ముహూర్తం

శ్రీ హేవళంబినామ సంవత్సరం, దక్షిణాయణం, హేమంతఋతువు, పుష్య మాసం, తిథి: బహుళ అష్టమి రా. 8.40 వరకు, అనంతరం నవమి; నక్షత్రం: హస్త ఉ. 6.45 వరకు, అనంతరం చిత్త; అమృతకాలం: రా. 1.00 నుండి 2.40 వరకు; వర్జ్యం: మ. 2.55 నుండి 4.34 వరకు; దుర్ముహూర్తం: ఉ. 8.24 నుండి 9.12 వరకు, రా. 10.48 నుండి 11.36 వరకు; రాహుకాలం: మ. 3.00 నుండి 4.30 వరకు; యమగండం: ఉ. 9.00 నుండి 10.30 వరకు

Estd 1938

ఆంధ్రప్రభ

www.prabhanews.com

Journalism first!

సంపుటి:56 . సంచిక:269 . మంగళవారం 9 జనవరి 2018 . హైదరాబాద్ * పేజీలు:12+4 . వెల: 5.00 . Published from: Hyderabad | Vijayawada | Guntur | Rajahmundry | Visakhapatnam | Tirupati | Karimnagar | Kurnool | Suryapet | Anantapur | Nellore | Nizamabad



కేసీఆర్ పాలనకు దేశమంతా జేజేలు..!

ఉద్యమ నాయకుడే తిరుగులేని పాలకుడు

కరీంనగర్‌లో మరో ఐటీ టవర్ ఏర్పాటు

పరిశ్రమలు, ఐటీ మంత్రి కేటీఆర్

2



3

తుమ్మిళ్ల... కేసీఆర్ చలవే

ఆరునెలల్లో లిఫ్ట్ ప్రాజెక్టు పూర్తి చేస్తాం

ప్రతి నెలా వస్తా.. పనులు పూర్తి చేయిస్తా

రాజకీయాలు కాదు.. రైతుల మేలే ముఖ్యం

నీటిపారుదల శాఖ మంత్రి హరీష్ రావు

రైతుకి కరెన్సీ దెబ్బ..!

ఆర్బీఐ నోట్ల ముద్రణపై ఆంక్షలు

రాష్ట్రానికిస్తున్నది రూ.200 కోట్లే

రాష్ట్రంలో రూ.700 కోట్ల చలామణి

పెట్టుబడి మద్దతుకు రూ.5 వేల కోట్లు • అధికారుల నివేదికతో తెల్లబోయిన మంత్రులు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : రైతులకు 'పెట్టుబడి మద్దతు పథకం' కార్యాచరణ ప్రణాళిక రోజుకో మలుపు తిరుగుతోంది. రైతులను పంటల సీజన్‌లో ఆర్థికంగా ఆదుకోవాలన్న ప్రభుత్వ సంకల్పానికి కరెన్సీ సమస్య పెనుసవాలుగా మారింది. నిన్నటి వరకు నిర్ధేశిత మొత్తాన్ని రైతులకు ఏ రూపంలో ఇవ్వాలన్న కోణంలో ఆలోచించిన ప్రభుత్వానికి తాజాగా మరో కొత్త సమస్య వచ్చిపడింది. బ్యాంకు ఖాతాలా? పోస్టాఫీసులా? లేక కిసాన్ గిఫ్టు కార్డులా? అన్ని అంశాలపై సమాలోచనలు జరిపి తుది నిర్ణయం తీసుకోవాలనుకున్న మంత్రివర్గ ఉపసంఘానికి నగదు కొరత సవాలుగా తయారైంది. మొదటి సమావేశంలోనే ఆర్థిక శాఖ అధికారుల వాస్తవ నివేదిక మంత్రులను ఆందోళనకు గురిచేసింది. దేశంలో నల్లధనాన్ని నియంత్రించే క్రమంలో కేంద్ర ప్రభుత్వం నోట్ల ముద్రణను పరిమితం చేసింది. అందులో భాగంగా తెలంగాణ రాష్ట్రానికి భారతీయ రిజర్వు బ్యాంకు (ఆర్బీఐ) ద్వారా ప్రతినెలా నగదు రూపంలో రూ.200 కోట్లు మాత్రమే విడుదల అవుతున్నాయి. ఆర్థిక శాఖ అధికారుల అంచనా ప్రకారం

3వ పేజీలో...



ఆంధ్రాలో నేడు కేసీఆర్‌కు పాలాభిషేకం

విజయవాడలో ఆంధ్రప్రదేశ్ యాదవ యువభేరి ఆధ్వర్యంలో ఏర్పాట్లు



వివరాలు 2లో...

రైతు సమితులే సంక్షేమ ఇరుసులు

సేద్యానికి నాలుగంచెల వ్యవస్థ • అడుగడుగునా పర్యవేక్షణ • ఈ ఖరీఫ్ నుంచే కార్యాచరణ • వచ్చే నెలలో క్షేత్రస్థాయికి మంత్రులు • రైతులందరికీ అధికారాలు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: వ్యవసాయ విధానాలకు మరింతగా పదును పెట్టి ఈ రంగంపై ఆధారపడిన వారందరికీ ఉపాధి అవకాశాలను మెరుగుపరిచే దిశగా ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. అనుబంధ రంగాలతో పాటు వృత్తులను ప్రోత్సహించి ఆర్థిక స్థితిగతులను బలోపేతం చేసే కార్యాచరణ ప్రణాళికను ఈ ఏడాది త్వరలో ప్రారంభమయ్యే ఖరీఫ్ సీజన్ నుంచి కార్యరూపం దాల్చబోతోంది. వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించడంతో పాటు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాల ద్వారా ఖర్చుచేసే నిధులు నేరుగా లబ్ధిదారులకే చేర్చాలన్న అంశంపై పోచారం శ్రీనివాసరెడ్డి నేతృత్వంలోని మంత్రివర్గ ఉపసంఘం కసరత్తు చేస్తోంది. ఇప్పటికే ఏర్పాటు చేయబడిన గ్రామ రైతు సమన్వయ సమితుల ద్వారా వ్యవసాయ రంగాన్ని, రైతు కుటుంబాలను అభివృద్ధి చేసి దేశానికే ఆదర్శంగా నిలువాలన్న దిశగా ప్రభుత్వం లక్ష్యాలను ఎంచుకుంది. ఆ దిశగా ఫలితాల సాధనకు ఫిబ్రవరి మొదలుకుని మంత్రుల కమిటీ క్షేత్రస్థాయి పర్యటనలకు సిద్ధమవుతోంది. దేశ చరిత్రలో మొట్టమొదటి సారిగా తెలంగాణ ప్రభుత్వం ప్రారంభిస్తున్న పెట్టుబడి మద్దతు పథకాన్ని అత్యంత పారదర్శకంగా అమలు చేసేందుకు గ్రామస్థాయిలో చర్యలు ప్రారంభమవుతున్నాయి.

వ్యవసాయ రంగ పరిపుష్టికి ముందుచూపుతో సీఎం కేసీఆర్ సరికొత్త తరహాలో నాలుగంచెల వ్యవస్థను ఏర్పాటు చేశారు. రైతుల పక్షాల ప్రభుత్వానికి సూచనలు, సలహాలు ఇచ్చేందుకు, ప్రభుత్వ పథకాల ద్వారా అన్నదాతలకు లబ్ధి చేకూర్చేలా చూసేందుకు అధికారికంగా రైతు సమన్వయ సమితులను నెలకొల్పారు. గ్రామ స్థాయిలోనే కాకుండా మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లోనూ ఈ సంఘాలు ఏర్పాటయ్యాయి. రాజకీయాలకు, పార్టీలకు అతీతంగా గ్రామ సభల ద్వారా పదిహేను మంది సభ్యులతో కూడిన కమిటీలను ఏర్పాటు చేసిన ప్రభుత్వం ఆ మేరకు కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేసి యంత్రాంగానికి బాధ్యతలు అప్పగించాలని నిర్ణయించింది. ఇందుకు సంబంధించి ఇప్పటికే సీఎం కేసీఆర్ అన్ని జిల్లాల కలెక్టర్లకు మార్గదర్శకాలు జారీ చేశారు. గత ఏడాది సెప్టెంబర్ 1 నుంచి 9 వరకు గ్రామ రైతు సమాఖ్యలను రాష్ట్రవ్యాప్తంగా పూర్తి స్థాయిలో నెలకొల్పారు. గ్రామ సమాఖ్యలు

3వ పేజీలో...

• ఒత్తిడితో విద్యార్థులు విలవిల...



గంటకో విద్యార్థి ఆత్మహత్య

మూడేళ్లలో 26వేల మంది కన్నుమూత

ఏటా పెరుగుతున్న బలవన్మరణాలు

అగ్రస్థానంలో మహారాష్ట్ర

పరీక్షలు తప్పడంతోనే ఆత్మహత్యలు

కౌన్సెలింగ్ నిర్వహిస్తే మేలు: వైద్యులు

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా గంటకో విద్యార్థి కన్ను మూస్తున్నాడు. ఈ పరంపర స్కూల్ స్థాయి నుండి వృత్తి విద్యా కళాశాలల వరకు కొనసాగుతున్నది. భారత్‌లో 2014 నుండి మూడేళ్లలో సుమారు 26వేల మంది విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. దీనికి సంబంధించిన డాటాను కేంద్ర మంత్రిత్వ శాఖ అన్నీ రాష్ట్రాలకు పంపింది. ఈ విషయమై కేంద్రం తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. కేవలం 2016లోనే 9,474 మంది విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారు. అంటే సగటున 55 నిమిషాలకో విద్యార్థి బలవన్మరణానికి పాల్పడినట్టు మంత్రిత్వ శాఖ తేల్చింది. ప్రతీ ఏటా విద్యార్థుల ఆత్మహత్యలు

8వ పేజీలో...

బహ్రెయిన్ రాజుకు రాహుల్ గిఫ్ట్

ప్రవాస భారతీయులతో ప్రత్యేక సమావేశం



వివరాలు 11లో...



వీఐపీల భారతం

ప్రపంచంలోకెల్లా మన దేశంలోనే వీఐపీలు అధికం

అధికార, అనధికార వీఐపీల సంఖ్య సుమారు 5,79,092

సగటున ఒక్కో వీఐపీకి ముగ్గురు పోలీసుల రక్షణ

ఢిల్లీలో వీఐపీ సేవల బడ్జెట్ వ్యయం రూ.341.24 కోట్లు

సామాన్యుల పన్నులతో నేతల విలాసాలు.. కులాసాలు

సంస్కరణలు ఎన్నొచ్చినా దేశానికి వదలని వీఐపీ రుగ్మత

న్యూఢిల్లీ: రాజకీయ నాయకులు.. ఉన్నత అధికార యంత్రాంగం.. గొప్ప పారిశ్రామిక వేత్తలు.. క్రీడా ప్రముఖులు.. వీఐపీ (అత్యంత ప్రముఖ వ్యక్తులు) కేటగిరీలో మనుగడ సాగిస్తున్న వ్యక్తులు. వీళ్లంతా ప్రత్యేక తరగతిగా చెలామణి అవుతూ, విశిష్ట సేవలు పొందుతున్నారు. ప్రజలు చెమటోడ్చి కష్టించి చెల్లించిన పన్నుల సొమ్మును సౌకర్యాలు, భద్రత పేరుతో ఎడాపెడా తగలేస్తున్నారు. ఇలాంటి సంస్కృతి భారతీయ సమాజాన్ని ఇది రెండు వర్గాలుగా

7వ పేజీలో...

వివరాలు 10లో...

కూలి బతుకులు కూలిపోయాయ్

బొలెరో వాహనం బోల్తాపడి ఐదుగురు దుర్మరణం

15మంది కూలీలకు గాయాలు

ముగ్గురి పరిస్థితి విషమం



పెళ్లి బరాత్‌లో తల్వార్ విన్యాసాలు

తల్వార్ తగిలి బాలుడు మృతి

షేక్‌పేటలో ఘటన.. కేసు నమోదు

400 డిగ్రీ కాలేజీల మూత?



సంక్రాంతి తర్వాత కార్యాచరణ

ప్రతి యూనివర్సిటీలో ఇంక్యుబేటర్

తెలంగాణలో నాణ్యమైన ఉన్నత విద్య అందించడం కోసం ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. రాష్ట్రంలోని అన్ని విశ్వవిద్యాలయాల్లో పరిశోధనలు చేయడంతోపాటు, నూతన ఆవిష్కరణల కోసం ఇంక్యుబేటర్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది.

హైదరాబాద్, ఆంధ్రప్రభ: డిగ్రీ కాలేజీల్లో త్వరలో సమూల మార్పులు తీసుకురావాలని ఉన్నత విద్యా మండలి నిర్ణయించింది. ప్రస్తుతం రాష్ట్రంలో అవసరం కంటే ఎక్కువ ప్రైవేటు డిగ్రీ కాలేజీలు, సీట్లు ఉన్నాయని అభిప్రాయ పడింది. డిగ్రీ ప్రవేశాల్లో ప్రతి ఏడాది సుమారు 1.80 లక్షల వరకు సీట్లు మిగిలిపోతున్నాయి. వీటిపై ఉన్నత విద్యా మండలి ప్రత్యేక దృష్టి సారించింది. కాలేజీలు ఎక్కువగా ఉండటమే ఇందుకు కారణంగా నిర్ణయించిన ఉన్నత విద్యా మండలి కాలేజీలను తగ్గించడం కోసం ప్రత్యేకంగా చర్యలు తీసుకోనుంది. సంక్రాంతి పండుగ తరువాత ఇందుకోసం యాక్షన్ ప్లాన్‌ను రూపొందించాలని ఉన్నత విద్యా మండలి నిర్ణయించింది. రాష్ట్రంలో సుమారు 1000కి పైగా ప్రైవేటు డిగ్రీ కాలేజీలు ఉన్నాయి. వాటిలో 350 నుంచి 400 వరకు కాలేజీల్లో కనీసం 15 శాతం కూడా సీట్లు భర్తీ కాని పరిస్థితి ఉంది. 15 శాతం సీట్లు కూడా భర్తీ కాకపోతే ఆయా కాలేజీలు ఎలా నడుస్తాయనేది ఉన్నత విద్యా మండలి వాదన. సోమవారం జరిగిన తెలంగాణ ఉన్నత విద్యా మండలి కార్యనిర్వాహక మండలి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పలునిర్ణయాలు తీసుకున్నారు. ప్రతి మూడు నెలలకొకసారి జరగాల్సిన మండలి కార్యనిర్వాహక మండలి సమావేశం చైర్మన్ ఆచార్య తుమ్మల పాపిరెడ్డి అధ్యక్షతన జరిగింది. రాష్ట్రంలో ఉన్న ప్రతి యూనివర్సిటీలోనూ

3వ పేజీలో...

ఔరా..!



పల్లె, పట్నంకు సంక్రాంతి స్పెషల్స్

ఆర్టీసీ, ప్రైవేట్ బస్సులతో పాటు ప్రత్యేక రైళ్లు

రోజుకు 25వేల మందిని గమ్యం చేర్చే ఏర్పాట్లు



హైదరాబాద్, ఆంధ్రప్రభ: సంక్రాంతి స్పెషల్స్ నడిపించడానికి ఆర్టీసీ, రైల్వే, ప్రైవేటు బస్ ఆపరేటర్లు సన్నద్ధమయ్యారు. దక్షిణ మధ్య రైల్వే 84 ప్రత్యేక రైళ్లను నడిపించబోతుంది. ఆర్టీసీ 3262 ప్రత్యేక బస్సులను సిద్ధం

7వ పేజీలో...



నెలకో సంక్షేమ సంబురం

- ఇదే టీఆర్ఎస్ విజయమంత్రం
- సంక్షేమ ఫలాలతో జనంలోకి
- అధికార పక్షం వ్యూహాత్మక ప్రణాళిక

హైదరాబాద్, ఆంధ్రప్రభ: తెలంగాణ ప్రభుత్వం దూసుకెళ్తున్న సంక్షేమపథమే.. టిఆర్ఎస్‌ను విజయతీరాలకు చేరుస్తుందని, ఈ కార్యక్రమాలే పార్టీ క్యాడర్‌లో జోష్ తీసుకువస్తాయని టిఆర్ఎస్ వర్గాలు అంచనావేస్తున్నాయి. ఎమ్మెల్యేలను నిత్యం ప్రజల్లో ఉండి.. సంక్షేమ కార్యక్రమాలు నిర్దేశితవర్గాలకు అందేలా చూడాలని ప్రతి సందర్భంలోనూ కోరుతున్న సిఎం కెసిఆర్.. క్షేత్రస్థాయిలో వాటి అమలుతీరును, నేతల పనితీరును ఎప్పటికపుడు తెలుసుకుంటున్నారు. జనవరి 1నుండి ప్రభుత్వం అమలుచేస్తున్న 24గంటల కరెంట్‌తో రాష్ట్రవ్యాప్తంగా రైతాంగంలో హర్షం వ్యక్తమవుతుండగా.. నెలనెలా ఇదే తరహా సంక్షేమ సంచలనంతో ప్రజల్లోనూ, క్యాడర్‌లోనూ ఉత్సాహం కలిగించాలని నిర్ణయించింది. ప్రభుత్వం అమలు ప్రారంభించిన భారీ పథకాలన్నీ.. ఫలితాల దశకు చేరడంతో నెలకో సంబురం జరగనుంది. జనవరిలో 24గంటల కరెంట్ వెలుగులు తేగా, ఫిబ్రవరిలో భూరికార్డుల ప్రక్షాళన ఫలితాలు, మార్చిలో మిషన్ భగీరథ, మేలో రైతులకు 8వేల పెట్టుబడి పథకం, జూన్‌లో కాళేశ్వరం ఎత్తిపోతల ప్రారంభోత్సవం.. ఇలా అనేక భారీ పథకాలతో రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది ప్రజల్లో జోష్ తీసుకురానుంది. టిఆర్ఎస్‌పై ప్రజల్లో ఇమేజ్ పెంచడానికి.. ఈ పథకాల సంబురమే దోహదపడుతుందని, ప్రత్యేకంగా పార్టీ కార్యక్రమాలు.. ప్రతిపక్ష పార్టీలు నిర్వహిస్తున్నట్లు సభలు.. సమావేశాలు నిర్వహించాల్సిన అవసరం లేదని పార్టీ తాజాగా భావిస్తోంది. ఇచ్చిన వాగ్దానాలు నెరవేర్చడం.. పాలకపార్టీగా ప్రజలను సంక్షేమ సంబురంలో ముంచడమే ప్రధానమని, అవే ఓట్లు కురిపించే తారకమంత్రాలని టిఆర్ఎస్ అంచనావేస్తోంది.

ఇప్పటికే సింగరేణి కార్మికులకు పెద్ద ఎత్తున వరాలు ప్రకటించి వారిని ఆకట్టుకోగా, గొల్లకుర్మల భవన నిర్మాణానికి శంఖుస్థాపన చేసి వారిపైనా ముఖ్యమంత్రి కెసిఆర్ వరాల వాన కురిపించారు. యాదవులకు ఒక రాజ్యసభ, ఒక ఎమ్మెల్సీ ఇస్తానని ప్రకటించడంతో పాటు అనేక వరాలిచ్చారు. దీనిపై యాదవులలో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ముదిరాజ్, బెస్తలకు మత్స్య సంపదను వరంగా ఇచ్చిన సిఎం వారికి వెన్నుదన్నుగా నిలిచేందుకు పలు సంక్షేమ కార్యక్రమాలు ప్రకటించబోతున్నారు. తెలంగాణ ప్రభుత్వం రాగానే గౌడలకు అనుకూలంగా కల్లుడిపోలు తెరిపించిన సిఎం మిషన్ కాకతీయ చెరువులపైనా.. తాటి, ఈత చెట్ల పెంపకాన్ని పెద్ద ఎత్తున ప్రోత్సహించారు. ఈ ఏడాది ఆర్థికంగా వెన్నుదన్నుగా నిలిచేందుకు పలు నిర్ణయాలు ప్రకటించనున్నారు. ఇప్పటికే ముస్లింల రిజర్వేషన్లపై అసెంబ్లీలో చర్చించి తీర్మానం చేయడంతో పాటు వడ్డీలేని రుణపథకాన్ని ప్రకటించారు.

ఆఖరి ఏడాది ప్రజలకు వీలైనంతగా సంక్షేమ ఫలాలు అందించి ఆకట్టుకోవాలని, ప్రజలకు ప్రభుత్వంపై ఉన్న నమ్మకాన్ని నిలుపుకుంటే విజయం నల్లేరుపై బండినడకేనన్న విశ్వాసం పార్టీ ముఖ్యుల్లో వ్యక్తమవుతోంది. సంక్షేమ పథమే బలం అని ధీమాగా ఉన్న టిఆర్ఎస్ పక్కా రోడ్‌మ్యాప్‌ను సిద్ధం చేసుకుంటోంది. రాష్ట్రంలోని అన్నివర్గాల ప్రజల సంక్షేమానికి ప్రత్యేక పథకాలు రూపకల్పన చేస్తున్న ముఖ్యమంత్రి కెసిఆర్.. ఇప్పటికే అనేకవర్గాలకు అమలు ప్రారంభించగా, మిగిలిన వర్గాలకు ఈ ఏడాది ఎంతో కొంత ప్రయోజనం దక్కనుంది. బడ్జెట్ కేటాయింపుల్లోనూ సంక్షేమానికి పెద్దపీట వేయనుండగా, నెలకో సంక్షేమసంబురంతో ప్రజలపై సంతోషాల జల్లు కురిపించనుంది.



పంచాయతీ రాజ్ చట్టంపై ఉపసంఘం సమావేశం

హైదరాబాద్, ఆంధ్రప్రభ: తెలంగాణరాష్ట్ర నూతన పంచాయతీరాజ్ చట్టం రూపకల్పనకు ఏర్పాటైన మంత్రివర్గ ఉపసఘం తొలివిడత సమావేశాలు ప్రారంభమయ్యాయి. ఈ కమిటీ కొత్త చట్టం విధివిధానాల ఖరారుకు అధ్యయనం ఆరంభించింది. ఇందులో భాగంగా సోమవారం మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో మంత్రి వర్గ ఉపసంఘం తొలిసమావేశం జరిగింది. ఈ సమావేశం రెండో రోజు మంగళవారం కూడా కొనసాగనుంది. గ్రామాల రూపురేఖలు పూర్తిగా మార్చివేసి గాంధీజి కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని సాకారం చేసేలా చట్టం రూపకల్పన చేస్తున్నామని మంత్రివర్గ ఉపసంఘం అధ్యక్షుడు, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఆశయాల మేరకు పంచాయతీల బలోపేతమే లక్ష్యంగా కొత్తచట్టం ఉంటుందన్నారు. సర్పంచులకు విస్తృత అధికారాలు, పెద్దమొత్తంలో నిధులు కేటాయించటం ద్వారా స్థానిక సంస్థలను మరింత పటిష్ట పరుస్తామన్నారు. కొత్త పంచాయతీల ఏర్పాటు, తాండాలను పంచాయతీలుగా మార్చటంపై సమావేశంలో చర్చించినట్లు తెలిపారు. ఖర్చు తగ్గించేలా ఎన్నికల ప్రక్రియను త్వరగా పూర్తిచేసే అంశాలను పరిశీలించాలని అధికారులకు సూచించామని మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. తొలిసారి జరిగిన ఈ సమావేశంలో మంత్రివర్గ ఉపసంఘం సభ్యులు, రాష్ట్ర మంత్రులు పోచారం శ్రీనివాసరెడ్డి, కేటీఆర్ , తుమ్మల నాగేశ్వరరావు, ఈటెల రాజేందర్ ,హరీష్ రావు, ఇంద్రకరణ్ రెడ్డితోపాటు అధికారులు నర్సింగరావు, వికాస్ రాజ్ ,స్మిత సబర్వాల్ ,నీతూ కుమారి, రిటైర్డ్ అధికారి ఎస్ చల్లప్ప, న్యాయశాఖ కార్యదర్శి నిరంజన్ రావు తదితరులు పాల్గొన్నారు. మంగళవారం కూడా మంత్రివర్గం ఉపసఘం సమావేశం కానుంది.

త్వరలో ప్రవాసీ తెలంగాణీలతో కేటీఆర్ భేటీ

హైదరాబాద్, ఆంధ్రప్రభ : తెలంగాణలో పారిశ్రామిక అభివృద్ధికి విశేష కృషిచేస్తున్న మంత్రి కేటీ రామారావు ఐటి పరిశ్రమలను పెద్దఎత్తున ఏర్పాటు చేసేందుకు దూకుడుగా వ్యవహరిస్తున్నారు. హైదరాబాద్‌లో ఐటి హబ్‌లు, పార్కులు, టి-హబ్ ఏర్పాటు చేసి ఐటి రంగాన్ని ప్రోత్సహిస్తూ ఇప్పుడు ద్వితీయ శ్రేణి పట్టణాలపై దృష్టిసారించారు. కరీంనగర్, వరంగల్, నిజామాబాద్, ఖమ్మం నగరాల్లో ఐటి టవర్లు ఏర్పాటుచేసి స్థానిక యువతకు ఉపాధి కల్పించేందుకు కృషి చేస్తున్నారు. అలాగే విదేశాల్లో ఉన్న తెలంగాణ ప్రవాసులను రాష్ట్రానికి రప్పించి ఇక్కడ యూనిట్లు ఏర్పాటుచేసే విధంగా వారిని ఒప్పించేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు. ఇప్పటికే అమెరికా, ఇంగ్లాంగ్‌తో పాటు మరికొన్ని దేశాల్లో పర్యటించి తెలంగాణ ప్రవాసులను కలుసుకుని బంగారు తెలంగాణ అభివృద్ధికి సహకరించాలని కోరిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా ప్రవాస భారతీయులందరినీ రాష్ట్రానికి రప్పించేందుకు త్వరలో ఒక భారీ సమావేశాన్ని నిర్వహించాలని నిర్ణయించారు. ఇప్పటికే ప్రవాసీయుల అడ్రస్‌లు సేకరించిన ఐటిశాఖ త్వరలోనే వారికి ఆహ్వానాలు పంపేందుకు కసరత్తు చేస్తోంది. స్టార్టప్‌ల నుంచి పెద్ద కంపెనీల వరకు తెలంగాణలో ఏర్పాటుచేసి ఇక్కడి యువతకు ఉపాధి కల్పించే లక్ష్యంతో కేటీఆర్ ఈ మేరకు అడుగులు వేస్తున్నారు.

కేసీఆర్ పాలనకు దేశమంతా జేజేలు

- కేంద్రమంత్రులూ ప్రశంసిస్తున్నారు • ఉద్యమ నాయకుడే తిరుగులేని పాలకుడు • కేసీఆర్ పాలనపై ప్రశంసల వెల్లువ
- కరీంనగర్‌లో మరో ఐటీ టవర్ • పరిశ్రమలు, ఐటీ మంత్రి కేటీఆర్



కరీంనగర్, ప్రభన్యూస్ బ్యూరో : ఉద్యమకారులు అధికారంలోకి వస్తే వారికి పరిపాలన తెలియదని నాడు ఎద్దేవాచేశారని, కానీ ఈ మూడున్నర ఏళ్లలో కేసీఆర్ పాలన చూసి దేశమంతా మెచ్చుకుంటోందని రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ అన్నారు. చీకటిరోజులు వస్తాయని పెట్టుబడులు రావని, ఇలా ప్రతిపక్షాలు నానా విమర్శలు చేశాయని, కాని అందుకు భిన్నంగా నేడు తెలంగాణ రాష్ట్రం అభివృద్ధిలో నంబర్ వన్‌గా దూసుకుపోతుందని , బంగారు తెలంగాణ కేసీఆర్‌తోనే సాధ్యమవుతుందని నిరూపణయిందని మంత్రి కే.తారకరామారావు పేర్కొన్నారు. కరీంనగర్ ఎల్ఎండీ సమీపంలో 25 కోట్ల రూపాయలతో నిర్మించనున్న ఐటీ టవర్‌కు ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్, కరీంనగర్ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ ఇతర ప్రతినిధులతో కలిసి శంకుస్థాపన ఆయన చేశారు. అనంతరం కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ అధ్యక్షతన జరిగిన బహిరంగసభలో మంత్రి కేటీఆర్ ప్రసంగించారు. తెలంగాణ అభివృద్ధిని చూసి కేంద్ర మంత్రులే ప్రశంసలు కురిపిస్తున్నారని కేటీఆర్ అన్నారు. ఉద్యమ నాయకుడు, పరిపాలన దక్షకుడు తెలంగాణ సీఎం కేసీఆర్ అంటూ ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ కొనియాడారని, నిన్ననే హైదరాబాద్‌కు వచ్చిన కేంద్ర మంత్రి మహేశ్ శర్మ కూడ కేసీఆర్‌కు గొప్ప విజన్ ఉందని కొనియాడారని, ఇక్కడి బీజేపీ నాయకులు మాత్రం అభివృద్ధిని విమర్శిస్తున్నారని నిప్పులు చెరిగారు. హరిత విప్లవకారుడు స్వామినాథన్ తెలంగాణలో 24 గంటల కరెంటును వ్యవసాయానికి అందిస్తున్న తీరును తన లేఖ ద్వారా ప్రశంసించారని గుర్తు చేశారు. తెలంగాణ వస్తే కరెంటు ఉండదన్నోళ్ల కాళ్లు వణుకుతున్నాయని ప్రతిపక్షాల విమర్శలపై కౌంటర్ ఇచ్చారు. తెలంగాణ ప్రభుత్వం యువతకు ఉద్యోగ, ఉపాధి రంగాల్లో అవకాశాలు కల్పించే విధంగా ముందుకు సాగతోందన్నారు. ఈ మూడున్నర సంవత్సరాల్లో లక్షప్రభుత్వ, ఉద్యోగాలు , లక్షప్రయివేట్ ఉద్యోగాలతో పాటు రంగాలలో వీటికి మూడొంతతంతలు పరోక్షంగా ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించామని స్పష్టం చేశారు. రాష్ట్ర యువతకు పనిచేసే చోటే ఉద్యోగ అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో కరీంనగర్‌లో ఐటీ టవర్‌ను ఏర్పాటు చేశామని, సంవత్సరంలోగా ఈ టవర్ నిర్మాణం పూర్తిచేసి ప్రారంభిస్తామని అన్నారు. అలాగే కరీంనగర్‌కు మరో ఐటీ టవర్‌ను మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. వరంగల్ తరహాలో ఐటీ హబ్‌ను ఏర్పాటు చేయడంతోపాటు త్వరలో 'టాస్క్' నెలకొల్పుతామన్నారు. విద్యార్థులు ఉద్యోగాలు ఆశించడమే కాదు, కల్పించే దిశగా ముందుకు కదలాలని, జాబ్ క్రియేటర్లుగా ఎదగాలని పిలుపునిచ్చారు.

ఈ సందర్భంగా మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, ప్రాజెక్టుల నిర్మాణాలను యువతకు వివరించారు. రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి ఈటల రాజేందర్ మాట్లాడుతూ హైదరాబాద్ తరువాత కరీంనగర్ జిల్లా ఐటీ రంగంలో అభివృద్ధి చెందనుందన్నారు. విద్యార్థులను తెలగాణ ఆస్తిగా భావిస్తామని, నిధులను దారిలో పెట్టామని, నియామకాలు మొదలు పెట్టామన్నారు. కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ మాట్లాడుతూ ఉపాధికోసం ఇతర దేశాలు, రాష్ట్రాలకు వెల్లడం కాదు ఉపాధినిచ్చే ఐటీ కంపెనీలను మనముందకు తీసుకువచ్చింది తెలంగాణ ప్రభుత్వమన్నారు. శంకుస్థాపన రోజే 8 కంపెనీలు ఎంవోయు చేసుకొని 650 ఉద్యోగాలను కల్పించేందుకు ముందుకు రావడం ఆహ్వానించదగ్గ పరిణామమని పేర్కొంటూ కంపెనీ ప్రతినిధులను మంత్రి కేటీఆర్‌కు పరిచయం చేశారు. కార్యక్రమంలో తెలంగాణ సంస్కృతిక సారథి రసమయి బాలకిషన్, ఆర్టీసీ ఛైర్మన్ సోమారపు సత్యనారాయణ, జెడ్పీ ఛైర్‌పర్సన్ తుల ఉమ, శాసనమండలిసభ్యులు నారదాసు లక్ష్మన్‌రావు, బానుప్రసాద్‌రావు, ఐడీసీ ఛైర్మన్ ఈద శంకర్ రెడ్డి, ఇన్‌చార్జి కలెక్టర్ శరత్, టీఎస్‌ఐటీ అధ్యక్షులు బాలమల్లయ్య, ఎండీ నర్సింహరెడ్డి, మేయర్ రవీందర్‌సింగ్, గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ ఏనుగు రవీందర్‌రెడ్డిలతోపాటు కార్పోరేటర్లు ఇతర ప్రతినిధులు హాజరైనారు.

ఆంధ్రాలో నేడు కేసీఆర్‌కు పాలాభిషేకం

- కృతజ్ఞత తెలిపేందుకు విజయవాడలో యాదవ యువభేరీ
- తెలంగాణలో యాదవులకు రాజ్యసభ టికెట్ ఇస్తానని ఇప్పటికే ప్రకటించిన కేసీఆర్
- యాదవ భవనానికి పది ఎకరాలు, రూ 10కోట్లు కేటాయింపు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : స్వరాష్ట్రంలోనే కాదు.. పొరుగు రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌లోనూ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావుకు ఎనలేని ఆదరణ పెరుగుతోంది. సీమాంధ్రకు వ్యతిరేకంగా పోరాడి తెలంగాణ రాష్ట్రం సాధించిన కేసీఆర్‌కు ఏపీలో ప్రజలు ఇప్పుడు పాలాభిషేకం చేయడానికి సిద్ధమవుతున్నారు. వినడానికి కొంచెం ఆశ్చర్యంగా ఉన్నా.. ఇది ముమ్మాటికి నిజం. ఇంతకూ ఆంధ్రప్రదేశ్ లో తెలంగాణ సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం ఎక్కడ చేస్తున్నారు? ఎందుకు చేస్తున్నారో మీకు తెలుసుకోవాలని ఉందా..! అయితే ఇది చదవండి.

తెలంగాణలోని యాదవ సామాజికవర్గానికి రాజ్యసభ టికెట్ ఇస్తానని సీఎం కేసీఆర్ ఇప్పటికే ప్రకటించిన సంగతి తెలిసిందే. నగర శివార్లలో యాదవ, కురవ భవన నిర్మాణానికి పది ఎకరాలు, రూ.10 కోట్లను ఆయన కేటాయించారు.

యాదవుల సామాజికవర్గాన్ని దృష్టిలో పెట్టుకుని కేసీఆర్ ఈ సామాజికవర్గానికి చేస్తున్న సేవకు గుర్తింపుగా మంగళవారం విజయవాడలో పెద్దఎత్తున ఆయన చిత్రపటానికి పాలాభిషేకం చేయాలని ఏపీ యాదవ సంఘం నిర్ణయించింది. యాదవ యువభేరీ అధ్యక్షుడు లక్కనబోయిన వేణు, కొలుసు సతీష్ యాదవుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరగనుంది.

యాదవులకు రాజ్యసభ, కురవలకు ఎమ్మెల్సీస్థానాన్ని ఇస్తానని ప్రకటించిన కేసీఆర్ భవిష్యత్తులో తమ సామాజికవర్గానికి అండగా



నిలబడతారన్న ఉద్దేశంతోనే ఆయన చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్నామని వారు తెలిపారు. మంగళవారం ఉదయం 10 గంటలకు విజయవాడలోని ప్రెస్‌క్లబ్‌లో పాలాభిషేకం కార్యక్రమం జరుగుతుందని ఈ కార్యక్రమంలో యాదవులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కొలుసు సతీష్ యాదవ్ కోరారు.

యాదవులు, గొర్రె కాపరులకు సబ్సిడీ రుణాలు అందిస్తున్న కేసీఆర్ తమ ప్రియతమ నేత అని ఆయన కృతజ్ఞతాంజలి అర్పిస్తున్నామని చెప్పారు. మొత్తానికి కేసీఆర్‌కు తెలంగాణలోనే కాకుండా సీమాంధ్రలో కూడా పాలాభిషేకం ట్రెండ్ మొదలుకావడంతో రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. తెలంగాణలో ఏ ముఖ్యమంత్రికి ఇన్నిసార్లు పాలాభిషేకాలు జరగలేదని నాలుగేళ్ళ కాలంలో వందల సంఖ్యలో కేసీఆర్‌కు పాలాభిషేకాలు జరిగాయని వారు చెబుతున్నారు.

సీఎం లక్ష్యాలను గుర్తించండి



- నిధుల వ్యయంలో జాప్యం వద్దు
- సంక్షేమంపై ప్రత్యేక శ్రద్ధ
- బీసీ సబ్‌ప్లాన్ ఏర్పాటుపై ప్రస్తావన
- 26 వరకు ప్రతిపాదనలకు తుది రూపం
- బడ్జెట్‌పై శాఖలవారీగా సీఎస్ సమీక్ష

హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : రాష్ట్ర ముఖ్యమంత్రి కె చంద్రశేఖరరావు లక్ష్యాలకు అనుగుణంగా బడ్జెట్ స్వరూపం ఉండాలని ఆ దిశలో ప్రతిపాదనలను రూపొందించాలని రాష్ట్ర ప్రభుత్వ శాఖాధిపతులకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీసింగ్ ఆదేశించారు. ప్రతిపాదనలు పంపేందుకు ఈ నెల 15 వరకు గడువు పొడిగించామని,ఈ లోగా వాస్తవ వ్యయాలతో కూడిన ప్రతిపాదనలు పంపాలని కోరారు. బడ్జెట్ ప్రతిపాదనలకు ఈ నెల 26 న తుదిరూపం ఇవ్వనున్నట్లు, ఆ తర్వాత సీఎం కె చంద్రశేఖరరావు దృష్టికి తీసుకువెళ్లి ఆయన సలహాలు, సూచనలతో బడ్జెట్ రూపకల్పన ప్రక్రియను పూర్తి చేస్తామని చెప్పారు. కార్యదర్శులకు బడ్జెట్ ప్రతిపాదనలు పంపేందుకు ఈ రోజే చివరి రోజైనప్పటికీ కొన్ని శాఖలు పంపకపోవడంపై మండిపడ్డారు. కొందరు శాఖాధిపతులు కోరిన మీదట ప్రతిపాదనలు పంపే గడు వును పొడిగించేందుకు సీఎస్ అంగీకరించారు. 2018 -19 వార్షిక బడ్జెట్ రూపకల్పన, సోమవారం సచివాలయంలోని తన కార్యాలయంలో సీఎస్ ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించారు. 2017-18 వార్షిక బడ్జెట్ రూ. 1,49,646. 00 కోట్లతో ప్రభుత్వం రూపొందించిన విషయం తెలిసిందే. వచ్చే బడ్జెట్‌ను 15 శాతం అదనంగా పెంచేందుకు సర్కార్ చర్యలు తీసుకుంటోంది. ఆ లెక్కన 2018 -19 బడ్జెట్ రూ. 1,72,146.00 కోట్లతో బడ్జెట్ రూపకల్పన జరిగే అవకాశం ఉందని ఒక అంచనా.

శాసనసభ ఎన్నికలు జరిగేందుకు మరో ఏడాదిన్నర గడువు మాత్రమే ఉండడంతో ఈ బడ్జెట్‌ను పూర్తి స్థాయిలో రూపొందించాలనేది ప్రభుత్వ నిర్ణయమని సీఎస్ చెప్పినట్లు తెలిసింది. ఆ దిశలోనే 2018 -19 బడ్జెట్‌ను ప్రగతిశీల బడ్జెట్‌గా రూపొందించాల్సి ఉందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ , మైనారిటీ, సాగునీరు,మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, డబుల్ బెడ్ రూం ఇళ్లు, కళ్యాణలక్ష్మి, ఫీజుల రీయింబర్స్‌మెంట్,వ్యవసాయం తదితర పథకాలకు ప్రభుత్వం పెద్దపీట వేస్తున్న విషయం తెలిసిందేనని, ఈ ఫ్లాగ్ షిప్ ప్రోగ్రాంలకు నిధుల కొరత ఉండదని, నిధులు విడుదల చేసిన తర్వాత వాటిని యుద్ధప్రాతిపదికన ఖర్చు చేయాలని ఆదేశించారు. వచ్చే మార్చినాటికి ఆర్థిక సంవత్సరం ముగిసే లోగా ఈ కార్యక్రమాలకు నిధుల విడుదల జరుగుతుందన్నారు. బీసీ సంక్షేమంపై చర్చ వచ్చిన సందర్భంగా బీసీ సబ్ ప్లాన్ ఏర్పాటుకు ఉన్న అవకాశాలను సంబంధిత శాఖాధికారులతో సీఎస్ చర్చించినట్లు సమాచారం. గత బడ్జెట్‌లో శాఖల పరంగా కేటాయింపులు, నిధుల విడుదల, చేసిన వ్యయంపై రాబోయే బడ్జెట్‌లో కేటాయించాల్సిన నిధులపై ఒక్కో శాఖ పరంగా సీఎస్ సమీక్షించారు. కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్, సాగునీరు, ఫీజుల రీయింబర్స్‌మెంట్ తదితర పథకాలకు వ్యయాలను పెంచాలన్నారు. అదే విధంగా మార్చి ఆఖరున ముగిసే ఆర్థిక సంవత్సరంలోగా విడుదల చేయాల్సిన నిధులను గూర్చి చర్చించారు.

నిధులు విడుదల చేసినప్పటికీ ఖర్చు చేయని శాఖాధిపతులతో వివరణ కోరారు. వచ్చే బడ్జెట్‌లో ప్రభుత్వ ప్రాధాన్యతలను గూర్చి అధికారులకు వివరించారు. వచ్చే మే నెలలోగా రైతాంగానికి పంటల పెట్టుబడి రూ. 4వేలు ఇస్తామని సీఎం కేసీఆర్ చేసిన ప్రకటన మేరకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సంబంధిత శాఖలను కోరారు.

సాగుకే అగ్ర పీఠం

- వ్యవసాయానికి అధిక ప్రాధాన్యత • రూ. 12వేల కోట్ల నిధులు కేటాయించే యోచన
- 1.42కోట్ల వ్యవసాయ భూమికిసాయం

హై దరాబాద్, ఆంధ్రప్రభ: బడ్జెట్‌లో సాగుకు పెట్టుబడి సాయం పెద్ద పద్దుగా అవతరించనుంది. దాదాపు ఒక ఏడాదిలో ప్రభుత్వం ఖర్చు చేసిన రుణమాఫీ నిధులకు ఇది స్వల్పంగా మించిపోనుంది. వ్యవసాయ బడ్జెట్‌ను ఈ ఏడాది ప్రత్యేకంగా ప్రతిపాదించాలనే యోచన నేపథ్యంలో సాగుకు సాయం నిధులే రూ.12వేల కోట్లుగా ఉండనున్నట్లు సమాచారం. మే 15నుంచి ఈ పథకం ప్రారంభం కానుంది. గత జూన్‌లో వ్యవసాయ శాఖ చేసిన సమగ్ర సర్వేలో రాష్ట్రంలో 1.23 కోట్ల ఎకరాల సాగుభూములు ఉన్నట్లుగా గుర్తించారు. అయితే ప్రభుత్వ అంచనా ప్రకారం ఇది 1.6కోట్ల ఎకరాలని ఉండగా తాజాగా రికార్డుల ప్రక్షాళనతో ఇది 1,42,12,816 ఎకరాలుగా తేల్చారు. భూ రికార్డుల ప్రక్షాళనతో అసలు రైతుల సంఖ్య తేలింది. వ్యవసాయ, రెవెన్యూ శాఖల రికార్డులు పరస్పర విరుద్ధంగా ఉండటంతో భూ రికార్డుల ప్రక్షాళనే మేలని ముఖ్యమంత్రి భావించారు. ఎకరాకు రూ. 8వేల పెట్టుబడి సాయం పథకం అమలుకు వ్యవసాయ శాఖ నిర్వహించిన సర్వేలో అనేక వివరాలు బైటికి రాలేదు. ఐదెకరాల లోపు వారికే పెట్టుబడి సాయం అందుతున్న అపోహతో చాలా మంది తమకు ఐదెకరాలే ఉన్నట్లుగా అధికారులకు చెప్పారు. కొందరైతే బినామీలను అసలు పట్టాదార్లుగా చూపి రికార్డులు రాయించుకున్నారు. దీంతో తెలంగాణలో పంటల విస్తీర్ణం, రైతుల సంఖ్యలో స్పష్టత రాలేదు. వ్యవసాయ శాఖ నిర్వహించిన సర్వేలో రాష్ట్రంలో సాగు విస్తీర్ణం 1.23 కోట్ల ఎకరాలుగా నమోదైంది. గత లెక్కలతో పోల్చితే ఇది 30లక్షల ఎకరాలు తక్కువగా నమోదుకావడం విశేషం. రైతుల సంఖ్య కూడా 10 లక్షలు తగ్గినట్లుగా స్పష్టమైంది. ఉద్యానవన పంటల విస్తీర్ణం 4.4 లక్షల ఎకరాలు తగ్గగా, సాదాబైనామాలు, వివాదాస్పద భూముల లెక్కలు నమోదు చేయలేదని వ్యవసాయ శాఖ పేర్కొంది. కానీ ప్రభుత్వం గతంలో చెప్పినట్లుగా కొత్తగా లక్షలాది ఎకరాల వ్యవసాయ భూ విస్తీర్ణం పెరిగిందని, సాగునీటి వెసులుబాటును పెంచడంద్వారా భారీగా రైతుల సంఖ్య కూడా



పెరిగిందని ప్రభుత్వం చెబుతూ వచ్చింది.

జూన్‌లో తేలిందిదే...

కాగా జూన్‌లో నిర్వహించిన రైతు సర్వేలో 45.40లక్షల మంది రైతులను నమోదు చేశారు. మరో 9లక్షలమంది రైతుల భూముల వివరాలపై రెవెన్యూ వివాదాలు ఉన్నట్లుగా ప్రాథమికంగా తేల్చారు. రెవెన్యూ రికార్డుల్లో ఒక్కో రైతు పేరుతో ఒకే ఖాతాకు బదులుగా రెండు, మూడు ఖాతాలున్నట్లుగా బైట పడింది. దీంతో ఒకే గ్రామంలో వివిధ ప్రాంతాల్లో ఒకే రైతుకు ఉన్న భూములన్నీ ఒకే ఖాతాలో ఉండాలి. అలా ఉన్నప్పుడే రైతు పేరు ఆన్‌లైన్‌లో కనిపిస్తుంది. వారసుల పేర్లు, కొనుగోలు చేసిన వారి పేర్లతో రికార్డుల్లో మార్పులు లేకపోవడంతో ఇలాంటి ఇబ్బందులు తలెత్తుతున్నాయి. తాజాగా రికార్డుల ప్రక్షాళనలో వీటిని సరిదిద్దారు. భూ దస్త్రాల పరిశీలన ఫలితాలు 568 మండలాల్లో, 10823 రెవెన్యూ గ్రామాల్లో 93 శాతం వివాదరహితంగా తేలాయి. 1507 బృందాలు శ్రమించి రికార్డుల ప్రక్షాళన పూర్తి చేశాయి. 2కోట్ల 55 లక్షల 98వేల 91 ఎకరాల భూ విస్తీర్ణానికి చెందిన రికార్డుల పరిశీలన పూర్తయింది. ఈ మొత్తంలో 2,38,08,650 ఎకరాలు వివాదరహితంగా తేలాయి. కేవలం 17లక్షల 89 వేల ఎకరాలే పార్ట్-బిలో చేర్చి వివాదాస్పదమని గుర్తించారు. ఇది మొత్తం విస్తీర్ణంలో 7శాతంగా ఉన్నది. 71,75,096 ఖాతాలు 92 శాతంతో వివాదాలకు అతీతంగా ఉన్నట్లుగా ఈ పరిశీ లనతో బైటపడింది. మొత్తం భూముల్లో 1,42,12,826 ఎకరాల వ్యవసాయ భూమి వివాదాలకు అతీతమని అధికారులు నివేదించారు. మొత్తం భూ విస్తీర్ణంలో వ్యవసాయ భూములవాటా 60శాతంగా ఉంది. మరో 11,95,889 ఎకరాలు వ్యవసాయేతరంగా తేల్చారు. ప్రభుత్వ అవసరాలకు, కార్యాలయాలకు దాదాపు 83,99,934 ఎకరాలను వినియోగించినట్లుగా వెల్లడైంది. ఇక ప్రభుత్వ కార్యాలయాలు, ఆస్పత్రులు, రహదారులు, దేవాదాయ అవసరాలకు నియోగించిన భూమి 35 శాతంగా ఉంది. కాగా గతంలో ఆయా భూములపై ఇంత వరకు స్పష్టత లేదు. తాజా రికార్డుల ప్రక్షాళనతో మొత్తం వ్యవహారం వెలుగులోకి వచ్చింది.

మరిన్ని నిధులు రాబట్టాలి

- 15వ ఆర్థిక సంఘానికి సమర్పించాల్సిన నివేదికలపై సీఎస్ సమీక్ష
- కేంద్రం నుంచి ఎక్కువ నిధులు వచ్చేలా శ్రద్ధ చూపాలని ఆదేశం


హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : కేంద్ర నిధులు రాబట్టేందుకు అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపించాలని రాష్ట్ర ప్రభుత్వ శాఖల అధిపతులకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీ సింగ్ ఆదేశించారు.15 వ ఆర్థిక సంఘానికి సమర్పించాల్సిన నివేదిక పై ఫిబ్రవరి 7 లోగా నివేదికలు ఇవ్వాలని కోరారు. 15 వ ఆర్థిక సంఘానికి సమర్పించాల్సిన నివేదికలపై సోమవారం సచివాలయంలో శాఖాధిపతులతో సీఎస్ ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించారు. 15 వ ఆర్థిక సంఘం ద్వారా తెలంగాణ రాష్ట్రం అత్యధికంగా నిధులు సాధించేందుకు ప్రభుత్వ శాఖలు సమర్పించే నివేదికలు అత్యంత కీలకమని, రాష్ట్ర ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని వివరాలను సమర్పించాలని కోరారు. ఈ సంఘం 2019 అక్టోబర్ 30 నాటికి కేంద్ర ప్రభుత్వానికి నివేదికను సమర్పిస్తుందని, దీని కోసమై వచ్చే ఏప్రిల్ నుంచి వివిధ రాష్ట్రా లలో సంఘం సభ్యులు పర్యటిస్తారని చెప్పారు. వచ్చే నెల 7 లోగా తమ శాఖలకు సంబంధించిన చేపడుతున్న పనులు, వాటి ప్రగతి, లక్ష్యాలు, ఇతర విషయాలపై సవివరమైన నివేదికలు సమర్పించాలన్నారు. ఈ నివేదికలు సమర్పించడానికి సంబంధించి అవగాహన కల్పించేందుకే ఈ సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పురపాలన, పంచాయతిరాజ్, గ్రామీణాభివృద్ధి, విద్యుత్ ,ఆరోగ్యం, పరిశ్రమలు, విద్య,వైద్య శాఖలు ప్రత్యేక దృష్టిసారించాలని ఎస్పీ సింగ్ ఆదేశించారు.ఆర్థిక శాఖ సలహాదారు జిఆర్ రెడ్డి కేంద్ర ఆర్థిక సంఘానికి సమర్పించాల్సిన నివేదికలో పొందుపర్చాల్సిన అంశాలను గూర్చి అధికారులకు వివరించారు. ప్రతి శాఖాధిపతి ఖచ్చితమైన సమాచారంతో నివేదికల ఇవ్వాలని సూచించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ఆర్థికసలహాదారు జిఆర్ రెడ్డి, ముఖ్య కార్యదర్శులు అధర్ సిన్హా, రజత్‌కుమార్, శాలినీ మిశ్రా, శశాంక్ గోయల్, సోమేష్‌కుమార్,రాజీవ్ త్రివేదీ, వికాస్ రాజ్, జయేష్ రంజన్, కార్యదర్శులు బి వెంకటేశం, పార్థసారథి, దానకిషోర్, సందీప్ సుల్తానియా, శివశంకర్, జగదీశ్వర్, బెన్‌హర్ మహేశ్‌దత్ ఎక్కా, సవ్యసాచి ఘోష్, చంద్రవదన్, కమీషనర్ నీతూ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

తుమ్మిళ్ల కేసీఆర్ చలవే



- ఆరు నెలల్లో లిఫ్ట్ పూర్తి చేస్తాం
- ప్రతి నెలా వస్తా.. పనులు పూర్తిచేయిస్తా
- పాలమూరు దశ తిరిగింది
- ఆర్‌డిఎస్‌కు పూర్వవైభవం
- రాజకీయాలు కాదు..రైతు ప్రయోజనాలే ముఖ్యం

వడ్డేపల్లి, ప్రభన్యూస్ : తుమ్మిళ్ళ లిఫ్ట్ కింద వచ్చే వానాకాలం నీళ్ళిస్తాం.. నేను ప్రతినెలా వస్తా. ఆరునెలల్లో పనులు పూర్తిచేయిస్తా అని రాష్ట్ర భారీనీటిపారుదల శాఖా మంత్రి తన్నీరు హరీష్‌రావు అన్నారు. జోగులాంబ గద్వాల జిల్లా రాజోలి మండల పరిధిలోని తుమ్మిళ్ల గ్రామంలో తుమ్మిళ్ళ ఎత్తిపోతల పనులకు శంఖుస్థాపన చేసిన మంత్రి ఈ సందర్భంగా మాజీ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మంద జగన్నాథం అధ్యక్షతన జరిగిన బహిరంగసభలో మాట్లాడారు. ఆరుమాసాల్లో పనులు పూర్తి చేసి వచ్చే వర్షాకాలం నాటికి ఆర్డీఎస్ చివరి ఆయకట్టు రైతులకు సాగునీరు అందిస్తామని, అలంపూర్ నియోజకవర్గ రైతాంగం పొలాలు సస్యశ్యామలం చేస్తామని మంత్రి హామీనిచ్చారు. ముఖ్యమంత్రి కెసిఆర్ చేతులమీదుగా తుమ్మిళ్ళ లిఫ్ట్‌ను ప్రారంభించి, ఇక్కడి రైతాంగానికి నీరు విడుదల చేస్తామన్నారు. ప్రాజెక్టులు అంటే పదేళ్ళు.. ఏళ్లకు ఏళ్లు అనేది గత ప్రభుత్వాల మాట అని, టిఆర్ఎస్ ప్రభుత్వం వేగంగా పనిచేస్తుంది.. ప్రాజెక్టు పనులను ఫాస్ట్‌ట్రాక్ కింద పూర్తిచేస్తుంది అని ప్రకటించారు. ఆర్‌డిఎస్‌కు పూర్వవైభవం తీసుకువస్తామని, 87,500ఎకరాలను సాగులోకితెచ్చే ప్రయత్నం చేస్తున్నామన్నారు. ఆర్‌డిఎస్ కోసం 2002లో ఉద్యమనాయకుడిగా కెసిఆర్ పాదయాత్ర చేశారని, నడిగడ్డ ప్రజలు రైతుల కష్టాలు స్వయంగా చూసి చలించిపోయారన్నారు. ఆ పాదయాత్రలో తామంతా పాల్గొన్నామన్నారు. ఇన్నేళ్ళ తర్వాత తెలంగాణ వచ్చిందని, ఉమ్మడి ఎపిలో ఆర్‌డిఎస్ ఆయకట్టు నిర్లక్ష్యానికి గురైందన్నారు. తెలంగాణ రాకుంటే కెసిఆర్ సిఎం కాకుంటే తుమ్మిళ్ళ వచ్చేదికాదన్నారు. పాలుమూరు జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టులను పరుగెత్తిస్తున్నామన్నారు. కల్వకుర్తి ప్రాజెక్టు దగ్గరే ఒక రాత్రి పడుకున్నానని, ఆవంచ ఆక్విడెక్ట్ దగ్గరే మకాంవేసి పనులు పూర్తిచేయించానన్నారు. మండుటెండల్లో పనిచేసి కాల్వల వెంట తిరిగానన్నారు. కల్వకుర్తి ప్రాజెక్టు ద్వారా 2016లో రెండున్నర లక్షల ఎకరాలకు సాగునీరు అందించామన్నారు. హెలికాప్టర్ నుండి కిందకు చూస్తే ఏ చెరువుకింద చూసినా.. పచ్చగా కనిపిస్తున్నద న్నారు. ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు నిరంజన్‌రెడ్డి సూచన మేరకు చిన్నోనిపల్లి రిజర్వాయర్ గుండా అయిజ మండలంలోని ఆర్డీఎస్ పై కాలువ ఏడు గ్రామాలకు కూడా సాగునీరు అందించి రైతాంగాన్ని ఆదుకుంటామని తెలిపారు. పార్లమెంట్ సభ్యులు జితేందర్‌రెడ్డి సూచన మేరకు తనగల గ్రామం దగ్గర మల్లమ్మకుంట, జూలెకల్, వల్లూరు గ్రామాల్లో మూడు రిజర్వాయర్లు ఏర్పాటు చేసి నడిగడ్డ రైతాంగాన్ని ఆదుకుంటామన్నారు. కర్ణాటక ప్రాంతంలోని ఆర్డీఎస్ ఆనకట్ట ఎత్తు పెంచి అక్కడ జరుగుతున్న ఫేజ్-1, ఫేజ్-2 పనులను పూర్తి చేసి 87,500ఎకరాలకు సాగునీరు అందించి నడిగడ్డ రైతాంగాన్ని ఆదుకుంటామని తెలిపారు. తమది రైతు సంక్షేమ ప్రభుత్వమని, ఎరువుల కొరత లేకుండా రైతు పండించిన పంటకు మద్దతు ధర, ముందస్తుగా వచ్చే ఖరీఫ్ నుంచి పెట్టుబడుల కోసం ఎకరానికి సంవత్సరానికి రూ. 8వేలు చొప్పున కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. అలంపూర్ నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో రూ. 30లక్షలతో గోదాములు ఏర్పాటు చేశామన్నారు. భారతదేశంలోనే ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి లక్ష్మారెడ్డి, ఎంపీ జితేందర్‌రెడ్డి, జడ్పీ చైర్మన్ బండారి భాస్కర్, ఎమ్మెల్యేలు శ్రీనివాస్‌గౌడ్, గువ్వల బాలరాజు, మర్రి జనార్ధన్‌రెడ్డి, ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యే సంపత్‌కుమార్, అలంపూర్ మార్కెట్ యార్డు చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, గద్వాల మార్కెట్ యార్డు చైర్మన్ బండ్ల లక్ష్మిదేవి, తెరాస రాష్ట్రకార్యదర్శి బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, అలంపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి మంద శ్రీనాథ్, మండల టీఆర్ఎస్ పార్టీ కన్వీనర్ చంద్రశేఖర్‌గౌడ్ మాజీ డీసీసీబీ చైర్మన్ గట్టు తిమ్మప్ప, జడ్పీటీసీ వెంకటేశ్వరమ్మ, ఎంపీపీ సుజాత, వైస్ ఎంపీపీ శ్రీనివాసులు, సర్పంచు గోవిందమ్మ, ఎంపీటీసీ గోవిందమ్మ పాల్గొన్నారు.


తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకం విహంగ వీక్షణం

400 డిగ్రీ కాలేజీల మూత?

(మొదటిపేజీ తరువాయి)

ఇంక్యూబేటర్‌ను ఏర్పాటు చేయాలని టెక్విప్ ప్రధాన ఉద్దేశ్యం. ఈ ప్రోగ్రామ్ ద్వారా నూనత ఆవిష్కరణలు చేయడంతోపాటు యూనివర్సిటీలోని అధ్యాపకులకు నైపుణ్య శిక్షణను క్రమం తప్పకుండా ఇవ్వనున్నారు. వాటితోపాటు ఉపాధి అవకాశాలు, ఇతర ఇన్నోవేషన్లను చేయించాలనే ఉద్దేశంతో ఈ ప్రోగ్రామ్‌ను ఏర్పాటు చేయనున్నారు. ప్రస్తుతం 5 యూనివర్సిటీల్లో ఇంక్యూబేటర్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఉస్మానియా, కాకతీయ, జెఎన్‌టియు, జెఎన్‌యుఎఫ్ఎ, ఆర్‌జేకేయుటిలో ఇంక్యూబేటర్లను ఐటి శాఖ సహకారంతో ఏర్పాటు చేసింది. అయితే వీటిని రాష్ట్రంలో ఉన్న అన్ని యూనివర్సిటీల్లోనూ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ప్రతి ఇంక్యూబేటర్‌కు రూ. 2 కోట్ల వరకు ఆర్థికసాయాన్ని ఐటీ శాఖ అందజేయనుంది. అయితే ఈ నిధులు సరిపోవని వాటిని భవిష్యత్‌లో పెంచాల్సిన అవసరం ఉంటుంది.

పలు నిర్ణయాలకు ఆమోదం

2024 పరస్పెక్టివ్ రిపోర్ట్‌పైకూడా సమావేశంలో చర్చించారు. న్యూస్ లెటర్‌ను తీసుకురావాలని నిర్ణయించారు. ఆరు నెలలకొకసారి తీసుకురావాలని ప్రతిపాదించగా దానిని మూడు నెలలకొకసారి తీసుకురావాలని సూచించారు. అదేవిధంగా యూనివర్సిటీలకు సంబంధించి రాష్ట్రస్థాయిలో బెస్ట్ టీచర్స్ అవార్డులను ఇవ్వాలని నిర్ణయించారు. 10 నుంచి 12 మందికి ఈ అవార్డులను ఇవ్వనున్నారు. 2018లో నిర్వహించాల్సిన వివిధ ప్రవేశ పరీక్షల తేదిలు, నిర్వహణ యూనివర్సిటీలు తదితర వాటిపై ఈసీ అనుమతి తీసుకున్నారు. కాంట్రాక్ట్ లెక్చరర్ల వేతనాల పెంపుపై వేసిన కమిటీ నివేదికకు ఈసీ అమోదం తెలిపింది. అదనంగా ఉన్న దాదాపు 350 నుంచి 400 కాలేజీల వరకు మూసేసేలా ఉన్నత విద్యా మండలి ఆలోచిస్తోంది.

ఇప్పటికే గోదావరిఖనిలో 5 డిగ్రీ కాలేజీలు ఉన్నాయి. వాస్తవంగా అక్కడ రెండు డిగ్రీ కాలేజీలు నడవగలిగే పరిస్థితే ఉంది. అక్కడ ఉన్న 5 కాలేజీల యాజమాన్యాలు చర్చించుకొని కేవలం రెండే కాలేజీలు ఉండేలాగా ప్రతిపాదనలు సిద్ధం చేసుకున్నట్టు తెలుస్తోంది.

ఇదే విధంగా రాష్ట్ర వ్యాప్తంగా ప్రైవేటు యాజమాన్యాలు నిర్ణయం తీసుకుని కాలేజీలను తగ్గించుకోవాలని ఉన్నత విద్యా మండలి సూచిస్తోంది. కాలేజీలు ఆ రకంగా ప్రయత్నం చేయకపోతే ఉన్నత విద్యా మండలే స్వయంగా అటువంటి ప్రయత్నాలను సంక్రాంతి పండుగ తర్వాత నుంచి ప్రారంభించనుంది. అందు కు సంబంధించి ఇప్పటికే స్పష్టమైన ప్రణాళికను ఉన్నత విద్యా మండలి నిర్ణయించుకున్నట్టు సమాచారం.

తెలంగాణ రాష్ట్రంలో నాణ్యమైన ఉన్నత విద్యను అందించడం కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు ప్రారంభించింది. అందులో భాగంగా రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల్లో పరిశోధనలు చేయడంతోపాటు, నూతన ఆవిష్కరణలను చేపట్టడం కోసం ఇంక్యూబేటర్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఇప్పటికే రాష్ట్ర ఐటీ శాఖతో తెలంగాణ ఉన్నత విద్యా మండలి అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. రాష్ట్రంలో నాణ్యమైన ఉన్నత విద్యను అందించడం కోసం ప్రత్యేకంగా ఒక మెకానిజమ్‌ను శాశ్వతంగా ఏర్పాటు చేయాలని ఉన్నత విద్యా మండలి నిర్ణయించింది. అందులో భాగంగా తెలంగాణ హయ్యర్ ఎడ్యుకేషన్ క్వాలిటీ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రామ్ (టిహెచ్‌ఈ- క్యూయుఐపి)ను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది.

రైతుకి కరెన్సీ దెబ్బ..!

(మొదటిపేజీ తరువాయి)

రాష్ట్ర వ్యాప్తంగా చెలామణిలో ఉన్న మొత్తం రూ.700 కోట్లు మాత్రమే. ఇప్పుడున్న పరిస్థితుల్లో అమల్లో ఉన్న సంక్షేమ పథకాలకు నెలనెలా నిధులను సమకూర్చడమే గగనమవుతోంది. అందుకు తోడు వచ్చే ఏప్రిల్ నెలాఖరు మొదలుకుని అమలు చేయాలని సంకల్పించిన పంట పెట్టుబడి మద్దతు పథకానికి నిధులు సమకూర్చడం ప్రశ్నార్థకంగా మారుతోంది. ఈ పథకానికి ఏకకాలంలో సుమారు



రూ.5వేల కోట్లు అవసరమవుతుండడంతో మంత్రివర్గ ఉపసంఘానికి మార్గం తోచడంలేదు. అలాగని గడిచిన ఆరు నెలల కాలంగా రైతు కుటుంబాలకిస్తున్న వాగ్దానాన్ని అమలు చేయడం అనివార్యంగా మారింది. దేశవ్యాప్తంగా నగదు కొరత సమస్య తీవ్రంగా ఉన్న ఈ పరిస్థితుల్లో అంత పెద్ద మొత్తాన్ని ఏ విధంగా సమకూర్చుకోవాలో తెలియక అధికార యంత్రాంగం సతమతమవుతోంది. ఆర్థికపరమైన అంశాలపై ఉన్నతాధికారులు మంత్రివర్గ ఉపసంఘానికి వాస్తవ నివేదికను వెల్లడించడంతో వారంతా ఒక్కసారిగా తెల్లముఖం వేశారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్ళి పరిష్కారమార్గం ఆలోచించాలని మంత్రులు నిర్ణయించారు.

విస్తరణాధికారుల ద్వారా బట్వాడా?

ఈ ఏడాది ఖరీఫ్ నుంచి అమలు చేయాలని నిర్ణయించిన పంట పెట్టుబడి రాయితీ పథకం మొత్తాన్ని వ్యవసాయ విస్తరణాధికారుల ద్వారా బట్వాడా చేయాలని మంత్రివర్గ ఉపసంఘం సూచనప్రాయ నిర్ణయం తీసుకుంది. ఈ విషయంపై సాధ్యాసాధ్యాలను పరిశీలించి అమలుకు చర్యలు తీసుకోవాలని మంత్రులు అభిప్రాయపడ్డారు. ఈ అంశంపై త్వరలోనే వ్యవసాయ విశ్విద్యాలయం అధికారులు, శాస్త్రవేత్తలతో, జిల్లా వ్యవసాయాధికారులతో చర్చించేందుకు ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నారు.

అపోహలను నివృత్తి చేద్దాం

ప్రభుత్వం ప్రకటించిన విధంగా రాష్ట్ర రైతాంగానికి ముందస్తు పెట్టుబడిగా ప్రతి సీజన్‌కు ఎకరాకు రూ.4వేల చొప్పున ఎలాంటి ఇబ్బంది లేకుండా సమకూర్చాలనే అంశంపై లోతుగా చర్చించి విధానాలను రూపొందిస్తామని వ్యవసాయశాఖ మంత్రి పోచారం శ్రీనివాసరెడ్డి తెలిపారు. సోమవారం సచివాలయంలో మంత్రివర్గ ఉపసంఘం సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, సంక్షేమ కార్యక్రమాలపై దేశమంతా తెలంగాణవైపు చూస్తోందన్నారు. రెవెన్యూ రికార్డు ప్రక్షాళన తర్వాత కేటగిరి 'ఎ' కింద రాష్ట్రంలో 71,75,000 మంది రైతు ఖాతాలు ఉన్నట్లు లెక్క తేలిందన్నారు. మొదటి సమావేశంలో అందరి అభిప్రాయాలను తీసుకున్నామన్నారు. కమిటీ సభ్యులు గ్రామాలలో సభలు, సమావేశాల ద్వారా రైతులు, ప్రజా ప్రతినిధుల అభిప్రాయాలను తెలుసుకోవాలని సూచించినట్లు చెప్పారు.

10న మరోసారి సమావేశం

ఈనెల 10న మరోసారి సమావేశమై అన్ని అంశాలపై మరింత లోతుగా చర్చిస్తామన్నారు. ప్రభుత్వం ఇచ్చే ఈ పంట పెట్టుబడి పథకం నగదు నేరుగా రైతులకు చేరాలన్నదే లక్ష్యమని మంత్రి పోచారం వెల్లడించారు. ప్రస్తుతం రైతులకు ఉన్న బ్యాంకు ఖాతాలోనే ఈ నగదు జమచేస్తే పాత బకాయిల కింద జమ కడతారని రైతులు అనుమానం వ్యక్తం చేస్తున్నట్లు పేర్కొన్నారు. దీనికై రాష్ట్రస్థాయి బ్యాంకర్ల కమిటీ అభిప్రాయాన్ని అడిగామని, వారు మరుసటి సమావేశంలో స్పష్టమైన విషయాన్ని చెబుతామని హామీ ఇచ్చారని తెలిపారు. నిపుణుల అభిప్రాయాలను, సలహాలను పరిగణలోకి తీసుకొని అందరికీ ఆమోదయోగ్యమైన నిర్ణయం తీసుకుంటామన్నారు.ఈ సమావేశంలో మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, టి.హరీష్‌రావు, ఈటల రాజేందర్, కేటీ రామారావు, ప్రభుత్వ ప్రత్యేక సలహాదారు రాజీవ్ శర్మ, వ్యవసాయశాఖ కార్యదర్శి సి.పార్థసారధి, ఆర్థికశాఖ కార్యదర్శి రామకృష్ణ వ్యవసాయశాఖ కమిషనర్ ఎం.జగన్మోహన్, కొండూరు రవీందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కాళేశ్వరంలో మహా పంప్‌హౌజ్

హైదరాబాద్, ఆంధ్రప్రభ: కాళేశ్వరం ఎత్తిపోతల పథకం పనులు కొత్త రికార్డులు నమోదుచేస్తున్నాయి. కరీంన గర్ జిల్లా లక్ష్మీపూర్‌లో జరుగుతోన్న 8వ ప్యాకేజీలో ఆసియాఖండంలోనే అతిపెద్ద పంప్‌హౌజ్ ఏర్పాటుచేస్తున్నా రు. ఇక్కడికి చేరిన నీటిని ఎత్తిపోయ డం ఈ ప్రాజెక్ట్‌లోనే ఓ అద్భుత ప్రక్రియగా అధికారులు చెబుతున్నా రు. లక్ష్మీపూర్ పంప్‌హౌజ్ సొరంగం లో ఏర్పాటుచేస్తున్న పంపులన్నీ స్వదేశీ టెక్నాలజీతో తయారుచేసినవే నని అధికారులు అంటున్నారు. కాళే శ్వరం పనులు ప్రస్తుతం శరవేగంగా జరుగుతుండగా, ఈ ఏడాదే ప్రాజెక్టు ఫలాలు ప్రజలకు దక్కనున్నాయి.

మండలి ఉపసభాపతికి మాతృవియోగం



హైదరాబాద్, ఆంధ్రప్రభ: శాసనమండలి ఉపసభాపతి నేతి విద్యాసాగర్ తల్లి రాధమ్మ సోమవారం ఉదయం మృతిచెందారు. నిమ్స్ ఆస్పత్రిలో మృతిచెందిన రాధమ్మ మృతదేహాన్ని విద్యాసాగర్ స్వగ్రామం నకిరేకల్ నియోజకవర్గ పరిధిలోని కేతేపల్లి మండలం చెరుకుపల్లికి తీసుకువెళ్ళారు. విద్యాసాగర్‌కు మాతృవియోగం పట్ల రాష్ట్ర విద్యుత్ శాఖా మంత్రి జగదీష్‌రెడ్డి తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.

చితకబాది.. శీర్షాసనం వేయించాడు

- జహీరాబాద్ ప్రభుత్వ వసతి గృహంలో వార్డెన్ నిర్వాకం



హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఇద్దరు విద్యార్థుల చేత గోడకు శీర్షాసనం వేయించి, ఓ వార్డెన్ చితకబాదిన ఉదంతం వెలుగుచూసింది. కాళ్లను గోడకు ఆనించి, తలలు కిందకు ఉంచి ఆ తర్వాత పైప్‌తో చితకబాదుతూ వార్డెన్ ఇద్దరు మైనర్ బాలురను చిత్రహింసలు పెట్టాడు. అల్లరి చేశారనే కారణంతో ఏడో తరగతి చదువుతున్న ఆ విద్యార్థులకు వార్డెన్ కఠిన దండన విధించాడు. హైదరాబాద్‌కు వంద కిలోమీటర్ల దూరంలో గల జహీరాబాద్ ప్రభుత్వ వసతి గృహంలో ఈ తంతు తరచుగా జరుగుతోందని అంటున్నారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. కాగా, విద్యార్థులు కొట్టుకున్నారని తమకు ఫిర్యాదు చేశారని, మందలించడానికి మాత్రమే అలా చేశానని వార్డెన్ సంజాయిషీ ఇచ్చారని గిరిజన సంక్షేమశాఖ అధికారి మణెమ్మ అంటున్నారు. గతంలోనూ విద్యార్థుల గొడవని తల్లిదండ్రుల దృష్టికి తీసుకెళ్లామని, అయినప్పటికీ మార్పు రాకపోవడంతో భయం చెప్పానని వార్డెన్ తెలిపారని మణెమ్మ చెప్పారు. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ ఎస్టీ హాస్టల్ వార్డెన్ యాదయ్య ఇద్దరు విద్యార్థులపై పైశాచికంగా వ్యవహరించినట్లు ఆరోపణలు వచ్చాయి. అయితే రెండు రోజుల క్రితం ఈ సంఘటన జరిగింది.

విద్యార్థుల పట్ల కఠినంగా వ్యవహరించిన అధికారిపై చర్యలు

విద్యార్థుల పట్ల కఠినంగా వ్యవహరించిన హాస్టల్ వార్డెన్‌పై చర్యలు తీసునేందుకు జిల్లా కలెక్టర్‌కు రిపోర్టు చేస్తామని జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ అధికారి మాణెమ్మ తెలిపారు. పట్టణంలోని ఎస్టీ బాలుర వసతి గృహంలో ఇద్దరు విద్యార్థులకు తలకిందులుగా చేసి బాదిన వార్డెన్‌పై ఫిర్యాదు రావడంతో సోమవారం సాయంత్రం జహీరా బాద్ ఆర్డీవో అబ్దుల్ హమీద్‌తో కలిసి హాస్టల్‌లో నిర్వహించిన విచారణలో విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులతోటి విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులు బాగ చదువుకోవాలని అల్లరి చేస్తే దండించాలనే విషయం తల్లిదండ్రులే చెప్పారనే విషయాన్ని అధికారులు తెలుసుకున్నారు. విద్యార్థుల పట్ల ఇలా ప్రవర్తించడం మంచిది కాదని, జరిగిన సంఘటనకు సంబంధించి విచారణ చేపట్టామని తెలిపారు.

వార్డెన్ యాదయ్య చేసిన పన మంచిది కాదని, ఇలాంటివి పునారావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు. వసతి గృహంలో విద్యార్థులకు మంచి భోజనం, అన్ని సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ఆర్‌డిఒ అబ్దుల్ హమీద్ మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకొవాలని, ఏవైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకొస్తే వెంటనే చర్యలు తీసుకుంటామని తెలిపారు. వసతి గృహంలో జరిగిన సంఘటనకు సంబంధించి జిల్లా అధికారులకు సమాచారం అందిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి కిషన్ పవర్, ఎంఈఒ బస్వరాజ్, ఆర్ఐ షఫియోద్దిన్, తదితరులు ఉన్నారు.



రైతు సమితులే సంక్షేమ ఇరుసులు



(మొదటిపేజీ తరువాయి)

ఏర్పాటైన వెంటనే మండల సమాఖ్యలను కూడా ఏర్పాటు చేశారు.

త్వరలోనే జిల్లా, రాష్ట్ర సమన్వయ సమితుల ఏర్పాటు, బాధ్యతలు

త్వరలోనే జిల్లా, రాష్ట్రస్థాయి కమిటీలను ఏర్పాటు చేసేందుకు చర్యలు కొనసాగుతున్నాయి. ఇదివరకు దశాబ్ధకాలం పాటు వ్యవసాయ రంగం ఎదుర్కొన్న దుర్భిక్ష పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని బాధ్యతలు అప్పగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. వ్యవసాయంతో పాటు అనుబంధ రంగాల్లోనూ పూర్వ వైభవం తీసుకురావడంతో పాటు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని క్షేత్రస్థాయిలో మెరుగైన వనరులను అందుబాటులోకి తీసుకురానున్నారు. అదే సమయంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేసేందుకు ఉన్నతాధికార యంత్రాంగం నిర్ధిష్టమైన కార్యాచరణను సిద్ధం చేసుకుంది. చిన్న, సన్నకారు రైతు కుటుంబాల ఆర్థిక స్థితిగతులపై అధ్యయనం చేసి పరిష్కార మార్గాలు సూచిస్తూ ప్రభుత్వానికి సిఫార్సు చేసేందుకు సరికొత్త వ్యవస్థను నెలకొల్పనున్నారు. రైతు పక్షపాతిగా పనిచేస్తున్న సీఎం కేసీఆర్ ఆలోచన మేరకు ఈ వ్యవస్థకు సంబంధించి గత మూడు నెలల కాలంగా వ్యవసాయ, అనుబంధ శాఖల ఉన్నతాధికారులు కసరత్తు చేసి ప్రతిపాదనలు సిద్ధం చేశారు.

రైతుల అవసరాలు తెలుసుకునేందుకు పారదర్శక వ్యవస్థ

గ్రామాల్లో ఎప్పటికప్పుడు రైతుల అవసరాలను తెలుసుకుంటూ, వారికి కావాల్సిన సహాయ, సహకా రాలకు అందిస్తూ వ్యవసాయం, అనుబంధ రంగాలను ముందుకు నడిపించేందుకు గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ఒక పారదర్శక వ్యవస్థను అందుబా టులోకి తీసుకువస్తున్నారు. ఖరీఫ్ ప్రారంభం మొదలు కుని గ్రామ, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో సమన్వ య సంఘాలు కార్యాచరణ ప్రణాళిక అమలుకు శ్రీకారం చుడుతున్నాయి. ఇటీవల ప్రగతి భవన్‌లో జరిగిన సమావేశంలో ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలను పరిశీలించిన సీఎం కేసీఆర్ తనకున్న ముందుచూపు విధానం, సరికొత్త ఆలోచన మేరకు మార్గదర్శకాలు జారీ చేశారు. రైతు కుటుంబాలకు ప్రభుత్వ పరంగా ఎలాంటి సబ్సిడీలు, రాయితీలు అందించాలన్నా సంబంధిత పథకాలను ఈ కమిటీల పర్యవేక్షణలోనే అమలు చేస్తారు. సీఎం ఆమోదించిన ప్రతిపాదనల ప్రకారం 42 మంది సభ్యులతో ఈ నెలాఖరు నాటికి తెలంగాణ రాష్ట్రీయ రైతు సమన్వయ సమితి కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయనున్నారు.

బడ్జెట్‌లో రూ.1000 కోట్ల నిధులు

రాష్ట్ర కేబినెట్ హోదాలో రాష్ట్ర రైతు సమన్వయ సమితి అధ్యక్షుణ్ణి నియమించనున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు వచ్చే బడ్జెట్‌లో ఈ సంస్థ కార్యకలాపాలకు రూ.1000 కోట్ల ప్రత్యేక బడ్జెట్‌ను కూడా కేటాయించనున్నారు.

ఈ పదవికి పోటీ పడుతున్న వారిలోంచి కొంతమంది పేర్లు ముఖ్యమంత్రి పరిశీలనలో ఉన్నాయి. త్వరలోనే తుదినిర్ణయం వెలువడనుంది. అలాగే 24 మంది సభ్యులతో జిల్లాస్థాయి, మండల స్థాయి రైతు సమన్వయ సమితిలను ఏర్పాటు చేయనున్నారు. 15 మంది సభ్యులతో గ్రామ రైతు సమన్వయ సమితిలు ఏర్పాటైన విషయం తెలిసిందే.

నోడల్ అధికారులుగా రెవెన్యూ యంత్రాంగం,

రాష్ట్రస్థాయిలో వ్యవసాయ శాఖ కమిషనర్ నోడల్ అధికారిగా వ్యవహరిస్తారు. అలాగే జిల్లా స్థాయిలో కలెక్టర్ నోడల్ అధికారిగా, మండల స్థాయిలో తహసిల్దార్, గ్రామస్థాయిలో వీఆర్వోలు కార్యనిర్వహ ణాధికారులుగా వ్యవహరిస్తారు.

గరిష్టంగా పక్షం రోజుల్లోగా ఈ ప్రక్రియను పూర్తి చేసేందుకు సీఎం కేసీఆర్ స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినట్లు తెలుస్తోంది. రైతు సమన్వయ సమితిల ఏర్పాటు ప్రక్రియను పర్యవేక్షించేందుకు ప్రతి మూడు జిల్లాలకు ఒకరి చొప్పున మంత్రులకు బాద్యతలు అప్పగించారు.

సత్యం బ్రూయాత్, ప్రియం బ్రూయాత్
నబ్రూయాత్ సత్యమప్రియం, ప్రియంచ నానృతం బ్రూయాత్

ఆంధ్రప్రభ

మంగళవారం 9 జనవరి 2018

వాక్ స్వేచ్ఛ అంటే ఇదేనా?

వాక్ స్వేచ్ఛకూ, పత్రికా స్వేచ్ఛకూ తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని కేంద్ర న్యాయశాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్ ఆధార్ కార్డుల గోప్యత వివాదంపై సమాధానమిస్తూ హామీ ఇచ్చిన రోజునే, ఢిల్లీలో దళిత నాయకుడు జిగ్నేష్ మేవానీ బహిరంగ సభకు అనుమతి ఇవ్వకపోవడం ప్రభుత్వ ద్వంద్వ ప్రమాణాలకు నిదర్శనం. ప్రధానమంత్రి మోడీ స్వరాష్ట్రమైన గుజరాత్‌లో ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో దళితులందరినీ సంఘటిత పరిచిన జిగ్నేష్ నాయకత్వంలో తమ కోర్కెలు సాధించుకోవాలని దేశంలోని పలుప్రాంతాల్లో దళితులు ముందుకు వస్తున్నారు. మహారాష్ట్రలోని పూణే సమీపంలో కోరేగావ్‌లో ఇటీవల జరిగిన ఆందోళన సందర్భంగా ఆయనను ఆహ్వానించారు. బాధితుల వద్దకు తనను వెళ్ళనివ్వకుండా పోలీసులు అడ్డుకున్నారని జిగ్నేష్ ఆరోపించారు. తన వద్ద ఎటువంటి ఆయుధాలు లేనప్పటికీ, తనను అరెస్టు చేయడాన్ని తన వాక్ స్వేచ్ఛను ప్రభుత్వం హరిస్తోందనడానికి ఇది నిదర్శనమని జిగ్నేష్ సోదాహరణంగా పేర్కొన్నారు. జిగ్నేష్ దళితుల తరఫున పోరాడుతున్న మాట నిజమే కానీ, కేవలం కులం ముద్ర వేయకుండా, సమాజంలో ఇప్పటికీ కొనసాగుతున్న అంటరానితనం, అన్యాయాలకు వ్యతిరేకంగా సాగిస్తున్న పోరాటంగానే అతడి ఉద్యమాన్ని చూడాల్సిఉంటుంది. గుజరాత్ ఎన్నికల సందర్భంగా సౌరాష్ట్ర, దక్షిణ గుజరాత్ ప్రాంతాల్లో బీజేపీ బాగా దెబ్బతినడానికి కుల సమీకరణలు కూడా కారణం కావచ్చు కానీ, అవే ప్రధాన కారణం కాదు. సమాజంలో అంతరాలు పెరుగుతున్న వాస్తవాన్ని పాలకవర్గాలు గుర్తించకపోతే అట్టడుగు వర్గాల్లో అసంతృప్తి ఎన్నికల సమయంలో వ్యక్తం అవుతూ ఉంటుంది. ప్రధానమంత్రి మోడీకి ఈ విషయం తెలుసు కనుకనే, దళితులు, వృత్తిపరమైన వర్గాలకు అనేక రాయితీలు ప్రకటించారు. అయితే, ఆర్థిక తోడ్పాటు, పథకాల ద్వారా ప్రయోజనం కన్నా, సామాజికంగా తమకు గుర్తింపు, గౌరవం కోసం అట్టడుగువర్గాలు పోరాటం సాగిస్తున్న వాస్తవాన్ని పాలకవర్గాలు గుర్తించాలి. ఇంతవరకూ దేశంలో దళితుల తరఫున జరిగిన ఉద్యమాలు వేరు, ఇప్పుడు జిగ్నేష్ నేతృత్వంలో సాగుతున్న ఉద్యమం వేరు. అట్టడుగు వర్గాల్లో విద్యావంతులు ఇప్పుడు నాయకత్వ బాధ్యతలను స్వీకరిస్తున్నారు. వారి ప్రతినిధే జిగ్నేష్. ముంబాయిలో కూడా ఆయన పాల్గొనే ర్యాలీకి అక్కడి పోలీసులు అనుమతి ఇవ్వలేదు. ఇప్పుడు ఢిల్లీలో పోలీసులు అనుమతి ఇవ్వకపోవడం వల్ల తమ పట్ల వివక్షకు ఇదే నిదర్శనమన్న అట్టడుగువర్గాల వాదనకు బలం చేకూరుతుంది. ఢిల్లీ, ముంబాయిలలో ఇప్పట్లో ఎన్నికలు ఏమీ లేవు. జిగ్నేష్ ర్యాలీల వల్ల బీజేపీకి వచ్చే తక్షణ నష్టం ఏమీ లేదు. అటువంటప్పుడు ర్యాలీలకు అనుమతి ఇవ్వకపోవడం ఉద్దేశ్య పూర్వకంగా ప్రభుత్వం వ్యవహరిస్తోందన్న అపవాదుకు ఆధారం అవుతుంది. రెండేళ్ళ క్రితం సరిగ్గా జనవరిలోనే హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ రిసెర్చ్ స్కాలర్ రోహిత్ వేముల ఆత్మహత్య జరిగిన నాటి నుంచి యూనివర్సిటీల్లో విద్యార్థులు తరచూ ర్యాలీలు నిర్వహిస్తూ బీజేపీ నేతృత్వంలోని ఎన్‌డిఏ పాలనలో పెరుగుతున్న అసహన ధోరణులను ఎండగడుతున్నారు. జిగ్నేష్ కూడా తమ రాష్ట్రంలో గోరక్షకుల దాడుల్లో దెబ్బతిన్న దళితులను సమీకరించడం ద్వారానే ఎమ్మెల్యే అయ్యాడు. ఇప్పుడు జాతీయ స్థాయికి ఎదిగేందుకు ప్రయత్నాలు చేసుకుంటున్నారు. ఆయన పిలుపునకు దళితులు ఏమేరకు స్పందిస్తారో, ఎంతమంది ఆయన వెంటనడుస్తారో తెలియదు. అప్పుడే ఆయన పై ఆంక్షలు విధించడంవల్ల మరో నాయకుడు దేశ రాజకీయాల్లో తయారు కావడానికి కారణం అవుతుందే తప్ప వెంటనే ఒరిగే ప్రయోజనం ఏమీ ఉండదు. రోహిత్ వేముల ఆత్మహత్య పర్యవసానంగా ఢిల్లీ యూనివర్సిటీలో విద్యార్థుల ర్యాలీలకు ఆంక్షలు విధించడం వల్ల కన్హయ్ కుమార్, ఒమర్ ఖలీద్ వంటి నాయకులు జాతీయ స్థాయిలో ప్రాచుర్యాన్ని సంపాదించుకున్నారు. తొక్కిపట్టే ధోరణుల వల్ల ఆవలి వ్యక్తులకు మరింత బలం చేకూరుతుందే తప్ప వేరే ప్రయోజనం ఉండదు. పైగా, ప్రభుత్వం వాక్ స్వేచ్ఛను హరిస్తోందనే అపవాదును మూటగట్టుకోవల్సి వస్తుంది. ఢిల్లీ, ముంబాయిలలో ప్రస్తుతం ఎటువంటి ఉద్రిక్తతలూ లేవు. జిగ్నేష్ ర్యాలీవల్ల వాతావరణం ఒక్కసారిగా మారిపోయే అవకాశం ఏమీలేదు. ఢిల్లీలో శాంతి భద్రతల అంశం కేంద్రం పరిధిలోనే ఉన్న దృష్ట్యా, జిగ్నేష్ ర్యాలీకి కేంద్రమే మోకాలడ్డుతోందని ఆయన అనుచరులు ఆరోపిస్తున్నారు. వాక్ స్వేచ్ఛను అరికట్టేందుకు గతంలో ప్రయత్నించిన ప్రభుత్వాలు చేతులు కాల్చుకోవల్సి వచ్చిందన్న వాస్తవాన్ని మరువకూడదు.

తలాఖ్‌లో దిద్దుబాట్లు తప్పవ్!



విశ్లేషణ
అనితా సలుజా
సీనియర్ పాత్రికేయురాలు

ముమ్మారు తలాఖ్ హీనమైనదని అత్యున్నత న్యాయస్థానం ప్రకటించిన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ట్రిపుల్ తలాఖ్‌ను నిషేధించింది. అప్పటికప్పుడు మూడుసార్లు తలాఖ్ చెప్పి విడాకులు తీసుకోవడం ఇకపై చెల్లదని పేర్కొంది. 2017 ముస్లి మహిళల బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టింది. లోక్‌సభలో ఆమోదం పొందిన ఈ బిల్లు రాజ్యసభలో చిక్కుకుపోయింది. ప్రతిపక్షానికి అక్కడ ఆధిక్యత ఉండడమే దీనికి కారణం. జనవరి 29నుంచి ప్రారంభం కానున్న బడ్జెట్ సమావేశాలలో దీనిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఆమోదింపజేసుకోవాలని భారతీయ జనతా పార్టీ కృతనిశ్చయంతో ఉంది. ట్రిపుల్ తలాఖ్‌ను నేరపూరితమైన చర్యగానే కాకుండా, మూడేళ్ళవరకూ జైలు శిక్ష కూడా పడే అవకాశమున్న ఈ బిల్లును ఆమోదింపజేసుకునేందుకు ప్రభుత్వం మరోమారు ప్రయత్నిస్తుంది.

వాస్తవానికి తలాఖ్ అనేది రెండు బిల్లు కథ. 1986లో అప్పటి ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ ది ముస్లిం ఉమెన్(ప్రొటెక్షన్ ఆఫ్ రైట్స్ ఆన్ డైవోర్స్) బిల్లును తెచ్చారు. షాబానో కేసులో అత్యున్నత న్యాయస్థానం తీర్పును రద్దుచేయడానికి ఆయనీ చర్యకు పూనుకున్నారు. ఈ కేసులో షాబానోకు జీవితాంత భరణం ఇవ్వాలని సుప్రీం కోర్టు తీర్పు చెప్పింది. అప్పట్లో 60ఏళ్ళ మహిళ షాబానో తాను జీవించి ఉన్నంతకాలం విడాకులిచ్చిన భర్తనుంచి భరణం ఇప్పించాలని ఆమె కోర్టును కోరింది. సిపిసి 125 కింద షీబానో భరణాన్ని పొందడానికి అర్హురాలని ఆదేశాలిచ్చింది. ముస్లిం ఉలేమాల నుంచి వచ్చిన నిరసనల కారణంగా సుప్రీం తీర్పును రద్దుచేయడానికి రాజీవ్ గాంధీ బిల్లును తెచ్చారు. మూడూ దశాబ్దాల అనంతరం 2017లో షాయరా బానో కేసు ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ చేతికి ట్రిగర్‌ను అందించింది. ది ముస్లిం ఉమెన్(వివాహ హక్కుల పరిరక్షణ)బిల్లు 2017ను తెచ్చేందుకు దోహదపడింది. షాయరా బానో సోషియాలజీలో పోస్టు గ్రాడ్యుయేషన్ చేశారు. పెళ్ళయ్యిన 13ఏళ్ళ అనంతరం ఇద్దరు పిల్లలున్న ఆమెకు భర్త రిజ్వాన్ అహ్మద్ స్పీడ్ పోస్టు ద్వారా 2015లో తలాక్ చెప్పి, విడాకులు తీసకున్నాడు. ఈ అంశంపై షాయరా సుప్రీం కోర్టు తలుపు తట్టింది. ట్రిపుల్ తలాఖ్‌ను రద్దు చేయాలని కోరింది. ఈ కేసులో ఆమె తొలి పిటిషనర్. నోటితో కానీ, టెలిఫోన్‌లో గానీ, రాతపూర్వగా గానీ, వాట్సాప్‌లో గానీ, ఎస్ఎంఎస్ ద్వారా గానీ తలాఖ్ చెప్పడం చట్ట విరుద్ధమూ, హీనమైనదని ప్రకటించింది సుప్రీం కోర్టు. ఈ ఉత్తర్వులను ధిక్కరించిన వారు జైలు శిక్షకు అర్హులు.

ట్రిపుల్ తలాఖ్‌ను రద్దు చేస్తామని ఉత్తర ప్రదేశ్ ఎన్నికల ప్రచారంలో భారతీయ జనతా పార్టీ ఓటర్లను హామీ ఇచ్చింది. ఆ హామీకి బీజేపీ కట్టుబడింది. ఇందులో రాహుల్ గాంధీ నేతృత్వంలోని కాంగ్రెస్ పార్టీ చిక్కుకుపోయింది. ఈ అంశంలో బీజేపీని సమర్థించడానికి కాంగ్రెస్ సిద్ధంగా లేదు. అలాగని వ్యతిరేకించటమూ లేదు. ఈ బిల్లుపై ముస్లిం మహిళల నుంచి వెల్లువెత్తుతున్న స్పందన కాంగ్రెస్‌కు పచ్చి వెలక్కాయ గొంతులో పడినట్టుగా మారింది. లోక్ సభలో తమ బలం తెలుసు కాబట్టి, బిల్లును కాంగ్రెస్ సభ్యులు అభ్యంతర పెట్టడానికి పరిమితమయ్యారు. రాజ్యసభలో అధికార పక్షానికి ఆధిక్యత లేదు కాబట్టి, కాంగ్రెస్ నిద్రలేచింది. ప్రతిపక్షాన్ని కూడగట్టింది. బీజేపీకి మిత్రపక్షాలైన టీడీపీ, ఏఐఏడీఎమ్‌కె, తటస్థంగా ఉండే బీజేడీ పార్టీలు కూడా ప్రతిపక్షంతో చేతులు కలిపాయి. మొత్తం 17పార్టీలు బిల్లును ఇప్పుడున్న రీతిన ఆమోదించడానికి అభ్యంతరం చెబుతున్నాయి. కాంగ్రెస్‌కు ఈ అంశం ఆయుధాన్ని చేతికిచ్చింది. షాబానో కేసు అనుభవంతో కాంగ్రెస్ ప్రస్తుత బిల్లును పూర్తిస్థాయిలో వ్యతిరేకించలేదు. ఎందుకంటే అది మిగిలి ప్రతిపక్షాల భుజాలను అధికారపక్షంపై దాడికి వాడుకుంటోంది కాబట్టి. అన్ని ప్రతిపక్ష పార్టీలు బిల్లును సెలెక్ట్ కమిటీకి పంపాలని డిమాండ్ చేస్తున్నాయి. అక్కడ చర్చించి, లోపాల్ని సవరించవచ్చని ప్రతిపక్షాల అభిప్రాయం. ఒక నెలలోపల సెలెక్ట్ కమిటీ ట్రిపుల్ తలాఖ్ బిల్లుపై అభిప్రాయాన్ని రాజ్యసభలో ప్రవేశపెట్టవచ్చని కూడా ప్రతిపక్షం పేర్కొంది. జనవరి 29 నుంచి బడ్జెట్ సెషన్ ప్రారంభమవుతోంది. ఈ నేపథ్యంలో సరిదిద్దిన బిల్లును రాజ్యసభలో ఎప్పుడు ప్రవేశపెట్టాలి? బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వానికీ, బీజేపీ నాయకత్వంలో సమైక్యమైన ప్రతిపక్షానికీ బిల్లు ప్రతిష్ఠాత్మకంగా తయారైంది. రెండు వర్గాలూ ముందు స్పందించదలచుకోలేదు. అలాగని పట్టు వీడదల్చుకోనూ లేదు. బిల్లులోని అంశాలను నీరు గార్చడం బీజేపీకి సుతరామూ ఇష్టం లేదు. అందుకే బిల్లును అది సెలెక్ట్ కమిటీకి పంపదలచుకోలేదు. అక్కడ కూడా ప్రతిపక్షానికే ఆధిక్యత ఉండడమే దీనికి కారణం.

తలాక్ రద్దు బిల్లును సెలక్ట్ కమిటీకి పంపాలని కాంగ్రెస్, ఇతర ప్రతిపక్షాలు పట్టపట్టాయి. అక్కడ మాత్రమే ఆ బిల్లుకు తాము కొన్ని సవరణలను ప్రతిపాదించగలమన్నది వాటి నిశ్చితాభిప్రాయం. ఎటువంటి వివక్ష లేకుండా అందరికీ న్యాయం చేకూరుతుందని కాంగ్రెస్, ప్రతిపక్షాలు వాదించాయి. ఈ బిల్లుకు సంబంధించి కొన్ని అంశాలను లోతుగా పరిశీలించాల్సి ఉంది. ఉదాహరణకు ఇస్లాం మతంలో పెళ్ళి అనేది భార్యా,భర్తలు కుదుర్చుకునే సివిల్ కాంట్రాక్ట్. అప్పటికప్పుడు తలాక్ ద్వారా విడాకులు తీసుకుంటే, నేరంగా ఎందుకు పరిగణించి, చర్య తీసుకోవాలన్నది ప్రశ్న. విడాకులిచ్చిన భర్త జైలుకి వెళ్ళడమనేది ఏ మతంలోనూ లేదు. ఇస్లాంలోనే ఎందుకు? ఇది ప్రతిబంధకంగా ఉన్న మాట నిజమేనని బీజేపీ కూడా పేర్కొంటోంది. కక్ష సాధింపు రాజకీయాలకు ఇది తెరలేపుతుందని కాంగ్రెస్ భావిస్తోంది.



ముమ్మారు తలాక్ చెప్పే పద్ధతి చెల్లదని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినప్పుడు భర్తను అరెస్టు చేయడం ఎందుకు? జైలులో పెట్టడం ఎందుకు? కుటుంబంలో ఆదాయం తెచ్చే వ్యక్తి జైలుకి వెళ్తే ఆ కుటుంబాన్ని ఎవరు పోషించాలి, ఆ కుటుంబం ఎలా గడుస్తుంది? అనే ప్రశ్నలు సమాధానం లేనివిగా మిగిలిపోతున్నాయి. ఇది శిక్షార్హమైన నేరం కనుక, ఫిర్యాదు భార్య నుంచే కాకుండా, మూడో వ్యక్తి ఎవరి నుంచైనా రావచ్చు. దీనిని బట్టి ముస్లిం వ్యక్తితో అమీతుమీ తేల్చుకోవడానికి ఎవరైనా అతడిని జైల్లో పెట్టవచ్చునని విమర్శకులు పేర్కొంటున్నారు.

మన దేశంలో ముఖ్యమైన మతాలకు వ్యక్తిగత చట్టాలు దేనివి దానికి ఉన్నాయి. ఈ చట్టాల ప్రకారమే పెళ్ళిళ్ళు, విడాకులు, వారసత్వ వివాదాలు, దత్తతలు, భరణాలు మొదలైనవి నిర్వహిస్తుంటారు.

ఈ బిల్లు విషయంలో బీజేపీ నేతృత్వంలోని ఎన్‌డిఏ ప్రభుత్వం తగిన హోం వర్క్ చేయలేదని విమర్శకులు పేర్కొంటున్నారు. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) అజెండా ప్రకారమే దీనిన రూపొందించారన్నది వారి వాదన. పర్సనల్ లా పేరిట ప్రాథమిక హక్కులకు భంగం కలగకుండా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ముమ్మారు తలాక్‌ని రద్దు చేస్తూ గత సంవత్సరం ఆగస్టులో సుప్రీంకోర్టు ఇచ్చిన చరిత్రాత్మకమైన తీర్పుపై అందరూ హర్షం ప్రకటించారు. ఇందుకు సంబంధించి తగిన చట్టాన్ని రూపొందించాల్సిందిగా సుప్రీంకోర్టు కేంద్రాన్ని ఆదేశించింది. బ్రిటిష్ పాలకులు తలాక్ చట్టాన్ని తెచ్చినప్పుడు, స్వతంత్ర భారత దేశంలో ఇందుకు పరిష్కారాలను సూచిస్తూ ప్రజాస్వామ్య ప్రభుత్వం ఎందుకు కొత్త బిల్లును తేకూడదన్న వాదన సహేతుకంగానే ఉంది.

సుప్రీం కోర్టు తన తీర్పులో తలాక్‌కి బదులు సరైన శాసనాన్ని తీసుకుని రావాలని కేంద్రాన్ని ఆదేశిస్తున్నామని పేర్కొంది. కొత్త శాసనాన్ని తీసుకుని వచ్చేటప్పుడు ముస్లిం పర్సనల్ లా--షరియత్‌ని కూడా పరిగణనలోకి తీసుకుంటారని ఆశిస్తున్నామని సుప్రీంకోర్టు పేర్కొంది. షరియత్‌ని ఇతర దేశాల్లో ఎలాగైతే దిద్దుబాటు చేశారో అలాగే మన దేశంలో చేస్తారని ఆశిస్తున్నామని సుప్రీంకోర్టు పేర్కొంది. ముస్లింల కోసం బ్రిటిష్ పాలకులు తెచ్చిన ఈ చట్టంలో ఇతర ఇస్లామిక్ దేశాల్లో దిద్దుబాటు చర్యలు తీసుకున్నప్పుడు మనం ఎందుకు వెనుకాడాలని సుప్రీంకోర్టు కేంద్రాన్ని ప్రశ్నించింది. మన దేశంలో కూడా ఈ చట్టాన్ని క్షుణ్ణంగా పరిశీలించి లోపాలు ఏమైనా ఉంటే దిద్దుబాటు చేసుకోవడం అత్యవసరం.

ముమ్మారు తలాక్ ద్వారా విడాకులు ఇచ్చే సంప్రదాయం వల్ల బాధలకు గురవుతున్న ముస్లిం మహిళలకు విముక్తి కలిగించేందుకు మోడీ ప్రభుత్వంఈ కొత్త బిల్లును తెచ్చినప్పటికీ, ఇలాంటి వివాదాస్పద అంశాలపై అందర్నీ సంప్రదించి ఏకాభిప్రాయాన్ని సాధించడం ప్రజాస్వామ్యంలో అత్యవసరం. ఈ బిల్లును ఏకపక్షంగా ఆమోదింపజేయకుండా, అందరినీ కలుపుకుని పోవడం ఎంతైనా అవసరం. బడ్జెట్ సమావేశాల్లో అన్ని రాజకీయ పార్టీలు ప్రతిష్టకూ, పంతాలకూ పోకుండా, చరిత్రాత్మకమైన సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో ఏ విధంగా తీసుకుని రావాలనేదానిపై దృష్టిని సారిస్తాయని ఆశిద్దాం.

క్షిపణులు నూరుతున్న అణుదేశాలు

అమెరికా తరచూ ఉత్తర కొరియాను రెచ్చ గొడుతూ యుద్ధం వైపు మళ్ళిస్తోంది. అదే అనివార్యమైతే ప్రపంచ మూడో యుద్ధం వస్తుందేమోనన్న ఆందోళన సర్వత్రా వ్యక్తం అవుతోంది. . అమెరికా పూర్వపు పట్టు కోల్పోయినా ఇప్పటికీ అగ్రరాజ్యంగా, ప్రపంచ దేశాలపై కన్నేసి సహజ వనరుల్ని దోచుకుంటోంది. గుత్తాధిపత్యానికై అమెరికా తహతహలాడుతుంది. 2003లో అమెరికా ఇరాక్‌పై జరిపిన దాడికి 24 లక్షల కోట్ల రూపాయలని వెచ్చించింది. ఇరాక్ ఇప్పటికీ కోలుకోలేదు. ఇంకా సంక్షోభంలో ఉంది. వలసలతో పల్లెలు, పట్టణాలు ఖాళీ అయినాయి. ఉత్తర కొరియా అమెరికా రెండు దేశాల అధ్యక్షులు కిమ్ జోంగ్ ఉన్, డొనాల్డ్ ట్రంప్ పరస్పరం దూషించుకుంటున్నారు. ట్రంప్ దేశ దేశాలు తిరిగి ఉత్తర కొరియాను ఏకాకి చేయాలని ఆయా దేశాధినేతలపై ఒత్తిడి తెస్తున్నారు. మద్దతును కూడా కూడగట్టేందుకు తీవ్రంగా ప్రయత్నించారు. . ఉత్తర కొరియా హవా సాంగ్-15 క్షిపణి పరీక్షించింది. 2017 జూలైలో పరీక్షించిన హవాసాంగ్ 14తో పోల్చినట్లయితే ఇది అత్యంత శక్తివంతమైంది. ప్రపంచంలో ఏ ప్రాంతంపైనా దాడి చేయగలిగే సామర్థ్యాన్ని ఉత్తర కొరియా పెంపొందించుకుంది. ప్రయోగించిన స్థలం నుంచి హసంగ్ క్షిపణి నాలుగువేల కిలోమీటర్ల ఎత్తుకు లేచి వెయ్యి కిలోమీటర్ల దూరంలో పడుతుంది. దీని సామర్థ్యం అత్యంత భయంకరమైంది. ఇది భూమిపై పేల్చినట్లయితే 15 వేల కిలోమీటర్ల దూరం ప్రయాణించి అమెరికా భూభాగాలను పూర్తిగా ధ్వంసం చేయనుంది. ఉత్తర కొరియా ప్రయోగించినటువంటి క్షిపణి హవా సాంగ్. జపాన్‌కు 250 కి.మీ. దూరంలో సముద్రంలో పడిపోయింది. మూడు నాలుగు నెలలపాటు ఎలాంటి ప్రయోగాలు చేయకుండా మౌనంగా ఉన్న ఉత్తర కొరియా ఒకేసారి హవాసాంగ్ క్షిపణిని విడుదల చేయడంతో అమెరికాకు ఎన్నడూ లేనంతగా వణుకు పుట్టింది. దీంతో ఆఘమేఘాలపై ఐక్యరాజ్యసమితిలోని భద్రతా మండలిలో అత్యవసర సమావేశాన్ని జరిపారు. యుద్ధం వస్తే రెండో మాట లేకుండా ఉత్తర కొరియాను ఇంత అణువు లేకుండా సర్వనాశనం చేస్తామని హెచ్చరించింది. దక్షిణ కొరియాకు అమెరికా ఎన్ని యుద్ధ విమానాలను తరలించినా, క్షిపణి విధ్వంసక వ్యవస్థలను పాతినా జపాన్‌తో జతకట్టి యుద్ధ విన్యాసాలు చేసినా, సముద్రంలో యుద్ధనౌకలు పంపించి తిప్పుతున్నా, ప్రపంచ దేశాలను ఏకం చేసినా, ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్. అసలు ఏమాత్రం భయపడకుండా తమదీ అణు సంపన్న దేశమేనని ప్రకటించాడు. మొదటి నుంచి ఉత్తరకొరియాను రెచ్చగొడుతూ అమెరికా వస్తోంది. అమెరికా మరింత రెచ్చిపోతే ఉత్తరకొరియా సర్వనాశనానికి పరిమితం కాదు. ఉభయ కొరియాలు, జపాన్‌లతో పాటు దెబ్బతినడంతో అమెరికా కూడా భారీ నష్టాన్ని చవి చూడాల్సి వస్తుంది. కూర్చుని చర్చించుకుని చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని రష్యా, చైనాలు సూచించాయి. మధ్యలోనే అమెరికా తెంపేసింది. అణ్వాయుధాలను ధ్వంసం చేయాలని అమెరికా నిబంధనల్ని విధిస్తుంది. దీనికి వ్యతిరేకిస్తున్నారు. ఉత్తర కొరియా ఆయుధాలను తయారు చేసుకోకూడనిదని మరో ఆంక్ష అమెరికాది. చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో అమెరికా అధ్యక్షుడు ఫోన్‌లో మాట్లాడాడు.ఉత్తర కొరియాతో సంబంధాలు పూర్తిగా తెంచుకోవాలన్న అమెరికా పిలుపును రష్యా తీవ్రంగా వ్యతిరేకించింది. అమెరికా ఎప్పుడు ప్రపంచ దేశాలను ఉగ్రవాదులుగా ప్రకటిస్తూ యుద్ధోన్మాదాలకు పాల్పడుతుంది. లిటిల్ రాకెట్ వచ్చాక మాట్లాడిన ట్రంప్. క్షిపణి ప్రయోగం అనంతరం వెనక్కి తగ్గారు. భయానికి గురైనట్లు కనిపిస్తోంది. రెచ్చగొట్టే మాటలు తగ్గించారు ట్రంప్ ప్రస్తుతం. రెండు దేశాల మధ్య యుద్ధం వస్తే లక్షల సంఖ్యలో ప్రాణనష్టం ఉంటుందని యుద్ధాన్ని కూడా అమెరికా చట్టసభల్లో ఉన్న 16 మంది తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఉత్తర కొరియాపై యుద్ధం చేయడంతో అమెరికా సాధించేదేముంది.ండు దేశాలు యుద్ధాలకు పోకుండా శాంతి చర్చల ద్వారా పరిష్కరించుకొని శాంతికై పరుగులు తీయాలి.

● దామరపల్లి నర్సింహారెడ్డి, 9581358696

ఘన చరితకు రక్షణ కరవు!

ఆదిమానవుడి ప్రస్థానం నుండి ఆధునిక మానవుడి ఆవిష్కరణల యుగం వరకూ ప్రయాణంలో అనేక అవరోధాలనూ, ఆటంకాలనూ అధిగమిస్తూనే ఉన్నాం. ఆహారం వసతి నుండి అద్భుతాలసృష్టి వరకు ఎన్నో ఆనవాళ్లు నేటికీ ఉన్నాయి. హరప్పా నాగరికతకు సంబంధించిన ఆధారాలు లభ్యమైన తర్వాత అప్పటివరకు ఉన్న ప్రపంచ ప్రాచీన నాగరికతలలో ఒకటిగా గుర్తింపు తెచ్చుకుంది. మన దేశ ఘన చరితను ప్రపంచానికి పరిచయం చేసింది. ప్రాచీనకాల నిర్మాణాలైన సమాధులు, గృహనిర్మాణం, దేవాలయాలు, శిల్పాలు, గృహోపకరణాలు, వ్యవసాయ, వాణిజ్య పనిముట్లు, క్రీడా వస్తువులు, అలంకరణ ఉపకరణాలు, నాణేలు, ఆయుధాలు, మట్టి పాత్రలు మొదలైనవన్నీ గత చరిత్ర అధ్యయనానికీ, మనదేశ ఘనకీర్తికీ సజీవ సాక్ష్యాలుగా నిలుస్తున్నాయి. దేశంలో అడుగడుగునా నిర్లక్ష్యం వల్ల ఘనమైన మన గత చరిత్ర వారసత్వ చారిత్రక సంపద గతించే స్థితికి చేరుకుంది. చారిత్రక సంపద వారసత్వ ఆనవాళ్ళు ఆధారంగా చేసుకొని ఎన్నో దేశాలు పర్యాటక రంగానికి అనుసంధానించి అవి అభివృద్ధి చెందుతూ ఉండగా మన దేశంలో మాత్రం పరిస్థితి భిన్నంగా తయారైంది.

తెలంగాణలో రాష్ట్ర ప్రభుత్వం అనేక వినూత్న పథకాలతో ముందుకెడుతోంది. మనకే ప్రత్యేకమైన బతుకమ్మ పండుగ బోనాలను రాష్ట్రపండుగగా ప్రకటించి విరివిగా నిధులు ఇస్తూ మన రాష్ట్ర ప్రత్యేకతను ప్రపంచం నలుమూలల వ్యాప్తి చేస్తున్నప్పటికీ మన రాష్ట్ర అస్తిత్వం ప్రత్యేకతకు గుర్తుగా నిలిచిన చారిత్రక వారసత్వ సంపదలు , సాహిత్యరంగం, నిర్మాణం, వాస్తు శిల్ప ఆనవాళ్లను సంరక్షించుకోవడమే కాక వాటిని మరింత మెరుగుపరిచి భవిష్య తరాలకు అందించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. పురాతన కాలం నుంచి మానవుడి ప్రస్థానంలో వాడిన పరికరాలు వాటి అవశేషాలు లభ్యమైన అనేక స్థలాలు పురాతన దేవాలయాలు అక్కడ లభ్యమయ్యే శాసనాలు నాణేలు కట్టడాలను పరిరక్షిస్తూ వాటిపై అధ్యయనానికి ప్రోత్సాహించాలి. మన సంస్కృతి సంప్రదాయాలతో పెనవేసుకున్న దేవాలయాలు నిర్మాణ శైలి వాస్తు శిల్పాలు ప్రతి ప్రాంతానికి భిన్నంగా ఉంటూ ప్రత్యేకతను కలిగుంటాయి. తెలంగాణలో కూడా శాతవాహన పూర్వంనుండి ఆఖరి పరిపాలకుడైన నైజాం నవాబుల వరకు అనేక నిర్మాణాలు రాష్ట్రం అంతటా విస్తరించి ఉన్నాయి. వాటిలో ముఖ్యమైన వారసత్వ కేంద్రాలు కూడా ప్రభుత్వ నిర్లక్ష్యంతో దెబ్బతింటున్నాయి.



రాష్ట్రంలోని ప్రతి గ్రామంలో ఏదో ఒక పురాతన వారసత్వ సంపద కట్టడాలు దేవాలయాలు శిల్పాలు విరివిగా ఉన్నాయి. ప్రత్యేక రాష్ట్రంగా ఆవిర్భవించిన మన రాష్ట్రం తన ఘన చరిత్రను కాపాడుకుంటూనే ప్రత్యేకతను తెచ్చిపెట్టేలా కృషి చేయాలి. ప్రభుత్వం కూడా తాత్కాలిక ప్రయోజనాల కంటే శాశ్వత ప్రయోజనాలకు ప్రాధాన్యతనిచ్చి గత సంపదను పర్యాటకానికి అనుసంధానిస్తూ చారిత్రక వారసత్వ సంపదను పరిరక్షించాలి. ఉపాధి అవకాశాల పెంపునకు దానిని సద్వినియోగం చేసుకోవాలి. యునెస్కో గుర్తింపు పొందాల్సిన అనేక కట్టడాలు ఉన్నప్పటికీ నిర్లక్ష్యం వాటిని ప్రపంచానికి దూరం చేస్తోంది. కాకతీయుల కాలంనాటి అద్భుత శిల్ప కట్టడాలలో వాడిన సాండ్‌బాక్స్ టెక్నాలజీ చాలా అద్భుతమైనదే కాక ఇప్పటి ఇంజనీరింగ్ నిపుణులను సైతం నివ్వెరపోయేలా చేసింది. కాకతీయుల కళా సంపదను కనులారా వీక్షించిన ఒక ఫ్రెంచ్ యాత్రికురాలు ''ఈ సంపద గనక మా దగ్గర ఉంటే బాగుండు ''అని వ్యాఖ్యానించింది. ప్రతి గ్రామంలో పురాతన కట్టడాలను, దేవాలయాల శిల్ప సౌందర్యాన్ని పాఠశాల విద్యార్థులకు పరిచయం చేసే కార్యక్రమాలు నిర్వహించాలి.

● వినోద్ కుమార్ సుద్దాల, 9908312949

భాషా పండితుల ఉన్నతీకరణ జరిగేనా..?

తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో తెలుగు, హిందీ, ఉర్దూ మిగతా దేశీయ భాషలు బోధించే భాషా పండితులు పదోన్నతులు లేక అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. సమైక్య రాష్ట్రంలో ఉపాధ్యాయ నియామకాల (డీఎస్సీ/టీఆర్టీ) ద్వారా భాషా పండితులుగా ఎంపికైన వారు ఇరవయ్యేళ్లకు పైగా అలాగే, ఊడిగం చేస్తున్నారు. ప్రాథమిక పాఠశాలల్లో ఉపాధ్యాయ నియామకాల కోసం ఇంటర్మీడియెట్, గతంలో టీటీసీ పూర్తి చేసిన వారిని ఎస్జీటీగా ఎంపిక చేస్తారు. వీరు ఒకటి నుంచి ఐదో తరగతి వరకు బోధిస్తారు. ఉన్నత పాఠశాలల్లో ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు బోధించేవారిని స్కూల్ అసిస్టెంట్లుగా నియమిస్తారు. వీరి విద్యార్హత బీఎడ్. భాషా పండితులను గ్రేడ్-2, స్కూల్ అసిస్టెంట్‌గా నియమిస్తున్నారు. వీరి విద్యార్హత రెండింటికీ సమానమే. డిగ్రీ లేదా పీజీ చేసిన తర్వాత టీపీటీ, హెచ్‌పీటీ, యూపీటీ చేసిన వారిని భాషలు బోధించడానికి నియమిస్తున్నారు. స్కూల్ అసిస్టెంట్లతో సమానంగా బోధిస్తున్నా వారు ఎస్జీటీ స్కేలు జీతాలు తీసుకుంటూ పాఠశాల విద్యలో వెట్టి చాకిరీ చేస్తున్నారు. ఎస్జీటీగా నియామకం అయిన ఉపాధ్యాయులు మూడు, నాలుగు సంవత్సరాలలోపు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతులు పొందుతున్నారు. ఎల్ఎఫ్ఎల్ హెచ్‌ఎంలుగా పదోన్నతులు పొందుతున్నారు. భాషా పండితులుగా నియమితులైన వారికి పదోన్నతులు ఉండటం లేదు.

తెలంగాణ ఉద్యమంలో భాషా పండితులు

ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో భాషా పండితులు చురుకైన పాత్రను పోషించారు. తమ కవితలు, పాటలు, గేయాలు, ఉపన్యాసాలు, కథలు, వ్యాసాలు, నాటికలు, నాటకాల ద్వారా వివిధ సాహిత్య, సాంస్కృతిక ప్రక్రియల ద్వారా తెలంగాణ ఆవశ్యకతను తెలియజేస్తూ ప్రజలను జాగృతం చేశారు. తెలంగాణ రాష్ట్రం సిద్ధించి మూడేళ్లు దాటినా భాషా పండితుల పదోన్నతి వ్యవహారం ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా ఉంది. హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా భాషా పండితుల పదోన్నతుల కోసం తెచ్చిన జీవో నెం:17, 18 అమలుకు నోచుకోలేదు.

ఉన్నత విద్యను పూర్తి చేసినా ఫలితం శూన్యం

భాషా పండితులుగా నియమితులైన వారు పీహెచ్‌డీలు, ఎంఈడీలు చేసినా ప్రయోజనం ఏమీ కలగడం లేదు. డైట్ కళాశాల లెక్చరర్లుగా నియామకం పొందాలంటే స్కూల్ అసిస్టెంట్లు (భాషలు) ఉండాలి. కానీ, భాషా పండితులకు స్కూల్ అసిస్టెంట్ పదోన్నతే రాకపోవడం వలన మిగతా పదోన్నతులకు నోచుకోవడం లేదు. లక్షలకు లక్షలు ఖర్చు పెట్టి ఎన్నో యేళ్లు కష్టపడి ఉన్నత విద్యను అభ్యసిస్తే ఎందుకూ పనికి రాకుండా పోతున్నదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రపంచ తెలుగు మహాసభలలో ప్రస్తావన

ఇటీవల రాష్ట్ర రాజధాని నగరంలో ఎంతో ఆర్భాటంగా జరిగిన ప్రపంచ తెలుగు మహాసభల ప్రారంభ, ముగింపు సభలలో కూడా ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు తెలుగు పండితులు ఎదుర్కొంటున్న సమస్యలను వారం పదిరోజుల్లోనే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. దీంతో భాషా పండితులలో మళ్లీ ఆశలు చిగురించాయి. తెలుగు భాష, సంస్కృతి, సాహిత్యం, సంప్రదాయం పట్ల సంపూర్ణ అవగాహన ఉన్న ముఖ్యమంత్రి కే.చంద్రశేఖర్ రావు హయాంలోనే భాషా పండితులకు న్యాయం జరుగుతుందన్న ఆశతో ఉన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఏ డిపార్టుమెంట్‌లోనూ పదవీ బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి పదవీ విరమణ పొందే వరకు ఒకే హోదాలో పని చేయడం ఎందులోనూ లేదు. సమాన పనికి సమాన వేతనమనే నియమ, నిబంధనలు ఉన్నప్పటికీ స్కూల్ అసిస్టెంట్లతో సమానంగా ఆరవ తరగతి నుంచి 10 తరగతి వరకు బోధిస్తూ, జీతం మాత్రం ఒకటి నుంచి ఐదో తరగతి వరకు బోధించే ఎస్జీటీ జీతంతో సమానంగా తీసుకుంటున్నారు. మిగతా సబ్జెక్టులైన ఇంగ్లీష్, సామాన్య శాస్త్రం, గణితం, సాంఘిక శాస్త్రం బోధించేవారు భాషా పండితులను చిన్న చూపు చూస్తున్నారు. అటెండెన్స్ రిజిష్టర్‌లోనూ చివరగా రాసి అవమానాలకు గురిచేస్తున్నారు. రిపబ్లిక్ దినోత్సవం, స్వాతంత్ర్య దినోత్సవం, ఉపాధ్యాయ దినోత్సవాలలో, వివిధ సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాలలో ఎంతో చురుకైన పాత్రను పోషించే భాషా పండితులు పదోన్నతుల విషయంలో తీవ్ర అన్యాయానికి గురవుతున్నారు. అన్ని ఉపాధ్యాయ సంఘాలు భాషా పండితులకు పదోన్నతులు కల్పించాలని విజ్ఞాపన పత్రాలు సమర్పించారు. భాషా పండితులను స్కూల్ అసిస్టెంట్లుగా నియమించాలనే న్యాయమైన డిమాండ్‌ను ఉపాధ్యాయ సంఘాలన్నీ అంగీకరించాయి. కాబట్టి త్వరలోనే తమ చిరకాల కోరిక తీరాలని భాషా పండితులు వేయి కళ్లతో ఎదురుచూస్తున్నారు.

● డాక్టర్ ఎస్.విజయభాస్కర్ (9290826988)

● తూర్పాటి జే.శ్రీధర్ (9705340088)

పండిత శిక్షణకు పక్క రాష్ట్రాలకు..

తెలుగు భాష పండుగను దిగ్విజయంగా నిర్వహించారు. తెలంగాణ కీర్తిని తెలుగు ప్రపంచ మహాసభల ద్వారా ప్రపంచానికి చాటిచెప్పారు. స్వయంగా కవి, రచయిత, విద్యావేత్త అయిన వ్యక్తి కేసీఆర్, తెలంగాణ ముఖ్యమంత్రి కావటం తెలుగు ప్రజల అదృష్టమని భావిస్తుండగా, ప్రభుత్వ విధానమో, అధికారుల తప్పుడు సమాచారమో కాని గత 3 విద్యా సంవత్సరాల నుండి తెలంగాణాలో లాంగ్వేజీ పండిట్ కాలేజీల్లో జీరో ఇయర్ చేశారు. 50 కళాశాలలు మూసివేశారు. 11 వేల మందికి శిక్షణ నిలిపివేశారు.

2014 జూన్ 2న తెలంగాణ రాష్ట్రం ఏర్పడింది. తెలంగాణాలోని 31 జిల్లాలలో 22 తెలుగు పండిట్ ట్రైనింగ్ కాలేజీలు, 27 హిందీ పండిట్ శిక్షణా కాలేజీలు ఒక ఉర్దూ పండిట్ శిక్షణ కళాశాల ఉంది. తెలుగు భాషకోసం ఎన్నో వినూత్న పథకాలు ప్రవేశపెట్టబోతున్న తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ ఎందువల్లనో గాని గత 3 సంవత్సరాలుగా లాంగ్వేజి పండిట్ ట్రైనింగ్ (ఎల్‌పి సెట్) నోటిఫికేషన్లను వేయటం లేదు. 2015 -16, 2016- 17, 2017-18 విద్యా సంవత్సరాలు జీరో సంవత్సరాలుగా మారాయి. 3 ఏళ్ళ నుండి తెలుగు, హిందీ, ఉర్దు భాషల్లో

శిక్షణ ఇచ్చే కళాశాలలకు తాళాలు పడ్డాయి. ఈ భాష శిక్షణ కళాశాలల్లో ఉద్యోగాలు చేసి ఉపాధిని పొందుతున్న 5 వేలమంది నిరుద్యోగులు బజారునపడ్డారు. ప్రభుత్వం నుంచి రేపో మాపో అనుమతి లభిస్తుందనే గంపెడాశతో లాంగ్వేజీ శిక్షణ కళాశాల యాజమాన్యాలు లక్షలాది రూపాయల కిరాయిలు చెల్లిస్తూ, కాలేజీలను తెరిచి ఉంచుతున్నారు. మూడేళ్ళ నుంచి 20కి పైగా కాలేజీలు అద్దె భవనాలలోనే ఉండి టీపీటీ, హెచ్‌పిటి, యుపిటి, కాలేజీలు ఉన్నాయి.

తెలంగాణ ప్రభుత్వం ఎడ్‌సెట్, లాసెట్, ఎంసెట్, ఎంబిఏ సెట్, డైట్‌సెట్, పాలిసెట్ వంటి అన్ని నోటిఫికేషన్లు రెగ్యులర్‌గా ఇస్తూ, ఎల్‌పి సెట్ నోటిఫికేషన్ ఎందుకు ఇవ్వటంలేదని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికే తెలంగాణ రాష్ట్రంలో అప్పులపాలై 43 భాష శిక్షణా కళాశాలలకు తాళం వేశారు. 1995కు ముందు తెలంగాణ జిల్లాల నుండి గుంటూరు, విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి లాంటి పట్నాలకు వెళ్ళిన రోజులు మళ్ళీ గుర్తు చేసుకుంటున్నారు. ప్రతి సంవత్సరం 1700 మంది తెలుగులో, 2050 మంది హిందీలో, 50 మంది ఉర్దు కళాశాలల్లో శిక్షణ పొందేవారు. ఒక్కో ఏడాది 3800 మంది చొప్పున 3 ఏళ్ళలో 11,400 మంది శిక్షణను పూర్తి చేసుకునే వారు కాని పాలకుల విధానం వల్ల భాష శిక్షణ కళాశాలలకు తాళాలు పడ్డాయి.

అన్ని శిక్షణా కళాశాలలు నిర్వహిస్తూ, లాంగ్వేజ్ పండిట్ కామన్ ఎంట్రెన్స్ టెస్టు (ఎల్‌పిసిఇటి)ను నిర్వహించకపోవటం వల్ల భాషావేత్తలు, భాష శిక్షణార్ధులు లబోదిబో మంటున్నారు. ప్రభుత్వంపై ఒత్తిడి తేవడానికి కోర్టును ఆశ్రయించారు. పై కోర్టు సైతం ఎల్‌పిసెట్ నిర్వహించాలని తెలంగాణా సర్కారును ఆదేశించినప్పటికీ ప్రభుత్వం నుంచి సానుకూల ప్రకటన లేదు. 2014 - 15 బాపతు 43 కాలేజీలకు ఫీజు రీయింబర్సు మెంటు సైతం ప్రభుత్వం ఇవ్వటంలేదు. 3 ఏళ్ళుగా తెలంగాణ ప్రభుత్వం తెలుగు, హిందీ, ఉర్దు శిక్షణ ప్రవేశ పరీక్ష నిర్వహించక పోవటం విచారకరం. వెంటనే ఎల్‌పిసెట్ నోటిఫికేషన్‌ను విడుదల చేయాలని భాషాభిమానులు కోరుతున్నారు.

● రావుల రాజేశం

గణతంత్ర వేడుకలకు ఏర్పాట్లు చేయండి

● ఉన్నతాధికారులకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీసింగ్ ఆదేశం



హైదరాబాద్, ఆంధ్రప్రభ: గణతంత్ర దినోత్సవ వేడుకల ఏర్పాట్ల కోసం వివిధ శాఖల అధికారులతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసుకుని, పనుల పర్యవేక్షణతో పాటు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్.పి.సింగ్ వివిధ ఉన్నతాధికారులను ఆదేశించారు.

గణతంత్ర దినోత్సవం వేడుకల ఏర్పాట్లపై సోమవారం సచివాలయంలో సీఎస్ సంబంధిత శాఖల అధికారులతో సమ న్వయ సమావేశం నిర్వహించారు. జనవరి 26న ఉదయం పరేడ్ మైదానంలో గణతంత్ర దినోత్సవ వేడుకలు ప్రారంభమవుతాయని, ఈ వేడుకల్లో గవర్నర్ ఇఎస్ఎల్ నరసింహన్ ముఖ్య అతిథిగా పాల్గొంటారన్నారు. వేడుకలకు అవసరమైన పోలీసు బందోబస్తు ఏర్పాటుతో పాటు ట్రాఫిక్ నియంత్రణ ఏర్పాట్లు చేపట్టాలని పోలీస్ శాఖను ఆదేశించారు. జిహెచ్ఎంసి ద్వారా పరేడ్ మైదానంలో పారిశుధ్యం, మొబైల్ టాయిలెట్లు తదితర ఏర్పాట్లు చేపట్టాలని, గన్‌పార్కు, క్లాక్ టవర్, ఫతేమైదాన్‌లను విద్యుద్దీకరించాలని తెలిపారు. రహదారులు, భవనాల శాఖ ద్వారా అవసరమైన బారికేడింగ్‌తో పాటు రాజ్‌భవన్, సచివాలయం, అసెంబ్లీ, హైకోర్టు, చార్మినార్‌లతో పాటు చారిత్రక ప్రాధాన్యత భవనాలను విద్యుద్దీపాలతో అలకరించాలన్నారు. విద్యుత్‌శాఖ ద్వారా నిరంతర విద్యుత్ సరఫరా, మెట్రోవాటర్ వర్క్స్ ద్వారా మంచినీటి సరఫరా, సమాచార శాఖ ద్వారా మీడియాకు ఏర్పాట్లు, పబ్లిక్ అడ్రస్ సిస్టం, ఎల్ఈడీ టీవీల్లో కామెంటేటర్ల నియామకం, వేడుకల ప్రత్యక్ష ప్రసారానికి తగు ఏర్పాట్లు చేయాలన్నారు. ఉద్యానవన శాఖ ద్వారా పరేడ్ మైదానంలో పుష్పాలతో అలంకరణ వినూత్నంగా ఉండాలన్నారు. వేడుకకు హాజరయ్యే పాఠశాలల విద్యార్థుల కోసం ప్రత్యేక ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేయాలన్నారు. అంబులెన్స్, అగ్నిమాపక ఏర్పాట్లు కూడా ఉండాలన్నారు.

ఈ సమావేశంలో జిఏడీ ముఖ్య కార్యదర్శి అధర్ సిన్హా, గవర్నర్ ముఖ్య కార్యదర్శి హరిప్రీత్ సింగ్, ఆర్అండ్‌బి ముఖ్య కార్యదర్శి సునీల్ శర్మ, జలమండలి ఎండి దానకిషోర్, హైదరాబాద్ పోలీస్ కమీషనర్ శ్రీనివాసరావు, అగ్నిమాపక శాఖ డైరెక్టర్ జనరల్ రాజీవ్ రతన్, పోలీస్ అధికారులు ఎంకె సింగ్, అంజనీ కుమార్, హైదరాబాద్ కలెక్టర్ యోగితా రాణా, ప్రోటోకాల్ డైరెక్టర్ అర్విందర్ సింగ్, నార్త్‌జోన్ డీసీపీ సుమతి, సాంస్కృతికశాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ, మిలటరీ, అగ్నిమాపక, స్కౌట్అండ్‌గైడ్ అధికారులు పాల్గొన్నారు.

కరడుగట్టిన నేరగాడి అరెస్టు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో ఇళ్ల దొంగతనాలకు పాల్పడుతున్న ఓ కరడుగట్టిన నిందితుడిని ఆదిభట్ల పోలీసులు అరెస్ట్ చేశారు. అరెస్ట్ అయిన నిందితుడు పేరు తిమ్మసముద్రపు శివ అలియాస్ వంశీ అలియాస్ నందా(28) అని పోలీసులు తెలిపారు. ఏపీ అనంతపురం జిల్లాకు చెందిన శివ నుంచి 19 తులాల బంగారు ఆభరణాలు, రూ.50 వేల నగదు మొత్తంగా రూ.6.2 లక్షల విలువైన పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

వైద్య సేవలు బాగున్నాయా?

● గాంధీ ఆస్పత్రిలో రోగులను ప్రశ్నించిన గవర్నర్ నరసింహన్



హైదరాబాద్/న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ: గాంధీ ఆస్పత్రిలో పరిసరాలు పరిశుభ్రంగా ఉంచడంపై గవర్నర్ నరసింహన్ సంతృప్తి వ్యక్తం చేశారు. గాంధీ ఆస్పత్రిని సోమవారం గవర్నర్ సందర్శించి చెవి సమస్యకు సంబంధించి డాక్టర్ హనుమంతరావుకు చూపించుకున్నారు. అనంతరం ఆయన గాంధీ ఆస్పత్రిని కలియ తిరిగారు. మధ్య మధ్యలో రోగులకు అందుతున్న సేవల గురించి ఆయన అడిగి తెలుసుకున్నారు. రోజుకు ఎంతమంది పేషెంట్లు వస్తారు, ఓపీ గురించి, ఐసీయూ గురించి డిప్యూటీ సూపరింటెండెంట్ నరసింహారావు నేతను అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలో కొత్తగా ఏర్పాటు చేసిన అధునాతన పరికరాలను గవర్నర్ ఆసక్తిగా పరిశీలించారు. ఆస్పత్రిని పరిశుభ్రంగా ఉంచినందుకు సిబ్బందిని అభినందిం చారు. ఇలాగే ఆస్పత్రి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని డిప్యూటీ సూపరింటెండెంట్‌కు ఆయన సూచించారు.

నేడు ఢిల్లీలో రాష్ట్రపతితో సమావేశం

ఉభయ తెలుగు రాష్ట్రాల గవర్నర్ నరసింహన్ సోమవారం ఢిల్లీ చేరుకున్నారు. రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌తో మంగళవారం సమావేశం కానున్నారు. గవర్నర్ల జీతభత్యాలు, సంస్కరణలపై రూపొందించిన కమిటీ నివేదికను రాష్ట్రపతికి అందజేయనున్నట్లు తెలిసింది. ఈ కమిటీలో ఉన్న తమిళనాడు, హిమాచల్‌ప్రదేశ్, త్రిపుర గవర్నర్లు కూడా ఢిల్లీకి చేరుకున్నారు. వీరంతా రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌కు నివేదిక ఇవ్వనున్నారని సమాచారం. అయిదుగురు సభ్యుల గవర్నర్ల కమిటీకి నేతృత్వం వహిస్తున్న నరసింహన్ ఆయా అంశాలపై పలుసార్లు సమావేశాలు జరిపారు. తన పర్యటనలో ప్రధాన మంత్రి మోడీ, హోం మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌ను కూ డా కలిసే అవకాశముంది. ఇటీ వల కాంగ్రెస్ నేతలు నరసింహన్‌పై తీవ్రమైన వ్యాఖ్యలు చేసిన నేపథ్యంలో ఉభయ రాష్ట్రాల్లోని రాజకీయ పరిస్థితులను కేంద్రానికి వివరించేఅవకాశం ఉంది.

ఔటర్ రింగ్ రోడ్డులో సీఎం ఓఎస్డీ తనిఖీలు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఔటర్ రింగు రోడ్డుపై సోమవారం సీఎం ఓఎస్డీ (హరితహారం) ప్రియాంక వర్గీస్ ఆకస్మిక తనిఖీ చేశారు. హరితహారంలో భాగంగా ఔటర్ వెంట చేపట్టిన పచ్చదనం పనులను పరిశీలించారు. మేడ్చల్ కండ్లకోయ జంక్షన్ నుంచి కీసర మీదుగా పెద్ద అంబర్‌పేట్, విజయవాడ జాతీయ రహదారి వెంట మొక్కల ఎదుగుదలను స్వయంగా చూశారు. అలాగే కీసర జంక్షన్‌లో నాటిన మొక్కలను పరిశీలించిన ప్రియాంక ఔటర్ వెంట రోడ్డుతో పాటు ప్రధాన జంక్షన్లలో సర్వీసు రోడ్ల వెంట మరిన్ని మొక్కలు నాటాలని సూచించారు. కాగా ఇప్పటికే ఉన్న మొక్కల రక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే మొక్కలకు నీటి సౌకర్యాలపై ఆమె ఆరా తీశారు. ఔటర్‌తో పాటు విజయవాడ జాతీయ రహదారిపై కొన్ని ప్రైవేటు కంపెనీలు మొక్కలను దత్తత తీసుకుని పెంచడంపై సంతోషం వ్యక్తం చేశారు.

ప్రజల్లోకి ప్రభుత్వ పథకాలు తీసుకెళ్లా

● వీడ్కోలు సభలో నవీన్ మిట్టల్



హైదరాబాద్, ఆంధ్రప్రభ : సమాచారశాఖ కమిషనరుగా పనిచేసిన కాలం తనకు సంతృప్తి ఇచ్చిందని కళాశాల, సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ నవీన్ మిట్టల్ అన్నారు. విద్యాశాఖకు బదిలీపై వెళ్ళిన ఆయనను సోమవారం సమాచారశాఖ అధికారులు, సిబ్బంది సన్మానించారు. ఈ సందర్భంగా నవీన్ మిట్టల్ మాట్లాడుతూ, సమాచారశాఖ సిబ్బంది సంపూర్ణ సహకారంతో తాను ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను విజయవంతంగా ప్రజల్లోకి తీసకువెళ్ళానని అన్నారు. సమాచార శాఖలో మెరుగైన మౌలిక సదుపాయాలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సమకూర్చడంతో సిబ్బంది పనితీరు మెరుగు పడిందని నవీన్ అన్నారు. నవంబర్ 2015 నుంచి ఈ శాఖలో పనిచేశానని, సిబ్బంది సమిష్టి కృషితో ఇది సాధ్యమైందన్నారు. ఫిల్మ్ డవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్, సిబ్బంది సహకారంతో నవంబర్‌లో అంతర్జాతీయ బాలల చలన చిత్రోత్సవాలను ఘనంగా నిర్వహించగలిగామని మిట్టల్ అన్నారు. ఈకార్యక్రమంలో ఫిల్మ్ డవలప్‌మెంట్ చైర్మన్ రామ్మోహనరావు, సమాచారశాఖ అదనపు సంచాలకులు కె.నాగయ్య, చీఫ్ ఇన్ఫర్మేషన్ ఇంజనీర్ కిషోర్‌బాబు, అధికారులు, ఫిల్మ్ డవలప్‌మెంట్ కార్పొరేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

సుప్రీం మెట్లెక్కిన 'పందెంకోళ్లు'

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : సంక్రాంతి పండుగలో ప్రత్యేక ఆకర్షణగా చెప్పుకునే పందెంకోళ్లు ఇప్పుడు సుప్రీంకోర్టు మెట్లెక్కాయి. ఆంధ్రప్రదేశ్‌లో పండుగ మాటున కోళ్ల పందేలు నిర్వహించడంపై ఇటీవల హైకోర్టు సీరియస్ అయింది. కోడి పంపందే నిర్వహణ పేరుతో జరుగుతున్న అసాంఘిక కార్యక్రమాలను కట్టడి చేయాలంటూ ఓ వ్యక్తి హైకోర్టులో ప్రజాహిత వ్యాజ్యం దాఖలు చేశారు. పందేల పేరుతో కోట్ల రూపాయలు చేతులు మారుతుండడంపై పలు ఆదేశాలు జారీ చేసింది. దీంతో కోళ్ల పందేలు జరగకుండా ఉండాలని ఏపీ డీజీపీ, ఇతర అధికారులకు హైకోర్టు నోటీసులిచ్చింది. బీజేపీ నేత రఘురామ కృష్ణంరాజు హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. కోడి పందేలు తెలుగు ప్రజల సంప్రదాయాలకు చిహ్నమని, సుప్రీంకోర్టు గతంలోనూ కోళ్లను అదుపులోకి తీసుకోవద్దని చెప్పినా పోలీసులు కోళ్లను, వాటిని పెంచే వారిని అదుపులోకి తీసుకున్నారని ఆయన పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ పిటిషన్ బుధవారం విచారణకు వచ్చే అవకాశముంది.

కృష్ణ మాదిగకు మధ్యంతర బెయిల్



హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగకు సికింద్రాబాద్ సివిల్ కోర్టు న్యాయమూర్తి ఒక్క రోజు మధ్యంతర బెయిల్ మంజూరు చేశారు. మంద కృష్ణమాదిగ బావ ఆదివారం సాయంత్రం గాంధీ ఆసుపత్రిలో మృతి చెందారు. సోమవారం నిర్వహించే అంత్యక్రియలకు హాజరుకావాలని బెయిల్ పిటిషన్ కోసం న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. వాదనలు విన్న న్యాయమూర్తి కృష్ణ మాదిగకకు 24 గంటల సమయ మిస్తూ తాత్కాలిక బెయిల్ మంజూరు చేశారు. మంగళవారం ఉదయం 10:30 గంటలకు తిరిగి కోర్టుకు హాజరుకావాలని సూచించారు. దీంతో సోమవారం మధ్యాహ్నం బెయిల్‌పై బయటకు వచ్చిన కృష్ణమాదిగ వరంగల్ జిల్లా శాయంపేటకు వెళ్లారు.

ఇదిలా ఉంటే మంద కృష్ణమాదిగ అరెస్టుకు నిరసన ఎమ్మార్పీఎస్ జాతీయ కమిటి పిలుపు మేరకు రెండు తెలుగు రాష్ట్రాల్లో ఒక రోజు ఉపవాస దీక్ష చేశారు. జిల్లా, మండల కేంద్రాల్లో ఎమ్మార్పీఎస్ శ్రేణులు, మాదిగ ఉద్యోగస్థులు, విద్యార్థులు ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉపవాస దీక్షలు చేపట్టారు. ఈ దీక్షలకు టీఆర్ఎస్ మినహా కాంగ్రెస్, టీడీపీ, బీజేపీ, తెలంగాణ ఇంటిపార్టీ, వామపక్షాలతో పాటు ప్రజా సంఘాలు, కుల సంఘాల నేతలు మద్దతు పలికారు. వచ్చే ఎన్నికల్లో ఈ ప్రభుత్వానికి బుద్ధి చెప్పడానికి మాదిగలు సిద్ధంగా ఉన్నారన్నారు.

భద్రత, సమయపాలన ప్రధానం

● ద.మ.రైల్వే జీఎం వినోద్‌కుమార్ యాదవ్



హైదరాబాద్, ఆంధ్రప్రభ : రైళ్ల ఆలస్యానికి కారణమయ్యే వ్యవస్థాగత వైఫల్యాల తగ్గుదల కోసం కృషి చేయాలని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ వినోద్ కుమార్ యాదవ్ అధికారులను ఆదేశించారు. భద్రత, సమయపాలన, ఎగుమతుల మెరుగుదలపైన సోమవారం రైల్ నిలయంలో ఆయన ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులను ఉద్దేశించి మాట్లాడారు. వెల్డింగ్ వైఫల్యాలు, రైలు పట్టాలు తప్పడం, లెవల్ క్రాసింగ్‌ల వద్ద జరిగే ప్రమాదాలపై అధికారులు అన్ని కోణాల్లో స్వయంగా పర్యవేక్షించాలని సూచించారు. డివిజనల్ మేనేజర్లు క్షేత్ర స్థాయి తనిఖీలు నిర్వహించి ట్రాక్ నిర్వహణలో సమస్యలను అధిగమించవలసి ఉంటుందన్నారు. ట్రాక్ నిర్వహణ సిబ్బంది సమస్యలపై దృష్టి కేంద్రీకరించాలని కోరారు. సరకు రవాణా ఎగుమతులు పెంచవలసి ఉందన్నారు. రైళ్ల రాకపోకల్లో సమయపాలన కచ్చితంగా పాటించాలన్నారు. వేగ నియంత్రణ నియమాలను పాటించవలసి ఉందన్నారు. ట్రాఫిక్ బ్లాక్‌లు, వ్యాగన్ల సరఫరాపై సమీక్షించారు. కాపలాలేపి లెవల్ క్రాసింగ్‌ల తొలగింపు పనులను తరచుగా సమీక్షించవలసి ఉందని డిఆర్ఎంలను ఆదేశించారు. ఈ సందర్భంగా ఏడుగురు రైల్వే సిబ్బందికి మ్యాన్ ఆఫ్ ద మంత్ అవార్డులను ప్రదానం చేశారు.

తాగి వాహనం నడపొద్దు: ప్రదీప్



తండ్రితో కలిసి పోలీస్ కౌన్సెలింగ్‌కు హాజరైన యాంకర్ ప్రదీప్

హైదరాబాద్, ఆంధ్రప్రభ : నూతన సంవత్సర వేడుకల రోజున డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డ యాంకర్ ప్రదీప్ ఎట్టకేలకు సోమవారం కౌన్సెలింగ్‌కు హాజరయ్యారు. ఆయన సోమవారం మధ్యాహ్నం సుమారు 3.35 గంటల సమయంలో గోషా మహల్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నారు. ప్రదీప్‌కు పోలీసులు మూడు డాక్యుమెంటరీలు చూపించారు. అరగంటపాటు కౌన్సెలింగ్ ఇచ్చారు. కౌన్సెలింగ్ అనంతరం ప్రదీప్ మీడియాతో మాట్లాడుతూ ఆ రోజు అలా జరిగిపోయిందని పశ్చాత్తాపం వ్యక్తం చేశారు. తాను తప్పు చేశానని, ఇకముందు ఇలాంటి తప్పు చేయనని ప్రదీప్ చెప్పారు. ఈ కౌన్సెలింగ్ ద్వారా తాను చాలా విషయాలు తెలుసుకున్నానని, పోలీసులు చాలా ఓపికతో బాగా వివరించారని చెప్పారు. ప్రదీప్ తండ్రితో కలిసి పోలీస్ కౌన్సెలింగ్‌కు హాజరయ్యారు.

పోలీసులు టీఆర్ఎస్ చెంచాలు: జగ్గారెడ్డి

హైదరాబాద్, ఆంధ్రప్రభ : టీఆర్ఎస్ ప్రభుత్వం మాదిగల వ్యతిరేక ప్రభుత్వమని కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ విప్ తూర్పు జగ్గారెడ్డి విమర్శించారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ కోసం 23 ఏళ్లుగా ఉద్యమిస్తున్న మంద కృష్ణమాదిగపై అక్రమ కేసులు పెట్టి అరెస్టు చేసి జైల్లో పెడితే.. టీఆర్ఎస్‌లోని మాదిగ ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులు నోరెందుకు మెదపడం లేదని ప్రశ్నించారు. కొందరు పోలీసులు టీఆర్ఎస్‌కు చెంచాలుగా పని చేస్తున్నారని, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక తగిన మూల్యం తప్పదని ఆయన హెచ్చరించారు. సోమవారం ఆయన గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో ధృతరాష్ట్రపాలన సాగుతోందని, గవర్నర్ టీఆర్ఎస్ కార్యకర్తగా మాట్లాడటం శోచనీయమన్నారు.

ఏపీ సెట్స్-2018 షెడ్యూలు

అమరావతి, ఆంధ్రప్రభ : ఆంధ్రప్రదేశ్‌లో 2018 - 19 విద్యా సంవత్సరానికి సంబంధించి వివిధ వృత్తి విద్యా కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే ప్రవేశ పరీక్షల షెడ్యూల్‌ను రాష్ట్ర మానవ వనరులు, విద్యాశాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు సోమవారం విడుదల చేశారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలోని ఉన్నత విద్యామండలి కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో మంత్రి పరీక్షల షెడ్యూల వివరాలు వెల్లడించారు. ఎంసెట్, ఇంజనీరింగ్‌ప్రవేశ పరీక్షలను ఏప్రిల్ 22 నుంచి 25వరకు, ఎంసెట్ మెడిసిన్ పరీక్ష ఏప్రిల్ 26న నిర్వహించనున్నట్లు మంత్రి తెలిపారు. అన్ని పరీక్షలను ఆన్‌లైన్‌లో నిర్వహిస్తామన్నారు. వివిధ సెట్లకు సంబంధించిన వివరాలు కింది విధంగా ఉన్నాయి.

ప్రవేశ పరీక్ష పేరు	తేదీ	సమయం	నిర్వహించే యూనివర్శిటీ	కన్వీనర్
ఎడ్‌సెట్	ఏప్రిల్ 19	11నుంచి1గం	ఎస్వీయూనివర్శిటీ	ప్రొ. టి.కుమారస్వామి
లాసెట్	ఏప్రిల్ 19	3-4.30 పీఎం	ఎస్.కె.యూనివర్శిటీ	ప్రొ.జ్యోతి విజయకుమార్
ఎంసెట్,ఇంజనీరింగ్	ఏప్రిల్ 22-25	9 -12	జేఎన్‌టీయూ,కాకినాడ	ప్రొ.సాయిబాబు
ఎంసెట్-బైపీసీ	ఏప్రిల్ 26	9-12 2.30-4పీఎం	జేఎన్‌టీయూ, కాకినాడ	ప్రొ.సీహెచ్.సాయిబాబు
ఐసెట్	మే 2	10.30-12.30 2.30-5.00	ఎస్వీ యూనివర్శిటీ	ప్రొ. బి.సుధీర్
ఈసెట్	మే 3	10-1.00	జేఎన్‌టీయూ అనంతపురం	ప్రొ. భానుమూర్తి
పీజీఈసెట్	మే10-12	10-12 2- 4.00	పీఎం ఆంధ్రా యూనివర్శిటీ	ప్రొ.పి.ఎస్.అవధాని
పీఈసెట్	మే 4	9.00	నాగార్జున యూనివర్శిటీ	ప్రొ.పాల్‌కుమార్

Andhraprabha business 2018
బిజినెస్
BUSINESS

శ్రీవారి సేవలో రతన్‌టాటా



తిరుమల, ప్రభ న్యూస్: తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి వారిని ప్రముఖ పారిశ్రామికవేత్త, మాజీ టాటా గ్రూప్ ఛైర్మన్ రతన్ టాటా సోమవారం ఉదయం దర్శించు కున్నారు. శ్రీవారి ఆలయంలో ఆయనకు టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, తిరుమల జేఈవో శ్రీనివాస రాజులు సాదర స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. శ్రీవారి మూలమూర్తిని దర్శించుకున్న అనంతరం ఆయనకు రంగనాయకుల మండపంలో వేదపండితులు ఆశీర్వచనం పలుకగ ఈవో, జేఈవోలు నూతన సంవత్సర క్యాలెండర్, డైరీ, తీర్థ ప్రసాదాలను అందచేశారు. ఆయనతో పాటు ప్రస్తుత టాటా గ్రూప్ ఛైర్మన్ చంద్రశేఖరన్ కూడా స్వామివారిని దర్శించుకున్నారు.

జెబీ డెటా నుంచి బ్లాక్ చైన్
బాబు మునగాల



హైదరాబాద్, ఆంధ్రప్రభ: జెబీ డెటా ఇండియా సెక్యూరిటీ సొల్యూషన్స్‌లో సరికొత్త టెక్నాలజీతో జెబీ చైన్‌ను ఆవిష్కరించింది. సాఫ్ట్‌వేర్ డేటాకు పూర్తిస్థాయి రక్షణ కల్పించే ఈ చైన్‌ను బ్లాక్ చైన్ ఆధారంగా రూపొందించినట్లు ఈ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ బాబు మునగాల సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో చెప్పారు. తమ సంస్థ ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలోని లక్షభూ రికార్డులకు బ్లాక్ చైన్ ఆధారంగా బిగ్ డేటా సొల్యూషన్స్ అందిస్తున్నామని ఆయన చెప్పారు. రెగ్యులర్ సాఫ్ట్‌వేర్ డేటాను హ్యాక్ చేసేందుకు అవకాశం ఉందని, బ్లాక్‌చైన్ ఆధారంగా ఉన్న ఈ టెక్నాలజీ ద్వారా ఎలాంటి హ్యాకింగ్ అవకాశం లేదని ఆయన చెప్పారు. బ్యాంకులు, ఏజెన్సీలతో పాటు వ్యక్తులకు కూడా జెబీ చైన్ సొల్యూషన్స్ అందిస్తామని ఆయన చెప్పారు. బ్లాక్ చైన్ టెక్నాలజీ కంపెనీలు బ్యాంకులకే సేవలు అందిస్తున్నాయనీ, కానీ తమ సంస్థ అనేక డేటాలకు సంబంధించి సర్వీసులు ఇస్తుందన్నారు. తమ సంస్థ వైజాగ్‌లో డవలప్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేసిందనీ, ప్రస్తుతం దేశీయ మార్కెట్‌పైనే దృష్టిసారించామని ఆయన చెప్పారు.

ప్రాపర్టీ, విద్యాసంస్థలు, ఉద్యోగులు, హెల్త్‌కేర్, పెద్ద మొత్తంలో చేసే లావాదేవీలకు సంబంధించిన రికార్డులను తమ టెక్నాలజీ ద్వారా భద్రత కల్పిస్తామని చెప్పారు. అలాగే క్రెడిట్ స్కోరింగ్, వ్యక్తిగత ప్రాడక్ట్ క్రియేషన్, అవకతవకలు, అక్రమాల పరిశోధనలు, వినియోగదారుల రుణాలకు సంబంధించి సర్వీసులు అందిస్తామని బాబు మునగాల తెలిపారు.


అసోచామ్ అధ్యక్షుడు సందీప్ జజోడియా

జీఎస్టీ వసూళ్లు తగ్గినందుకు..
అనూహ్య నిర్ణయాలొద్దు
● కేంద్రానికి అసోచామ్ విన్నపం

హైదరాబాద్ / ముంబై : వస్తు సేవల పన్ను (జీఎస్టి) అమల్లోకి తెచ్చిన తర్వాత ప్రభుత్వానికి జీఎస్టి వసూళ్లు తగ్గిపోవడంతో కేంద్రప్రభుత్వం రెవెన్యూ పెంచుకోవడానికి అనూహ్యమైన నిర్ణయాలు తీసుకోరాదని పారిశ్రామిక మండలి అసోచామ్ ప్రభుత్వాన్ని కోరింది. ప్రస్తుతం జీఎస్టి అమల్లోకి వచ్చింది.. కొత్త పన్ను వ్యవస్థ గాడిన పడుతోంది.. కొత్త వ్యవస్థలోని ఇబ్బందులపై దృష్టి పెడితే రెవెన్యూ క్రమంగా పెరుగుతుందని పేర్కొంది.

కాగా జీఎస్టి అమల్లోకి వచ్చిన తర్వాత వరుసగా రెండో నెల జీఎస్టి వసూళ్లు తగ్గముఖం పట్టాయి. నవంబర్‌లో రూ.80,808 కోట్లకు దిగిరాగా.. అంతకు ముందు నెలలో రూ.83,000 కోట్ల వరకు నమోదయ్యాయి. అసోచామ్ అధ్యక్షుడు సందీప్ జజోడియా ఇక్కడ మాట్లాడుతూ... జీఎస్టి అమల్లో వస్తున్న ఇబ్బందులతో పాటు ... జీఎస్టి అమలు పట్ల నిఘా పెంచాలని అన్నారు. దీనికి వ్యతిరేకంగా ప్రభుత్వం పన్ను రెవెన్యూ తగ్గిపోతోందని అనూహ్యమైన నిర్ణయాలు తీసుకోవద్దని ఆయన కోరారు. ప్రభుత్వం జీఎస్టి అమల్లో ఎక్కడైతే లోపాలున్నాయో వాటిపై దృష్టి పెడితే రెవెన్యూ వసూళ్లు పెరుగుతాయని జజోడియా చెప్పారు.

ఫిబ్రవరి 1వ తేదీన ప్రభుత్వం 2018-19 ఆర్థిక సంవత్సరం బడ్జెట్ ప్రవేశపెడుతోంది. భారత కార్పొరేట్ రంగం తరఫున తాము కోరేది.. ప్రభుత్వం బ్యాంకుల్లో పేరుకుపోతున్న మొండిబకాయిల ఇబ్బందులపై దృష్టి పెట్టాలని.. బ్యాంకుల్లో పెరిగిపోతున్న మొండిబకాయిల వల్ల బ్యాంకుల బ్యాలెన్స్ షీట్లు బలహీనపడతాయన్నారు. డిమాండ్‌కు తగ్గట్లు బ్యాంకుల్లో పెద్ద మొత్తంలో రుణాలు ఇస్తే.. దేశ ఆర్థిక వ్యవస్థ తిరిగి గాడినపడుతుందని ఆయన పేర్కొన్నారు.

మిగిలిన అంశాల విషయానికి వస్తే ప్రైవేట్ పెట్టుబడులు ప్రోత్సహించాలని కోరారు. గత కొన్ని సంవత్సరాల నుంచి ప్రైవేట్ పెట్టుబడులు జోలికి ప్రభుత్వం పోలేదన్నారు. పెట్టుబడులపై వ్యయం తగ్గించడానికి వడ్డీరేట్లను తగ్గించాలని.. కొన్ని రంగాల్లో ప్రైవేట్ రంగాన్ని కూడా అనుమతించాలని.. ఉదాహరణకు రైల్వే పనులన్నీ ప్రభుత్వమే చేపడుతోందని... ప్రైవేట్ రంగానికి కూడా అవకాశం ఇవ్వాలని ఆయన కోరారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని ఇక్కడ ప్రైవేట్ రంగాన్ని భాగస్వాములుగా తీసుకోవాలన్నారు. ముఖ్యంగా ఎరువులు, విత్తనాలు, వ్యవసాయ మార్కెటింగ్, ప్రాసెసింగ్ అంశాల్లో ప్రైవేట్ రంగాన్ని భాగస్వాములుగా చేసుకోవాలని ఆయన వివరించారు.

CARE Ratings
Professional Risk Opinion

2019 వృద్ధిరేటు 7.6 శాతం
క్రిసిల్ రేటింగ్ అంచనా

పెద్దనోట్ల రద్దు, జీఎస్టి అమలు, వ్యవసాయరంగం బలహీనపడ్డంతో ఈ ఆర్థిక సంవత్సరం వృద్ధిరేటు మందగిస్తుందని ఇప్పటికే పలు రేటింగ్ ఏజెన్సీలతో పాటు ఆర్థికవేత్తలు ముందస్తు అంచనాలు వేశారు. అయితే క్రిసిల్ రేటింగ్ మాత్రం వచ్చే ఆర్థికసంవత్సరం 2018-19లో జీడీపీ వృద్ధిరేటు 7.6శాతానికి ఎగబాకుతుందని సోమవారం నాడు విడుదల చేసిన ఒక నివేదికలో పేర్కొంది.

కేంద్ర గణాంకాల కార్యాలయం (సీఎస్ఓ) శుక్రవారం నాడు ఈ ఆర్థిక సంవత్సరం జీడీపీవృద్ధిరేటు 6.5 శాతానికి దిగివస్తుందని, నాలుగు సంవత్సరాల కనిష్ఠానికి దిగివస్తుందని అంచనా వేసిన తర్వాత క్రిసిల్ తాజాగా నోట్ విడుదల చేయడం గమనార్హం. వచ్చే ఆర్థికసంవత్సరం జీడీపీ వృద్ధిరేటు 7.6 శాతానికి ఎగబాకుతుందని.. దీనికి ప్రధాన కారణం ఈ ఆర్థిక సంవత్సరం 2018లో లో బేస్ అని స్పష్టం చేసింది. లో బేస్‌తో పాటు జీఎస్టి అమల్లో ఉన్న ఇబ్బందులన్నీ తొలగిపోతాయని.. ప్రైవేట్ వినియోగం కూడా పుంజుకుంటుంది కాబట్టి వచ్చే ఆర్థిక సంవత్సరానికి జీడీపీ వృద్ధిరేటు 7.6 శాతానికి ఎగబాకుతుందని అంచనా వేస్తున్నామని తెలిపింది. ఈ ఆర్థిక సంవత్సరం ప్రైవేట్ వినియోగం 6.3 శాతానికి చేరితే ... 2017లో హై బేస్‌తో 8.7 శాతం వృద్ధిరేటు సాధించిందని..జీడీపీలో ప్రైవేట్ వినియోగం 55.7 శాతం ఆక్రమించిదని నివేదికలో పేర్కొంది. (లో బేస్ అంటే... పెద్దనోట్ల రద్దుతో చిన్న చితకా వ్యాపారాలు బాగా దెబ్బతిన్నాయి.. అటు తర్వాత జీఎస్టి అమల్లోకి వచ్చింది. దాని ప్రభావం కూడా చిన్న వ్యాపారాలపై కనిపించింది. ప్రస్తుతం.. పెద్దనోట్ల రద్దు సమస్య తీరిపోయింది. జీఎస్టి గాడిలో పడింది.. కాబట్టి జీడీపీ వృద్ధిరేటు పెరగడానికి చిన్న చితకా వ్యాపారాలు కూడా తమ వంతు చేయూతనిస్తాయని చెప్పుకోవచ్చు). వచ్చే ఆర్థిక సంవత్సరం వృద్ధిరేటు వినియోగం ఆధారితంగా ఉంటుందని .. ద్రవ్యోల్బణం అదుపులో ఉంటుంది. అదే సమయంలో ఇవి వృద్ధిరేటు పెరగడానికి తోడ్పడతాయని.. దీంతో పాటు వడ్డీరేట్లు కూడా అందుబాటులో ఉంటాయని, ప్రభుత్వం ఏడవ వేతన కమిషన్ సిఫారసులను తమ ఉద్యోగులకు అమలు చేస్తే వృద్ధిరేటు పెరగడానికి దారి తీస్తుందని, ప్రభుత్వం గ్రామీణ ఆర్థిక వ్యవస్థపై దృష్టిపెట్టి పెద్దమొత్తంలో వ్యయంచేస్తే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ కూడా గాడిన పడుతుందని నివేదికలో వివరించింది. దీంతో పాటు కేంద్రప్రభుత్వం బ్యాంకులకు రూ.2.11లక్షల కోట్ల మూలధనం సమకూరస్తామని ప్రకటించడం కూడా వృద్ధిరేటు పుంజుకోవడానికి చేయూతనిచ్చినట్లవుతుందని క్రిసిల్ నివేదికలో వివరించింది.

బాండ్ల ద్వారా
రెండు బి.డాలర్ల సేకరణ





న్యూఢిల్లీ : ప్రభుత్వ రంగానికి చెందిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా విదేశాల్లో వ్యాపార కార్యకలపాలను విస్తరించుకునేందుక ు బాండ్లతో పాటు ఇతర కన్వెర్టబుల్ కరెన్సీ బాండ్లను జారీ చేసి వచ్చే రెండు ఆర్థిక సంవత్సరాల్లో రెండు బిలియన్ డాలర్లు లేదా రూ.12,600 కోట్లు సేకరిస్తుంది. బ్యాంకు ఎగ్జిక్యూటివ్ కమిటితో పాటు సెంట్రల్ బోర్డు దీర్ఘకాలిక ప్రాతిపదికన ఒకసారి/ లేదా పలు మార్లు రెండుబిలియన్ డాలర్లు సేకరించడానికి అనుమతించిందని ఎస్‌బీఐ బీఎస్‌ఈకి సమాచారం అందించింది. ఎస్‌బీఐ బాసిల్-3 మూలధనం నిబంధనలకోసం వివిధ మార్గాల ద్వారా నిధులు సేకరిస్తోంది. గత నెలలో బ్యాంకు బోర్డు రూ.8వేల కోట్లు సేకరించడానికి అనుమతించింది. వాటిలో మసాలా బాండ్లు కూడా ఉన్నాయి. కాగా ఈ నిధులు మార్చి 2018 వరకు సేకరించడానికి సమయం ఉంద ని తెలిపింది. బీఎస్‌ఈలో దీని షేరు 0.44 శాతం పెరిగి రూ.307.55 వద్ద ముగిసింది. కాగా బ్యాంకులన్నీ మార్చి 2019 నాటికి బాసిల్ -3 నిబంధనలు పాటించాల్సి ఉంటుంది. ప్రపంచ వ్యాప్తంగా బ్యాంకింగ్ రంగంలో ఈ ప్రమాణాలనే పాటిస్తున్నాయి.

జీడీపీ వృద్ధిలో భాగస్వాములు కావాలి
● ఐటీ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్

హైదరాబాద్, ఆంధ్రప్రభ: జీడిపి 8శాతం వృద్ధిలో ఎటువంటి తడబాట్లు లేకుండా ఉండేందుకు పబ్లిక్ ప్రైవేటు భాగస్వామ్య పెట్టుబడులను ఆకర్షించంతోపాటు అధిక సామర్థ్యంతో సేవలను అందించే ప్రమాణాలను పెంచు కోవాలని ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్ అన్నారు. ఆర్థిక వ్యవస్థకు పి పిపి ప్రాజెక్టులు చాలా ఖరీదైనవని, పేదలకు అందుబాటులో ఉండవని తొలుత భావించారని, కానీ బహిరంగ బిడ్డింగ్ పోటీలలో పిపిపి ప్రాజె క్టులుఎంపిక చేయబడుతున్నాయని, ప్రజల ప్రయోజనాలను కాపాడుకునేందుకు ప్రభుత్వం నిర్మాణాత్మక పర్యవేక్షణతో పనిచేయాలని ఆయన సూచించారు. సోమవారం డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్ అధికారులకు పిపిపిపై శిక్షణా కార్యక్రమాన్ని ఆయన లాంఛనంగా ప్రారంభించారు. పారదర్శకతతో ప్రాజెక్టుల రూపకల్పన, నైపుణ్యంతో నిర్మాణాలు, ప్ర భుత్వ ప్రాజెక్టు లు విజయవంతంగా తీరం చేరతాయని, ఇందుకు పిపిపి విధా నం మెరుగైందని ఆయన అభిప్రాయపడ్డారు. హైదరాబా ద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు, ఔటర్ రింగ్ రోడ్డు, హైటెక్ సిటీ, కన్వెన్షన్ సెంటర్, ఇంటిగ్రేటెడ్ టౌన్‌షిప్, మైండ్ స్పేస్ ఐటీ పార్కు, హైదరాబాద్ మెట్రో రైల్ వంటి అనేక ప్రాజెక్టులను ఇరు తెలుగు రాష్ట్రాలు అద్భుతంగా సొంతం చేసుకున్నాయన్నారు. పిపి పి ప్రాజెక్టులను చేపట్టేందుకు అటవీ, పర్యావరణ రంగాల్లో భారీ సామర్థ్యం ఉందని తెలంగాణ రాష్ట్ర అటవీ అభివృద్ధి కార్పొరేసన్ లిమిటెడ్ వైస్ ఛైర్మన్, ఎండీ చందర్ మిత్రా అన్నారు. ఈ కార్యక్రమంలో డీన్ డాక్టర్ గౌతమ్ పింగ్లే, అసోసియేట్ ప్రొఫెసర్ గోవింద్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

జీవీకేకి నవీముంబై ఎయిర్‌పోర్ట్
● నిర్మాణం ఒప్పందంపై సంతకాలు



ముంబై : నవీముంబైలో రూ.16వేల కోట్లతో నిర్మించనున్న అంతర్జాతీయ విమానాశ్రయం ప్రాజెక్టుకు జీవీకె పవర్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ (జీవీకెపీఐఎల్) .. సోమవారం నాడు సిటి అండ్ ఇండస్ట్రీయల్ డెవెలప్‌మెంట్ కార్పొరేషన్‌తో సోమవారం నాడు కన్సెషన్ ఒప్పందం కుదుర్చుకుందని అధికారులు తెలియజేశారు. ఈ ఒప్పందం ప్రకారం నవీముంబై ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ ప్రైవేట్ లిమిటెడ్ (ఎన్‌ఎంఐఎఎల్).. సిడ్కోతో ప్రత్యేకంగా స్పెషల్ పర్పస్ వెహికల్ ఏర్పాటు చేస్తుంది. ఈ ప్రాజెక్టు ఎలా అమలు జరుగుతుందో మహారాష్ట్రప్రభుత్వంఆధ్వర్యంలోని ఈ నోడల్ అథారిటీ చూస్తుంది. ఆ ప్రాజెక్టులో జీవీకెపీఐఎల్‌కు చెందిన అనుబంధ సంస్థ ముంబై ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ ప్రైవేట్ లిమిటెడ్‌కు 74 శాతం మిగిలిన 26 శాతం వాటా సిడ్కోకు లభిస్తుంది. ప్రారంభంలో కన్సెషన్ గడువు 30 సంవత్సరాలపాటు ఉంటుంది. అటు తర్వాత దీన్ని మరో పది సంవత్సరాల పాటు పొడిగిస్తారు. ఈ ప్రాజెక్టు ఒప్పందాలు మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్, ఎంఐఎల్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ జీవీకె రెడ్డితో పాటు సిడ్కో వైస్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ భూషన్ గగ్రాణిలో సమక్షంలో జరిగాయి. ఈ సందర్భంగా రెడ్డి మాట్లాడుతూ.. ఈ ప్రాజెక్టు జీవీకెకు దక్కడం పట్ల రెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. ఇప్పటికే ముంబై ఎయిర్‌పోర్టు నిర్మించి పలు అవార్డు దక్కించుకుందన్నారు. కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు, సిడ్కోతో పాటు ఇతర భాగస్వాముల మద్దతుతో కంపెనీ ముంబై, నవీముంబై అవసరాలకు తగ్గట్లు అత్యాధునిక విమానాశ్రమయం నిర్మించి ఇస్తామని రెడ్డి చెప్పారు. జీవీకెపిఐఎల్ అనుబంధం సంస్థ ఎంఐఎల్ నవీముంబై అంతర్జా తీయ విమానశ్రయం ప్రాజెక్టు ఫిబ్రవరి 2017లో జరిగిన బిడ్డింగ్‌లో విజేతగా నిలిచింది. కాగా సిడ్కోనుంచి గతేడాది అక్టోబర్ 25న లెటర్ ఆఫ్ అవార్డును జీవీకె ఐపీఎల్‌కు అప్పగించింది. కాగా ఎన్ఐ ఎ ం ఐ ఎ ల్ గ్రీన్‌ఫీల్డ్ ప్రాజెక్టు నవీ ముంబైలో 1,160 హెక్టార్లలో నిర్మించ నున్న ఈ విమానాశ్రయం పీపీపీ పద్ధతిలో నిర్మిస్తారు. కాగా ఈ ప్రాజెక్టు ముందుస్తు అభివృద్ధి పనులకు గాను అయ్యే వ్యయాలను సిడ్కో వెచ్చిస్తుంది. తర్వాత వాటిని జీవీకే నుంచి రాబట్టుకుం టుంది. దీంతో పాటు ఈ మెగా ప్రాజెక్టుపై వచ్చే వార్షిక రెవెన్యూలో 12.6 శాతం వరకు సిడ్కోకు వాటా లభిస్తుంది. ప్రస్తుతం జీవీకె ముంబై ఇంటర్నేషన్ ఎయిర్‌పోర్టు లిమిటె డ్‌ను నిర్వహిస్తోంది. ఈ ప్రాజెక్టు దక్కించుకోడానికి ప్రధాన కారణం. వార్షిక రెవెన్యూ పంపకంలో జీవీకె 12.6 శాతం వాటా ఇస్తామని ముందుకొస్తే.. జీఎంఆర్ 10.44 శాతం కోట్ చేయడమే. ప్రస్తుతం జీవీకె చేతిలో రెండు అతి పెద్ద విమానాశ్రయ ప్రాజెక్టు లున్నాయి. కాగా జీవీకె రెడ్డి తమ ఎయిర్ పోర్ట్ వ్యాపారాలను అంతర్జాతీయ స్థాయికి తీసుకు వెళతామని ఈ సందర్భంగా అన్నారు.

ఆటో ఎక్స్‌పో - 2018
ఫిబ్రవరి 9-14 వరకు



● మారుతి టాటామోటర్స్ కార్ల ప్రదర్శన

న్యూఢిల్లీ : వచ్చే నెల నుంచి ప్రారంభం కానున్న ఆటో ఎక్స్‌పోలో దేశంలోని ఆటో కంపెనీలు తమ తమ ప్రాడక్టులను ప్రదర్శనకు ఉంచుతాయి. దేశంలోని అతి పెద్ద కార్ల తయారీ కంపెనీ మారుతి సుజుకి కాంపాక్ట్ కార్లను ఎస్‌యూవీ మోడల్స్‌గా తీసుకొచ్చి ప్రదర్శనకు ఉంచుతామని చెబుతోంది. కొత్తగా దీనికి కాన్సెప్ట్ ఫ్యూచర్ ఎస్ పేరుతో కొత్త కాన్సెప్ట్‌తో తీసుకొస్తుంది. ఈ కారు మొత్తానికి ఎస్‌యూవీ లాగానే ఉంటుంది. దీని ఫీచర్లు కస్టమర్లకు బాగా ఆకర్షిస్తాయని కంపెనీ ఒక ప్రకటనలో తెలిపింది. దీని గురించి మారుతి సుజుకి ఇండియా సీనియర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఇంజినీరింగ్)సీవీ రామన్ వివరిస్తూ.. యుటిలిటి వాహనాలకు రోజు రోజుకు డిమాండ్ పెరుగుతోందని.. దీన్ని డిజైన్‌ను మరింత ఆకర్షణీయంగా తయారు చేయడానికి తమ బృందం అధ్యయనం చేస్తోందన్నారు. భవిష్యత్తులో కాంపాక్ట్ కార్లను యూవీ కార్లుగా తీర్చుదిద్దుతామని ఆయన అన్నారు. సంప్రదాయ కాంపాక్ట్‌కారుస్థానంలో కాన్సెప్ట్ ఫ్యూచర్ ఎస్ కార్లు వస్తాయన్నారు. ఎత్తైన సీట్లు, గ్రౌండ్ క్లియరెన్స్ తదితర అంశాలపై దృష్టిపెడతామని ఆయన వివరించారు. మారుతి సుజుకికి చెందిన కాంపాక్ట్ ఎస్‌యూవీలు బ్రెజ్జా విజయం సాధించడంతో పాటు రెనో ఎంట్రీ లెవెల్ కారు క్విడ్ విజయం సాధించడంతో మరింత ఉత్సాహంతో కొత్త యుటిలిటి వాహనాలపై దృష్టి పెడుతున్నామని రామన్ అన్నారు.

టాటామోటార్స్ నుంచి 26 వాహనాలు ప్రదర్శనకు

దేశీయ ఆటో దిగ్గజం టాటామోటార్స్ కూడా వచ్చే ఆటో ఎక్స్‌పోలో మొత్తం 26 వాహనాలను అవి ప్యాసింజర్ కార్లతో పాటువాణిజ్య వాహనాలను ప్రదర్శనకు ఉంచుతామంటోంది. ఈ ప్రదర్శనలో గ్లోబల్ ప్రిమియర్ మోడల్స్‌తో పాటు కొత్తగా డిజైన్ చేసిన ప్యాసింజర్, వాణిజ్య వాహనాలను ప్రదర్శనకు ఉంచుతామని ఒక ప్రకటనలో తెలిపింది. కేంద్రప్రభుత్వం స్మార్ట్ సిటిలకుపెద్దపీట వేస్తున్నందున దానికి తగ్గట్లు వాహనాలను రూపుదిద్ది అందుబాటులో ఉంచుతామని పేర్కొంది.

టాటామోటార్స్ సీఈవో, ఎండీ గుంటేర్ బట్స్‌చెక్ మాట్లాడుతూ గత ఏడ దశాబ్దాల నుంచి కంపెనీ గ్లోబల్ మార్కెట్లోఅందుబాటులో కొచ్చిన వినూత్నమైన కార్లను దేశీయ కస్టమర్లకు అందించామన్నారు. ప్రభుత్వం స్మార్ట్‌సిటి కాన్సెప్ట్‌కు మద్దతు ఇస్తూ.. ఆటో ఎక్స్‌పోలో తాము కూడా స్మార్ట్ మొబిలిటి.. స్మార్ట్ సిటీస్ పేరుతో స్టాల్‌ను ఏర్పాటు చేసి కస్టమర్లకు భవిష్యత్తులో టాటామోటార్స్ నుంచి రానున్న వాహనాలపై అవగాహన కలిగిస్తామని ఆయన చెప్పారు. ప్యాసింజర్ విభాగంలో ఇంఫాక్ట్ డిజైన్ 2.0తో పాటు వాణిజ్య వాహనాల విషయానికి వస్తే ..కొత్త డిజైన్‌తో పాటు బలమైన, నాణ్యమైన వాహనాలను ప్రదర్శనకు ఉంచుతామని ఆయన అన్నారు.

మళ్లీ నంబర్ వన్ బెంజ్!
● 2017లో 15,330 యూనిట్లు విక్రయం



న్యూఢిల్లీ: దేశీయ లగ్జరీ కార్ల విక్రయాల్లో మెర్సిడెజ్ బెంజ్ 2017లో కూడా తన హవాను కొనసాగించింది. వరుసగా మూడో సంవత్సరం తన ఆధిపత్యాన్ని చాటుకుంది. మార్కెట్లో దీనికి పోటీ కంపెనీలైన బీఎండబ్ల్యు, ఆడిలను వెనక్కి నెట్టింది. మొత్తానికి గతేడాది మెర్క్ 15,330 యూనిట్లు విక్రయించి మళ్లీ నెంబర్‌వన్‌గా నిలిచింది. 2016లో 13,231 యూనిట్లు విక్రయించింది.... దీంతో పోల్చుకుంటే గతేడాది అమ్మకాలు 15.86 శాతం పెరిగాయి. కంపెనీ పెద్దమొత్తంలో కొత్త మోడల్స్‌ను మార్కెట్లో తేవడంతో అమ్మకాలు పెంచుకోవాడానికి వీలైంది. లేదంటే అమ్మకాలు అంతంత మాత్రంగానే ఉండవేని ఆటో రంగానికి చెందిన వారు చెబుతున్నారు.

బీఎండబ్ల్యు గ్రూపు 2017లో 9,800 యూనిట్లు విక్రయిస్తే 2016లో 7,861 యూనిట్లు విక్రయించింది. ఇక ఆడి విషయానికి వస్తే గతేడాది 7,876 యూనిట్లు విక్రయిస్తే.. అంతకు ముందు ఏడాది 7,720 యూనిట్లు విక్రయించింది. అమ్మకాల్లో కేవలంరెండు శాతం మాత్రం వృద్ధి కనిపించింది. టాటామోటార్స్‌కు చెందిన జాగ్వార్ అండ్ ల్యాండ్ రోవర్ అమ్మకాలు గతేడాది 3,954 యూనిట్లు కాగా.. 2016లో 2,653 యూనిట్లు, అమ్మకాల్లో 49శాతం వృద్ధి కనిపించింది. గతేడాది ఆటో పరిశ్రమకు గడ్డుకాలమని, మంచి అవకాశాలు కూడా కోల్పోయామని, అయినా 15,330 యూనిట్లు విక్రయించి రికార్డు సాధించామని మెర్సిడెజ్ బెంజ్ ఇండిమా మేనేజింగ్ డైరెక్టర్ సీఈవో రోలాండ ఫోల్గార్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం జీఎస్టి అమల్లోకి తెచ్చిన తర్వాత లగ్జరీ కార్లపై పలు మార్లు పన్ను రేట్లు మార్చుతూపోయిందన్నారు. జీఎస్టి అమల్లోకి తెచ్చిన తర్వాత లగ్జరీ కార్లపై 28 శాతంతోపాటు 15 శాతం సుంకంగా నిర్ణయించారు. తర్వాత సుంకాన్ని సవరించి మరో 5 శాతం 7 శాతం సెప్టెంబర్‌లో పెంచారన్నారు. గతేడాది జులై, ఆగస్టులో పన్నులు తగ్గించడం వల్ల అమ్మకాలు పెంచుకున్నామని ఫోల్గార్ అన్నారు. లగ్జరీ కార్ల మార్కెట్‌లో మెర్క్ 40 శాతం వాటా దక్కించుకుందన్నారు. మర్సెడెజ్‌కు చెందిన అన్నీ కార్ల విభాగాలు వాటిలో ఎస్‌యూవీల నుంచి ఎఎంజీ వరకు అమ్మకాలు రెండంకెలు దాటాయని ఆయన అన్నారు. కొత్తగా పెద్ద చక్రాల ఈ - క్లాస్‌కు మంచి స్పందన లభించిందన్నారు. సీ- క్లాస్, ఈ-క్లాస్, ఎస్‌యూవీల అమ్మకాలు జోరుందుకున్నాయని ఆయన వివరించారు. ఈ ఏడాది కూడా అమ్మకాలు బాగుంటాయని ఆశిస్తున్నానన్నారు. వచ్చే నెల ఢిల్లీలో జరగబోయే ఆటోఎక్స్‌పోలో మెర్సిడెజ్ మేబాచ్ ఎస్ 650 తో పాటు ఎఎంజీ ఫోర్టుపోలియోలోని కొత్త ప్రాడక్టులను ప్రదర్శనకు ఉంచుతామని ఫోల్గార్ వివరించారు.

ఇండిగో డిస్కౌంట్ ఆఫర్
● ప్రారంభ ధర రూ. 899



హైదరాబాద్ : చౌకరకం విమానయాన సంస్థ ఇండిగో ఎయిర్‌లైన్స్ ఎంపిక చేసిన రూట్లలో కొత్త సంవత్సరం కానుకగా మూడు రోజుల పాటు డిస్కౌంట్ సేల్‌ను అందుబాటులో ఉంచింది. సోమవారం నుంచి అమల్లోకి వస్తున్న ఈ స్కీం ద్వారా టిక్కెట్లు కొనుగోలు చేసిన వారు ఫిబ్రవరి 1 నుంచి ఏప్రిల్ 15 మధ్యలో తమ ప్రయాణాలు ఉండేలా ప్లాన్ చేసుకోవాల్సి ఉంటుందని కంపెనీ వెబ్‌సైట్‌లో పేర్కొంది. డిస్కౌంట్ సేల్ ద్వారా కొనుగోలు చేసిన టిక్కెట్లు తర్వాత రద్దుచేసుకుంటే రీఫండ్‌లు ఇవ్వరు. దీంతో పాటు గ్రూపు బుకింగ్‌లను అనుమతించరు. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు క్రెడిట్‌కార్డుల ద్వారా టిక్కెట్లు కొనుగోలు చేస్తే 10 శాతం క్యాష్‌బ్యాక్ ఆఫర్ చేస్తోంది. గరిష్ఠంగా ఇది రూ.600 వరకు మాత్రమే. ఢిల్లీ - చండీఘడ్ టిక్కెటు ధర రూ.899, ఢిల్లీ - జైపూర్ టిక్కెల్లు రూ.999, ఢిల్లీ - అమృతసర్ టిక్కెట్ ధర రూ.1,099గా నిర్ణయించారు. ఆదివారం నాడు ఇండిగో తిరుపతి - హైదరాబాద్ విమానసర్వీసులు ప్రారంభించిన విషయం తెలిసిందే.

ఎన్ఎండీసీ షేరు రూ. 153.5కు విక్రయం

एन एम डी सी
NMDC

హైదరాబాద్ : కేంద్రప్రభుత్వం ఎన్ఎండీసీలో పెట్టుబడుల ఉపసహంరణకు శ్రీకారం చుట్టింది. మంగళవారం నాడు 1.5 శాతం వాటాలను విక్రయించనుంది. ఒక్కో షేరు రూ.153.5కు అందుబాటులో ఉంచింది. ఒక వేళ ఒవర్‌సబ్‌స్క్రైబ్ అయితే అదనపు సొమ్మును తమ వద్దనే ఉంచుకునే వెసులుబాటు కల్పించుకుంది. రెండు రోజుల పాటు జరిగే ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) ద్వారా మంగళవారం నాడు ఇన్స్‌స్టిట్యూషన్ ఇన్వెస్టర్లకు, బుధవారం నాడు రిటైల్ ఇన్వెస్టర్ల కోసం అందుబాటులో ఉంచుతారు. 1.5 శాతం వాటాలను విక్రయించడం వల్ల ప్రభుత్వ ఖజానాకు రూ.750 కోట్లు సమకూరుతాయని ప్రభుత్వవర్గాలు తెలియజేశాయి. ఫ్లోర్ ధర రూ.153.50కి విక్రయిస్తే .. ప్రస్తుతం మార్కెట్లో రూ.161.85 వద్ద ట్రేడ్ అవుతోంది. సుమారు ఐదు శాతం వరకు డిస్కౌంట్‌కు షేర్లను ఆఫర్ చేస్తోంది. కాగా ప్రభుత్వం పెట్టుబడుల ఉపసంహరణ ద్వారా ఈ ఆర్థికసంవత్సరం రూ.72,500 కోట్లు సేకరించాలనుకుంది. అయితే ఇప్పటి వరకు రూ.52,500 కోట్లు సేకరించింది.

మార్కెట్లు రికార్డుల జోరు..!
● బడ్జెట్ అంచనాలపై మదుపరుల నజర్ ● విదేశీ ఇన్వెస్టర్ల భారీ కొనుగోళ్లు

ముంబై : స్టాక్ మార్కెట్లు సోమవారం నాడు సరికొత్త రికార్డుకు చేరాయి. త్వరలోనే ప్రారంభం కాబోతున్న క్యూ3 ఫ లితాలతో పాటు బడ్జెట్‌పై దృష్టిపెట్టిన మదుపరులు పెద్దెత్తున కొనుగొళ్లకు పాల్పడ్డారు, ముఖ్యంగా ఐటి, క్యాపిటల్‌గూడ్స్, హెల్త్‌కేర్, మెటల్ రంగానికి చెందిన షేర్లను దేశీయ, విదేశీ ఇన్వెస్టర్లు పెద్దెత్తున కొనుగొళ్లు చేయడంతో సూచి సరికొత్త రికార్డులను బద్దలు కొట్టింది. ఇంట్రాడేలో రికార్డు స్థాయికి 34,385.67 పాయింట్లకు ఎగబాకింది. గతంలోని రికార్డు 34,188.85 పాయింట్లను దాటిపోయింది. అయితే మదుపరులు లాభాల స్వీకరణకు పాల్పడ్డంతో సూచి 198.44 పాయింట్లు లాభపడి 34,352.79 వద్ద స్థిరపడింది. మొత్తానికి ఇదే ఆల్‌టైం హైగా చెప్పుకోవచ్చు. నిఫ్టీ కూడా అదే స్థాయిలో జోరందుకుంది. 64.75 పాయింట్లు లాభపడి 10,623.60 వద్ద ముగిసింది. గత రికార్డు 10,558.85 రికార్డును బద్దలు కొట్టిందని చెప్పుకోవచ్చు. మొత్తానికి స్టాక్ మార్కెట్లు జోరందుకోవడానికి ప్రధాన కారణం రాబోయే క్యూ3 ఫలితాల సీజన్‌లో కార్పొరేట్ ఫలితాలు అనుకూలంగా ఉంటాయన్న అంచనా. కేంద్ర గణాంకాల కార్యాలయం ఈ ఆర్థిక సంవత్సరం జీడీపీ అంచనా తగ్గించినా దాని ప్రభావం మార్కెట్లపై కనిపించలేదు. విదేశీ ఫోర్టుపోలియో ఇన్వెస్టర్లు కొత్త సంవత్సరం నుంచి మార్కెట్లో పెద్దమొత్తంలో పెట్టుబడులు పెడుతున్నాయి. గత శుక్రవారం నాడు విదేశీ ఇన్వెస్టర్లు రూ.581.43 కోట్ల షేర్లను కొనుగోలు చేస్తే, దేశీయ ఇన్వెస్టర్లు రూ.243.13 కోట్ల షేర్లు కొనుగోలు చేశాయని స్టాక్ మార్కెట్ గణాంకాలు తెలియజేస్తున్నాయి. ఎల్‌అండ్‌టి 1.80 శాతం లాభపడింది. ఆంధ్రప్రదేశ్ రాజధాని నిర్మాణానికి రూ.2,265 కోట్ల ఆర్డరు దక్కించుకుంది.

లాభపడిన ఇతర షేర్ల విషయానికి వస్తే హీరోమోటో కార్ప్, ఇండస్‌ఇండ్ బ్యాంకు, ఐటీసీ లిమిటెడ్, హిందుస్తాన్ యూనీలీవర్, హెచ్‌డీఎఫ్ లిమిటెడ్, విప్రో, టాటామోటార్స్, రిలయన్స్ ఇండస్ట్రీస్, ఐసీఐసీఐ బ్యాంకు, ఎంఅండ్ఎం, కొటక్ బ్యాంకు, మారుతి సుజుకి, ఎస్ బ్యాంకు, పవర్ గ్రిడ్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులు 1.37 శాతం వరకు లాభపడిన వాటిలో ఉన్నాయి. వీటికి వ్యతిరేకంగా నష్టపోయిన షేర్లు భారతి ఎయిర్‌టెల్, ఒఎన్‌జీసీ, ఎస్‌బీఐ, టాటాస్టీల్, అదానీ పోర్ట్స్, డాక్టర్ రెడ్డీస్ షేర్లపై మదుపరులు లాభాలస్వీకరణకు పాల్పడ్డంతో షేర్లు కిందికి దిగివచ్చాయి. అత్యధికంగా ఐటి సూచి 1.40 శాతం, క్యాపిటల్‌గూడ్స్ 1.22శాతం, హెల్త్‌కేర్ 1.20శాతం, రియల్టీ 0.87 శాతం, మెటల్ 0.78 శాతం, ఎఫ్ఎంసీజీ 0.78 శాతం, చమురు సహజవాయువు 0.67 శాతం, టెక్ 0.66 శాతం, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ 0.39 శాతం లాభపడిన వాటిలో ఉన్నాయి. టెలికం 2.64 శాతం నష్టాన్ని చవిచూసింది.



TOP GAINERS	%	TOP LOSERS	%
Coal India	3.26	Bharti Airtel	-4.43
Infosys	2.33	ONGC	-0.28
Sun Pharma	2.28	SBI	-0.18
Larsen	1.80	Tata Steel	-0.18
Hero Motor	1.37	Adani Ports	-0.07

PTI GRAPHICS



TOP GAINERS	%	TOP LOSERS	%
Coal India	3.12	Idea Cellular	-5.83
Lupin	2.57	Bharti Airtel	-4.38
Infosys	2.38	ONGC	-0.53
Sun Pharma	2.22	Power Grid	-0.35
Tech Mahi	2.06	Asian Paints	-0.27

వీఐపీల భారతం

(మొదటిపేజీ తరువాయి)

విభజిస్తున్నది. సామాన్య ప్రజానీకాన్ని రెండో తరగతి పౌరులుగా పరిగణింపబడేలా చేస్తున్నది. మిగతా దేశాల్లోనూ వీఐపీ సంస్కృతి ఉంది. కాకుంటే అది కొంత పరిమితికి లోబడి ఉంటుంది. వీఐపీ హోదాకూ అక్కడ స్పష్టమైన నిర్వచనం ఉంటుంది. కానీ, మనదేశంలో పరిస్థితి భిన్నంగా ఉంది. ప్రధాని నుంచి సర్పంచ్ దాకా ఈ సంస్కృతి విస్తరించి ఉంది. దరిమిలా మనదేశంలో ఇదొక రుగ్మతలా మారింది.

ప్రపంచ వ్యాప్తంగా మూడంకెల్లో ఉన్న వీఐపీ జాబితా మన దేశంలో ఆరంకెలకు చేరింది. ఇండియాలో అధికారికంగా వీఐపీ హోదా కలిగిన వారి సంఖ్య 475. సోకాల్డ్ వీఐపీలతో కలుపుకుంటే ఇది 5,79,092గా ఉన్నట్లు అంచనా. ప్రపంచ దేశాలతో పోల్చుకుంటే, మనదేశం వీఐపీ సంస్కృతిలో శిఖరాగ్రాన నిలిచింది. 130 కోట్ల జనాభాను ఇందుకు కారణంగా సమర్థించుకోవడానికి వీల్లేదు. ఎందుకంటే మన పొరుగున ఉన్న చైనాలో మనకంటే ఎక్కువ జనభా ఉంది. అయినా అక్కడ ప్రముఖుల జాబితా వందల్లోనే ఉంది.

దేశం -	వీఐపీలు
బ్రిటన్ -	84
ఫ్రాన్స్ -	109
జపాన్ -	125
జర్మనీ -	142
ఐస్ట్రేలియా -	205
అమెరికా -	252
ద. కొరియా -	282
రష్యా -	312
చైనా -	435

2015లో భారత ప్రభుత్వం వీఐపీ జాబితాను ప్రకటించింది. అమెరికా విమానాశ్రయాల్లోనూ, విదేశీ పర్యటనల్లోనూ సమస్యలు ఎదురవకుండా ఉండేందుకు 2000 మంది పేర్లను ప్రముఖుల జాబితాలో చేర్చింది. ఆ తర్వాత ఇది క్రమేణా ఇంతై.. వటుడింతై అన్నట్లుగా వృద్ధి చెందుతూ వస్తోంది. ఇండియన్ వీఐపీల్లో రాజకీయ నాయకులదే అగ్రస్థానం. ముఖ్యంగా పార్లమెంటేరియన్లు, ముఖ్య మంత్రులు, కేబినెట్ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఈ కేటగిరీలో కొనసాగుతున్నారు. వీరి జీతభత్యాలు, అలవెన్సులు, సెక్యూరిటీ సిబ్బంది వ్యయాలు, ఇతరత్రా సౌకర్యాలకు చెల్లింపులు వందల కోట్ల రూపాయలకు చేరుతున్నాయి. వీఐపీ స్టేటస్ ద్వారా ఒక్క 543 మంది లోక్‌సభ సభ్యులకు 186 కోట్ల రూపాయలు ఖర్చు అవుతోంది. సగటున నెలకు 2.7 లక్షల రూపాయలన్నమాట. జీతభత్యాలపై వీరెలాంటి పన్నులు చెల్లించాల్సిన పనిలేదు. పైపెచ్చు ఉచిత అలవెన్సుల రూపేణ బోలెడు సౌకర్యాలు అనుభవిస్తుంటారు. గుండు సూది నుంచి విమాన ప్రయాణాల దాకా నేతలు తమ జేబుల్లోంచి ఒక్క పైసా ఖర్చు చేయాల్సిన పనిలేదు. ప్రజలు చెల్లించే పన్నుల నుంచే ప్రభుత్వం వీళ్ల అవసరాలు తీర్చుతుంది. బ్రిటన్, అమెరికాల్లో ఇంచుమించు మనలాగే పార్లమెంటరీ వ్యవస్థ ఉంటుంది. అక్కడ వారూ సదుపాయాలు పొందుతుంటారు. కానీ కచ్చితంగా పనిచేస్తారు. బాధ్యతాయుతంగా మెలుగుతారు. కానీ మన వీఐపీ ఎంపీల తీరు ఇందుకు విరుద్ధం. చాలా మంది సభ్యులు సక్రమంగా పార్లమెంటుకు హాజరు కానేకారు. అంతేకాదు ముఖ్య నేతల వారసులు 15 మంది వీఐపీ భద్రత నీడలో ఉన్నారు. కొందరు నేతలకు ఎన్ఎస్‌జీ సెక్యూరిటీ కేటాయించారు. మరికొందరు ఎక్స్, వై, జెడ్ కేటగిరీల్లో భద్రత కలిగివున్నారు. దేశవ్యాప్తంగా 50 మంది ఈ తరహా సదుపాయం కలిగివున్నారు. జెడ్ ప్లస్ కేటరిగీలో ప్రతి ఒక్కరికి 35-40 మంది సిబ్బంది రక్షణ వలయంగా ఉంటారు. జడ్ భద్రతలో 22 మంది వై కేటగిరీలో 11 మంది, ఎక్స్ విభాగంలో ఇద్దరేసి చొప్పున బలగాలు పహారాగా ఉంటాయి. ఎన్ఎస్‌జీ అధికారుల సమాచారం ప్రకారం 15 మంది నేతలకు వీరు భద్రత అందిస్తున్నారు. బ్లాక్ కమెండోలతో రక్షణ వలయం ఏర్పాటు చేశారు.

సీఆర్‌పీఎఫ్ బలగాలు 75 మంది వీవీఐపీలకు సేవలు అందిస్తున్నాయి. ఇక సీఐఎస్ఎఫ్ బృందాలు 75 మందికి, ఐటీబీపీ బృందాలు 18మందికి భద్రత కల్పిస్తున్నాయి.

ఢిల్లీలో ఒక్కో వీఐపీకి 17 మంది పోలీసులు రక్షణగా ఉండగా, పౌరులవిషయానికొస్తే 253 మందికి ఒక పోలీసు ఉన్నారు. మొత్తంగా 8049 మంది పోలీసులు నేతలసేవలో తరిస్తున్నారు. నాలుగేళ్ల కిందట వీఐపీ సెక్యూరిటీ కింద ఢిల్లీ ప్రభుత్వ వ్యయం రూ. 341 కోట్లు 24 లక్షలు, 32వేల రూపాయలుగా ఉంది. ఇప్పుడది 400 కోట్లుగా ఉండివుండవచ్చు. దేశవ్యాప్తంగా లెక్కచూస్తే ఈ మొత్తం వెయ్యిన్నర కోట్ల రూపాయలు ఉంటుందని అంచనా.

ఖద్దరు సేవల్లోనే ఖాకీ?

ప్రముఖ వ్యక్తులకు భద్రత కల్పించడం అవసరమే. అలాగని మొత్తం వ్యవస్థను వారి సేవకే అంకితం చేస్తే ఎలా? దేశంలో శాంతిభద్రతల మాటేమిటి? అన్న ప్రశ్న సగటు పౌరుడి నుంచి తరచూ వినిపిస్తూ వస్తున్నదే. అయినా మన పాలకుల నుంచి ఈ ప్రశ్నకు ఎప్పటికీ జవాబు రాదు. ఎందుకంటే వాళ్లంతా వీఐపీ సంస్కృతికి బాగా అలవాటు పడిపోయారు. కుడి, ఎడమలతోపాటు వెనకవైపున భద్రతా సిబ్బంది కాపుగాయడాన్ని దర్పంగా భావిస్తున్నారు కాబట్టి. బ్యూరో ఆఫ్ పోలీస్ రీసెర్చ్ డెవలప్‌మెంట్ (బీపీఆర్ అండ్ డీ) వివరాల ప్రకారం మన దేశంలో ఒక్కో వీఐపీకి సగటున ముగ్గురు పోలీసులు భద్రతగా ఉంటున్నారు. అదే సమయంలో 663 మంది సామాన్య ప్రజానీకానికి ఒక పోలీసు మాత్రమే సేవలు అందిస్తుండటమే ఆందోళనకర అంశం. దేశంలో సుమారు 20లక్షల మంది పోలీసులు ఉన్నారనుకుంటే, ఇందులో 60వేల మంది దాకా వీఐపీ సేవలోనే తరించాల్సి వస్తోంది. దీంతో సమాజంలో శాంతిభద్రతలు భేతాళ ప్రశ్నగానే మిగిలిపోతున్నది.

అత్యంత పేద రాష్ట్రం, శాంతి భద్రతల సమస్యలతో సతమతం అవుతున్న బీహార్‌లో 3200 మంది వీఐపీలున్నారు. వీళ్లకు భద్రత నిమిత్తం 6248 మంది పోలీసులను కేటాయించడం జరిగింది. అదేవిధంగా, పశ్చిమబెంగాల్ లో 2207 మంది వీఐపీలకు 4233మంది, ఉత్తర ప్రదేశ్‌లో 4681 మందికి 5315 మంది ఖాకీలు సేవలు అందిస్తున్నారు. ఇక, రాష్ట్రపతి, ప్రధానమంత్రి, కేంద్ర మంత్రులతోపాటు సుప్రీం కోర్టు, పార్లమెంటు వంటి ఉన్నత వ్యవస్థలకు నిలయమైన దేశ రాజధాని నగరం ఢిల్లీలో సుమారు 489 మంది వీఐపీలు ఉన్నారు. వీరి రక్షణ విధుల కోసం 7420 మంది పోలీసులు పహారా కాస్తుంటారు. ప్రత్యేక భద్రత చర్యలపేరుతో మరికొంత మందిని వీఐపీ విధులకు కేటాయిస్తుంటారు.





పల్లె, పట్నంకు సంక్రాంతి స్పెషల్స్


(మొదటిపేజీ తరువాయి)

చేసింది. రెగ్యూలర్‌గా తిరిగే 3065 బస్సులకు ఇవి అదనం. ప్రైవేటు ఆపరేటర్లు సుమారు 3 వేలకు పైగా బస్సులను నడిపించడానికి సిద్ధమయ్యారు. ప్రత్యేక బస్సులు, రైళ్లలో 50 శాతం అదనపు ఛార్జీలను వసూలు చేస్తారు. ప్రైవేటు ఆపరేటర్లు డిమాండ్ ఆధారంగా ఛార్జీలను 100 శాతం నుండి 250 శాతం వరకు పెంచడం సర్వసాధారణం. బస్సులు బాదేస్తున్నప్పటికీ ప్రయాణికులు కిక్కురుమనకుంగా టికెట్లను అడ్వాన్సుగా కొనుగోలు చేస్తున్నారు. చివరి నిమిషయంలో టికెట్ దొరకదనే ఆందోళనతో ఆన్‌లైన్ టికెట్ బుకింగ్ పై అత్యధికులు ఆధారపడుతున్నారు. మంగళవారం తెల్లవారు జాము నుండి ప్రత్యేక బస్సులు నడిపించడానికి ఆర్టీసీ ఏర్పాట్లు చేసింది. అడ్వాన్స్ రిజర్వేషన్ విధానం కారణంగా ప్రయాణ ప్రాంగణాల్లో ప్రయాణికుల రద్దీ పెద్దగా ఉండటం లేదు. నగర శివారు నుండే ప్రత్యేక బస్సులను నడిపించబోతున్నారు. ప్రైవేటు ఆపరేటర్లు మాత్రం నగరంలోని అత్యధిక ప్రాంతాల నుండి బస్సులను నడిపిస్తున్నారు. దీనికి తోడు ఆంధ్రప్రదేశ్ రోడ్డు రవాణా సంస్థ కూడా హైదరాబాద్ నుండి తమ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు ప్రత్యేక బస్సులను నడిపించబోతుంది. సగటున రోజుకు 25 వేల మంది తమ స్వస్థలాలకు చేరుకొనేందుకు బస్సులు, రైళ్లలో ప్రయాణం చేసే అవకాశం ఉంది. ఈ నెల 12, 13, 14 తేదీల్లో అత్యధికులు హైదరాబాద్ నుండి వివిధ ప్రాంతాలకు వెళ్లబోతున్నారు. తిరుగు ప్రయాణాలు 16, 17, 18 తేదీల్లో ఉంటాయని అధికారులు తెలిపారు. రద్దీకి అనుగుణంగా బస్సులు నడిపించడానికి ఏర్పాట్లు పూర్తి చేశామని ఆర్టీసీ వర్గాలు పేర్కొన్నాయి. ఆర్టీసీ విజయవాడ వైపు 1094, కర్నూలు వైపు 115, నెల్లూరు వైపు 143, వరంగల్ వైపు 384, కరీంనగర్ వైపు 280, ఖమ్మంకు 430, మహబూబ్‌నగర్‌కు 179, ఆదిలాబాద్, నిజామాబాద్ వైపు 259 ప్రత్యేక బస్సులను నడిపిస్తుంది. ప్రైవేటు బస్ ఆపరేటర్లు అత్యధికంగా విశాఖపట్టణం, కాకినాడ, విజయవాడ, బెంగుళూరు, నెల్లూరుకు ప్రత్యేక బస్సులు నడిపిస్తున్నారు. హైదరాబాద్ నుండి విజయవాడ, విశాఖపట్టణం, కాకినాడ, గుంటూరు, విజయనగరం నగరాలకు అత్యధికంగా బస్సులు నడిపించబోతున్నారు. ముంబాయి, పూణె, బెంగూళూరు తదితర దూర ప్రాంతాలకు ప్రత్యేక బస్సులను నడిపిస్తున్నారు. దక్షిణ మధ్య రైల్వే హైదరాబాద్ - కాకినాడ, హైదరాబాద్ - విశాఖపట్టణం, సికింద్రాబాద్ - తిరుపతి మీదుగా దూర ప్రాంతాలకు 84 ప్రత్యేక రైళ్లను ప్రకటించింది. ఈ ప్రత్యేక రైళ్లు ఈ నెల 7వ తేదీ నుండి వచ్చే నెల 16వ తేదీ వరకు ఉన్నాయి. ప్రత్యేక రైళ్లలో ఇప్పటికే బుకింగ్ 86 శాతం మేరకు పూర్తయిందని అధికారులు తెలిపారు. ప్రయాణికుల అవసరాల మేరకు అదనపు రైళ్లను నడిపించడానికి సిద్ధంగా ఉన్నామని వెల్లడించారు. ఆర్టీసీ బస్సులు, రైళ్లలో సీట్లు దొరకని వారు, తరచుగా ప్రైవేటు బస్సుల్లోనే తిరిగే వారు అధిక ఛార్జీలను భరించి ప్రైవేటు బస్సుల్లో టికెట్లను బుక్ చేసుకుంటున్నారు. గతంతో పోల్చుకుంటే హైదరాబాద్ నుండి ఆంధ్రకు సంక్రాంతి సందర్భంగా వెళ్లే వారి సంఖ్య తగ్గుతుందన్నారు. ఐటి ఉద్యోగుల్లో అత్యధికులు హైదరాబాద్ నుండి ఆంధ్రప్రదేశ్‌లోని తమ స్వస్థలాలకు వెళ్లడం జరుగుతుందన్నారు. అదే విధంగా పూణె, బెంగుళూరు, ముంబాయి నుండి హైదరాబాద్, వరంగల్, నిజామాబాద్, కర్నూలుకు వచ్చే వారి సంఖ్య కూడా అధికంగానే ఉంటుందన్నారు. సెలవులు దొరకని కారణంగా, కుటుంబాలతో సహ స్వగ్రామాలకు వెళ్లాలనుకునే వారిలో అత్యధికులు రైలు ప్రయాణం, సొంత వాహనంలో వెళ్లడానికి ఇష్టపడుతున్నారని ఆర్టీసీ అధికారులు తెలిపారు. ప్రైవేటు బస్సుల్లో విశాఖకు రూ. 2590లు, కాకినాడకు రూ. 1800లు, గుంటూరుకు రూ. 1500లు, విజయనగరం కూ రూ. 2600ల వరకు వసూలు చేస్తున్నారు. సాధారణ రోజుల్లో ఈ నగరాలకు హైదరాబాద్ నుండి వరుసగా రూ. 940, రూ. 670, రూ. 550, రూ. 1190లు వసూలు చేస్తుంటారు.

8500 రైల్వేస్టేషన్లలో వైఫై సౌకర్యం

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా ఉన్న సుమారు 8,500 రైల్వేస్టేషన్లలో వైఫై సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకురావాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. గ్రామీణ, మారుమూల ప్రాంతాలతో సహా రైల్వేస్టేషన్లలో రూ.700 కోట్లతో ఈ సౌకర్యం కల్పించనుంది. కేంద్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక డిజిటల్ ఇండియా కార్యక్రమంలో భాగంగా 216 ప్రధాన రైల్వేస్టేషన్లలో ఉచితంగా ప్రయాణికులకు ఇంటర్నెట్ సదుపాయం ఇప్పటికే అందుబాటులోకి తెచ్చినట్టు రైల్వే మంత్రిత్వ శాఖ సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. రోజువారీ పనుల్లో ఇంటర్నెట్ కీలక అవసరంగా మారిందని, దీన్ని పరిగణనలోకి తీసుకునే దేశంలోని అన్ని రైల్వేస్టేషన్లలోనూ వైఫై సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. దేశంలోని అన్ని రైల్వేస్టేషన్లలో ఈ సౌకర్యాన్ని విస్తరింపజేస్తున్నామని తెలిపారు. రైల్వే ప్రయాణికుల అవసరాల దృష్ట్యా ప్రాథమికంగా 1,200 స్టేషన్లను రైల్వేలు గుర్తించినట్లు తెలిపారు.

ఎమ్మెల్యేల సంఖ్యపైనే సీఎం దృష్టి



చెన్నై: తమిళనాడు ముఖ్యమంత్రి పళనిస్వామికి తన పార్టీ ఎమ్మెల్యేల సంఖ్యపైనే దృష్టి తప్ప ప్రజల సమస్యలపై లేదని ఆర్కే నగర్ ఉప ఎన్నికలో విజయం సాధించిన శశికళ మేనల్లుడు దినకరన్ అన్నారు. రాష్ట్రంలో రవాణా కార్మికుల సమ్మె కారణంగా ఎమ్మెల్యేల కోసం ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తానని ముఖ్యమంత్రి ప్రకటించడంపై దినకరన్ పైవిధంగా వ్యాఖ్యానించారు.

బహిరంగ ప్రదేశాల్లో లౌడ్‌స్పీకర్ల రద్దు

లక్నో: బహిరంగ ప్రదేశాలు, ధార్మిక సంస్థలు, ఆలయాలు తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన లౌడ్ స్పీకర్లపై వేటు వేయడానికి ఉత్తర్ ప్రదేశ్ ప్రభుత్వం రంగం సిద్ధం చేస్తోంది. బహిరంగ ప్రదేశాల్లో లౌడ్ స్పీకర్ల ఏర్పాటు కారణంగా కలుగుతున్న శబ్ద కాలుష్యానికి సంబంధించి మరికొద్ది వారాల్లో సుప్రీంకోర్టుకు సమాధానం చెప్పవలసి ఉన్న నేపథ్యంలో యోగి ఆదిత్యనాథ్ సర్కార్ ఈ అంశంపై నడుం బిగించింది. లౌడ్ స్పీకర్లను ఎక్కడెక్కడ ఏర్పాటు చేశారనే అంశాన్ని పరిశీలించడానికి అధికారులతో బృందాలు ఏర్పాటు చేసి పంపాల్సిందిగా వివిధ జిల్లాల కలెక్టర్లు, ఎస్‌పిలకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

డబ్బు కట్టలేదని వైద్యం చేయలేదు!

హైదరాబాద్, ఆంధ్రప్రభ : మానవీయ కోణం మృగ్యమైంది. పైసానే పరమాత్మ అయింది. ఓ తాగుబోతు నిర్లక్ష్యంగా కారు నడిపిన ఘటనలో తీవ్ర గాయాలపాలైన ఆ ఇద్దరి యువతులకు ఎంత కష్టమొచ్చింది? అత్యవసర చికిత్స అవసరమైన వారికి వారి కుటుంబసభ్యులు డబ్బులు చెల్లించకపోవడంతో.. డబ్బులు కట్టని పక్షంలో వైద్యం అందించలేమని అపోలో ఆసుపత్రి వైద్యులు వారి వారి కుటుంబసభ్యులకు తెగేసి చెప్పారు. దీంతో, విధిలేని పరిస్థితుల్లో ఆ ఇద్దరిని ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్చి చికిత్సనందించేందుకు కుటుంబ సభ్యులు సమాయత్తమయ్యారు.

విష్ణువర్దన్ తమను ఆదుకోవాలని ఈ సందర్భంగా ఆ యువతుల కుటుంబసభ్యులు డిమాండ్ చేశారు. వివరాల్లోకి వెళితే.. జూబ్లీహిల్స్ రోడ్ నెం.10లో ఆదివారం వేకువజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో విష్ణువర్ధన్ అనే వ్యక్తి అతివేగంతో కారును నడుపుతూ స్కూటీని ఢీకొట్టాడు. దీంతో స్కూటీ నడుపుతున్న శ్రీనగర్‌కు చెందిన మస్తానీ అనే యువతి స్పాట్‌లో మృతి చెందగా, ఆమె వెనకనే కూర్చున్న అనూష, ప్రియలు తీవ్రంగా గాయపడ్డారు. ప్రియా అలియాస్ అనూషరెడ్డి అలియాస్ వెంకటలక్ష్మి సొంతూరు విశాఖపట్నం, మరో మహిళ అనూష సొంతూరు రాజమండ్రి, మస్తానీ సొంతూరు తాడేపల్లిగూడెం. డబ్బు కట్టనిదే ఆ ఇద్దరి యువతులకు వైద్య సహాయం అందించలేమని అపోలో ఆసుపత్రి వైద్యులు కరాకండీగా తేల్చి చెప్పిన నేపథ్యంలో ఆ యువతుల తల్లిదండ్రులు ఆవేదన అంతా ఇంతా కాదు. మరో వైపు ఈ ఘటనలో విష్ణువర్ధన్‌ని పోలీసులు జైలుకు పంపారు.

భైరామ్‌గఢ్‌లో ముగ్గురు మావోల అరెస్టు

రాయ్‌పూర్: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం భైరామ్‌గఢ్‌లో ముగ్గురు మావోయిస్టులు అరెస్టయ్యారు. చిహికా అటవీ ప్రాంతంలో పోలీసులు మావోయిస్టులను అరెస్టు చేశారు. అరెస్టయిన మావోయిస్టులు హత్యలు, దోపిడీలకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు.

తెలంగాణ భవన్‌కు కొత్త బాస్



న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : ఢిల్లీలోని తెలంగాణ భవన్ ఇక కొత్త బాస్ ఆధ్వర్యంలో పని చేయనుంది. నూతన ప్రిన్సిపల్ రెసిడెంట్ కమి షనర్‌గా ఐఏఎస్ అధికారి జి. అశోక్ కుమార్ సోమవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. 1991 అఖిల భారతసర్వీసెస్‌కు చెందిన ఆయన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన వివిధ విభాగాల్లో అనేక హెూదాల్లో సమర్థవంతంగా సేవలందించారు. ప్రస్తుతం తెలంగాణ భవన్ పీఆర్సీగా బాధ్యతలు స్వీకరించిన జి. అశోక్ కుమార్‌కు భవన్ అదనపు రెసిడెంట్ కమిషనర్ వేదాంతం గిరి, సహాయక కమిషనర్ జి. రామ్మోహన్, పలువురు అధికారులు, సిబ్బంది ఘన స్వాగతం పలికారు. కేంద్ర పౌర, విమానయాన శాఖ సంయుక్త కార్యదర్శి హోదాలో అశోక్ కుమార్ ప్రవేశపెట్టిన ఎయిర్ క్రాఫ్ట్ యాక్సిడెంట్స్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో (ఏఏఐబీ) ఇప్పటికీ విజయవంతంగా కొనసాగుతోంది. సాంఘిక సంక్షేమ అభివృద్ధి కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిన బీసీ హాస్టళ్ల ఏర్పాటులోనూ అశోక్ కుమార్ విశేషంగా కృషి చేశారు.

టీఆర్‌టీకి 2.77 లక్షల దరఖాస్తులు

హైదరాబాద్,ఆంధ్రప్రభ: రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల భర్తీ కోసం నిర్వహించే ఉపాధ్యాయ నియామక పరీక్ష(టిఆర్‌టి) దరఖాస్తు ప్రక్రియ ఆదివారంతో ముగిసింది. టిఆర్‌టికి మొత్తం 2,77,574 దరఖాస్తులు వచ్చాయి. అభ్యర్థులు దరఖాస్తు ఫారంలో రాసిన బయోడేటాలోని తప్పులను సవరించుకోవడం కోసం 9 నుంచి 11 వరకు ఎడిట్ ఆప్షన్‌ను ఇచ్చినట్టు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ కార్యదర్శి వాణిప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

వికలాంగులకు ఉచిత శిక్షణా తరగతులు

హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహించు పోటీ పరీక్షలకు హాజరయ్యే వికలాంగులకు ఉచిత శిక్షణ తరగతులు నిర్వహించాలని వికలాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ నిర్ణయించింది. అర్హులైన వికలాంగులు ఈ నెల 20 లోగా తమ దరఖాస్తులు పంపాలని సంస్థ డైరెక్టర్ శైలజ సోమవారం ఒక ప్రకటనలో కోరారు. వివరాలను డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు . టీవీసీసీ. తెలంగాణ. గవ్, ఇన్ లేదా డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు . డబ్ల్యుడిఎస్‌సి.తెలంగాణ.గవ్. ఇన్ ను సంప్రదించాలని సూచించారు.

వృత్తిదారులకు ప్రమాద బీమా

హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : యూనై టెడ్ ఇండియా ఇన్సూ రెన్స్ కంపెనీతో చర్చించి వృత్తిదారులందిరికీ ప్రమాద బీమా అందించేల ఒప్పిం చినట్లు భువనగిరి ఎంపి బూర నర్సయ్యగౌడ్ తెలిపారు. నాగోల్ పీఎంఆర్ కన్వె న్షన్‌లో రూ. 60కే ప్రమాద బీమా పథకంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎంపి మాట్లాడుతూ వ్యవసాయ పనుల్లో లేదా రోడ్డు ప్రమాదాలు, ఇతర వృత్తి పరమైన ప్రమాదాల్లో మరణించే వారికి రూ.5లక్షల బీమా వర్తిస్తుందని అన్నారు. శాశ్వత అంగవైకల్యం కలిగే వారికి కూడా ఇది వర్తిస్తుందని అన్నారు. పేద వారికి ఏదైనా ఆసరా అందించాలన్న సంకల్పంతో ఏడాదికి రూ.60 చెల్లిస్తే 5లక్షల బీమా సదుపాయం కల్పించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్, ఎల్బీనగర్ ఇన్‌చార్జ్ రామ్మోహన్‌గౌడ్, నాగోల్ కార్పొరేటర్ చెరుకు సంగీత ప్రశాంత్‌గౌడ్, ఆలేరు జెడ్‌పిటిసి పరమేశ్వర్, నాయకులు ఆకారపు మోహన్‌రావు, ధన్‌రాజ్‌గౌడ్, రాంనర్సింహ్మాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వీఆర్‌వో వైఖరిపై రైతుల నిరసన

హైదరాబాద్, ప్రభన్యూస్: అబ్దుల్లాపూమెట్ మండలం తుర్కయాంజాల్ రెవెన్యూ పరిధిలోని సర్వేనెంబర్ 644,645,646లలో మొత్తం 5ఎకరాల63గుంటల భూమి బొడ్డు హన్మయ్య పేరుమీద ఉంది. హన్మయ్య 2001లో మరణించడంతో అతని కుమారులు బొడ్డు ఎట్టయ్య, సామయ్య, సుక్కయ్య, నర్సింహ్మా, బాలయ్య పేరుమీద పాసుపుస్తకాల కోసం ఎమ్మార్వో కార్యాలయంలో గత సంవత్సరం మే నెలలో దరఖాస్తు చేసుకున్నారు. మరుసటి రోజు ఎమ్మార్వో దరఖాస్తులను పరిశీలించి వీఆర్‌ఓకు పంపించింది. తమ వద్ద టైటిల్‌డీడ్, పహాణిలు, తాత పేరుమీద ఆర్‌ఓఆర్‌లు కూడా ఉన్నాయని బాధితులు తెలిపారు. సోమవారం విఆర్‌ఓను అడగ్గా పొంతనలేని సమాధానం చెప్పడంతో ఆగ్రహించిన బాధితులు మండల కార్యాలయంలో ముందు విషం బాటిళ్లతో ఆందోళనకు దిగారు. ఇది గమనించిన కార్యాలయం సిబ్బంది ఎమ్మా ర్వో విజయ, డిటి కిష్టయ్య దృష్టికి తీసుకొచ్చారు. ఇరువురిని సముదాయించిన ఎమ్మార్వో, డిటిలు విఆర్‌ఓ రాములుతో మాట్లాడి సంక్రాంతి పండుగ తర్వాత సమస్యను పరిష్కరిస్తామని హామి ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

విద్యుత్ ఉద్యోగులను ఆదుకోండి

హైదరాబాద్, ఆంధ్రప్రభ : తెలంగాణ స్టేట్ పవర్ ఎంప్లాయిస్ యూనియన్ సమస్యలు పరిష్కరించాలని సీఎండీ ప్రభాకర్ రావుకు యూనియన్ అధ్యక్షుడు ఎంఎ వజీర్ విజ్ఞప్తి చేశారు. యూనియన్ కార్యాలయం ఏర్పాటుకు గదిని కేటాయించాలని కోరారు. జన్కో ఉద్యోగుల కుటుంబ సభ్యులకు వైద్యసదుపాయం కోసం అన్ లిమిటెడ్ క్రెడిట్ కార్డు సౌకర్యం కల్పించాలన్నారు. 1999 ఫిబ్రవరి తరువాత చేరిన ఉద్యోగులకు ఈపీఎఫ్ నుంచి జీపీఎఫ్ పెన్సన్ సౌకర్యం కల్పించాలని కోరారు. జన్కోలో పనిచేస్తున్న ఓఅండ్ఎం క్యాడర్ ఉద్యోగులకు ప్రమోషన్లు కల్పించాలన్నారు.పెండింగ్‌లో ఉన్న డిపెండింగ్ డిసీజ్డ్ కోటా ఉద్యోగాలు వెంటనే ఇవ్వాలన్నారు. 25ఏళ్లుగా పనిచేస్తున ఆఫీస్ సబార్డినేట్స్‌కు ఒన్‌టైం బేసిస్ ప్రమోషన్లు కల్పించాలన్నారు.ఆర్టిజన్స్‌కు పేరివిజన్‌తోపాటుగా స్పెషల్ ఇంక్రిమెంట్స్ వర్తింపచేయాలని వజీర్ ఈ మేరకు సీఎండీ ప్రభాకర్‌రావుకు విజ్ఞాపనపత్రం సమర్పించారు.

ఏపీలో 'అజ్ఞాతవాసి' నైట్ షోలు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : సినీనటుడు పవన్ కల్యాణ్ నటించిన అజ్ఞాతవాసి సినిమాను సంక్రాంతి సందర్భంగా అర్ధరాత్రి ఒంటిగంట నుంచి ఉదయం 10 గంటల వరకు ప్రత్యేక ప్రదర్శనలకు ఆంధ్రప్రదేశ్ అనుమతించింది. ఈనెల 10 నుంచి 17వ తేదీవరకు సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రేక్షకుల రద్దీని తట్టుకునేందుకు ఈ మేరకు అవకాశం కల్పిస్తున్నట్లు హోంశాఖ ముఖ్య కార్యదర్శి ఎ.ఆర్. అనూరాధ ఈ మేరకు ఉత్తర్వులు ఇచ్చారు. ఈ సినిమాను అర్ధరాత్రి ఆట అనుమతించాల్సిందిగా అన్ని జిల్లాల కలెక్టర్లకు ఈ మేరకు ఆదేశాలు ఇచ్చారు. ఈ ప్రత్యేక ప్రదర్శనల సందర్భంగా శాంతిభద్రతలను, బ్లాక్ మార్కెటింగ్‌లో టిక్కెట్ల క్రయ విక్రయాలు జరగకుండా తగిన చర్యలు తీసుకోవాల్సిందిగా ఈ ఉత్తర్వులో ఆదేశించారు. అయితే ఈ సినిమాపై వినోదపన్ను చెల్లింపు యథావిధిగానే కొనసాగుతుందని ఆ ఉత్తర్వులో తెలిపారు.

వేద నిలయం సీఈవోకు డాక్టరేట్



హైదరాబాద్, ఆంధ్రప్రభ : గత రెండు దశాబ్దాలుగా ఆధ్యాత్మిక రంగంలో సేవలు అందిస్తున్న వేద నిలయం సీఈవో దంటు నాగార్జున శర్మకు గౌరవ డాక్టరేట్ ప్రదానం చేశారు. న్యూక్రిస్ట్ టెస్టమెంట్ డీమ్డ్ యూనివర్సిటీ నాగార్జునను ఎంపికచేసి విజయవాడలోని తుమ్మలపల్లి కళాశాలలో ఈ మేరకు గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. ఇంప్రింట్ ట్రావెల్స్ అండ్ టూర్స్ గ్రూపునకు చెందిన వేద నిలయం ఉత్తమ టూర్ ఆపరేటర్‌గా గతంలో అవార్డు కూడా పొందింది. ఆధ్యాత్మిక సేవలు, పుణ్యక్షేత్రాల యాత్రల టూర్ ఆపరేటర్‌గా నాగార్జున అంది స్తున్న ఉత్తమ సేవలకుగానూ ఆయనను గౌరవ డాక్టరేట్‌కు ఎంపిక చేసినట్లు యూని వర్సిటీ పేర్కొంది. తమ సంస్థ నిర్వహించిన యాత్రల్లో పాల్గొని తమకు సహక రించిన పర్యాటకులవల్లే తామ ఈ విజయాన్ని సాధించగలిగామని నాగార్జున పేర్కొన్నారు. వేద నిలయం కుటుంబ సభ్యులందరికీ ఈ గౌరవం దక్కుతుందని ఆయన పేర్కొన్నారు.

బడికి వెళ్లనివారికీ 'ఆశ్రమం'

- డ్రాపౌట్స్‌లో ఎస్టీలు 61, ఎస్సీలు 38శాతం
- బడీడు పిల్లలకు ప్రోత్సాహకాలు
- గిరిజన ఆవాసాలకు చేరువలో ఆశ్రమ పాఠశాలలు
- గురుకులాల్లో ఎస్సీలను చేర్పించేందుకు చర్యలు



హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఎస్సీ, ఎస్టీలు విద్యకు దూరమవుతున్నారు. పిల్లలను బడికి పంపితే పూట గడవదని తల్లిదండ్రులు వాపోతున్నారు. ఎంతగా నచ్చజెప్పినప్పటికీ బడి మానేయించడానికే మొగ్గు చూపుతున్నారు. ప్రభుత్వం వందల కోట్లు వ్యయం చేస్తున్నప్పటికీ ఆ వర్గాల్లో పేదరికం నిర్మూలించబడకపోవడమే ప్రధాన కారణంగా కనిపిస్తుంది. చేతికొచ్చిన కొడుకును, పెళ్లీడొచ్చిన బిడ్డను బడికెట్లా పంపిస్తామని తమ వద్దకు వెళ్లిన అధికారులను నిలదీస్తున్నారు. అమ్మాయికి పెళ్లి చేస్తాం, అబ్బాయిని కూలికి పంపిస్తామని బదులిస్తున్నారు. గత కొంత కాలంగా ఎస్సీ, ఎస్టీల విషయంలో ఇలాంటి సమస్యలు ఎదురవుతున్నాయని అధికారులు పేర్కొంటున్నారు. ఎస్సీ, ఎస్టీల్లో డ్రాపౌట్స్ పెరగడం పై ప్రభుత్వం ఆందోళన వ్యక్తం చేసింది. అందుకు కారణాలను తెలుసుకొనేందుకు క్షేత్ర స్థాయికి అధికారులను పంపించింది. అధికారుల బృందం ఎస్సీ, ఎస్టీ కుటుంబాలను విచారించింది. అత్యధికులు పేదరికంతో ఉన్నారు. రెక్కాడితే కాని డొక్కాడని పరిస్థితితో జీవనం సాగిస్తున్నారు. వారందరికీ ఆర్థిక తోడ్పాటు, ఉపాధి, నివాసం అత్యవసరం అని అధికారులు భావించారు. కుటుంబ పోషణ భారంగా మారడంతోనే పిల్లలను బడిపి పంపించలేక పోతున్నారు. ఉపాధి కూలీగా పంపించడానికి ఇష్టపడుతున్నారు.

దీంతో ఎస్సీ, ఎస్టీల డ్రాపౌట్స్ 2015 -16లో 36.99 శాతం, 2016 -17లో 37.92 శాతానికి చేరింది. అందులో ఎస్సీ విద్యార్థుల డ్రాపౌట్స్ 38.90 శాతం, ఎస్టీ విద్యార్థుల డ్రాపౌట్స్ 61.09 శాతం అని అధికార వర్గాలు పేర్కొన్నాయి. ఎస్సీలకంటే ఎస్టీలలో డ్రాపౌట్స్ పెరిగిపోవడం పట్ల ప్రభుత్వం అప్రమత్తమైంది. ఆదివాసీల స్థితిగతులు మెరుగుపర్చడానికి ప్రతిపాదనలు సిద్ధం చేసింది. కుటుంబాలకు ఆర్థిక తోడ్పాటు ఇవ్వడంతో పాటుగా ఆదాయ వనరులుగా పిల్లలను భావించని పరిస్థితులు కల్పించాలని భావిస్తుంది. ఆదివాసీలు ఉంటున్న ప్రాంతాల్లోనే ఆశ్రమ పాఠశాలలు తెరవడానికి సమాయత్తమయింది.

వచ్చే విద్యా సంవత్సరంలో మరిన్ని గురుకులాలు ఆదివాసీలకు చేరువలో నెలకొల్పడానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించింది. ఏకలవ్య పాఠశాలలను విస్తరించే ఆలోచనలో అధికారులు ఉన్నారు. గురుకుల పాఠశాలలను బలోపేతం చేయబోతున్నారు. గురుకులాల్లో మంచి ఫలితాలు వస్తున్నాయి. గురుకులాల్లో చేరుతున్న వారిలో డ్రాపౌట్స్ చాలా తక్కువ. మార్చిలో గురుకులాల అడ్మిషన్లు ప్రారంభం కాబోతున్నాయి. అప్పటిలోగా ఎస్సీ, ఎస్టీ కుటుంబాలలో విద్య, దాని ప్రాధాన్యత, పిల్లల భవిష్యత్ పై అవగాహన కల్పించడానికి కార్యాచరణ రూపొందించుకుంటున్నారు. ఐదవ తరగతి నుండి గురుకులాల్లో చేర్చుకొనేందుకు అర్హత పరీక్షలు నిర్వహించబోతున్నారు. ఒకటవ తరగతి నుండి నాల్గవ తరగతి వరకు అన్ని సౌకర్యాలతో ఉచిత విద్యను ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు అందించబడుతుందన్నారు. తెలంగాణలో 268 గురుకుల విద్యా సంస్థలు ఉన్నాయి. ఈ విద్యా సంస్థల్లో చేరిన విద్యార్థులకు అన్నీ ఉచితం. ఇప్పటికే దాదాపు 1,12,088 మంది విద్యార్థులు గురుకులాల్లో విద్యను అభ్యశిస్తున్నారు. పదవ తరగతి వరకు 85,187 మంది, ఇంటర్మీడియట్ స్థాయిలో 18354 మంది, డిగ్రీ స్థాయిలో 8547 మంది గురుకులాల్లో విద్యను అభ్యశిస్తున్నారు. ఉన్నత విద్యల కోసం ప్రత్యేక శిక్షణ ఇప్పిస్తున్నారు. క్రీడల్లో ప్రోత్సహిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని ఎస్సీ విద్యార్థులను ఈ గురుకులాల్లో 70 శాతానికి పైగా చేర్చుకుంటున్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజన విద్యార్థుల కోసం ఆశ్రమ పాఠశాలలను నిర్వహిస్తున్నారు. బాలలందరూ బడిలో ఉండాలనే నినాదంతో ఏజెన్సీ ప్రాంతాల్లోని ఆశ్రమ పాఠశాలలను బలోపేతం చేస్తున్నారు. గిరిజనుల్లో డ్రాపౌట్స్ అధికంగా ఉండటంతో ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారు. బడి మానేసే పరిస్థితులను అధిగమించేందకు చర్యలు తీసుకుంటున్నారు. కుటుంబ పోషణ భారంగా భావిస్తున్న కుటుంబాలను గుర్తించి ఉపాధి అవకాశాలను మెరుగుపర్చబోతున్నారు. పిల్లలను బడికి పంపించే కుటుంబాలకు ప్రత్యేక ప్రోత్సాహకాలను పరిశీలిస్తున్నారు. గిరిజనుల్లో అక్షరాస్యతను పెంపొందించడం, ఏజెన్సీ ప్రాంతాల పిల్లలను మంచి విద్యావంతులుగా తీర్చిదిద్దడం లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నామని గిరిజనాభివృద్ధి అధికారులు పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ మైనారిటీల రెసిడెన్సియల్ స్కూల్స్‌ను మరింతగా విస్తరించడం. ఐదేళ్లు నిండిన పిల్లలను తప్పనిసరిగా బడిలో చేర్పించడం, ఉచిత విద్యతో పాటుగా ఆహారం, దుస్తులు, ఆరోగ్య పరిరక్షణ, పోషణ బాధ్యతలను స్వీకరించడం లాంటి కార్యాచరణతో డ్రాపౌట్స్‌ను తగ్గించబోతున్నామని వివరించారు. మార్చిలో ప్రత్యేక ప్రచార కార్యక్రమం నిర్వహించబోతున్నామని, ఆదివాసీ, గిరిజనుల్లో చదువు పట్ల అవగాహన పెంపొందించడం జరుగుతుందని తెలియచేశారు.

సంస్కరణల వల్లే తగ్గిన నేరాలు

జైళ్ళ శాఖ డీజీ వీకే సింగ్



హైదరాబాద్, ఆంధ్రప్రభ : రాష్ట్రంలో పోలీసులు చేపట్టిన సంస్కరణలు, తీసుకుంటున్న జాగ్రత్తలు, గస్తీని ముమ్మరం చేయడం, జైలు నుంచి విడుదలైన వారి కదలికలపై నిఘాను పెంచడంతో నేరాలు తగ్గాయని అంటుంటే జైళ్ళ శాఖ డీజీ వికె సింగ్ మాత్రం జైళ్ళలో తాము ఖైదీల ప్రవర్తన కోసం తీసు కుంటున్న చర్యలేనని తెల్చి చెప్పారు. సోమవారం తన కార్యా లయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో మాట్లా డుతూ, మూడేళ్ళలో జైళ్ళ శాఖకు ఆర్థిక పరిపుష్టి కల్పిస్తానని చెప్పానని, ఇందుకు సిబ్బంది కూడా పూర్తిగా సహకరించారని ఫలితంగా 2017 సంవత్సరంలో రూ. 12,85,70,276 కోట్లను ఆర్జించడం జరిగిందన్నారు. 2016లో రూ. 7,34,25,774 కోట్లు, 2015లో రూ. 5,15,01,337 కోట్లు, 2014లో 3,07,03,635 కోట్లను ఆర్జించామని పేర్కొన్నారు. 2016 సంవత్సరం కంటే 2017లో దాదాపు రూ. 5 కోట్లు అధి కంగా లాభాలను ఆర్జించడం జరిగిందని వివరించారు. జైళ్ళ శాఖ ఆధ్వర్యంలో ప్రస్తుతం పెట్రోల్ బంక్‌లు, ఆయుర్వేద గ్రామాలు, మై నేషన్ అవుట్‌లెట్‌లను నిర్వహిస్తున్నామని, వీటన్నింటిలో దాదాపు 191 మంది ఉపాధి పొందు తున్నా రన్నారు.ఇప్పటి వరకు 34 బ్యాచ్ లలో 1050 మంది ఖైదీ లలో మానసిక పరివర్తన తీసుకు రావడం జరిగిందన్నారు. ఇందులో దాదాపు 150 మంది కరుడుగట్టిన నేరస్థులున్నారని పేర్కొన్నారు. తాము చేపట్టిన పరివర్తన కారణంగానే హైద రాబాద్‌లో నేరాలు తగ్గాయని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని 43 జైళ్ళలో 6848 మంది ఖైదీలుండేందుకు సౌకర్యాలున్నాయని, ప్రస్తుతం 68,369 మంది ఖైదీలున్నారని, ఇందులో 5474 మంది మాత్రమే జీవిత ఖైదీలని చెప్పారు. నేరాలు తగ్గడం వల్ల జైళ్ళకు వచ్చే ఖైదీల సంఖ్య కూడా తగ్గిందన్నారు. ఖైదీలకు నిత్యం యోగా, ఆరోగ్య రక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పరేడ్, మాస్టర్ హెల్త్ చెకప్ లాంటివి చేయిస్తున్నామని, ఫలితంగా ఖైదీల మరణాల సంఖ్య కూడా తగ్గిందని తెలిపారు. 2014 లో 56 మంది, 2015 లో 32 మంది, 2016 లో 24 మం ది వేర్వేరు అనారోగ్య కారణాలతో మరణించగా 2017లో 17 మంది మరణించారని, వీరంతా క్యాన్సర్, గుండెపోటులతో మరణించారన్నారు.

మార్గదర్శకాల మేరకు ఖైదీల విడుదల

ప్రస్తుతం జైళ్ళలో 5474 మంది జీవిత ఖైదీలున్నారని, ఇందులో ప్రభుత్వం క్షమాభిక్షపై విడుదలవుతారని అడుగగా, నిబంధనలు విడుదలైతే చెప్పేందుకు వీలవుతుందన్నారు. ఖైదీల విడుదల అంశం ఆరు రకాలుగా ఉంటుందని, హత్యలు, దోపిడీలు చేసిన వారికి కొంత ఉపకరిస్తుందని, అదే ప్రభుత్వ ఉద్యోగిపై దాడికి పాల్పడ్డ వారి విషయంలో నిబంధనలు ఒక్కోసారి వర్తించబోవన్నారు. జనవరి 26 వ తేదీన ఖైదీల క్షమాభిక్ష విషయంలో పరిశీలన చేస్తోందని, జైళ్ళ శాఖ అధికారుల అభిప్రాయాలను కూడా తీసుకుందన్నారు.

మరోసారి తెరపైకి స్వలింగ వివాదం


విస్తృత స్థాయి విచారణ జరగాలన్న సుప్రీం

న్యూఢిల్లీ: స్వలింగ సంపర్కం నేరమా..కాదా.. అనే అంశాన్ని పునః పరి శీలించేందుకు సుప్రీంకోర్టు అంగీకరించింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్రా నేతృత్వంలోని ఇద్దరు న్యాయమూర్తుల ధర్మాసనం ఈ అంశాన్ని విస్తృత ధర్మాసనానికి అప్పగించింది. స్వలింగ సంపర్కానికి సంబంధించిన సెక్షన్ 377 రాజ్యాంగబద్ధతపై చర్చించాల్సిన అవసరముందనని స్పష్టం చేసింది.2009లో ఢిల్లీ హైకోర్టు స్వలింగ సంపర్కం నేరం కాదన్న తీర్పును 2013లో సుప్రీంకోర్టు కొట్టివేసింది. లెసిబియన్స్,గే, బైసెక్సువల్,ట్రాన్స్ జెండర్,క్వీర్ మొదలైన స్వలింగ సంపర్కాలు నేరమని సుప్రీంకోర్టు స్పష్టం చేయడంతో ఆయా వర్గాల నుంచి తీవ్ర వ్యతిరేకత వస్తోంది. ఇది మానవహక్కుల ఉల్లంఘణే అంటూ పలువురు ఆందోళనబాటపట్టారు. తాజాగా సుప్రీంకోర్టులో ఐదుగురు దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయస్థానం ప్రకృతి విరుద్ధమైన లైంగిక చర్యలను నేరంగా పరిగణించడం అనే విషయం కొందరికి నేరం అనిపిస్తే..మరికొందరికి అలా అనిపించకపోవచ్చని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. ఈ అంశంపై విస్తృత స్థాయిలో విచారణ జరగాల్సిన అవసరముందని కేసు విచారణను విస్తృత ధర్మాసనానికి అప్పగించింది.

సెక్షన్ 377 ఏం చెబుతోంది..?

భారత శిక్షాస్మృతిలోని సెక్షన్ 377 1862 నుంచి అమలులోకి వచ్చింది. ఈ సెక్షన్ ప్రకృతి విరుద్ధమైన చర్యలను నేరంగా పరిగణిస్తుంది. ఏవ్యక్తి అయిన స్వచ్ఛందంగా ప్రకృతి నియమాలకు విరుద్ధంగా ఇతర పురుష,స్త్రీ, జంతువులతో శారీరక సంబంధాలు కలిగి ఉండటం నేరం. అందుకు గరిష్టం జీవితకాల శిక్ష వేయవచ్చు. లేక 10ఏళ్ల వరకు జైలు శిక్ష పొడిగించవచ్చు. జైలు శిక్షతో పాటు జరిమానా కూడా విధించవచ్చు.

ఈవీఎంలు వద్దు.. బ్యాలెట్ పత్రాలే ముద్దు



న్యూఢిల్లీ: ఈవీఎంలు వద్దు.. బ్యా లెట్ పత్రాలే ముద్దని ఎన్డీయేతర ప్రతి పక్ష పార్టీలంటున్నాయి. రానున్న అసెం బ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్ల(ఈవీఎం)కు బదులు బ్యాలెట్ పత్రాలనే ఉప యోగించాలని, లేదంటే అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఓటు రసీదు వచ్చే ఈవీ ఎంలను ఉపయోగించాలని ఎన్డీయే ఏతర ప్రతిపక్ష పార్టీలన్నీ డిమాండ్ చేస్తు న్నాయి. గుజ రాత్ అసెంబ్లీ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ(బీజేపీ) విజయం సాధిం చడానికి కారణం ఈవీఎంలను ట్యాంపర్ చేయడమేనని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. పాటిదార్ల ఉద్యమ నాయకుడు హార్దిక్ పటేల్ దీనిపై పెద్ద ఎత్తున గొడవ చేసిన విషయం తెల్సిందే. ఈ ఏడాది ఎనిమిది రాష్ట్రాల అసెంబ్లీలకు ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో మళ్లీ ఈవీఎంల అంశం ముందుకు వచ్చింది. ఈ అంశంపై చర్చించేందుకు సమాజ్ వాది పార్టీ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్ పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. కాంగ్రెస్, రాష్ట్రీయ లోక్‌దళ్, సీపీఐ, సీపీఎం పార్టీలు బ్యాలెట్ పత్రాలనే ఎన్నికలకు ఉప యోగించాలంటున్నాయి. దేశవ్యాప్తంగా పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల్లో దశల వారిగా ఓటుకు రసీదు వచ్చే యంత్రాలను ఉపయోగిస్తామని, అందులో భాగంగా ముందుగా ప్రతి నియోజకవర్గంలో ఐదు శాతం పోలింగ్ కేంద్రాల్లో వీటిని అమలు చేస్తామని ఎన్నికల కమిషన్ ఇదివరకే ప్రకటించింది. ఇటీవల జరిగిన గుజరాత్, హిమాచల్ ప్రదేశ్ ఎన్నికల్లో ప్రతి నియోజక వర్గంలో ఒక్క పోలింగ్ కేంద్రంలో మాత్రమే అమలు చేయగలిగింది. ఈ నేపథ్యంలో బ్యాలెట్ పత్రాల అంశం డిమాండ్ ముందుకు వచ్చింది. ఈ శీతాకాల పార్లమెంట్ సమావేశాలు ముగిసిన తర్వాత ఈ అంశాన్ని సమగ్రంగా చర్చించేందు కు మరో సమావేశాన్ని ఏర్పాటు చేయాలని ఎన్డీయే ఏతర ప్రతిపక్షాలు నిర్ణయించాయి.

రిపోర్టర్‌పై అక్రమ కేసు ఎత్తివేయాలి

హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : చం డీగఢ్‌కు చెందిన ట్రిబ్యూన్ పత్రిక రిపోర్టర్ రచనా ఖైరాపై అక్రమంగా కేసు నమోదు చేయడాన్ని ఇండియన్ జర్నలిస్టుల యూనియన్ తీవ్రంగా ఖండించింది. ఈ వ్యవహారంలో కేం ద్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని కేసు ఎత్తివేయించాలని యూనియన్ రాష్ట్ర కార్యదర్శి వై నరేందర్ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

హీరో నితిన్‌కు హైకోర్టులో ఊరట

హైదరాబాద్, ఆంధ్రప్రభ : టాలివుడ్ హీరో నితిన్, అతని సోదరి నిఖిత లకు హైకోర్టులో ఊరట లభించింది. మల్కాజిగిరి కోర్టు విచారణలో ఉన్న క్రిమినల్ కేసును హైకోర్టు కొట్టివేసింది. ఉమ్మడి హైకోర్టు న్యాయమూర్తి ఎం.సత్యనారాయణ మూర్తి ఇటీవల ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కేసులో అఖిల్ తెలుగు సినిమాను శ్రేష్ఠనిర్మాణ సంస్థ నిర్మించింది. ఈ సంస్థను నితిన్ తండ్రి సుధాకర్ రెడ్డి నిర్వహిస్తున్నారు. తన నుంచి రూ .50 లక్షలు తీసుకుని సినిమా పై హక్కులు ఇవ్వలేదని పేర్కొంటూ సికింద్రాబాద్ లోని సైనిక్ పురికి చెందిన గంగాధర.సత్యనారాయణ ఫిర్యాదు దాఖలు చేశారు. నితిన్, నిఖిత తరఫున సీనియర్ న్యాయవాది ఎస్.నిరంజన్ రెడ్డి వాదనలు వినిపిస్తూ అఖిల్ సినిమా వివాదంతో ఈ పిల్లలిద్దరికీ ఎలాంటి సంబంధం లేదన్నారు. ఫిర్యాదుదారుడు ఆ సొమ్మును ఇవ్వలేదని, అది యూఎస్ పంపిణీదారుడు ఇచ్చినట్లు విన్నవించారు. ఈ వ్యవహారంలో సుధాకర్ రెడ్డిపై మానసికంగా ఒత్తిడి తెచ్చేందుకు కుమారుడు, కుమార్తెలను ఈ క్రిమినల్ కేసులో ఇరికించారని తెలిపారు. దీనిపై స్పందించిన న్యాయమూర్తి నితిన్, నిఖితలపై దాఖలైన క్రిమినల్ కేసును కొట్టివేశారు.

యశోదాబెన్‌కు న్యాయం చేయాలి

వైద్యురాలి దీక్ష భగ్నం

హైదరాబాద్, ఆంధ్రప్రభ : ప్ర ధాని నరేంద్ర మోడీ తన భార్య యశో దా బెన్ (జశోదా బెన్)కు న్యాయం చేయాలంటూ నగరానికి చెందిన వైద్యురాలు పాలెపు సుశీల చేస్తున్న దీక్షను మియాపూర్ పోలీసులు భగ్నం చేశారు. యశోదాను మోడీ తన భార్యగా అంగీకరించి గౌర వించా లని, లేదంటే.. జెడ్ కేటగిరీ భద్రత తొలగించి ఆమెకు స్వేచ్ఛ ప్రసా దించాలని డిమాండ్ చేస్తూ గత ఎని మిది రోజులుగా దీక్ష చేస్తోంది సుశీల. ఈ క్రమంలో ఆదివారం రాత్రి పోలీ సులు అదుపులోకి తీసుకున్నారు. బాగా నీరసించిపోయిన ఆమెను గాం ధీ ఆసుపత్రికి తరలించి చికిత్స అందే ప్రయత్నం చేశారు. అయితే, తాను మాత్రం తన డిమాండ్లు పరిష్కారం అయ్యే దాకా దీక్ష విరమించబోనని సుశీల సోషల్ మీడియాలో స్పష్టం చేశారు. అఖండ భారత ఉద్యమ వ్యవస్థాపకురాలిగా ఉన్న డాక్టర్ పాలెపు సుశీల.. హైదరాబాద్ మియా పూర్‌లోని న్యూ హాఫీజ్‌పేటలో క్లీనిక్ నడుపుతున్నారు.

క్రీడలకు రాజకీయ రంగు

మాజీ ఎంపీ వీహెచ్ విమర్శలు

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) అవకతవకలకు మారుపేరుగా తయారైందని కాంగ్రెస్ మాజీ ఎంపీ వి.హనుమంతరావు ఆరోపించారు. అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్న క్రీడాకారులకు అవార్డులిస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్ హెచ్‌సీఏలో జరుగుతున్న అక్రమాలపై మాత్రం దృష్టి పెట్టడం లేదని ఢిల్లీలో జరిగిన పాత్రికేయుల సమావేశంలో ఆయన విమర్శించారు. హెచ్‌సీఏ అధ్యక్షుడు వివేక్ అక్రమాలకు పాల్పడుతున్నారని వీహెచ్ చెప్పుకొచ్చారు. పదేళ్లు కెప్టెన్‌గా పని చేసిన అజారుద్దీన్‌ను అసోసియేషన్‌కు రాకుండా అడ్డుకుని అవమానించారని అన్నారు. క్రీడలకు రాజకీయ రంగు పులిమి క్రీడాకారులకు నష్టం కలిగిస్తున్నారని ఆయన చెప్పారు. రాజీవ్ గాంధీ పేరు పెట్టాల్సిన స్టేడియానికి విశాఖ ఇండస్ట్రీస్ అంటూ వివేక్ కోట్ల రూపాయల ఒప్పందం చేసుకున్నారని వీహెచ్ తెలిపారు.

పాక్‌కు చైనా బాసట

బీజింగ్ : పాకిస్తాన్ ఉగ్రవాదాన్ని పెంచిపోషిస్తోందన్న అమెరికా ఆరోపణలను చైనా తిప్పికొట్టింది. ఉగ్రవాదానికి పాకిస్తాన్ తో లంకెపెట్టడం సరికాదని ఆక్షేపించింది. ఉగ్రవాదాన్ని నిర్మూలించేందుకు బాధ్యత పాకిస్తాన్ ఒక్కదేశంపై వేయడం సరికాదని అమెరికా వాదనను తప్పుబట్టింది.

గంటకో విద్యార్థి ఆత్మహత్య

(మొదటిపేజీ తరువాయి)

పెరుగుతూ వస్తున్నాయని నివేదికలో పేర్కొంది. ఎక్కువ మంది పరీక్షలు ఫెయిల్ కావడంతోనే ఆత్మహత్యకు పాల్పడుతున్నట్టు తెలిసింది. 2014లో 2,403 మంది విద్యార్థులు ఆత్మహత్యకు పాల్పడగా, 2015లో ఈ సంఖ్య పెరిగింది. ఆత్మహత్యలు 2,646గా నమోదైంది. 2016లో మరింత పెరిగి 2,413కి చేరింది. వీరంతా కేవలం పరీక్షలు ఫెయిల్‌కావడంతోనే ఆత్మహత్యకు పాల్పడినట్టు కేంద్ర మంత్రి హన్స్‌రాజ్ గంగారాం ఆహిర్ వివరించారు. దీనికి సంబంధించిన డాటాను ఆయన జనవరి 2న లోక్‌సభలో అందజేశారు. 2016ల అత్యధికంగా విద్యార్థులు మహారాష్ట్రలో బలవన్మరణానికి పాల్పడ్డారు. ఒకే ఏడాదిలో సుమారు 1,350 మంది విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారు. తరువాత వెస్ట్ బెంగాల్‌లో 1,147, తమిళనాడులో ఈ సంఖ్య 981గా నమోదైంది. కేవలం ఫెయిల్ కావడంతో వీరంతా ఆత్మహత్యలకు పాల్పడలేదని, ఇతరాత్ర కారణాలు చాలానే ఉన్నాయని సర్వేలో తేలింది. కొందరు చదువుపై ఒత్తిడి చేయడంలో, కోర్సుల ఎంపికలో ఇలా అనేక కారణాలతో విద్యార్థులపై మానసికంగా అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో వారంతా ఆత్మహత్యలకు పాల్పడుతున్నట్టు అధికారులు గుర్తించారు. కౌన్సిలింగ్ కేంద్రాలు లేని కారణంగా కూడా ఆత్మహత్య చేసుకుంటున్న విద్యార్థుల సంఖ్య పెరుగుతోందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. వెంటనే అన్నీ పాఠశాలల్లో, కళాశాలల్లో కౌన్సిలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని వైద్యులు సూచిస్తున్నారు. మహారాష్ట్రలో అత్యధికంగా మెడికల్ కళాశాలకు చెందిన విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని నివేదికలో తేలిందని మహారాష్ట్ర ఎంపీ కపిల్ మోరేశ్వర్ పాటిల్ తెలిపారు. ఆత్మహత్యల విషయమై పాటిల్ పార్లమెంట్‌లో ప్రశ్న లేవనెత్తగా... పరీక్షల్లో పేలవమైన ప్రదర్శన ఇవ్వడంతో పాటు పని ప్రదేశాల్లో వర్గాలపరంగా విభేదాలు ఉండటం కూడా ఆత్మహత్యలకు కారణం మీడియా చెబుతున్నదని కేంద్ర మంత్రి హన్స్‌రాజ్ సమాధానం ఇచ్చారు. అదేవిధంగా మానసిక వైద్య నిపుణుల ద్వారా కూడా జిల్లాల వారీగా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతున్నదని మంత్రి చెప్పారు. పాఠశాలల్లో అయితే ఉపాధ్యాయులతో, పని ప్రదేశాల్లో అయితే మేనేజ్‌మెంట్‌తో మాట్లాడుతూ.. ఉద్యోగుల మానసిక పరిస్థితులపై అధ్యయనం చేస్తున్నట్టు తెలిపారు. పుణెలో 115 కళాశాలల్లో వెల్‌నెస్ విభాగాలను ఏర్పాటు చేయడం జరిగింది. అక్కడ విద్యనభ్యసిస్తున్న విద్యార్థులతో ప్రత్యేకంగా మాట్లడటంతో పాటు, ఎక్కువ ఒత్తిడికి గురవుతున్న వారికి కౌన్సిలింగ్ కూడా ఏర్పాటు చేస్తున్నారు. దేశంలో అత్యధిక, నైపుణ్యం గల ఇంజినీరింగ్ కళాశాలలు పుణెలోనే ఎక్కువగా ఉన్నాయి. ఖరగ్‌పూర్ ఐఐటీలో కూడా విద్యార్థుల మానసిక పరిస్థితులపై ఎప్పటికప్పుడు అధ్యయం చేస్తూ వస్తున్నారు. ఇందులో భాగంగా తోటి విద్యార్థులతో తమ బాధలు, సంతోషాలు పంచుకోవడానికి ఒక గంట పాటు సమయం కేటాయిస్తున్నారు.

మూడేళ్లలో 26,416 మంది విద్యార్థులు ఆత్మహత్య చేసుకోగా, అందులో 28.24 శాతం అనగా, 7,462 మంది విద్యార్థులు పరీక్షలు బాగా రాయకపోవడంతోనే తనువు చాలించినట్టు ప్రభుత్వ లెక్కల పరంగా తేలింది. దేశ వ్యాప్తంగా జరుగుతున్న ఆత్మహత్యల్లో.. 6 నుండి 7 శాతం మంది విద్యార్థులు ఉంటున్నారు. సగటున చూస్తే మూడేళ్లలో చనిపోయిన విద్యార్థుల్లో 40 నుండి 45 శాంతి విద్యార్థినులు ఉన్నారు.

దేశ వ్యాప్తంగా విద్యార్థుల మరణాలు

2014లో	8,068
2015లో	8,934
2016లో	9,474

కేవలం పరీక్షల్లో ఫెయిల్ కావడంతో...

2014లో	2,403
2015లో	2,646
2016లో	2,413

2016లో విద్యార్థుల ఆత్మహత్యల్లో

స్థానం	రాష్ట్రం	విద్యార్థులు
1వ	మహారాష్ట్ర	1,350
2వ	పశ్చిమ బెంగాల్	1,147
3వ	తమిళనాడు	981
4వ	ఛత్తీస్‌ఘడ్	633
5వ	గుజరాత్	556
6వ	కర్నాటక	540

బీజేపీకి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి గుడ్‌బై



హైదరాబాద్, ఆంధ్రప్రభ : భారతీయ జనతా పార్టీ రాష్ట్ర శాఖకు తొలిషాక్ తగిలింది. పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ శాసనసభ్యుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి సోమవారం ఆ పార్టీకి గుడ్‌బై చెప్పారు. అదే బాటలో మరికొందరు నేతలు ఉన్నారన్న ప్రచారం కూడా గుప్పుమంటున్నది. 2019లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఎలాగైనా పార్టీని అధికారంలోకి తీసుకరావాలన్న ఏకైక లక్ష్యంతో జాతీయ నాయకత్వం తెలంగాణ రాష్ట్రంపై ప్రత్యేకంగా దృష్టిసారించింది. తదనుగుణంగా వ్యూహాలకు పదను పెడుతోంది. తదనుగుణంగా రాష్ట్ర నేతలు కూడా కొంతకాలంగా తమస్పీడ్‌ను పెంచారు. రాష్ట్రంలో తెరాసకు ప్రత్యామ్నాయం భాజపానే రీతిలో వ్యవహరిస్తున్నారు. అధికార పార్టీపై తీవ్ర స్థాయిలో విరుచుకపడుతున్నారు. తెరాస ప్రభుత్వం తీసుకుంటున్న ప్రజా వ్యతిరేక నిర్ణయాలపై ధ్వజమెత్తుతున్నారు. పనిలో పనిగా ఇతరపార్టీల నేతలను భాజపాలోకి ఆహ్వానించే పనిలో నిమగ్నమయ్యారు. ఇలాంటి తరుణంలో కొంతకాలంగా పార్టీపై కొంత అసంతృప్తిగా ఉంటున్న జనగామ నియోజ కవర్గానికి చెందిన కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి సోమవారం పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ఆయన తన రాజీనామా లేఖను పార్టీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు కె. లక్ష్మణ్‌కు ఫ్యాక్స్ ద్వారా అందజేశారు.

పంచాయతీలకు ప్రత్యక్ష ఎన్నికలు!



హైదరాబాద్, ఆంధ్రప్రభ : వచ్చే ఎన్నికల్లో తమ పార్టీ నూతన రాజకీయ ఒరవడి సృష్టించి మళ్ళీ పూర్వవైభవం తెస్తుందని తెలుగుదేశంపార్టీ తెలంగాణ అధ్యక్షుడు ఎల్.రమణ అన్నారు. తెదేపా ఆవిర్భావంతోనే జాతీయ స్థాయిలో ఎన్‌టి రామారావు చరిత్రసృష్టించి రాజకీయాలను ప్రభావితం చేశారని ఆయన గుర్తుచేశారు. ప్రజా సమస్యలపై అవగాహన పెంచుకుని సమాజానికి సేవ చేస్తూ పార్టీని బలోపేతం చేయాలని కార్యకర్తలకు ఆయన పిలుపునిచ్చారు. తెదేపా నిర్వహిస్తున్న కార్యకర్తల శిక్షణా శిబిరం రెండవ బ్యాచ్‌ను సోమవారం ప్రారంభించారు. ఈ శిక్షణా తరగతుల్లో మండల పార్టీ అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ, ఎన్‌టిఆర్ హయాం నుంచి పార్టీ కార్యకర్తలకు నిరంతరం శిక్షణా తరగతులు నిర్వహిస్తు న్నామని, తాము కూడా రాజకీయాల్లో చేరిన కొత్తలో ఇలాంటి తరగతుల్లో పాల్గొని విషయ పరిజ్ఞానం పెంచుకున్నామన్నారు. తెదేపా శిక్షణా తరగతుల్లో పాల్గొన్న వారు కేంద్రమంత్రులు, లోక్‌సభస్పీకర్ అయ్యారని ఆయన గుర్తుచేశారు. స్థానిక సంస్థల్లో తెదేపా రిజర్వేషన్ కల్పించినందునే గ్రామాల్లో సామాజికన్యాయం జరిగిందని ఆయన గుర్తుచేశారు. తెరాస ప్రభుత్వంలో మాల, మాదిగలకు, మహిళలకు మంత్రివర్గంలో స్థానం లేదని, పంచాయితీ వ్యవస్థపై ఏర్పాటు చేసిన మంత్రివర్గ ఉపసంఘంలో కనీసం ఒక్క బీసీ మంత్రికి కూడా అవకాశం కల్పించలేదని రమణ ఆరోపించారు. పంచాయితీ ఎన్నికల్లో ప్రత్యక్ష ఎన్నికలు జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు.

సర్పంచ్‌ల అధికారాలకు కత్తెర



హైదరాబాద్, ఆంధ్రప్రభ : పంచాయతీరాజ్ చట్ట సవరణ ద్వారా సర్పంచుల అధికారాలకు కత్తెర వేయాలని ముఖ్యమంత్రి కేసీఆర్ చూస్తున్నారని భాజపా మండిపడింది. ఈ చర్యలను నిరసిస్తూ సర్పంచ్‌లంతా కేసీఆర్‌పై యుద్ధం చేయాల్సిన అవసరం ఆసన్నమైందని వ్యాఖ్యానించింది. కేసీఆర్ తీసు కుంటున్న నిర్ణయాలు ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టుగా ఉన్నాయంది. స్థానిక సంస్థలను చిన్నా, భిన్నం చేయడానికే కేసీఆర్ ఇదంతా చేస్తున్నారని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. వాస్తవానికి చట్టానికి సవరణ చేయడం రాష్ట్ర ప్రభు త్వానికి సాధ్యం కాదు....అది చెల్లదని ఆ పార్టీ నేతలు అన్నారు. పంచాయతీరాజ్ చట్టానికిసవరణ చేయడం కోసం ప్రత్యేకంగా మంత్రి వర్గం ఉపసంఘాన్ని ఏర్పాటు చేయడంపై ధ్వజమెత్తారు. రాష్ట్ర ప్రభు త్వం ఏర్పాటు చేసింది మంత్రివర్గ ఉపసంఘం కాదని... ఉత్తుత్తి సంఘమని, కోరలు లేని సంఘంగా పార్టీ నేతలు అభివర్ణించారు. సోమవారం నాంపల్లిలోని భాజపా రాష్ట్ర కార్యా లయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పలువురు పార్టీ నేతలతో కలిసి రాష్ట్ర అధికార ప్రతినిధి కృష్ణసాగర్‌రావు మాట్లాడుతూ, కేసీఆర్ తీసుకుంటున్న నిర్ణయాలపై తీవ్ర స్థాయిలో ధ్వజ మెత్తారు. గ్రామసర్పంచ్‌ల ఎన్నికలు ప్రత్యక్ష పద్ధతిలో జరగాలన్నారు. కానీ సర్పంచ్‌లను తన గుప్పిట్లో పెట్టుకోవాలన్న దుర్మార్గంతోనే కేసీఆర్ పంచా యతీరాజ్ చట్టానికి సవరణ చేయాలని చూస్తున్నాడని ఆయన విమర్శించారు. ఒకవేళ ఆయన మొండిగా సవరణ చేసినా న్యాయస్థానాల్లో అది నిలువదన్నారు. గతంలో కూడా కేసీఆర్ ప్రభుత్వం అనేక తొందరపాటుతో నిర్ణయాలు తీసుకుని కోర్టులతో అక్షింతలు వేసుకున్న విషయాన్ని ఈ సందర్భంగా కృష్ణసాగర్‌రావు గుర్తు చేశారు. ఈ విషయంలో అవసరమైతే తాము సుప్రీంకోర్టును ఆశ్రయించడానికైనా సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు.

సార్..మేడారం జాతరకు రండి!



హైదరాబాద్, ఆంధ్రప్రభ : భాజపా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కె. లక్ష్మణ్ నేతృత్వంలో పార్టీ ప్రతినిధుల బృందం సోమవారం మహారాష్ట్ర గవర్నర్ సిహెచ్. విద్యాసాగర్‌రావును, ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నావీస్‌ను కలిసింది. తెలంగాణలో ఘనంగా నిర్వహించుకునే మేడారం సమ్మక్క-సారలమ్మ జాతరకు రాష్ట్ర సరిహద్దు రాష్ట్రా ల గవర్నర్‌లు, ముఖ్యమంత్రులను ఆహ్వానించడంలో భాగంగా అక్కడకు వెళ్ళారు. మొదట గవర్నర్ విద్యాసాగర్ రావును కలిసి తెలంగాణలో గిరిజనులు అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించే మేడారం జాతరకు రావాలని కోరారు. అనంతరం సిఎంను కలిసి జాతరకు రావాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. ఈ బృందంలో పార్టీ నాయకులు రాజేశ్వర్‌రావు, ప్రేమేందర్‌రెడ్డి, లింగయ్యదొర, వన్నాల శ్రీరాములు, అమర్‌సింగ్ పవార్ తదితరులు ఉన్నారు.

● వరద నీటిలో స్మారక కేంద్రం



జర్మనీలో వరదలకు ఉప్పొంగి ప్రవహిస్తున్న మొసెల్లి, రినో నదులు.

2019లో కాంగ్రెస్‌దే అధికారం

- త్వరలో టీపీసీసీ బస్సుయాత్ర
- రోజుకు 3 నియోజకవర్గాల చొప్పున యాత్ర
- నెలాఖరులో రాహుల్ పర్యటన
- టీపీసీసీ చీఫ్ ఉత్తమ్ కుమార్‌రెడ్డి



హైదరాబాద్, ఆంధ్రప్రభ : తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ప్రజల్లోకి వెళ్లేందుకు ఆ పార్టీ నేతలు కార్యాచరణ సిద్ధం చేస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 119 నియోజక వర్గాల్లో బస్సుయాత్రను చేపట్టాలని నిర్ణయించారు. ప్రతి రోజు మూడు అసెంబ్లీ నియోజక వర్గాల్లో ప్రజలను కలుసుకుంటూ సభలు, సమావేశాలు నిర్వహించనున్నట్లు టీ పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వివరించారు. సోమవారం ఆయన గాంధీభవన్‌లో మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. ఈ నెలాఖర్‌లో ఏఐసీసీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ సభ ఉంటుందని తెలిపారు. దళిత, గిరిజన బలహీన వర్గాల ఆత్మగౌరవ సదస్సు పేరుతో నిర్వహించే ఈ సభకు భారీగా జనసమీకరణ చేయనున్నట్లు ఆయన తెలిపారు. మేడారం జాతరకు ముందుగానీ, ఆ తర్వాత గానీ సభ నిర్వహించాలని తాము పార్టీ హై కమాండ్‌ను కోరినట్లు ఉత్తమ్ తెలిపారు. రాహుల్ పర్యనటలో రైతులు, ఉస్మానియా విద్యార్థులతోనూ సమావేశమయ్యే అకాశం ఉంటుందని ఆయన అభిప్రాయపడ్డారు. యూనివర్సిటిలో సభను నిర్వహించాలని ప్లాన్ చేస్తున్నట్లు వివరించారు. టీఆర్‌ఎస్ ప్రభుత్వం మునిగే నావ అని ప్రజలు అనుకుంటున్నారని ఉత్తమ్ వివరించారు. నియోజక వర్గాల పునర్విభజనకై టీఆర్‌ఎస్‌ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి చేస్తున్నట్లు ఆయన తెలిపారు. పార్లమెంట్‌లో బిల్లు పెట్టి నప్పుడు కాంగ్రెస్ పార్టీ స్పంది స్తుం దన్నారు. సర్పంచ్ ఎన్ని కలు ప్రత్యక్ష పద్దతి లోనే నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు.

సంక్రాంతి తర్వాత టీ పీసీసీ కొత్త కార్యవర్గం

టీ పీసీసీ నూతన కార్యవర్గం సంక్రాంతి పండుగ తర్వా త ఉంటుందని ఉత్తమ్ అభిప్రాయపడ్డారు. ఈ కమిటి వచ్చే ఎన్నికలను దృష్టిలో పెట్టుకునే ఉంటుందన్నారు. రాష్ట్ర కమిటిలో ప్రతి జిల్లా నుంచి ప్రాతినిధ్యం ఉంటుందన్నారు. టీ పీసీసీలో 13 మంది ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యద ర్శులు గా జిల్లా నుంచి ముగ్గురికి అవకాశం ఇవ్వాలని, ప్రతి అసెంబ్లీ నియోజక వర్గం నుంచి ఒక కార్యదర్శిని నియమిం చాలనే ఆలోచనతో ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు. రాష్ట్రం నుంచి ఏఐసీసీలో ప్రాతినిధ్యం ఉంటుందన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రచార కమిటి, మేనిఫెస్టో కమిటిలు కూడా ఉంటాయన్నారు. కాంగ్రెస్ పార్టీలోకి వివిధ పార్టీలకు చెందిన చాల మంది సీని యర్లు వస్తారని ఆయన తెలిపారు. 2019లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. టీఆర్‌ఎస్ పార్టీ ఓవర్‌లోడ్‌తో ఉందని, ప్రభుత్వ పనితీరు బాగలేద న్నారు. పార్టీలో కష్టపడే వారికి సముచిత స్థానం ఉంటుం దన్నారు.

ప్రతి కార్యకర్త నా కుటుంబ సభ్యుడే

రెండోసారి టీ పీసీసీ అధ్యక్షుడిగా కొనసాగిస్తూ రాహుల్ గాంధీ నిర్ణయానికి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఉత్తమ్‌ను టీ పీసీసీగా కొనసాగిస్తున్నట్లు ఏఐసీసీ ఆదేశాలు జారీ చేశాక.. ఆయన మొదటిసారిగా గాంధీభవన్‌కు వచ్చారు. పార్టీ శ్రేణులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ రాహుల్ గాంధీ నాయకత్వంలో 2019లో అధికారంలోకి వస్తామ న్నారు. కార్యకర్తలకు ఏ ఆపద వచ్చినా ఆదుకుం టానని ఆయన వివరించారు. మహ బూబ్‌నగర్ జిల్లాలో 14 అసెంబ్లీ, రెండు లోక్‌సభ స్థానాలు కైవసం చేసుకుం టామన్నారు.

సాయిలు ముమ్మాటికి వీఆర్‌ఏనే..

కామారెడ్డి జిల్లాలో పిట్లం మండలం కారేగావ్ గ్రామం లో జరిగిన ఇసుక ట్రాక్టర్ ఘటనలో మరణించిన సాయిలు వీఆరేనని.. తహసీల్దార్ కూడా దృవీకరించినట్లు ఉత్తమ్ తెలిపారు. సాయిలు మరణంపై ప్రభుత్వం వికృతంగా వ్యవహరిస్తోందన్నారు. మృతుడి తల్లిదండ్రులు శివయ్య, ఈరవ్వ, భార్యయ్య సాయవ్వలు సోమ వారం గాంధీభవన్‌కు వచ్చి ఉత్తమ్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఉత్తమ్ స్పందిస్తూ గవర్నర్, పోలీసులు తప్పుడు ప్రకటనలు చేయడం దుర్మార్గ మన్నారు. మృతుని కుటుంబానికి రూ. 25 లక్షల నష్టపరి హారం ఇవ్వాలని, ఘటనకు బాధ్యులైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

కాంగ్రెస్‌లో మహిళలకు సముచిత స్థానం



కాంగ్రెస్ పార్టీలోనే మహిళలకు సముచిత స్థానం ఉంటుందని టీ పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్ కుమార్‌రెడ్డి అన్నారు. శాసన మండలికి ఎమ్మెల్సీగా కాంగ్రెస్ పార్టీ మహిళకు అవకాశం ఇచ్చిందని, అధికార టీఆర్‌ఎస్ పార్టీ ఏ ఒక్క మహిళకు అవకాశం ఇవ్వలేదన్నారు. కేసీఆర్ కేబినెట్‌లోనూ మహిళలకు చోటివ్వలేదని ఆయన విమర్శించారు. సోమవారం గాంధీభవన్‌లో కాంగ్రెస్ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు నేరెళ్ల శారద అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సమా వేశానికి కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవ హారాల ఇన్‌చార్జీ రాంచంద్ర కుంతియా, కేంద్ర మాజీ మంత్రి సర్వే సత్యనారాయణ, టీ పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లు భట్టి విక్రమార్క , పార్టీ నేతలు మహేశ్‌కుమార్‌గౌడ్, అనిల్‌కుమార్‌యాదవ్ తదితర నేతలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉత్తమ్ మాట్లాడుతూ టీఆర్‌ఎస్ ప్రభుత్వం మహిళా వ్యతిరేక ప్రభుత్వమన్నారు.

విద్యార్థులు టెక్నాలజీపై దృష్టిపెట్టాలి

- సౌత్ ఇండియా సైన్స్‌ఫెయిర్‌లో డిప్యూటీ సీఎంలు కడియం, మహమూద్ అలీ, హోంమంత్రి



హైదరాబాద్, ఆంధ్రప్రభ : సైన్స్ ఫెయిర్‌ల వల్ల విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుందని, దీనిని వారు వినియోగించుకోవాలని ఉప ముఖ్యమంత్రి, విద్యా శాఖ మంత్రి కడియం శ్రీహరి పేర్కొన్నారు. సికింద్రాబాద్‌లోని సెయింట్ ప్యాట్రిక్ హైస్కూల్‌లో సోమ వారం సౌత్ ఇండియా సైన్స్ ఫెయిర్- 2018 ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా మంత్రి కడియం మాట్లా డుతూ ఈ మహానగరంలో ఈ కార్యక్రమం జర గడం సంతోషకరమన్నారు. 5 రాష్ట్రాలు 1 కేంద్ర పాలిత ప్రాంతం నుంచి ఈ సైన్స్ ఫెయిర్‌లో విద్యార్థులు పాల్గొంటున్నారని ఆయన తెలిపారు. హైదరాబాద్‌కు ఎంతో చారిత్రక చరిత్ర ఉందని ఇలాంటి చోట ఈ సైన్స్ ఫెయిర్ జరగడం వలన మన రాష్ట్రానికి ఎంతో పేరు వస్తుందన్నారు. సైన్స్ ఫెయిర్‌కు స్థానిక ఎమ్మెల్యే సాయన్న అధ్యక్షత వహి స్తున్నారని ఆయన ఆధ్వర్యంలో 5 రోజుల పాటు ఈ కార్యక్రమం నిర్వహి స్తున్నామన్నారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రం వేగంగా అభివృద్ధి చెందు తుందని మూడేళ్లలోనే ప్రపంచ వ్యాప్తంగా మన రాష్ట్రానికి గుర్తింపు రావడం మాములు విషయం కాదన్నారు. ఏ రంగాల్లో చూసినా మన రాష్ట్రం అభివృద్ధి చెందు తుందన్నారు. ఈ క్రెడిట్ అంతా సీఎంకే దక్కు తుం దన్నారు. అన్ని రంగాల్లో మనం అమలు చేసే విధానాలను కేంద్ర ప్రభు త్వం పరిశీ లిస్తుందని చాలా విషయాల్లో మన నిర్ణయాలను సైతం ప్రశంసించిందన్నారు. తెలం గాణ ఏర్పడిన తరువాత 544 గురుకుల పాఠశాలలు, 194 మోడల్ స్కూల్‌లను ఏర్పాటు చేసిందన్నారు.

డిప్యూటీ సీఎం, రెవెన్యూ మంత్రి మహమూద్ అలీ మాట్లాడుతూ మైనార్టీల కోసం 204 రెసిడెన్షియల్ స్కూల్‌లను ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. విద్యా శాఖ మంత్రి కడియం శ్రీహరి తన శాఖను పటిష్టపరుస్తున్నారని ఢిల్లీలో ఎంపీగా ఉన్న ఆయన్ను సీఎం కేసీఆర్ గుర్తించి ఈ పదవి కట్టబెట్టడం దానిని కడియం నిలబెట్టుకున్నారని ఆయన ప్రశంసించారు. హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డి మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ బీసీ, మైనార్టీ విద్యార్థుల కోసం 500 రెసిడెన్షియల్ స్కూల్ లను మన ప్రభుత్వం ఏర్పాటు చేసిందని, ఇది చేతల ప్రభుత్వం మాటల ప్రభుత్వం కాదని ఆయన పేర్కొన్నారు. సికింద్రాబాద్ ఎంపీ దత్తాత్రేయ మాట్లాడుతూ సైన్స్ అండ్ టెక్నాలజీ దేశ అభివృ ద్ధికి దోహదం చేస్తుందన్నారు. సైన్స్ టెక్నాలజీ సంబంధించి రీజనల్ సెంటర్‌ను హైదరాబాద్‌లో ఏర్పాటు చేసేందుకు తన వంతు ప్రయత్నం చేస్తానని ఆయన హామీ ఇచ్చారు.

హామీల అమలులో సర్కార్ విఫలం



మహబూబ్‌నగర్, ప్రభన్యూస్ బ్యూరో : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు తెలంగాణ ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయలేని చేతగాని ప్రభుత్వమని తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇంచార్జ్ కుంతియ తీవ్రంగా విమర్శించారు. సోమవారం ఆయన జిల్లా పర్యటనలో భాగంగా బాలానగర్‌లో ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశంలో క్షేత్ర స్థాయిలో పార్టీ పటిష్టతపై కార్యకర్తల బాధ్యతలపై సమావేశంలో ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి కేసిఆర్ నియంతృత్వ పాలనతో బంగారు తెలంగాణ పేరు చెప్పుకొని వేల కోట్ల రూపాయలను కాజేస్తూ అవినీతికి పాల్పడుతున్నారన్నారు. ఇప్పటికే తెలంగాణ ప్రజలు బంగారు తెలంగాణ చేస్తామంటూ మోసం చేస్తున్న టీఆర్ఎస్ ప్రభుత్వంపై తీవ్ర అసంతృప్తితో ఉన్నారన్నారు. పాలమూరు జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో కాంగ్రెస్ విజయం సాధించడం ఖాయమని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బాలానగర్ కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులు , కార్యకర్తలు తమ పార్టీకి సంబంధించిన సమస్యలను భవిష్యత్ కార్యాచరణపై తీసుకోవాల్సిన అంశాలను ఆయన ముం దుంచారు. ఈ కార్యక్రమంలో మాజీ కేంద్ర మంత్రి జైపాల్‌రెడ్డి, టీపీసీసీ ఉపాధ్య క్షుడు డా. మల్లురవి, మాజీ ఎంపీ పొన్నంప్రభాకర్, పరిగి ఎమ్మెల్యే రాంమోహ న్‌రెడ్డి, బాలానగర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష, కార్యదర్శులు, నాయకులు , కార్యకర్తలు పాల్గొన్నారు.

తెరాసతోనే గొల్లకురుమల అభివృద్ధి

- తాండూరులో కురుమలకు గొర్రెల పంపిణీ

తాండూరు టౌన్, ప్రభన్యూస్ : తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ గొల్లకురుమల పాలిట దైవం అని, ఆరాధ్య దేవుళ్లు మల్లప్ప, బీరప్పలకు ఆయన ప్రతిరూపం అని రాష్ట్ర పశుసంరక్షణ శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అభివర్ణించారు. గొల్లకురుమలతో పాటు అన్ని వర్గాల అభ్యున్నతికి తెలంగాణ సర్కార్ కృషి చేస్తుందని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి మహేందర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమ వారం తాండూరు పట్టణంలోని క్లాసిక్ గార్డెన్‌లో తాండూరు, యాలాల మండ లంలోని గొల్ల కురుమల లబ్దిదారులకు గొర్రెల పంపిణీ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈకార్యక్రమానికి రాష్ట్ర పశుసం రక్షణశాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ రాష్ట్ర రవాణాశాఖ మంత్రి మహేందర్‌రెడ్డితో కలిసి లబ్దిదారులకు గొర్రెలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ గొర్రెల పెంపకంపైనే గొల్ల కురుమల జీవితాలు ఆధారపడ్డాయని అన్నారు. 60,70ఏళ్ల స్వాతంత్ర్యంలో ఎన్నికలు ఎన్నికల మధ్య గొల్ల కురుమలను గత ప్రభుత్వాలు ఓటుబ్యాంకుగా వాడుకున్నాయన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు అయ్యాక సిఎం కేసిఆర్ అన్ని వర్గాలతో పాటు గొల్లకురుమల అభివృద్ధి కి ప్రత్యేక శ్రద్ధ చూపారని అన్నారు. ఆంధ్రా పాలనలో ఎన్‌సిడిపి కింది గొల్ల కురుమ సంఘాలకు నిధులు మంజూరైతే వాటిపై రుణాలు అందించాలని గత కాంగ్రెస్, తెదేపా ప్రభుత్వాలు కేంద్రాన్ని కోరగా గ్యారెంటీ ఇవ్వాలని కేంద్రం సూచిస్తే వెనక్కితగ్గాయని గుర్తుచేశారు. టిఆర్‌ఎస్ ప్రభుత్వంలో ఈ విషయాన్ని కేసిఆర్ దృష్టికి తీసుకెళ్లగానే మన ప్రాంతంలోని వారికి మనం గ్యారెంటి ఇవ్వకపోతే ఎలా అని అలోచించకుండా సంతకాలు చేశారని, అనంతరం కొద్ది రోజుల తరువాత గొల్ల కురుమల సంక్షేమం కోసం సబ్సిడిపై గొర్రెలు పంపిణీ చేయాలని నిర్ణయించినట్లు తెలిపారని అన్నారు. తెలంగాణ వస్తే కరెంటు విషయంలో చీకటిరాష్ట్రంగా మారిపోతుందని దుమ్మెత్తిన కాంగ్రెస్ ప్రస్తుతం 24గంటల ఉచిత కరెంట్‌ను అందిస్తుంటే మా మహయాంలోనే 24గంటల అంశాన్ని ప్రస్తావించడం జరిగిందని గొప్పలకు పోతున్నారని విమర్శించారు. ఇలా చెప్పుకోవడానికి వారికి సిగ్గుండాలని అన్నారు. పాలమూరు రంగారెడ్డి జిల్లాల ప్రాజెక్టు ద్వారా 1లక్ష 50ఎకరాలకు సాగునీరందడం ఖాయమన్నారు. మరోవైపు మంత్రి మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ గొల్ల కురుమల కోసం సిఎం కేసిఆర్ బడ్జెట్‌లో రూ. 4,5కోట్లు పెట్టి గొర్రెల పంపిణీ చేపట్టారని తెలిపారు. తాజాగా రూ. 250కోట్ల విలువైన స్థలాన్ని కొనుగోలు చేసి 10ఎకరాల స్థలంలో, రూ. 10కోట్లతో సంక్షేమ భవనాన్ని నిర్మిస్తున్నారని తెలిపారు. గొల్ల కురుమలతో పాటు అన్ని వర్గాల అభివృద్ధి కి సిఎం కేసిఆర్ కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. చేవేళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ బంగారు తెలంగాణలో భాగంగా సిఎం కేసిఆర్ వెనుక బడిన గ్రామీణ ప్రాంతాల్లో గొల్ల కురుమలకు గొర్రెల పంపిణీ కార్యక్రమం చేపట్టారని అన్నారు.





తాండూరులో గొర్రెల పంపిణీ కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, గొర్రెలు పంపిణీ చేస్తున్న మంత్రులు తలసాని, మహేందర్‌రెడ్డి.

విప్‌ల సదస్సు సూచనల అమలులో..
ముందంజలో తెలంగాణ చట్టసభలు



హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఆలిండియా విప్‌ల సదస్సులలో చేసిన సిఫార్సులను సక్రమంగా అమలు చేయడంలో తెలంగాణ రాష్ట్ర చట్టసభలు ముందంజలో ఉన్నాయని శాసనమండలిలో ప్రభుత్వ విప్ డాక్టర్ పల్లా రాజేశ్వరరెడ్డి అన్నారు. రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌లో సోమ వారం ప్రారంభమైన 18వ ఆలిండియా విప్స్ కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న రాజేశ్వరరెడ్డి గత సదస్సులలో చేసిన తీర్మానాలు తెలంగాణలో అమలు జరుగుతున్న తీరును వివరించారు. ఫ్లోర్ మేనేజ్‌మెంట్, క్రమశిక్షణ, ప్రైవేట్ మెంబర్ బిల్లు, కోడ్ ఆఫ్ కండక్ట్, కోడిఫికేషన్ ఆఫ్ ప్రివిలేజెస్, సభ్యుల హాజరు శాతం, సభ్యులకు శిక్షణ, ఈ-లెజిస్లేచర్, మినిమం నెంబర్ ఆఫ్ వర్కింగ్ డేస్ వంటి అంశాలపై గోవా సదస్సు తొమ్మిది కీలకమైన సిఫార్సులను చేసిందన్నారు. తర్వాత విశాఖ పట్నంలో జరిగిన విప్‌ల సదస్సులో గోవా సదస్సు చేసిన సిఫార్సులు ఎలా అమలుజరిగాయన్న అంశంపై చర్చ జరి గిందన్నారు. బిఎసి సమావేశం ఏర్పాటుచేసి అన్ని పార్టీల ఫ్లోర్‌లీడర్ల సూచనలు తీసుకుని అన్ని అంశాలు చర్చకు వచ్చేలా ప్రభు త్వం చర్యలు తీసుకుం టున్న దన్నారు. ప్రతి అంశం చర్చకు వచ్చేలా .. సభ్యులు అడిగిన ప్రశ్నలకు ప్రభు త్వం సమాధానం చెప్పేలా, ఎన్నిరో జులైనా సమావేశాలు నిర్వ హించేలా ప్రభుత్వం పారదర్శకంగా వ్యవహరి స్తున్న దన్నారు. ఈసదస్సుకు చీఫ్‌విప్ పాతూరి సుధాకర్‌రెడ్డి, ఉభయసభల విప్‌లు బోడ కుంటి వెంకటేశ్వర్లు, గొంగడి సునితా మహేందర్‌రెడ్డి, గంపా గోవర్ధన్‌లు కూడా పాల్గొ న్నారు. రాజస్థాన్ వెళ్ళిన ప్రభుత్వ విప్ పల్లా రాజేశ్వర రెడ్డి నేతృత్వం లోని బృందం అక్కడి ముఖ్యమంత్రి వసుం ధరా రాజెతో భేటీ అయ్యారు. ఈ సంద ర్భంగా తెలంగాణ ప్రభుత్వం అమలుచేస్తున్న పలు పథకాలను, అంశాలను ఆమె దృష్టికి తీసుకెళ్ళారు. కేంద్ర మంత్రులు అనంత కుమార్, విజయ్‌గోయెల్‌లను కలిసి పలు అంశాలపై చర్చించినట్లు రాజేశ్వరరెడ్డి తెలిపారు.

● సముద్రం గడ్డకట్టింది నౌక ఇరుక్కుపోయింది



మెయిన్‌నుంచి వెస్ట్ వర్జీనియాకు వస్తూ తూర్పు తీరంలో సముద్రం మధ్యలో ఇరుక్కుపోయిన మత్స్య కారుల నౌక.

భూగర్భ జలాలకు విద్యుత్ షాక్!

• నాన్‌స్టాప్‌గా తిరుగుతున్న మోటార్లు
• వేగంగా పడిపోతున్న నీటి మట్టాలు
• ఆటో స్టార్టర్లు తొలగిస్తేనే డిమాండ్ తెలిసేది?

హైదరాబాద్, ఆంధ్రప్రభ: రాష్ట్రంలో వ్యవసాయరంగానికి సరఫరా చేస్తున్న 24గంటల విద్యుత్ భూగర్భ జలాలకు షాక్ ఇస్తోంది. రాష్ట్రంలో నిరంతర విద్యుత్ సరఫరా ద్వారా పంటల సాగులో రైతన్నకు చేయూతగా నివ్వాలన్న లక్ష్యంతో కేసీఆర్ సర్కారు డిసెంబర్ 31 అర్థ రాత్రి ప్రభుత్వం వ్యవసాయరంగానికి అండ గా నిల వాలన్న లక్ష్యంతో ఈ రంగానికి 24గంటల విద్యుత్ సరఫరాను ప్రారంభించినప్పటికి రైతులు ఆటోస్టార్టర్లను తొలగించుకోవటంలో ఇంకా మీనమేషాలు లెక్కిస్తున్నారు. గత వారం రోజులుగా పొలాల్లో బోర్లనుంచి భూగర్భజలం నిరంతరం బయటకు వస్తున్నా మోటార్లను స్టాప్ చేయడం మాత్రం రైతులు వెనుకాడుతున్నారు. ఒక్కసారి ఆటోస్టార్టర్ తొలగించాక

తొలగని ఆటో స్టార్టర్లు

మళ్లీ 24గంటల విద్యుత్ సరఫరా ఆగిపోతే.. అన్న సందేహాలే రైతులను సందిగ్ధంలో పడవేశాయం టున్నారు. ఆటోస్టార్టర్లు తొలగించుకోకపోతే ఇటు 24గం టల విద్యుత్ సరఫరా వల్ల ఆశించిన ఫలితం రాకపోగా, భూగర్భ జలా లు వేగంగా తరిగిపోయి చివరకు రైతులే నష్టపోవాల్సి వస్తుంది. వ్యవసాయ మోటర్లకు అమర్చిన ఆటోస్టార్టర్ల తొల గింపునకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని డిస్కం లు నిర్ణ యం తీసుకున్నాయి. రాష్ట్రంలో 23లక్షల మేరకు వ్యవ సాయ బోర్లు ఉండగా అందులో ఇప్పటివరకు కనీసం 25శాతం కూడా ఆటోస్టార్టర్లు తొలగించేదని తెలుస్తోంది.

తరువాత రాష్ట్రమంతటా 24గంటల విద్యుత్ సరఫరాను ప్రారంభించింది. అంతకు ముందు పలు జిల్లాల్లో ప్రయోగాత్మకంగా వ్యవసాయ పంప్ సెట్లకు 24గంటల విద్యుత్‌ను అమలు చేసిలోటు పాట్లు అధ్యయనం చేసిన విద్యుత్ పంపిణీ సంస్థలకు గత వారం రోజులుగా రాష్ట్రంలో అమలవుతున్న 24గంటల విద్యుత్ సరఫరాలో పెద్దగా సమస్యలేవీ తలెత్తలేదు. అయితే భూగర్భ జలాల రూపంలో మరో కొత్త సమస్య ఏర్పడింది. వ్యవసాయ రంగానికి 24గంటల విద్యుత్ సరఫరా జరుగుతుండటంతో వ్యవసాయ మోటార్లు నిరంతరంగా పనిచేస్తున్నా యి. రాష్ట్రమంతటా చలి మంచు వాతావరణం అధికంగా ఉన్నందున పంటలకు ఇపుడు నీటి తడులు పెద్దగా అవసరం ఉండదని రైతులు చెబుతున్నారు. ఉత్తర తెలంగాణతోపాటు దక్షిణ తెలంగాణలోని పలు జిల్లాల్లో యాసంగి వరినాట్లు పూర్తి కావచ్చాయి. ఈ పరిస్థితుల్లో పొలంలో గట్టునిండుగా నీరుండాల్సిన అవసరం ఉన్నప్పటికీ వరిపైరుకు ఒక్క సారి నీరు పెడితే పదిరోజులదాకా పొలంలో నీరు అలాగే ఉంటుంది. వేవవి ఉష్ణోగ్రతలు పెద్దగా లేకపోవటంతో నీటి ఆవిరి శాతం తక్కువగా ఉంటోంది. ఈ కారణంగానే పొలాల్లో తేమ చాలారోజుల వరకు నిలవ ఉం టుంది. నిరంతర విద్యుత్ సరఫరా కారణంగా పలు జిల్లాల్లో వ్యవసాయ మోటార్లు నాన్‌స్టాప్‌గా పనిచేస్తునే ఉన్నాయి. దీంతో అవసరం లేకపో యినప్పటికీ బోర్లనుంచి భూగర్భజలాలు ఇబ్బ తోడేస్తున్నాయి. దీంతో భూగర్భజల మట్టాలు వేగంగా దిగజారి పోతున్నాయి. కొన్నిజిల్లాల్లో భూగర్భజలమట్టాలను గత డిసెంబర్‌కు ఇప్పటికి ఉన్న తేడాలను పరిశీలిస్తే ఆందోళన గొలుపుతోంది. సిరిసిల్ల జిల్లాలో భూగర్భజల మట్టం 8.29 మీటర్లనుంచి 13.36మీటర్లకు పడిపోయింది. నిర్మల్‌లో 6.39 మీటర్ల నుంచి 9.58మీటర్లకు తరిగిపోయింది. నిజామాబాద్ జిల్లాలో 7.10మీటర్ల నుంచి 10.01మీటర్లుకు , అదిలాబాద్ జిల్లాలో 5.31మీటర్ల నుంచి 7.65మీటర్లుకు



తరిగిపోయాయి. సంగా రెడ్డిలో 10.92 మీటర్ల నుంచి 12.01 మీటర్లకు తరిగి పోయింది. మెదక్ జిల్లాలో 12.45 మీటర్ల నుంచి 14.78మీటర్లకు పడిపోయింది. మంచి ర్యాల జిల్లాలో 4.14మీటర్ల నుంచి 6.51మీటర్ల కు తరిగిపోయింది. పెద్దపల్లి జిల్లాలో కూడా 7.14మీటర్ల నుంచి 9.20 మీటర్లకు పడిపో యింది. భూగర్భజల మట్టాలు జనవరిలోనే ఇంత వేగంగా తరిగిపోతే ఇక మార్చి ,ఏప్రిల్ నాటికి మరింత లోతుకు పడిపోతాయెా అన్న ఆందోళన వ్యక్తమవుతోంది.


183 ఎంయూకు పెరిగిన విద్యుత్ డిమాండ్

రాష్ట్రంలో 24గంటల విద్యుత్ సరఫరా ద్వారా డిమాండ్ 183 మిలియన్ యూనిట్లకు చేరుకుంది. విద్యుత్ సరఫరా ద్వారా పెరగనున్న విద్యుత్ డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని విద్యుత్ పంపిణీ సంస్థలు విద్యుత్ సరఫరా , పంపిణీ వ్యవస్థలను 11వేల మెగావాట్లకు తగ్గట్టుగా సామర్థ్యాన్ని పెంచు కున్నా యి. రాష్ట్రంలో 24గంటల విద్యుత్ అమల్లోకి వచ్చాక ఈ నెల ఒకటిన 180మిలియన్ యూనిట్లు ఉన్న విద్యుత్ పంపిణీ ఈ వారంరోజుల్లో క్రమేపీ పెరుగుతూ 183 మిలియన్ యూని ట్లకు చేరుకుంది. రైతులు అవసరం మేరకే విద్యుత్‌ను వినియో గించుకుంటున్నారని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి జి. జగదీష్ రెడ్డి పేర్కొన్నారు. ఉదయం పూట 9500మెగావాట్లు ఉన్న వి ద్యుత్ డిమాండ్ మధ్యాహ్నానికి 8000మెగావాట్లకు తగ్గు తుందని మంత్రి పేర్కొన్నారు. ఆటోమీటర్లను తొలగించు కుంటే తప్ప రాష్ట్రంలో ఈ రంగానికి విద్యుత్ సరఫరాలో ఎంత డిమాండ్ ఉందన్నది స్పష్టం కాదని విద్యుత్ పంపిణీ సంస్థలకు చెందిన అధికారి ఒకరు పేర్కొన్నారు.

2500 మెగావాట్ల ఉత్పత్తి లక్ష్యం

హైదరాబాద్, ఆంధ్రప్రభ: విద్యుత్ ఉత్పత్తిరంగంలోకి ప్రవేశించిన సింగరేణి కాలరీస్ అత్యుత్తమ పనితీరు తో జాతీయస్థాయి ప్రశంసలం దుకుం టుండగా, 2022నాటికి మెగా ప్రణాళిక రూపొందించుకుంది. ప్రస్తుతం మంచిర్యాల జిల్లా జైపూర్‌లో ఉన్న విద్యుత్‌కేంద్రం ద్వారా 1200మె గావాట్ల విద్యుత్‌ను సింగరేణి ఉత్పత్తి చేస్తోంది. పూర్తిగా రాష్ట్ర అవసరాలకే విద్యుత్‌ను సరఫరా చేస్తున్న సింగరేణి కాలరీస్ రెండు యూనిట్లు మంచి సామర్థ్యాన్ని కనబరుస్తున్నాయి. తొలియూనిట్ నూరుశాతం పిఎల్ఎఫ్‌తో పలు రికార్డులు నమోదు చేసింది. ఈ విద్యుత్ యూనిట్లు జాతీయస్థా యిలో సింగరేణిని నాలుగవ స్థానంలో నిలిపాయి. మూడవ విద్యుత్‌కేంద్రాన్ని 800 మెగా వాట్ల సామర్థ్యంతో సింగరేణి నిర్మిస్తోంది. 2018లోనే ఈ యూనిట్ పనులు ప్రారంభం కానుండగా, 2020నాటికి దీనిని పూర్తిచేయను న్నారు. ఈ విద్యుత్‌కేంద్రం కోసం సింగరేణి యాజమాన్యం ఇప్పటికే రూ.6వేల కోట్ల నిధులను నిల్వచేసి ఉంచు కోవడం విశేషం. సింగరేణి యాజమాన్యం గతంలో నిర్మించిన రెండు యూనిట్లు కూడా.. రుణాలకు వెళ్లకుండా పూర్తిగా స్వంత వనరులు, నిధులతోనే ఏర్పాటుచేయడం విశేషం. ఇపుడు మూడో విద్యుత్ కేంద్రాన్ని అదే రీతిన ఏర్పాటుచేసేందుకు సన్నాహాలు చేసుకుంటోంది. ఇక మరోవైపు 500మెగావాట్ల సోలార్ విద్యుత్‌కేంద్రాల ఏర్పాటుకు సంస్థ నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే చైర్మన్ శ్రీధర్ కంపెనీ వ్యాప్తంగా సోలార్ విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుకు ఉన్న అవకాశాలపై అన్ని ఏరియాల లోనూ సర్వేలు నిర్వహించారు. పలు ఏజెన్సీల నుండి అనుకూలతలపై సమాచారం తెప్పించుకున్నా రు.సింగరే ణిలోని అన్ని ఏరియా లలో సో లార్ విద్యుత్‌ప్లాంట్లు ఏర్పాటుచే యాలని యాజమాన్యం భావి స్తోంది. ఇప్పటికే జైపూర్ విద్యుత్ కేంద్రంలో 10మెగావాట్ల సోలార్ ప్లాంట్‌కు యాజ మాన్యం గ్రీన్‌సిగ్నల్ ఇవ్వగా, కొత్తగూడెంలోనూ సోలార్ ప్లాంట్ల ఏర్పాటు కు యోచి స్తోంది. ప్రస్తుతం గ్రేటర్ హైద రాబాద్ విద్యుత్ అవసరాలు మొత్తం ఒక్క సింగ రేణి విద్యుత్ కేంద్రమే తీరుస్తుండగా రాష్ట్ర అభివృద్ధిలో, అవస రాలు తీర్చడంలో సంస్థ భాగస్వామిగా మారడంపై హర్షం వ్యక్తమవుతోంది. గడచిన మూడేళ్ళలో సింగరేణి పురోగమనరేటు పెరగ్గా, ఈఏడాది భారీ లాభాలు వస్తాయన్న అంచనాలో యాజమాన్యం ఉంది.

భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి



హైదరాబాద్, ఆంధ్రప్రభ : వ్యవసాయానికి 24 గంటల విద్యుత్ ఇవ్వడం వల్ల భూగర్భ జలాలు అడుగంటి పోతున్నాయని సీఎల్పీ ఉపనేత కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. వ్యవసాయానికి 12 గంటలైతే సరిపోతదని రైతులే చెబుతున్నారని ఆయన పేర్కొన్నారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ కోసం శాంతియుతంగా పోరాటం చేస్తున్న మంద కృష్ణమాదిగను అరెస్టు చేయడం శోచనీయమ న్నారు. సోమవారం ఆయన అసెంబ్లీ మీడియా హాల్లో మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్యతో కలిసి మాట్లాడారు. గ్రామ పంచాయతీ బోర్లు ఎండిపోతున్నాయని, 24 గంటల విద్యుత్ పథకంపై ప్రభుత్వం పున సమీక్షించాలని ఆయన కోరారు. సీఎం చంద్రశేఖర్‌రావుకు రైతులపై ప్రేమ ఉంటే.. ఎకరానికి రూ. 4 ఇచ్చే పథకం ఈ సీజన్ నుంచే అమలు చేయాలన్నారు. రైతు పండించిన ప్రతి పంటకు మద్దతు ధర లేకపోవడం పెట్టుబడి కూడా రావడం లేదన్నారు. రుణమాఫీలో 70 శాతం వడ్డీలకే సరిపోయిందన్నారు. వర్గీకరణ విషయంలో అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకుపోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఎమ్మార్పీఎస్ మహిళా నాయకురాలు భారతి మృతి చెందిన రోజు సీఎం కేసీఆర్ అసెంబ్లీలో హడావుడి చేశారని, ఆ తర్వాత వర్గీకరణ విషయాన్ని మర్చిపోయారని ఆయన విమర్శించారు.

మద్దతు ధరలేక రైతులకు రూ.35వేల కోట్ల నష్టం

● ప్రధాన పంటలకే రూ.6వేల కోట్లకుపైగా నష్టం
● కిసాన్ సంఘర్ష్ కమిటీ అధ్యయనం

హైదరాబాద్, ఆంధ్రప్రభ : వ్యవసాయ ఉత్పత్తులకు కనీస మద్దతు ధర రాకపోవడంతో గత ఏడాది రైతాంగం భారీగా ఆదాయాన్ని కోల్పోగా, అది వ్యాపారులకు లాభదాయక వనరుగా మారింది. సంక్షోభంలో ఉన్న వ్యవ సాయ రంగాన్ని ఆదుకునేందుకు కనీస మద్దతు ధరపై నిపుణుల కమిటీలు చేసిన సిఫారసులు ఆచరణకు నోచుకోకపోవడంతో గత ఏడాది రైతులకు వేలాది కోట్లు నష్టం వాటిల్లిందని అనేక అధ్యయనాలు వెల్లడిస్తున్నా యి. మరోవైపు అనావృష్టి చీడలతో దిగుబడు లు తగ్గడం, పంటలకు మద్దతు ధరలు లేకపోవ డంతో రైతాంగం ఎంతో నష్టపోయిం ది.ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర ఈ ఏడాది ఖరీఫ్‌లో వ్యాపారులు చెల్లించకపోవ డంతో రైతాంగం రూ.35,948 కోట్ల మేరకు నష్టపోయారని అఖిల భారత కిసాన్ సంఘర్ష్ సమన్వయ కమిటీ వెల్లడించింది. దేశవ్యాప్తంగా 18 రాష్ట్రాల్లో 500 సమావేశాలు నిర్వహించి 50 లక్షల మంది రైతుల నుంచి అన్ని ముఖ్యమైన మార్కెట్లలో పంటలకు చెల్లిస్తున్న ధరలను సేకరించింది. అటు వ్యాపారులు, ఇటు రైతాంగం నుంచి మార్కెట్ ధరలపై ఎప్పటికప్పుడు సమాచారం తీసుకుని మద్దతు ధరకు, రైతుకు అందిన ధరల వ్యత్యాసంపై అధ్యయనం చేసింది. మరోవైపు ఏడు ప్రధాన పంటలైన వరి, మొక్కజొన్న, సోయాబీన్, పత్తి, జొన్న, సజ్జలు, వేరుశనగ, మినపప్పులకు మద్దతు ధర చెల్లించనందున రైతాంగం రూ.6,283 కోట్లు నష్టపోయారు. ఈ పంటలను మార్కెట్‌లో వినియోగదారులకు అందినప్ప టికీ వీటి ధరలు రెండింతలు పెరగడంతో దా దాపు లక్ష కోట్ల రూపాయల మేర లాభాలు గడిం చారు. రైతుకు పెట్టుబడి వ్యయం పెరగ డం, మద్దతు ధర అంద కపోవడంతో వ్యవసాయం కనీసం గిట్టు బాటు కావడం లేదని ఈ కమిటీ ఆందోళన వ్యక్తం చేసింది. ఇలాఉండగా, 2014 ఎన్నికల్లో భాజపా తన ఎన్నికల ప్రణాళికలో, ప్రధాని అభ్యర్థిగా నరేంద్రమోడీ ఇచ్చిన హామీతో పోల్చితే రూ.2 లక్షల కోట్ల మేరకు నష్టపోయారని ఆ కమిటీ వెల్లడించింది. 2006లో డాక్టర్ స్వామినాథన్ కమిటీ సిఫారసులు మేరకు ఉత్పత్తి వ్యయంపై 50శాతం ధర ఉండాలని, 2011లో డాక్టర్ సి.రంగరాజన్ కమిటీ సిఫారసులు, కేంద్ర మంత్రి సురేష్ ప్రభు కమిటీల సిఫారసుల మేరకు మద్దతు ధరను నిర్ణయించాల్సి ఉంది. భాజపా హామీలు, ఈ కమిటీల సిఫారసులతో పోల్చితే దాదాపు రూ.2 లక్షల కోట్ల మేరకు రైతాంగం నష్టపోయారని భారత రైతు సంఘా ల సమాఖ్య పేర్కొంది. వ్యవసాయ రంగంలో వచ్చిన నష్టాలతో రైతాంగం ఆర్థికంగా దెబ్బతిన డం, మరోవైపు ఈ రంగం కుదేలవ్వడంతో ఇది అనేక రంగాలపై ప్రతికూల ప్రభావం చూపుతోం ది. ముఖ్యంగా జాతీయ స్థూల ఉత్పత్తి, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ ప్రజల జీవన ప్రమాణాలను దెబ్బతీసే విధంగా ఉందని ఆ సమాఖ్య పేర్కొంది. 49 శాతం మంది ప్రజలు వ్యవసాయ రంగంపై ఆధారపడి స్థూల ఉత్పత్తిలో 15.2 శాతం ఈ రంగం నుంచి వస్తోంది. అయితే ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర అమలుచేస్తే రైతులకు వ్యవసాయంపై విశ్వాసం కల్పించినట్లవుతుందని సమాఖ్య అభిప్రాయ పడింది. వ్యవసాయ పరికరాలు, ఇతర వస్తువులపై జిఎస్‌టి తొలగించి, జాతీయ ఉపాధి హామీ పథకాన్ని ఈ రంగానికి అనుసంధానం చేస్తే నష్టాలు తగ్గించుకోవచ్చునని డిమాండ్ చేస్తోంది. ఉత్పత్తి, డిమాండ్ ప్రాతిపదికగా ఎగుమతి - దిగుమతి విధానం ఎప్పటికప్పుడు సవరిస్తే రైతుకు గిట్టుబాటు ధర వస్తుందని భావిస్తున్నారు.

పంటల బీమాపై అధ్యయనానికి అమెరికా ప్రతినిధి బృందం

● వ్యవసాయ వర్సిటీని సందర్శించిన జాన్స్‌హాప్‌కిన్స్ స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ ప్రతినిధులు ●17నుంచి 20 వరకు సహకార విధానం నిపుణులతో సెమినార్

తెలంగాణ రాష్ట్రంలో పంటలబీమా పథకం అమలుపై అధ్యయనం చేసేందుకు హైదరాబాద్ వచ్చిన జాన్‌హోప్ కిన్స్ విశ్వవిద్యాలయం ప్రతినిధులు సోమ వారం ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ వి.ప్రవీణ్‌రా వును కలిశారు. ఈ సందర్భంగా దేశంలో అమలవుతున్న వ్యవసాయ బీమా పరిస్థితి, రైతుకు మరింత మేలు కలిగించేందుకు అనుసరించాల్సిన వ్యూహాలు తదితర అంశాలపై అధ్యయనం చేయనున్నట్లు జాన్స్‌హప్‌కిన్స్ స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ ఎకనామిక్స్ ప్రతినిధి కరీనా అబోర్న్‌సెన్, ఇటుస్ ప్రతినిధి సీవీ కుమార్ ఉపకులపతికి వివరించారు. ఇందుకు సంబంధించి తెలంగాణలో అధ్యయనం చేసేందుకు విశ్వవిద్యాలయం సహకారాన్ని వారు కోరారు. వారి అభ్యర్థనకు సానుకూలంగా స్పందించిన ఉపకులపతి ఈనెల 17 నుంచి 20వ తేదీల మధ్య వ్యవసాయ సహకార విధానం, పంటల బీమాకు సంబంధించి నిపుణులు, విశ్వవిద్యాలయంలోని అగ్రిబిజినెస్ మేనేజ్‌మెంట్, అగ్రికల్చర్ ఎకనామిక్స్ విభాగాల అధ్యాపకులు, వ్యవసాయ శాఖ అధికారులతో ఒక సెమినార్‌ను నిర్వహించేందుకు అంగీక రించారు. మన రైతులకు మేలుచేసే వ్యవసాయ బీమా మాడ్యూల్‌ను జాన్‌హోప్‌కిన్స్ ఎకనామిక్స్ స్కూల్ రూపొం దించడంపై అధ్యయనం చేస్తుంది. అలాగే మధ్యాహ్నం జాన్ హోప్‌కిన్స్ బిజినెస్ స్కూల్‌కి చెందిన ఫ్యాకల్టీ సభ్యులు కూడా ఉపకు లపతిని కలిసి తమ విద్యార్థులు ప్రాజెక్టు వర్క్ చేయ డానికి విశ్వవిద్యాలయంలో అవకాశం కల్పించాలని కోరారు.



పెళ్లి బరాత్‌లో విన్యాసాలు

• తల్వార్ వేటుకు బాలుడు దుర్మరణం



హైదరాబాద్, ఆంధ్రప్రభ: పెళ్లి బరాత్‌లలో చేసే విన్యాసాలు, వికృ తచేష్టలు ప్రాణాం తకంగా పరిణ మిస్తున్నాయి. ఈ బరాత్‌ల సంద ర్భంగా జరిగే ఆ చర్యలపై పోలీ సులు చూసీ చూడనట్లుగా వ్య వహరిస్తుండటంతో బరాత్‌లో ఇలాం టి విన్యాసాలు తీవ్రమవుతు న్నాయి. వినోదం కోసం జరిగే ఈ విన్యాసాలు చివరికి విషాదాం తాలుగా మారుతున్నాయి. బరాత్‌ల సందర్భంగా గాలిలో కాల్పులు, తల్వార్లతో విన్యాసాలకు పాల్పడుతుండటం ఆనవాయితీగా మారింది. తాజాగా హైదరా బాద్‌లోని షేక్‌పేటలో ఘటన ఇందుకు అద్దం పడుతోంది. వినోదంలో విషాదం చోటు చేసుకుంది. పెళ్లి బరాత్‌లో తల్వార్లతో మైనర్లు చేసిన విన్యాసాలు (మర్ఫా డ్యాన్స్) ఓ బాలుడి ప్రాణాలు తీశాయి. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు పది మందిని అదుపులోకి తీసుకున్నారు. షేక్‌పేటకు చెందిన సయ్యద్ హమీద్ స్థానిక పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. మిత్రులు పిలవడంతో మూడు రోజుల క్రితం అతను ఓ పెళ్లి బరాత్‌కు వెళ్లి నృత్యం చేశాడు. ఆ వేడుకల్లో అనుభవం లేకున్నా కత్తులు, తల్వార్లతో మైనర్లు విన్యాసాలు చేశారు. ఆ క్రమంలోనే దూసుకొచ్చిన తల్వార్ హమీద్ మెడక ు తగిలింది. దీంతో తీవ్రంగా రక్తస్రావం జరిగి పడిపోయాడు. ఘటన జరిగిన వెంటనే అతడిని చికిత్సనిమిత్తం మూడు ఆసుపత్రులకు తిప్పడంతో ఆలస్యమైంది. దీంతో సయ్యద్ హమీద్ మృతి చెందాడు. ఘటనపై బాధితుడి తల్లి ఫిర్యాదు మేరకు రాయదుర్గం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. కాగా, పెళ్లి బరాత్‌కు వెళ్లిన సందర్భంలో తమపై కావాలనే దాడికి యత్నించినట్లుగా ఆ ఘటనలో సయ్యద్ హమీద్ మృతి చెందినట్లుగా హమీద్ సోదరుడు చెబుతున్నాడు. మరోవైపు హమీద్ తల్లి మాట్లాడుతూ బరాత్‌ల సందర్భంగా ఇలాంటి విన్యాసాలు, వికృత చేష్టలు జర గకుండా నిరోధించే దిశగా చర్యలు చేపట్టాలని కోరారు. ఎంతో ఉత్సాహంగా వెళ్లిన హమీద్ మృతి చెందడంతో ఆ కుటుంబంలో విషాదఛాయలు అలుము కున్నాయి.

కూలి బతుకులు కూలిపోయాయ్



జోగుళాంబ గద్వాల, ప్రభన్యూస్ : వారంతా రోజువారి కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు.. ఎప్పటిలాగే దినసరి కూలీలుగా పత్తి జిన్నింగ్ మిల్లుకు వెళ్లి రాత్రంతా శ్రమించి తిరిగి ఇళ్లకు చేరుకునేందుకు పయనమయ్యారు...కొన్ని నిమిషాల్లో స్వస్థలాలకు చేరుకుంటామనేలోపు డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా.. అనుకోని ప్రమాదానికి గురై ఐదుగురు ప్రాణాలు అనంతవాయువులో కలిసిపోగా, ముగ్గురి పరిస్థితి విషమంగా ఉంది.. మరో 15మంది కూలీలకు తీవ్ర గాయాలయ్యాయి... ఈ విషాద సంఘటన జోగుళాంబ గద్వాల జిల్లా, ధరూర్ మండల పరిధిలోని పారుచర్ల గ్రామ స్టేజి సమీపంలో సోమవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.ధరూర్ మండలంలోని చిన్నపాడు, ఎములోంపల్లి గ్రామాలకు చెందిన 40మంది కూలీలు బొలెరో వాహనంపై గద్వాలలోని ఓ పత్తి మిల్లులో రాత్రి పని చేసేందుకు ఆదివారం వచ్చారు. రాత్రంతా మిల్లులో పనిచేసి తెల్లవారుజామున గ్రామానికి బయలుదేరారు. కాగా కూలీలతోపాటు నిద్ర మేల్కొని ఉన్న డ్రైవర్ రాముడు వాహనాన్ని అతివేగంగా నిర్లక్ష్యంగా నిద్రమత్తులో నడుపుతూ పారుచర్ల గ్రామ స్టేజి శివారులో మలుపు వద్ద మలుపు తీసుకుంటూ వాహన వేగాన్ని నియంత్రించలేక బోల్తా కొట్టించాడు. రాత్రంతా పనిచేసి అలసిపోయిన కూలీలు నిద్రమత్తు కళ్లతో ఉండడం, వాహనం బోల్తాపడడం...పరిమితికి మించి వాహనంలో ప్రయాణించడంతో ఒకరిపై ఒకరు పడి...వాహన కడ్డీలకు ఢీకొని చిన్న పాడు గ్రామానికి చెందిన లోహిత్‌చారి(45), గీతమ్మ(30), కొత్త వెంకటన్న(40), కోట్ల వెంకటన్న(55), ఎములోంపల్లి గ్రామానికి చెందిన అరుణ(23)లు అక్కడికక్కడే మృతి చెందగా మరో 15మందికి తీవ్ర గాయాలయ్యాయి. వీరిని వెంటనే చికిత్స నిమిత్తం గద్వాల ఏరియా ఆసుపత్రికి తరలించారు. కాగా వారిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉండడంతో కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు సంఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. విషయం తెలుసుకున్న జోగుళాంబ గద్వాల జిల్లా ఎస్పీ విజయ్‌కుమార్, డీఎస్పీ సురేందర్‌రావు, సంఘటన స్థలానికి చేరుకుని సంఘటన వివరాలను బాధితులను అడిగి తెలుసుకున్నారు.

దైవ దర్శనానికి వెళ్లి...!



నంగునూర్, ప్రభన్యూస్ : భార్యతో కలిసి రాజన్న సిరిసిల్లా జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన వేములవాడకు వెళ్లి హత్యకు గురైన బాలయ్య మృతితో గ్రామంలో విషాద చాయలు అలుముకున్నా యి. సిద్దిపేట జిల్లా, నంగునూర్ మండల పరిధిలోని ఘనపూర్ గ్రామానికి చెందిన బండి బాల య్య(40) సోమవారం తెల్లవారు జామున వేములవాడ పుణ్య క్షేత్రంలో హత్యకు గురైయాడన్న విషయం తెలిసిన కుటుంబికులు, గ్రామస్థులు వేములవాడకు తరలివెళ్లారు. గ్రామస్థుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన బండి బాలయ్య తన భార్య బండి నర్సవ్వతో కలిసి ఆదివారం ఉదయం వేములవాడకు తరలివెళ్లారు. దేవాలయ ఆవరణ పార్కింగ్ స్థలంలో గుర్తు తెలియని వ్యక్తులు మెడపై కత్తితో పొడవడంతో బాలయ్య అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. . దైవ దర్శనానికి వెళ్లేముందు బాలయ్య కూతురు శైలజ(17), అంజలి(9), తండ్రి బక్కయ్యను సైతం వెంట తీసుకెళ్లకపోవడంతో పక్క ప్రణాళికతోనే మరొకరితో కలిసి బాలయ్యను హత్య చేసి ఉంటుందని పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. వేములవాడ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం. అనుమాని తురాలిగా భార్య నర్సవ్వను అక్కడి పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు గ్రామస్థులు తెలిపారు. బాలయ్య మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం స్వగ్రామానికి తరలించారు. అటు తల్లి నర్సవ్వ పోలీసుల అదుపులో ఉండటం, ఇట ు తండ్రి హత్యకు గురికావడంతో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న శైలజ, 4వ తరగతి చదువుతున్న అంజలిల రోదనలు గ్రామస్థులను కంటతడి పెట్టించాయి.

జీహెచ్ఎంసీ పార్కుల్లో జిమ్‌లు



హైదరాబాద్, ఆంధ్రప్రభ: పేద, మధ్య తరగతి వర్గాల్లో చాలా మందికి జిమ్‌కు వెళ్ళి శరీర సౌష్టవాన్ని కాపాడుకో వాలని నిరంతరం తపిస్తుం టారు. కానీ ప్రైవేటు జిమ్ము ల్లో ఫీజు వేల రూపాయల్లో గుంజుతున్నారు. దీంతో పలువురు జిమ్‌లకు వెళ్ళ లేకపోతున్నారు. ఈ నేపథ్యంలో వారి కోరికను తీర్చడానికి గ్రేటర్ బల్దియా ముందుకు వచ్చింది.గ్రే టర్ పరిధిలోని పలు పార్కుల్లో జాగింగ్ కోసం వచ్చేవారికి ఓపెన్ జిమ్ములను ఏర్పాటు చేసింది. పైలెట్ ప్రాజెక్టు కింద నగరంలోని ఆరు పార్కుల్లో రూ. 65 లక్షలతో ఎక్సర్‌సైజ్ పరికారాలను ఏర్పాటు చేశారు. వాటిని ఏఎస్ రావునగర్ పార్కు, ఇమ్లీబన్ పార్కు, కృష్ణకాంత్ పార్కు, గుల్మోహర్ పార్కు, నెహ్రూనగర్ పార్కు, ఇందిరాపార్కుల్లో ఏర్పాటు చేశారు. ఇందులో లెగ్‌ప్రెస్, లెగ్ స్ట్రెచ్ స్రెయిట్, లెగ్ స్ట్రెచ్ సైడ్స్, చెస్ట్ పుష్, ట్విస్టర్ త్రీ ఇన్ వన్, వర్టికల్ షోల్డర్ పుల్, ఆటో డోమినల్ రైడర్, షోల్డర్ ష్కై రోవర్, డ్యూస్ క్రాస్ ట్రైనర్,షోల్డర్ బ్యాంక్ ట్విస్ట్, సీటర్ ట్విస్టర్, ఏబి బోర్డు తదితర ఎక్సర్‌సైజ్‌కు చెందిన పరికరాలను నెలకొల్పారు. కాగా గ్రేటర్ బల్దియా కల్పించిన ఓపెన్ జిమ్ములపై నగర ప్రజలు మరింత ఫిదా అవుతున్నారు. సంబంధిత అధికారులపై ప్రశంసలను కురిపిస్తున్నారు.

బీటెక్ దొంగలు



హైదరాబాద్, ఆంధ్రప్రభ: రాచకొండ పోలీస్ కమిష నరేట్ పరిధిలోని కరడుగట్టిన నలుగురు సభ్యులుగా గల ముఠా గుట్టును ఎల్‌బి నగర్ డివిజన్ పోలీసులు రట్టు చేశారు. ఎల్‌బినగర్‌లోని సాయినగర్ కాలనీలో అనుమా నాస్పదంగా సంచరిస్తున్న ఈ నలుగురు ముఠా సభ్యులను పోలీసులు అదుపులోకి తీసుకున్నా రు. అరెస్టయిన నిందితుల వద్దనుంచి రూ.17 లక్షల విలువైన 540 గ్రాముల బంగారు గొలుసులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నాలుగు మోటార్ సైకిళ్ల (టీఎస్ 07 ఈఎల్ 3162, టీఎస్29 1861, ఏపీ 23 ఏజీ 2594, టీఎస్ 09 టీ/ఆర్ 7814)ను పోలీసులు స్వాధీన పర్చుకున్నారు. నిందితుల ఎల్‌బినగర్ మన్సూరాబాద్‌కు చెందిన చవన్ సూరజ్ (21)(ఎ1) (బీటెక్ మొదటి సంవత్సరం), కొమ్ము పవన్ కుమా ర్(20)(ఎ2)(బీటెక్ మూడవ సంవత్సరం), ఖమ్మం జిల్లాకు చెందిన మహమ్మద్ ఒవైస్ అహ్మద్ (19) (ఎ3)(పాలిటెక్నిక్ డిస్ కంటిన్యూడ్) మామిడి పురోహి త్ కుమార్ (20)(ఎ4)(బీటెక్ మూడవ సంవ త్సరం). సూరజ్, పవన్‌కుమార్‌ల స్వస్థలం వరంగల్ జిల్లా.

జల్సాల కోసం..

సూరజ్, పవన్‌కుమార్‌లు ఇద్దరూ స్కూల్‌మేట్స్. గురునానక్, సీఎంఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ చదివారు. వార్షిక పరీక్షల్లో ఫెయిలయ్యారు. చదువులో వెనుకబడ్డ మరో ఇద్దరు మొహమ్మద్ ఒవైసీ అహ్మద్, మామిడి రోహిత్ కుమార్‌లను కలుపుకున్నారు. వారు కూడా కాలేజి మెట్స్ కావడం గమనార్హం. వీరంతా ముఠాగా ఏర్పడ్డారు. వీరంతా మద్యం, సిగరెట్స్, గంజాయికి బానిసలయ్యారు. వారి జల్సాలకు ఈజీ మనీ సంపాదన కోసం చైన్‌స్నాచింగ్‌లకు పాల్పడుతూ వచ్చారు. ఎల్‌బీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 9, చైతన్య పురి పీఎస్ పరిధిలో 2, సరూర్‌నగర్ పీఎస్ పరిధిలో 5, మీర్‌పేట, వనస్థలిపురం పీఎస్ పరిధిలో ఒక్కొక్కటి చొప్పున మొత్తంగా 18 కేసులలో వీరు నిందితులు.

గురుకుల విద్యార్థిని మృతి



పెద్దకొడప్‌గల్, ప్రభన్యూస్ : కామారెడ్డి జిల్లా, పెద్దకొడప్‌గల్ మండల కేంద్రంలోని బాలికల గురుకుల పాఠశాల జూనియర్ కళాశాలలో కృప(17) ఇంటర్మీడి యట్ విద్యార్థిని అనారోగ్యంతో మృతి చెందింది. శనివారం నుం చి బాలికకు వాంతులు కావడం తో తీవ్ర నీరసానికి గురైంది. దీంతో కళాశాలలో ఉన్న ఏఎన్ఎం ఉజ్వల వద్దకు వెళ్ళగా ఆమె వాంతుల నివారణకు మాత్రలు ఇవ్వగా ఆరోగ్యపరిస్థితి నిలకడగా లేక ఆదివారం నాడు కూ డా కృపకు వాంతులు ఎక్కువ కావడంతో తోటి విధ్యార్థులు ప్రధానోపా ధ్యా యురాలు రూపాదేవికి సమాచారం ఇచ్చారు. దీంతో విద్యార్థిని కృపను ఆసుపత్రికి తీసుకువెళ్లడం జరిగింది. ఆదివారం సాయంత్రం వరకు అమ్మాయి ఆరోగ్యం క్షీణించిపోవడంతో పిట్లం ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమంగా ఉందని అక్కడి వైద్యులు బాన్సువాడ ఏరియా ఆసుపత్రికి రిఫర్ చేశారు. ఆరోగ్య పరిస్థితిని గమనించిన బాన్సువాడ వైద్యులు నిజామబాద్ జిల్లా ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యులు చూసేసరికి విద్యార్థిని కృప చనిపోయినట్లు నిర్ధారిం చారు. తమ క ూతురు అనారోగ్య విషయం ఆదివారం సాయంత్రం వరకు కూడా తెలుపలేదని, మృతిపై అనుమానాలున్నాయని విద్యార్థిని తల్లిదండ్రులు ఆరోపించారు.

బీజేపీ యువ మంత్రం

● మిలీనియం ఓటరు పేరుతో యువ ఓటర్ల నమోదు ● కాలేజీ కనెక్ట్‌తో కార్యక్రమాలకు సన్నాహాలు ● కుల రాజకీయాలకు వ్యతిరేకంగా అభివృద్ధిపై ప్రచారం

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : ఎన్నికలకు మరో ఏడాదే ఉండడంతో బీజేపీ యువతపై దృష్టి పెట్టింది. ఈ మిలినీయం 2000వ సంవత్సరంలో పుట్టిన వారందరినీ ఓటరు జాబితాలో చేర్పించేందుకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని నిర్ణయించింది. ఈ ఏడాదికి వారందరికీ 18 సంవత్సరాలు నిండుతుండడంతో వారందరినీ కలుసుకుని, బీజేపీ వైపు ఆకర్షించాలని ప్రణాళిక రచించింది. ఈ మేరకు పెద్ద ఎత్తున కాలేజీల్లో వెళ్లాలని నిర్ణయించారు. కాలేజ్ కనెక్ట్ పేరుతో వివిధ కళాశాలల్లో ఓటరు నమోదుకు సంబంధించిన కార్యక్రమాలు చేపట్టనున్నారు. అలాగే జనవరి 12 స్వామివివేకానంద జయంతి రోజున దేశవ్యాప్తంగా భారీ స్థాయిలో రక్తదాన శిబిరాలను నిర్వహించనున్నారు. ఇందుకోసం రక్తదాల వివరాలతో జాబితాలు తయారు చేస్తున్నారు. జనవరి 23వ తేదీన నేతాజీ సుభాష్ చంద్రబోస్ శతజయంతి పూర్తవుతుండడంతో అప్పటివరకు వరకు ఈ రక్తదాన శిబిరాలను కొనసాగించనున్నారు.

ప్రధానంగా రెండువేల సంవత్సరంలో పుట్టిన వారిని మిలినీయం ఓటర్స్ పేరుతో వారిని భారీ సంఖ్యలో ఓటర్ల జాబితాలో చేర్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. దీని కోసం ప్రత్యేకంగా ఓ మొబైల్ యాప్‌ను కూడా తయారుచేశారు. క్షేత్రస్థాయి కి వెళ్లి యువకులను కలుసుకుని ఈ యాప్‌లో వారి వివరాలు నమోదు చేయిస్తారు. వీటితో పాటు కాలేజీ కనెక్ట్ పేరుతో యువమోర్చా భారీ సంఖ్యలో కళాశాలల్లో వివిధ కార్యక్రమాలను చేపట్టనున్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోడీ విజన్ న్యూ ఇండియా అనే యువకుల్లోకి తీసుకువెళ్లి వారిని పార్టీ వైపును తిప్పుకునే విధంగా ప్రణాళిక రచించారు. ప్రతి పోలింగ్ బూత్ కమిటీలోనూ కనీసం పదిమంది యువకులు ఉండే విధంగా లక్ష్యాన్ని నిర్దేశించుకున్నారు. సోషల్ మీడియా, వాట్సాప్



గ్రూప్‌ల ద్వారా బూత్ కనెక్ట్ ప్రోగ్రామ్‌తో వారిని ఒకే వేదికపై తీసుకురావాలని యువమోర్చా కార్యక్రమాన్ని రూపొందించింది.

ప్రధానమంత్రి నరేంద్రమోడీ న్యూ ఇండియా లక్ష్య సాధనలో యువకులే కీలకం కావడంతో ఆ వర్గాలను ఆకర్షించేందుకు పెద్ద ఎత్తున వినూత్న కార్యక్రమాలను తీసుకువెళ్లనున్నారు. మన్ కీ బాత్‌లో సైతం ప్రధానమంత్రి అనేక సార్లు యువకులే జాతి నిర్మాణంలో కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. దాంతో బీజేపీ యువమోర్చా యువకులను పార్టీలో చేర్పించేందుకు ఈ ప్రయత్నాలు ప్రారంభించింది. వచ్చే లోక్‌సభ ఎన్నికలు 2019 నాటికి భారీ సంఖ్యలో యువకులను తమ బ్రిగేడ్‌లో చేర్చుకోవాలని ముమ్మరయత్నాలు చేస్తున్నారు.

గుజరాత్‌లో కాంగ్రెస్ పార్టీ ముగ్గురు యువ నాయకులను తమ వైపు తిప్పుకుని ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించింది. దళిత నేత జిగ్నేష్ మేవానీ, ఓబీసీ నేత అల్పేష్ ఠాకూర్, పటేళ్ల నేత హర్దిక్ పటేళ్లు పెద్ద ఎత్తున బీజేపీకి వ్యతిరేకంగా ఎన్నికల ప్రచారాన్ని చేశారు. రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీ ఆయా రాష్ట్రాల్లో ఇదే రకమైన వ్యూహాన్ని అనుసరిస్తుందని బీజేపీ నాయకులు అంచనావేస్తున్నారు. కులాల మధ్య విద్వేషాలను రేపి తమ హిందూ ఓటు బ్యాంకును చెల్లాచెదురు చేయాలని చూస్తోందని భావిస్తున్నారు. దీనికి విరుగుడుగా బీజేపీ తన యువమోర్చా విభాగాన్ని రంగంలోకి దింపుతోంది. కాంగ్రెస్ పార్టీ కులాల మధ్య మంట పెడుతోందని ప్రచారం నిర్వహించాలని నిర్ణయించింది. వీటితో పాటు ప్రధాని న్యూఇండియా నినాదంతో కాంగ్రెస్‌కు విరుగుడు వేయాలని భావిస్తోంది. పెద్ద ఎత్తున కాలేజీలకు వెళ్లి కుల, మతాలకు అతీతంగా అభివృద్ధి రాజకీయాలను వివరించాలని ప్రణాళికలు రచించింది.

యూఏఈ లాటరీలో భారతీయుడికి జాక్‌పాట్



దుబాయ్: యునైటెడ్ అరబ్ ఎమిరైట్స్ (యూఏఈ) లోని అబూధాబి లో ఒక వాణిజ్య సంస్థలో పని చేస్తున్న కేరళ వాసి హరికృష్ణన్.వి.నాయర్‌కి 3.2 మిలియన్ డాలర్లతో సమానమైన 21 మిలియన్ దిర్హామ్ లాటరీ లభించింది. అబూ ధాబీలో ప్రవాస భారతీయుడు ఇంత పెద్ద మొత్తంలో జాక్ పాట్ కొట్టడం ఇదే మొదటిసారి.ఇంత పెద్ద మొత్తంలో లాటరీ గెల్చుకున్నందుకు అతడి ఆనందానికి అవధులు లేవు.ఖలీజ్ టైమ్స్‌తో మాట్లాడుతూ తన కుమారుని ఉన్నత విద్యాభ్యాసానికి ప్రణాళికను రూపొందించుకుంటాననీ, కేరళలో మరొక గృహాన్ని కొనుగోలు చేస్తానని చెప్పాడు.గత అక్టోబర్‌లో జరిగిన మెగా డ్రాలో 8 మంది భారతీయులు భారీ మొత్తాలలో జాక్‌పాట్ కొట్టారు.

పాతనోట్లతో ప్యాడ్‌లు



చెన్నై: నరేంద్రమోడీ 2016 నవంబర్ 8వ తేదీన రద్దు చేసిన వెయ్యి,ఐదొందల రూపాయల నోట్ల కట్టలు టన్నుల కొద్దీ మూలుగుతున్నాయి. వీటిని ఉపయోగంలోకి తెచ్చేందుకు ప్రభుత్వానికి మంచి ఆలోచన వచ్చింది. ప్రభుత్వ కార్యాలయాల్లో ఉపయోగించేప్యాడ్‌లను తయారు చేయడానికి పాతనోట్లను వినియోగించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. తమిళనాడులోని పుజల్ కేంద్ర కారాగారంలో ఖైదీలకు ఈ పని అప్పగించారు. జీవిత ఖైదీలకు ఇందులో ముందుగా శిక్షణ ఇప్పించారు.ప్రత్యేకంగా శిక్షణ పొందిన 25 నుంచి 30 మంది జీవిత ఖైదీలు ఇప్పటికి 1.5టన్నుల నోట్లను ప్యాడ్‌లుగా తయారు చేశారు. నెలకు 25 రోజుల పాటు ఖైదీలు ఈ పనిలో నిమగ్నమై ఉంటున్నారు. వారికి రోజుకు 160 నుంచి200రూపాయిల వరకూ వేతనాన్ని చెల్లిస్తున్నారు. ఇంతవరకు 9 టన్నుల నోట్లు వచ్చాయని అధికారి చెప్పారు.

నితీష్‌కు ముఫ్తీ మహ్మద్ సయీద్ అవార్డు



పాట్నా : బీహార్ సీఎం నితీష్‌కుమార్‌ను ముఫ్తీ మహ్మద్ సయీద్ అవార్డు వరించింది. రాజకీయ రంగంలో సేవలకు గాను ఈ అవార్డును జమ్మూ-కాశ్మీర్‌లో నిర్వహించిన ఓ అధికారిక కార్యక్రమంలో ఆయనకు గవర్నర్ ఎన్ఎన్ వోహ్రా ప్రదానం చేశారు. సయీద్ వర్ధంతిని పురస్కరించుకుని ఈ అవార్డును అందజేశారు. 2016, జనవరి 7న ముఫ్తీ కన్నుమూశారు. ఈ కార్యక్రమంలో ప్రస్తుత సీఎం మహబూబా ముఫ్తీ, యూకేకు చెందిన భారతీయ సంతతి రాజకీయ నాయకుడు మేఘంద్ దేశాయ్, బీహార్ డిప్యూటీ సీఎం సుశీల్ కుమార్ మోడీ, గవర్నర్ వీవీ వోహ్రాపాల్గొన్నారు. ఈ సందర్భంగా నితీష్‌కుమార్ మాట్లాడుతూ.. అవార్డును రావడంతో ఎంతో సంతోషంగా ఉందన్నారు.

ట్రంప్ టవర్‌లో మంటలు



వాషింగ్టన్: న్యూయార్క్‌లోని అత్యంత ఖరీదైన ఫిఫ్త్ అవెన్యూలోని ట్రంప్ టవర్‌లో అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. 68 అంతస్తుల భవనంలో ప్రమాద ఘటనపై అగ్నిమాపక సిబ్బంది తక్షణమే రంగంలోకి దిగారు. ఉదయం 8.30 గంటల ప్రాంతంలో జరిగిన ఘటనతో అక్కడ దట్టంగా పొగలు వ్యాపించాయి. నివాసితులు కొద్ది నిముషాలు భయాందోళనకు గురయ్యారు. భవన ఉష్ణోగ్రతలను నియంత్రించే హెచ్‌వీఏసీ వ్యవస్థలో సాంకేతిక సమస్యల కారణంగా మంటలు ఎగసిపడినట్లు ప్రాథమిక దర్యాప్తులో నిర్ధారించారు. ఇదే విషయాన్ని ట్రంప్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు ఎరిక్ ట్రంప్ ఈ మెయిల్ ద్వారా మీడియాకు తెలిపారు. ఎత్తయిన ఈ భవనంలోని పెంట్‌హౌస్ ట్రంప్‌దే కావడం విశేషం.

బహ్రెయిన్‌లో రాహుల్

● ఎన్ఐఆర్‌లతో ప్రత్యేక సమావేశం



బహ్రెన్: ఏఐసీసీ అధ్యక్షుడిగా పగ్గాలు చేపట్టిన తరువాత రాహుల్ మొట్టమొదటి సారిగా విదేశీ పర్యటన చేశారు. బహ్రెయిన్‌లో నిర్వహించిన సమావేశంలో ఎన్ఆర్ఐలనుద్దేశించి ఆయన ప్రసంగించారు. గ్లోబల్ ఆర్గనైజేషన్ ఆఫ్ పీపుల్ ఆఫ్ ఇండియా ఆర్జిన్ నిర్వహించిన సదస్సులో రాహుల్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అదేవిధంగా బహ్రెయిన్ ప్రధాని, రాజు అయిన సల్మాన్ బిన్ హమస్-అల్-ఖలీఫాను అల్‌వడీ ప్యాలెస్‌లో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సదస్సుకు సుమారు 50 దేశాల నుండి ప్రతినిధులు పాల్గొన్నారు. భారత్ నుండి వెళ్లి బహ్రెయిన్‌లో స్థిరపడి వ్యాపారాలు చేస్తున్న వారితో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. సదస్సులో రాహుల్ మాట్లాడుతూ.. భారత్ దేశంలో మోడీ ప్రభుత్వం కులాలు, మతాల ప్రాతిపదికన విభజింపు, పాలించు నినాదంతో ముందుకెళ్తున్నది విమర్శించారు. అమెరికా, బర్కిలీ, ప్రిన్స్టన్‌లోని యూనైటెడ్ స్టేట్ యూనివర్సిటీలను చివరిసారిగా రాహుల్ సందర్శించినట్టు తెలిపారు. ఆ సమయంలో ప్రతీ ఒక్కరు రాహుల్ కాంగ్రెస్ చీఫ్‌గా రావాలని కోరుకున్నట్టు పార్టీ వర్గాలు ఈ సందర్భంగా వివరించాయి. బహ్రెన్ రాజుతో రాహుల్ క్రీడల విషయమై చర్చించారు.

రాహుల్‌తో మధుయాష్కీ

గల్ఫ్‌లోని బహ్రెయిన్ దేశంలో జరుగుతున్న గోపియో సదస్సులో ఏఐసీసీ అధ్యక్షులు రాహుల్‌గాంధీతో నిజామాబాద్ మాజీ పార్లమెంట్ సభ్యులు, ఏఐసిసి కార్యదర్శి మధుయాష్కీ పాల్గొనున్నారు. గ్లోబల్ ఆర్గనైజేషన్ పీపుల్ ఆఫ్ ఇండియన్ అరిజిన్(గోపియో) ఆధ్వర్యంలో ప్రతి రెండేళ్ళకొకసారి ఈ సదస్సు నిర్వహిస్తారు. ఏర్పాట్లను పర్యవేక్షించేందుకు రెండ్రోజుల ముందు ఏఐసీసీ తరపున మధుయాష్కీ బహ్రెయిన్ చేరుకున్నారు. రాహుల్ ఏర్పాట్లను మధుయాష్కీ పర్యవేక్షించారు.

రెస్టారెంట్‌లో అగ్ని ప్రమాదం

ఐదుగురు సజీవ దహనం



బెంగళూరు : కలాసీపాల్యా ప్రాంతంలోని కుంభార సంఘ్ బిల్డింగ్‌లో కొనసాగుతున్న బార్ కం రెస్టారెంట్‌లో సోమవారం తెల్లవారు జామున జరిగిన అగ్ని ప్రమాదంలో ఐదుగురు మృతి చెందారు. మృతులంతా బార్ కం రెస్టారెంట్‌లో పనిచేస్తున్న వారే. గాఢ నిద్రలో ఉన్న సమయంలో ఈ అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. 70 ఏళ్ల క్రితం నిర్మించిన ఓ పురాతన భవనం గ్రౌండ్ ఫ్లోర్‌లో ఈ రెస్టారెంట్ కొనసాగుతున్నది. విషయం తెలుసుకున్న ఫోరెన్సిక్ నిపుణులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతి చెందిన వారిని స్వామి (23), ప్రసాద్ (20), మహేశ్ (35)గా గుర్తించారు. వీరంతా టుంకుర్ వాస్తవ్యులు. మంజునాథ్ (45), కీర్తి (24) హసన్, మాండ్యా వాసులుగా పోలీసులు గుర్తించారు. రెస్టారెంట్ అంతా పొగతో నిండిపోవడంతో స్థానికులు ఉదయం 2.30 నిమిషాలకు గుర్తించారు. అనంతరం అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం అందించారు. పోలీసులు యజమాని ఆర్‌వీ దయాశంజర్‌కు తెలియజేసేందుకు చూడగా అతను అందుబాటులోకి రాలేదు. ఉదయం 4 గంటల సమయంలో ఫోన్ ద్వారా సమాచారం ఇవ్వగా వస్తున్నట్టు చెప్పి సెల్ స్విచ్ ఆఫ్ చేసినట్టు తెలిపారు. పట్టణాభివృద్ధి శాఖ మంత్రి కేజే జార్జ్ ఘటనాస్థలాన్ని పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట బెంగుళూరు మేయర్ ఆర్ సంపత్ రాజ్ ఉన్నారు. మృతులకు రూ.5లక్షల ఎక్స్‌గ్రేషియా అందివ్వనున్నట్టు ప్రకటించారు. రెస్టారెంట్ నిర్వాహకులు అగ్నిమాపక నియంత్రణ పరికరాలు ఉపయోగించకపోవడం తోనే ప్రాణనష్టం సంభవించిందని అగ్నిమాపక శాఖ అధికారులు వివరించారు. ఇలాంటి ఘటనలు మళ్లీ పునరావృతం కాకుండా అన్నీ బార్లు, రెస్టారెంట్లకు నోటీసులు అందజేస్తామని తెలిపారు. యజమానిపై ఐపీసీ సెక్షన్ 304 కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీస్ కమిషనర్ టి.సునీల్ కుమార్ తెలిపారు. ఘటనకు కారణమైన ఎవరినీ వదిలి పెట్టేది లేదని కర్నాటక హోంమంత్రి రామలింగరెడ్డి తెలిపారు.

బాబా రాఘవ్ దాస్ మెడికల్ కళాశాలలో...

గోరఖ్‌పూర్ బాబా రాఘవ్ దాస్ మెడికల్ కళాశాలలో సోమవారం ఉదయం అగ్ని ప్రమాదం సంభవించింది. గత ఏడాది పలువురు చిన్నారులు ఇదే ఆస్పత్రిలో మృతి చెందడం గమనార్హం. ఆరు ఫైరింజన్లు ఘటనా స్థలానికి చేరుకుని మంటలు అదుపులోకి తీసుకొచ్చాయి. ప్రిన్సిపల్ ఆఫీసుతో పాటు పక్కనే ఉన్న మరో గదిలో అగ్ని ప్రమాదం చోటు చేసుకున్నట్టు అగ్నిమాపక శాఖ అధికారులు గుర్తించారు. షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదం సంభవించినట్టు ఉత్తర మండల ఎస్పీ గణేష్ సాహా తెలిపారు. అగ్ని ప్రమాదానికి సంబంధించి కారణాలు తెలుసుకోవడానికి ఓ కమిటీని ఏర్పాటు చేసినట్టు అగ్నిమాపక శాఖ ప్రత్యేక అధికారి టీకే సింగ్ తెలిపారు.

12న అంతరిక్షంలో 31 ఉపగ్రహాలు


బెంగళూరు : జనవరి 12న 31 ఉపగ్రహాలు అంతరిక్షంలో పంపించడానికి ఇస్రో సన్నద్ధం అవుతున్నది. అమెరికాకు చెందిన 28 శాటిలైట్‌లతో పాటు మరికొన్ని దేశాలకు చెందిన ఉపగ్రహాలు సైతం పంపించనున్నట్టు తెలిపారు. జనవరి 12న ఉదయం 9.30 నిమిషాలకు ఇస్రో అంతరిక్షం లోకి పంపనున్నట్టు డైరెక్టర్ దేవి ప్రసాద్ కార్మిక్ తెలిపారు. శ్రీహరి కోట నుండి ప్రయోగించనున్నట్టు తెలిపారు.

అన్సారీకి 'గోల్డెన్ గ్లోబ్'

కాలిఫోర్నియా: అమెరికా లోని కాలిఫోర్నియాలో గోల్డెన్ గ్లోబ్ అవార్డుల వేడకలో భారత సంతతకి చెందిన నటుడు అజీజ్ అన్సారీ రికార్డు సృష్టించాడు. కామెడీ టీవి సీరీస్‌లో ఉత్తమ నటునిగా అవార్డు అందుకున్నాడు.ఈ అవార్డు అందుకున్న తొలి ఆసియన్-అమెరికన్‌గా గుర్తింపు పొందారు. మాస్టర్ ఆఫ్ నన్‌లో నటనకు గాను అతడికి ఈ అవార్డు లభించింది.అతడి వయస్సు 34 సంవత్సరాలు. తాను గెలుస్తానని అనుకోలేదనీ,ఈ అవార్డు వచ్చినందుకు ఎంతో ఆనందంగా ఉందని అతడు పేర్కొన్నాడు.అన్సారీ తమిళ ముస్లిం కుటుంబానికి చెందిన వాడు. వాయిస్ ఆర్టిస్టుగా,ప్రొడ్యూసర్‌గా హాలీవుడ్‌లో అతడు రాణిస్తున్నాడు. స్వేచ్ఛ నిచ్చిన తల్లితండ్రులకు రుణపడి ఉంటానన్నారు.

రైల్వే భద్రతకు డ్రోన్ నిఘా

● భద్రత, సమర్ధత, ట్రాక్‌ల నిర్వహణకు కొత్త ఆలోచన ● డ్రోన్ కెమెరాలు వినియోగించాలని జోన్‌లకు ఆదేశాలు



న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : రైళ్ల నిర్వహణ, పనితీరు మెరుగుపర్చేందుకు రైల్వే శాఖ కొత్త ఆలోచనలకు శ్రీకారం చుట్టింది. రైళ్ల భద్రత, సమర్ధతను పెంచేందుకు డ్రోన్ కెమెరాలను వినియోగించాలని నిర్ణయిచింది. దీనితో రైల్వే ప్రాజెక్టుల పర్యవేక్షణ, ట్రాక్ మెయింటెనెన్స్ , మౌలిక సదుపాయాల పరిస్థితిని ప్రత్యక్షంగా తెలుసుకునే అవకాశముంది. రైల్వే శాఖ చేపడుతున్న అన్ని పనుల్లో ఇక నుంచి డ్రోన్ కెమెరాలను వినియోగించనున్నారు. యూఏవీ, నేత్ర టెక్నాలజీతో ఉన్న డ్రోన్ కెమెరాలను వాడాలని రైల్వే నిర్ణయించింది. ఈ మేరకు అన్ని రైల్వే జోన్‌లకు ఆదేశాలు జారీ చేశారు. అన్ని పనుల పర్యవేక్షణకు కెమెరాలను ఉపయోగించుకోవాలని కోరారు. ప్రమాదాలు జరిగిన సమయంలో సైతం డ్రోన్ కెమెరాలను ఉపయోగించి సహాయ చర్యలను పర్యవేక్షిస్తారు. వీటితో ఆయా ప్రాజెక్టుల పురోగతి, ట్రాక్‌ల కండీషన్, ప్రధానమైన పనుల ఎలా జరుగుతున్నాయి తదితర అంశాలను నేరుగా తెలుసుకుంటారు. నాన్ ఇంటర్‌లాకింగ్ పనులకు సంబంధించి పనుల సంసిద్ధతను తెలుసుకునేందుకు ఉపయోగిస్తారు. ఆయా మేళాలలో ఎంత భారీ సంఖ్యలో జనం పాల్గొన్నారనే విషయాలు తెలుసుకోవడం, రైల్వే పనులలో మిగిలిపోయిన తుక్కు , స్టేషన్ పరిసరాలలో నెలకొన్న క్రౌడ్ పరిస్థితులను తెలుసుకోనున్నారు. సాంకేతికతను అమలుపర్చడం, కెమెరాలను సమకూర్చుకోవడంలో వెస్ట్ సెంట్రల్ రైల్వే ముందంజలో ఉంది. ఇప్పటికే డ్రోన్ కెమెరాలను సమకూర్చుకుని, జోన్ పరిధిలోని ప్రాంతాల్లో ప్రయోగాత్మకంగా వాటి పనితీరును పరీక్షిస్తోంది. మూడు డివిజన్లలో ఈ కెమెరాలను అమర్చి ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తోంది. జబల్‌పూర్ డివిజన్, భోపాల్ డివిజన్, కోటా డివిజన్‌లలోని పలు రైల్వే ప్రాజెక్టు పనుల వద్ద వీటిని వినియోగిస్తున్నారు. బిన - కత్ని మధ్య నిర్మిస్తున్న మూడో రైలు లైన్ ప్రాజెక్టు పనులను డ్రోన్ ద్వారా పర్యవేక్షిస్తున్నారు. అలాగే కత్ని - సింగ్రౌలి మధ్యలోని డబ్లింగ్ పనులను, ఘాట్ సెక్షన్‌లలో మలుపుల వద్ద ఉన్న పరిస్థితులను డ్రోన్ కెమెరా ద్వారా తెలుసుకుంటున్నారు.

ప్రమాదాలకు, అవినీతికి చెక్

ఇటీవల కాలంలో ట్రాక్‌లు దెబ్బతిని అనేక రైలు ప్రమాదాలు జరిగాయి. అనేక మంది ప్రయాణికులు చనిపోయారు. రైల్వేకు అపారనష్టం జరిగింది. ఈ ప్రమాదాలు రైల్వేశాఖలో దశాబ్దాలుగా పరిపాటిగా మారాయి. అయితే సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుని చెక్ పెట్టేందుకు రైల్వేశాఖ ఉన్నతాధికారులు భావిస్తున్నారు.

25న 'పద్మావత్' విడుదల

న్యూఢిల్లీ: 'పద్మావత్' నీరీక్షణకు ఎట్టకేలకు తెరపడింది. వివాదాస్పద చిత్రం పద్మావతిని పద్మావత్‌గా మార్చిన అనంతరం ఈ నెల 25న విడుదల చేసేందుకు చిత్ర యూనిట్ సన్నాహాలు చేస్తుంది. కొన్ని సవరణలు తర్వాత సెన్సార్ బోర్డు ఈ చిత్రం విడుదలకు అంగీకరించింది. సవరణల్లో భాగంగా చిత్రం పేరును పద్మావతి నుంచి పద్మావత్‌గా మార్చారు. వివాదాల్లో చిక్కుకుని విడుదల విషయం సందిగ్ధంగా మారిన నేపథ్యంలో సినిమా విడుదలకు మార్గం సుగమం అవటంతో బాలీవుడ్‌లో పలువురు నటులు, టెక్నిషియన్లు హర్షం వ్యక్తం చేశారు.దీపికా పదుకొనే, రణ్‌వీర్ సింగ్, షాహిద్ కపూర్ ప్రధాన పాత్రలు పోషించిన ఈ చిత్రానికి సంజయ్‌లీలా బన్సాలీ దర్శకత్వ బాధ్యతలు నెరవేర్చిన సంగతి తెలిసిందే.

పత్రికా స్వేచ్ఛకు కట్టుబడి ఉన్నాం

న్యూఢిల్లీ: పత్రికా స్వేచ్ఛకు కట్టుబడి ఉన్నామని కేంద్రం పేర్కొంది.ఆధార్ కార్డుల వివరాలు గోప్యత గురించి రాసిన విలేఖరి పేరు ఎఫ్ఐఆర్‌లో చేర్చడంపై విమర్శలు రేగిన నేపథ్యంలో కేంద్రం స్పందించింది. ఈ మేరకు మంత్రి రవిశంకర్ ప్రసాద్ స్పందిస్తూ కేంద్రం పత్రికాస్వేచ్ఛకు చిత్తశుద్ధితో కట్టుబడి ఉందన్నారు. అభివృద్ధికి దోహదం చేసే ఆధార్ గోప్యత కాపాడటం తమ బాధ్యత అన్నారు. ప్రాథమిక దర్యాప్తు పత్రంలో గుర్తు తెలియన వ్యక్తులపై మాత్రమే నమోదు చేశారని తెలిపారు. ఆధార్ వివరాలు గోప్యంగాలేవని ఓ పత్రిక వెలువరించిన కథనానికి సంబంధించి యూఐడీఏఐ డిప్యూటీ డైరెక్టర్ పట్నాయక్ ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు. ఆధార్ వివరాలను ఓ పత్రిక కొనుగోలు చేసిందని సమాచారం అందిందనీ ఇది ఆధార్ గోప్యతను అతిక్రమించడమేనని పట్నాయక్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు.

తొలిప్రేమలో ఓడాను: రజనీకాంత్

చెన్నై: సూపర్‌స్టార్ రజనీకాంత్ తన తొలి ప్రేమ గురించి విఫలమైనట్టు తెలిపారు. తాజాగా జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన్ను టీనేజ్ లవ్ గురించి ప్రశ్నించగా... దీనిపై తలైవా స్పందిస్తూ... 'నాకూ తొలిప్రేమ ఉంది. నేను హైస్కూల్‌లో ఉన్నప్పుడు ప్రేమలో పడ్డాను. చాలా మంది తమ తొలిప్రేమను గెలవగలిగారు. కానీ నేను ఆమె హృదయాన్ని గెలుచుకోలేకపోయాను' అని చెప్పారు. అనంతరం ఆమె పేరు చెప్పాల్సిందిగా కోరగా, చెప్పడానికి ఆయన నిరాకరించారు. ఆ తర్వాత 'మీ చిన్న, పెద్ద కోరికలు ఏంటి?' అని ప్రశ్నించగా, 'ఒక స్కూటర్, ఓ చిన్న ఇల్లుకట్టుకుని మధ్యతరగతి కుటుంబంలా జీవించాలన్నది నా చిన్న కోరిక, ఇక నా సినిమాల ద్వారా ప్రజలు, అభిమానులకు మంచి సందేశాలు అందిస్తూ వారి ముఖాల్లో చిరునవ్వు చూడాలి అనుకోవడమే నా పెద్ద కోరిక' అని రజనీ అన్నారు. తలైవా హీరోగా నటించిన '2.ఓ' సినిమా విడుదలకు సిద్ధమౌతోంది.

ట్రంప్ హెచ్చరిక సమర్ధనీయమే..

వాషింగ్టన్ : యుద్ధోన్మాద హెచ్చరికలు చేస్తున్న ఉత్తరకొరియాఅధినేత కిమ్ జోంగ్ ఉన్ కి అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌దీటైన రీతిలో సమాధానమిచ్చారని సమితిలో అమెరికా రాయబారి నిక్కీహేలీ సమర్ధించుకున్నారు. తమ వద్ద ఉన్న అణ్వస్త్రం బటన్ నొక్కితే అమెరికా సర్వనాశనమై పోగలదంటూ డాంబికాలు పలికిన కిమ్‌ని హెచ్చరిస్తూ తమ వద్ద అంతకన్నా ఎక్కువ శక్తివంతమైన అణ్వస్త్రాలు ఉన్నాయంటూ ట్రంప్ ఇటీవల ట్విట్టర్‌లో హెచ్చరించడాన్ని ఆమె సమర్ధించారు. కిమ్ ఏ స్థాయిలో మాట్లాడితే ఆ స్థాయిలో సమాధానం చెప్పే సామర్థ్యం ట్రంప్‌కి ఉందని ఆమె అన్నారు. కిమ్ ప్రకటనలు చూసి ప్రపంచ దేశాలు అసహ్యించుకుంటున్నాయనీ,అతడు ఇలాంటి ప్రకటనలకు ఇకనైనా స్వస్తి చెప్పాలనిఆమె హెచ్చరించారు. దక్షిణ కొరియాతో సామరస్యంతో మెలిగితేనే ఉత్తర కొరియా మనుగడ సాధ్యమని ఆమె అన్నారు.

'సల్మాన్.. పెళ్లి వద్దు.. పిల్లల్ని కను'

ముంబై: సుమారు దశాబ్ద కాలం నుంచి సల్మాన్ ఖాన్ పెళ్లి విషయమై వార్తలు వింటూనే ఉన్నాం. ఎప్పుడు పెళ్లి చేసుకుంటాడా అని ఎదురుచూస్తున్న వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతూనే ఉంది కానీ జవాబు మాత్రం దొరకడం లేదని కొంతమంది సరదాగా వ్యాఖ్యానిస్తున్నారు. అయితే, తాజాగా సల్మాన్ పెళ్లి గురించి బాలీవుడ్ వెటరన్ హీరోయిన్ రాణి ముఖర్జీ ఆసక్తికరంగా స్పందించింది. తన తాజా చిత్రం 'హిచ్‌కీ' ప్రచారం కోసం సల్మాన్ హోస్ట్‌గా వ్యవహరిస్తున్న 'బిగ్‌బాస్-11'కి రాణి ముఖర్జీ వచ్చింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సల్మాన్ పెళ్లి గురించి ఒక సలహా ఇచ్చింది. 'సల్మాన్ పెళ్లి చేసుకోకూడదు. అయితే, పిల్లల్ని మాత్రం కనాలి. అప్పుడే నా కూతురు అదీరా ఆడుకోవడానికి తోడు దొరుకుతుంది. అలాగే సల్మాన్‌కు పెట్టబోయే పిల్లలు అచ్చం నాన్నలాగానే అందంగా ఉండాల'ని ముఖర్జీ సలహా చెప్పింది.

గాంధీ హత్యపై విచారణ అనవసరం

న్యూఢిల్లీ: మహాత్మాగాంధీ హత్య కేసులో నాథూరాం గాడ్సే, నారాయణ ఆప్టే కాకుండా మూడో వ్యక్తి ప్రమేయం ఉందన్న పిల్ పై న్యాయ సహాయకుడు అమరేంద్ర శరణ్ తన అభిప్రాయాన్ని కోర్టును నివేదించారు. నాథూరాం గాడ్సే, నారాయణ ఆప్టేయే గాంధీజిని హత్య చేసినట్లు వివిధ పత్రాల ద్వారా తెలుస్తోందని కోర్టుకు వెల్లడించారు. గాంధీజిని నాథురాంగాడ్సే, ఆప్టే తప్ప మరొకరు హత్య చేసినట్లు ఎలాంటి ఆధారాలు లభించలేదని,విచారణ అనవసరమని పేర్కొన్నారు. ముంబైకి చెందిన హిందూ గ్రూప్ ట్రస్టీ గతేడాది అక్టోబర్‌లో సుప్రీంకోర్టులో దాఖలు చేసిన ప్రజాహిత వ్యాజ్యంపై విచారణ జరిపిన సుప్రీంకోర్టు ఈ కేసులో సీనియర్ న్యాయవాది శరన్ ను న్యాయసహాయకుడిగా నియమించింది. ట్రస్టీకి చెందిన అభినవ్ భారత్, పంకజ్ ఫాండ్నీస్ గాంధీ హత్యపై పలు అనుమానాలను లేవనెత్తుతూ సుప్రీంకోర్టులో పిల్ వేశారు.

థియేటర్లలో జాతీయగీతంపై కేంద్ర కమిటీ

న్యూఢిల్లీ: జాతీయ గీతాన్ని థియేటర్లలో బహిరంగ ప్రదేశాల్లో ప్రదర్శనపై కేంద్రం సోమవారం నూతన నియమావళిని రూపొందించడానికి మంత్రివర్గ కమిటీని ఏర్పాటు చేయనున్నట్టు అఫిడవట్లో పేర్కొంది. దీనిపై తగిన కసరత్తు చేసేందుకు ఆరునెలల సమయం పట్టవచ్చన్నారు. ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రా నేతృత్వంలోని ధర్మాసనం ముందు ప్రభుత్వ దాఖలు చేసిన అఫిడవిట్లో సుప్రీంకోర్టుకు తెలియజేయడం జరిగింది. దేశంలోని అన్ని సినిమాహాళ్లలో చలనచిత్ర ప్రదర్శనకు ముందు జాతీయగీతాన్ని ప్రదర్శించాలని నవంబర్ 30, 2016లో సుప్రీంకోర్టు ఆదేశించిన విషయం తెలిసిందే.

కుక్కల దాడిలో బాలిక మృతి

జార్ఖండ్: కుక్కల దాడిలో జార్ఖండ్లో బాలిక మృతి చెందింది. ఆదివారం ఉదయం జార్ఖండ్‌లోని కోడెర్మ జిల్లాలో మార్కోచ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఒకగ్రామంలో ఈ దుర్ఘటన చోటు చేసుకుంది.ఈ సంఘటనపై పోలీసులు తెలిపిన వివరాలు ఈవిధంగా ఉన్నాయి. భగవతిది గ్రామంలో పన్నెండేళ్ల బాలిక ఇంటిముందు కాలకృత్యం తీర్చుకునేందుకు బయటకురాగా కుక్కలు సామూహిక దాడి చేయటంతో ప్రాణాలు విడిచిందని పోలీసులు తెలిపారు. ఈ సంఘటనపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని చెప్పారు.

చెప్పుల దండతో బీజేపీ ఎమ్మెల్యేకు స్వాగతం

ధార్: మధ్యప్రదేశ్‌లోని ధార్ జిల్లా ధమ్నోడ్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న బీజేపీ ఎమ్మెల్యే దినేశ్ శర్మకు స్థానిక ప్రజలు చెప్పుల దండ వేసి స్వాగతం పలికారు. త్వరలో జరుగనున్న పురపాలక ఎన్నికల సందర్భంగా ప్రచారానికి వచ్చిన ఎమ్మెల్యేపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తూ చెప్పుల దండ వేశారు. నీటి కోసం తీవ్రమైన ఇక్కట్లు పడుతున్నామని, దాని గురించి గతంలో ఫిర్యాదు చేశామని ఎమ్మెల్యేకు చెప్పుల దండ వేసిన వ్యక్తి చెప్పారు. తమ కుటుంబాల మహిళలు అప్పటి చైర్‌పర్సన్‌కు నీటి ఎద్దడిపై ఫిర్యాదు ఇవ్వడానికి వెళితే ఫిర్యాదు స్వీకరించడానికి బదులు వారిపైనే కేసు నమోదు చేశారని ఆయన అన్నారు. అనేకసార్లు రాత్రిళ్లుకూడా ఆడవారిని విచారణ అంటూ పోలీస్‌స్టేషన్లకు పిలిచారని ఆ వ్యక్తి చెప్పాడు. చెప్పుల దండ వేయడంపై దినేశ్ శర్మ స్పందిస్తూ వారందరూ తమ వారేనని, తాను వారి కుమారుడి వంటి వాడినని చెప్పారు.

క్రీడాప్రభ

తొలి టెస్టు సఫారీలదే

- 73 పరుగుల తేడాతో దక్షిణాఫ్రికా విజయం
- రెండో ఇన్నింగ్స్‌లో 135 పరుగులకే చేతులెత్తేసిన ఇండియా
- ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ ఫిలాండర్

కేప్‌టౌన్: దక్షిణాఫ్రికాతో ఆడుతున్న తొలి టెస్ట్ మ్యాచ్‌లో ఇండియా ఓటమినుంచి తప్పించుకోవడానికి శతవిధాలా ప్రయత్నించి విఫలమైంది. భారత్ విజయానికి మరో 72 పరుగుల దూరంలో భారత్ ఇన్నింగ్స్ (135/ఆలౌట్) ముగిసింది. దీనితో సఫారీలు మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో 1-0 ఆధిక్యం సాధించారు. భారత్ తన రెండో ఇన్నింగ్స్‌లో బ్యాట్స్‌మన్లు ఆదినుంచే తడబడ్డారు. ఏడో ఓవర్లోనే తొలి వికెట్ పడింది. పిచ్ బౌలింగ్‌కు అనుకూలించడంతో సఫారీ బౌలర్లు చెలరేగిపోయారు. ముఖ్యంగా భారత తొలి ఇన్నింగ్స్‌లో మూడు వికెట్లు తీసిన


ఫిలాండర్

ఫిలాండర్ రెండో ఇన్నింగ్స్‌లో రెచ్చిపోయాడు 15.4 ఓవర్లు వేసి 42 పరుగిలిచ్చి 6 వికెట్లు తీశాడు. కాగా, సఫారీలు తొలి ఇన్నింగ్స్‌లో 286 పరుగులు చేయగా, భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 130పరుగులకు ఆలౌట్ అయింది. మూడోరోజు ఆట వర్షార్పణం కావడంతో సోమవారం నాలుగోరోజు వరుణుడు తెరిపి ఇచ్చాడు. రెండో ఆట ముగిసే సమయానికి క్రీజులో ఉన్న సఫారీ బ్యాట్స్‌మన్లు అషీం ఆమ్లా(4), రబాడా(2) నాలుగోరోజు రెండో ఓవర్లో మహ్మదా షమీ వేసిన బంతిని ఆడబోయి ఆమ్లా రోహిత్ శర్మకు క్యాచ్ ఇచ్చి ఔటయ్యాడు. అనంతరం బ్యాటింగ్‌కు వచ్చిన డివిలియర్స్ నిలకడగా ఆడుతూ సఫారీల స్కోరును ముందుకు పరుగెత్తించాడు. జట్టు స్కోరు 73 పరుగుల వద్ద రబాడా(5) వికెట్‌ను కూడా షమీ చేజిక్కుంచుకున్నాడు. ఆ తర్వాత వచ్చిన బ్యాట్స్‌మన్‌లెవరూ కూడా భారత బౌలర్ల ధాటికి నిలబడలేకపోయారు. సఫారీల వికెట్లు టపటపా రాలిపోయాయి. భారత బౌలర్ల సహనాన్ని పరీక్షిస్తున్న డివిలీయర్స్ 35 పరుగులు చేసి బూమ్రా బౌలింగ్‌లో భువనేశ్వర్ క్యాచ్ పట్టగా పదవ వికెట్‌గా వెనుతిరిగాడు. మొత్తానికి సఫారీలు తమ రెండో ఇన్నింగ్స్‌లో 130 పరుగులు చేశారు. భారత్ గెలవాలంటే 208 పరుగులు సాధించాల్సి ఉంది. అనంతరం లక్ష్య ఛేదన ప్రారంభించిన భారత ఓపెనర్లు శిఖర్ ధావన్, మురళీ విజయ్‌లు సఫారీల బౌలింగ్ ధ్వయం ఫిలాండర్, మోర్కెల్లను బాగానే ఎదుర్కొన్నారు. అయితే ఫిలాండర్ ఇన్నింగ్స్ ఏడవ ఓవర్లో ధావన్‌ను ఔట్ చేశాడు. ధావన్ 20 బంతులు ఎదుర్కొని 16 పరుగులు చేశాడు. అనంతరం బ్యాటింగ్‌కు వచ్చిన పూజారా, విజయ్‌తో కలిసి స్కోరును నెమ్మదిగా కొనసాగిస్తున్న సమయంలో.. విజయ్13 (32 బంతులు) రెండో వికెట్‌గా ఫిలాండర్‌కు చిక్కాడు. ఈ దశలో బ్యాటింగ్‌కు వచ్చిన కెప్టెన్ కోహ్లీ వీరోచితంగా ఆడుతూ స్కోరును ముందుకు పరుగెత్తించాడు. కోహ్లీ బరోసాతో భారత్ విజయ్ ఖాయమని అందరూ అనుకుంటున్న సమయంలో.. పూజారా 4(13బంతులు) మోర్కెల్ బౌలింగ్‌లో డికాక్‌కు క్యాచ్ ఇచ్చి ఔటయ్యాడు. 13 ఓవర్లు గడిచేసరికి భారత్ స్కోరు 39/3. అనంతరం బ్యాటింగ్ వచ్చిన రోహిత్ శర్మ, కెప్టెన్ కోహ్లీతో జతకలిశాడు. 21 ఓవర్లు ముగిసే సరికి భారత్ 71 పరుగులకు 3 వికెట్లు కాగా అనంతరం భారత్ వరుసగా వికెట్లను కోల్పోయింది. 22వ ఓవర్లో బౌలింగ్‌కు వచ్చిన ఫిలాండర్, కోహ్లీని28(బంతులు40) ఎల్బీడబ్ల్యు చేశాడు. 22 ఓవర్లు ముగిసేసరికి భారత్ స్కోరు 71/4గా ఉంది. కోహ్లీ స్థానంలో బ్యాటింగ్‌కు సాహా వచ్చాడు. 24వ ఓవర్లో రోహిత్ 10(30బంతులు) ఫిలాండర్ బౌలింగ్‌లో క్లీన్‌బౌల్డ్ అయ్యాడు. తొలి ఇన్నింగ్స్‌లో ఆదుకున్న హార్థిక్ పాండ్యా ఈ సారీ విఫలమయ్యాడు. కేవలం ఒక పరుగు చేసి రబాడా బౌలింగ్‌లో డివిల్లియర్స్‌కు క్యాచ్ ఇచ్చి ఆరవ వికెట్‌గా వెనుదిరిగాడు. అప్పటికి భారత్ స్కోరు 77 పరుగులు మాత్రమే. అనంతరం ఆశ్విన్ బ్యాటింగ్‌కు వచ్చాడు. 29వ ఓవర్లో రబాడా బౌలింగ్‌లో సాహా 8(19బంతులు) ఎల్బీడబ్ల్యుగా వెనుదిరిగాడు. దీనిపై భారత్ రీవ్యూ కోరగా నిర్ణయం సఫారీలకు అనుకూలంగా వచ్చింది. సాహా స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చిన భువనేశ్వర్‌కుమార్, ఆశ్విన్‌కు జతకలిసి భారత స్కోరును వంద దాటించారు. అడపా దడపా ఫోర్లు కొడుతూ వీరిద్దరూ కుదురుకున్నట్లే కన్పించారు కాని.. ఫిలాండర్ వేస్తున్న 43వ ఓవర్లో ఆశ్విన్ బంతిని కట్ చేయబోయి డికాక్‌కు క్యాచ్ ఇచ్చాడు. అంతవరకు భారత శిబిరంలో ఆశలు రేపిన ఆశ్విన్ వెనుదిరగడంతో ఇక భారత్ ఓటమి దాదాపుగా నిశ్చయమైంది. అనంతరం షమి వచ్చి నాలుగుపరుగులు చేసి ఫిలాండర్ బౌలింగ్‌లో డుప్లెస్సిస్‌కు క్యాచ్ ఇచ్చి ఔట్‌కాగా బూమ్రా ఫిలాండర్ బౌలింగ్‌లోనే డుప్లెస్సిస్‌కే క్యాచ్ ఇచ్చి పరుగులేమీ చేయకుండానే ఔటయ్యాడు. దీనితో భారత్ 135 పరుగులకు ఆలౌట్ అయింది. సఫారీ జట్టు 72 పరుగుల తేడాతో గెలిచింది. రెండు ఇన్నింగ్స్‌లలో భారత్ నడ్డి విరిచిన ఫిలాండర్‌కు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు లభించింది. కాగా భారత్ రెండో ఇన్నింగ్స్‌లో కేవలం 17 ఫోర్లు మాత్రమే నమోదయ్యాయి. వాటిలో ఆశ్విన్ కొట్టినవి 5 కాగా, 4 ఫోర్లు కోహ్లీ, విజయ్, ధావన్, సాహాతలా 2 ఫోర్లు కొట్టగా, భువనేశ్వర్ కుమార్, షమీ చెరొక ఫోర్ కొట్టారు. సిక్సర్లు నమోదు కాలేదు.



స్కోరు బోర్డు:

దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్: 286 ఆలౌట్, భారత్ తొలి ఇన్నింగ్స్:209 ఆలౌట్,

దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్: ఎల్గర్ (సి) సాహా (బి) పాండ్యా 25, మర్‌క్రమ్ (సి)భువనేశ్వర్ (బి) పాండ్యా 34, ఆమ్లా (సి) రోహిత్ (బి) షమీ 4, డివిలియర్స్ (సి) భువనేశ్వర్ (బి) బుమ్రా 35, డు ప్లెసిస్ (సి) సాహా (బి) బుమ్రా 0, డి కాక్ (సి) సాహా (బి) బుమ్రా 8, ఫిలాండర్ ఎల్బీడబ్ల్యు(బి) షమి 0, మహరాజ్ (సి)సాహా(బి) భువనేశ్వర్ 15 రబాడ (సి) కోహ్లీ (బి) షమీ 5, స్టెయిన్ నాటౌట్ 0, మోర్కెల్ (సి) సాహా (బి) భువనేశ్వర్ 2, ఎక్స్‌ట్రాలు 2, మొత్తం 130ఆలౌట్(41.2 ఓవర్లు), వికెట్ల పతనం: 52-1, 59-2, 66-3,73-4, 82-5, 92-6, 95-7, 122-8, 130-9, 130-10.

భారత్ తొలి ఇన్నింగ్స్: విజయ్ (సి) డివిల్లియర్స్ (బి) ఫిలాండర్ 13, ధావన్ (సి) మోరిస్ (బి) మోర్కెల్ 16, పుజారా బ్యాటింగ్ 5, విరాట్ (సి) డికాక్ (బి) మోర్కెల్ 4, కోహ్లీ ఎల్బీడబ్ల్యు (బి) ఫిలాండర్ 28, రోహిత్ శర్మ (బి) ఫిలాండర్ 10, సాహా ఎల్బీడబ్ల్యు (బి) రబాడా 8, పాండ్యా (సి)డివిల్లియర్స్ (బి)రబాడా 1, ఆశ్విన్ ఎల్బీడబ్ల్యు (బి) ఫిలాండర్ 37, భువనేశ్వర్ కుమార్ నాటౌట్ 13, షమీ (సి) ప్లెస్సిస్ (బి)ఫిలాండర్ 4, బుమ్రా (సి) ప్లెస్సిస్ (బి)ఫిలాండర్ 0, ఎక్స్‌ట్రాలు 1,

మొత్తం :135 ఆలౌట్(42.4 ఓవర్లు), **దక్షిణాఫ్రికా బౌలింగ్:** ఫిలాండర్ 15.4-42-6, మోర్కెల్ 11-39-2, రబాడా12-41-2,మహరాజ్ 4-12-0

యాషెస్‌తో టెస్ట్ ర్యాంకులు తారుమారు

ఇంగ్లండ్ ఐదుకు డౌన్, ఆస్ట్రేలియా 3కు అప్



దుబాయ్: యాషెస్ సిరీస్‌లో ఆస్ట్రేలియా విజయం అనంతర ప్రపంచ టెస్ట్ ర్యాంకులు మారాయి. ఇప్పటివరకు ఐదో స్థానంలో ఉన్న ఆస్ట్రేలియా 104 పాయింట్లతో మూడో స్థానానికి ఎగబాకగా, మూడో స్థానంలో ఉన్న ఇంగ్లండ్ 99 పాయింట్లతో ఐదో స్థానానికి దిగజారింది. కాగా భారత్ 124 పాయింట్లతో అగ్ర స్థానంలో ఉండగా, దక్షిణాఫ్రికా111 పాయింట్లతో రెండో స్థానంలో ఉంది.

ఆల్ ఇండియా యూనివర్శిటీ

మహిళా టెన్నిస్ విజేత ముంబై యూనివర్శిటి



విశాఖస్పోర్ట్స్, ప్రభన్యూస్: ఆల్ ఇండియా యూనివర్శిటీ మహిళా టెన్నిస్ పోటీల్లో ముంబై యూనివర్శిటీ విజేతగా నిలిచింది. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం వేదికగా గత మూడు రోజులుగా జరుగుతున్న ఆల్ ఇండియా అంతర్ విశ్వవిద్యాలయం మహిళా టెన్నిస్ పోటీలు సోమవారం ముగిసాయి. ద్వితీయ స్థానంలో ఎస్.ఆర్.ఎమ్. విశ్వవిద్యాలయం, తృతీయ స్థానంలో ఉస్మానియా విశ్వవిద్యాలయం, నాల్గవ స్థానంలో పూణె విశ్వవిద్యాలయం విజేతలుగా నిలిచాయి. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎస్.పీ. రాహుల్‌దేవ్‌శర్మ విజేతలకు బ హుమతి ప్రధానం చేశారు. కార్యక్రమంలో గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ప్రిన్సిపాల్ ఆచార్య కె.లక్ష్మీప్రసాద్, గీతం స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి కె. రామకృష్ణ మహిళా టెన్నిస్ క్రీడాకారులు పాల్గొన్నారు.

అస్ట్రేలియాదే యాషెస్




ప్యాట్ కమిన్స్


సిడ్నీ: ఆస్ట్రేలియా యాషెస్‌ను దక్కించుకుంది. సోమవారం సిడ్నీ మైదానంలో ముగిసిన చివరి టెస్టులో ఇన్నింగ్స్, 123 పరుగుల ఆధిక్యతో గెలిచి ఐదు మ్యాచ్‌ల సరీస్‌ను 4-0 తేడాతో కైవసం చేసుకుంది. ఈ సిరీస్‌లో నాల్గవ టెస్ట్ డ్రాగా ముగిసింది. చివరి టెస్టులో ఇంగ్లండ్ ఆటగాళ్లు ఆస్ట్రేలియా బౌలర్ల ను ఎదుర్కొనడంలో పూర్తిగా విఫలమయ్యారు. ఇంగ్లండ్ బ్యాట్స్‌మన్లు ఏదశలోనూ ఆసీస్ బౌలర్లను నిలువరించలేకపోయారు. ముఖ్యంగా ఫాస్ట్ బౌలర్ ప్యాట్ కమిన్స్ చెలరేగిపోయాడు. ఇంగ్లండ్ రెండు ఇన్నింగ్స్‌లో మొత్తం 8 వికెట్లు తీసి ఆ జట్టు నడ్డి విరిచాడు. మ్యాచ్ ప్రారంభంలో ఇంగ్లండ్ టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుంది. ఇంగ్లండ్ తన తొలి ఇన్నింగ్స్‌లో ఆస్ట్రేలియా బౌలర్ల ధాటికి తట్టుకులేకపోయారు. 346 పరుగులు చేసి ఆలౌటయింది. కమిన్స్ నాలుగు వికెట్లు తీశాడు. మిచెల్‌స్టార్క్, హేజిల్‌వుడ్ తలా రెండు వికెట్లు, లియన్ ఒక వికెట్ తీశాడు. అనంతరం ఆట ప్రారంభించిన ఆస్ట్రేలియా తన తొలి ఇన్నింగ్స్‌లో ఏడు వికెట్లకు 649 పరుగులు చేసిడిక్లేర్ చేసింది. తొలి ఇన్నింగ్స్‌లో ఆసీస్ బ్యాట్స్‌మన్ ఉస్మాన్ ఖ్వాజా 171పరుగులు, షువాన్ మార్ష్ 156 పరుగులు, మిచెల్ మార్ష్ 101పరుగులు చేయగా, కెప్టెన్ స్టీవెన్ స్మిత్ 83 పరుగులు చేశాడు. ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్‌లో కూడా ఆస్ట్రేలియా బౌలర్ల ధాటికి తలవంచి 180(88.1 ఓవర్లు) పరుగులు చేసి ఆలౌట్ అయింది. దీనితో ఆసీస్ జట్టు ఇన్నింగ్స్, 123 పరుగుల ఆధిక్యతతో యాషెస్‌ను గెలుచుకుంది. 2015లో జరిగిన యాషెస్ సిరీస్‌లో ట్రోఫీని ఇంగ్లండ్ గెలుచుకుంది. చివరి రోజు ఆట ప్రారంభించిన ఇంగ్లండ్ నాలుగో రోజు నాటౌట్ నిలిచిన జోరూట్ ఆస్ట్రేలియాకు మింగుడుపడలేదు. చివరి రోజు కూడా బ్యాటింగ్ చేసి తీవ్ర అనారోగ్యం పాలై రిటైర్డ్ అవుట్‌గా మధ్యలోనే వెనుతిరిగాడు. రూట్ 58 పరుగులు చేశాడు. దీనితో ఆస్ట్రేలియాకు తమ విజయంపై మరింత విశ్వాసం పెరిగింది. ఆ తర్వాత వచ్చిన ఇంగ్లండ్ బ్యాట్స్‌మన ల్లో వికెట్ కీపర్ బెయిర్‌స్టో (38పరుగులు నాటౌట్), టామ్ కర్రెన్ (23 పరుగులు) మినహా ఎవరూకూడా పెద్దగా రాణించలేదు. రెండో ఇన్నింగ్స్‌లో కూడా కమిన్స్ తన బుల్లెట్ లాంటి బంతులతో ఇంగ్లండ్ బ్యాట్స్‌మన్లకు చుక్కలు చూపించాడు. కమిన్స్ నాలుగు వికెట్లు చేజిక్కుంచుకోగా, లియాన్ మూడు వికెట్లు, స్టార్క్, హేజిల్‌వుడ్ తలా ఒక వికెట్‌ను తీశారు. మొత్తం 8 వికెట్లు తీసి ఆస్ట్రేలియా చివరి టెస్టులో కీలక భూమిక నిర్వహించిన కమిన్స్‌కు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డును అందుకోగా సిరీస్‌లో మొత్తం ఏడు ఇన్నింగ్సుల్లో 687 పరుగులు చేసిన ఆధునిక బ్రాడ్‌మన్(అభిమానులు ఇచ్చిన పేరు) కెప్టెన్ స్మిత్‌కు ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ అవార్డు లభించింది. యాషెస్ సిరీస్‌లో ఒక కెప్టెన్‌గా అత్యధిక పరుగులు చేసిన మూడవ బ్యాట్స్‌మన్‌గా స్మిత్ రికార్డు సృష్టించాడు. కాగా యాషెస్ సిరీస్‌లలో 500కు పైగా పరుగులు చేసిన వారిలో స్మిత్ ఏడవ వాడు. ఆస్ట్రేలియా ఈ విజయంతో ఐసిసి టెస్ట్ ర్యాంకింగ్స్‌లో మూడో స్థానం పొందగా, ఇంగ్లండ్ ఐదవ స్థానానికి పడిపోయింది.

స్కోరు బోర్డు:

ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్ : 346 ఆలౌట్, **ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్:** 649/7 డిక్లేర్డ్,

ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్: అలెస్టర్ కుక్ (బి) లియాన్ 10, మార్క్‌స్టోన్‌మన్ ఎల్బీడబ్ల్యు (బి) స్టార్క్ 0 జేమ్స్ విన్స్ (బి) స్టార్క్ (సి)స్మిత్(బి)కమిన్స్18, జో రూట్(కెప్టెన్) రిటైర్డ్ అవుట్ 58, డేవిడ్ మలాన్ ఎల్బీడబ్ల్యు (బి)లియాన్ 5, జొన్ని బెయిర్‌స్టో(వి.కీ) ఎల్బీడబ్ల్యు (బి) కమిన్స్ 38, మొయిన్ అలీ ఎల్బీడబ్ల్యు (బి)లియాన్ 13, టామ్ కర్రేన్ 23 నాటౌట్, స్టువార్డ్ బ్రాడ్ (సి)పెయినీ, (బి)కమిన్స్4, మాసన్ క్రానె (సి)పెయినీ, (బి)కమిన్స్2, అండర్సన్ (సి)పెయినీ (బి)హేజిల్‌వుడ్ 2, **ఎక్స్‌ట్రాలు:**7 మొత్తం 180(10 వికెట్లకు,88.1 ఓవర్లు)

వికెట్ల పతనం: 5-1, 15-2, 43-3, 68-4, 121-5, 144-6, 148-7,156-8,180-9, **ఆస్ట్రేలియా బౌలింగ్:** మిచెల్ స్టార్క్ 16-4-38-1, హేజిల్‌వుడ్ 17.1-6-36-1, లియాన్ 35-12-54-3, కమిన్స్ 17-4-39-4, స్మిత్(సి) 2-0-6-0, మిచెల్ మార్ష్ 1-1-0-0



ఒక యాషెస్ సిరీస్‌లో అత్యధిక పరుగులు చేసిన కెప్టెన్లు

810 డాన్ బ్రాడ్‌మన్ 1936/37 (9 ఇన్నింగ్సులు) (ఆస్ట్రేలియా)
732 డి గోవర్ 1936/37 (9 ఇన్నింగ్సులు) (ఇంగ్లండ్)
687 ఎస్‌స్మిత్ 2017/18 (7 ఇన్నింగ్సులు) (ఆస్ట్రేలియా)
680 డి బ్రాడ్‌మన్ 1946/47 (8 ఇన్నింగ్సులు)(ఆస్ట్రేలియా)

500కు పైగా పరుగులు సాధించిన ఆటగాళ్లు

డి బ్రాడ్‌మన్ రెండుసార్లు 1934/1936-37, 1946/47, 1948(ఆస్ట్రేలియా)
అర్థర్ మోరిస్ 1946/47, 1948(ఆస్ట్రేలియా)
కె బారింగ్టన్ 1962-63, 1964 (ఇంగ్లండ్)
జాన్ ఎడ్రిక్ 1968, 1970-71 (ఇంగ్లండ్)
డీన్ జోన్స్ 1986-87, 1989(ఆస్ట్రేలియా)
డేవిడ్ బూన్ 1990-91 , 1993(ఆస్ట్రేలియా)
స్టీవ్ స్మిత్ 2015, 2017-18 (ఆస్ట్రేలియా)

పీబీఎల్‌లో.. బ్లాస్టర్స్‌పై స్మాషర్స్ గెలుపు

చెన్నై: పిబిఎల్ టోర్నీలో చెన్నై స్మాషర్స్ తమ సెమీస్ ఆశలను సజీవంగా ఉంచుకుంది.. సోమవారం జరిగిన మ్యాచ్‌లో స్మాషర్స్ 3-2 తేడాతో బెంగళూరు బ్లాస్టర్స్‌పై మ్యాచ్‌ను గెలుచుకుంది. స్మాషర్స్ తరపున ఆడుతున్న పివి సింధు మహిళల సింగిల్స్ మ్యాచ్‌లో గిల్‌మోర్‌పై వరుస సెట్లలో 2-0 తేడాతో గెలిచింది. కాగా మిక్స్‌డ్ డబుల్స్‌లో సింధు, అడ్‌కాక్ జంట, బ్లాస్టర్స్ జంట ఎస్ రెడ్డి, రాంగ్ జంటను 2-0 ఓడించింది. పురుషుల డబుల్స్‌లో స్మాషర్స్ జంట లీ, బిఎస్. రెడ్డిలు బ్లాస్టర్స్ బో, రాంగ్ జంటను 2-1 తేడాతో ఓడించారు. పురుషుల సింగిల్స్‌లో సయాన్‌సొబొస్కి బ్లాస్టర్ ఆటగాడు అక్స్‌లసన్ చేతిలో 2-1 తేడాతో ఓటిపోయాడాడు. మరో సింగిల్స్‌లో కూడా బ్లాస్టర్ ఆటగాడు ఎస్ దేవ్ చేతిలో స్మాషర్స్ ఆటగాడు లెవెర్‌డెజ్ 2-0 తేడాతో ఓడిపోయాడు. మొత్తంగా చూస్తే స్మాషర్స్ 3-2 తేడాతో మ్యాచ్‌ను కైవసం చేసుకుంది.

ముంబై చెస్ టోర్నీ విజేతలుగా మగసూద్లూ, మాస్టర్ గుకేష్



ముంబై: ఇరానియన్ గ్రాండ్ మాస్టర్ ఫర్హామ్ మగసూద్లూ, భారత్‌కు చెందిన మాస్టర్ గుకేష్‌లు ముంబై చెస్ టైటిల్‌ను గెలుచుకున్నారు. ఐఐఎఫ్ఎల్ వెల్త్ 3వ ముంబై అంతర్జాతీయ చెస్ టోర్నమెంట్ ఓపెన్‌ను ఫర్హామ్ మగసూద్లూ గెలుచుకోగా, జూనియర్ గ్రూప్స్‌లో మాస్టర్ గుకేష్ విజేతగా నిలిచారు. ఫైనల్ రౌండ్‌లో ఫర్హామ్ ఇటాలియన్ గ్రాండ్ మాస్టర్ డేవిడ్ అల్బర్టోతో మ్యాచ్ డ్రాగా ముగించింది. కాగా అమెరికన్ గ్రాండ్ మాస్టర్ తిముర్ గ్యారీయెవ్, భారత గ్రాండ్ మాస్టర్ అభిజిత్ గుప్తాపై విజయం సాధించారు. ఈ ఫలితాలతో ఫర్హామ్ 8/9స్కోరును సాధించగా, రెండో స్థానంలో డేవిడ్ అల్బర్టో(ఇటలీ 7.5/9) నిలిచాడు. కాగా భారత గ్రాండ్ మాస్టర్ దీపన్ చక్రవర్తి 7/9 స్కోరుతో నాల్గవ స్థానంలో నిలిచాడు. జూనియర్స్ గ్రూప్‌లో గుకేష్ టోర్నమెంట్‌లో అగ్రభాగాన నిలవాలని చేస్తున్న పోరాటం ఫలించింది. ఫైనల్ రౌండ్‌లో రోహిత్ క్రిష్ణపై గెలుపొందాడు. ప్రణవ్‌తో జరిగిన మ్యాచ్‌ను టై చేసుకున్నాడు. ప్రణవ్ అర్యన్ వార్ష్ణేయ్‌తో జరిగిన మ్యాచ్‌ను డ్రాగా ముగించడంతో గుకేష్ టై బ్రేక్ స్కోర్ 8/9తో అతన్ని విజేతగా నిలిపింది. ప్రణవ్ 8/9తో రన్నరప్‌గా నిలిచాడు. ఫర్హాం బహుమతిగా రూ.లక్షలు గెలుచుకోగా, గుకేష్ రూ.1.5లక్షలు గెలుచుకున్నాడు.

Printed & Published by **MOOTHA GOUTAM** on behalf of Andhra Prabha Publications Ltd., and printed at Andhra Prabha Publications Ltd., 13-6-445/a/b1, Konejeti Enclave, Mehdhipatnam, Hyderabad-500028. Published from Andhra Prabha Publications Ltd., 8-2-293/82/A/75, Plot No.75, Road No.9, Jubilee Hills, Hyderabad-500033. Phones: 23559940/41/42/45, Fax No.23558812. Editor: Y S R Sarma, Responsible for News selection under PRB ACT. RNI Regd.No.32178/1977.



ఓ మై...గూగుల్!

మన మొదటి లోక్‌సభ స్పీకర్ ఎవరు?..అదీ....!..అనుమానం ఎందుకు గూగుల్‌లో చూడు తెలుస్తుంది. టన్నుకు ఎన్ని కిలోలు..? ఏమో...! స్మార్ట్ ఫోన్‌లో నెట్ ఉందిగా గూగుల్‌లో చూడు తెలుస్తుంది.... విషయం ఏది తెలియకున్నా..గూగుల్‌ను ఆశ్రయించడం మనకు బాగా అలవాటైపోయింది. నేటి డిజిటల్ యుగంలో ప్రతి ప్రశ్నకు సమాధానం చెప్పగలిగే ఏకైక సాధనం గూగుల్ అనడం అతిశయోక్తి కాదు. గతంలో అడగండి చెబుతా..అంటూ ప్రముఖ రచయిత్రి మాలతీ చందూర్ రెడీగా ఉండేవారు. ప్రస్తుతం మీరేదడిగినా చెప్పడానికి నేనున్నా ....అంటోంది గూగుల్. చాలా మందికి ఏది తెలియకున్నా గూగుల్‌ను ఆశ్రయించడం సర్వసాధారణం. కాని గూగుల్ చాలా మందికి తెలియని ఎన్నో సౌకర్యాలను, ఫీచర్లను అందిస్తోంది. మెయిల్ వాడకం అవసరం లేకపోయినా...స్మార్ట్‌ఫోన్ యూజర్స్ అంతా గూగుల్ అకౌంట్ తెరవడం మంచిది. ఒకవేళ స్మార్ట్ ఫోన్ యూజర్లకు ఈ పాటికే గూగుల్ ఖాతా ఉన్నట్లయితే దాని వల్ల కలిగే ప్రయోజనాలు తెలుసుకోవాలి. వాస్తవానికి గూగుల్‌లో వందల కొద్ది ఫీచర్లు ఉన్నాయి. కాకపోతే మనకు నిత్యం ఉపయోగపడే, ఆపత్కాలంలో యూజర్లను కాపాడే ఫీచర్ల వివరాలు తెలుసుకుందాం!

మహేష్ స్మార్ట్ ఫోన్ నీళ్లలో పడిపోయింది. పనిచేయకుండా మొరాయించింది. కొత్తది కొనడం తప్ప వేరే మార్గం లేదు. బస్సు ప్రయాణంలో శ్రీధర్ స్మార్ట్ ఫోన్‌ను పోగొట్టుకున్నాడు. తిరిగి దొరికే ఛాన్స్ లేదు. ఇక్కడ పోగొట్టుకున్నా,నీళ్లలో పడిపోయినా.. పరిష్కారం కొత్త ఫోన్ కొనుక్కోవడమే. కాని పాత ఫోన్‌లో ఉన్న ఫోన్ నెంబర్ల మాటేంటి? కాకపోతే మహేష్ తన ఫోన్‌ను గూగుల్‌తో అనుసంధానం చేయడం మూలంగా పాత ఫోన్‌లోని నెంబర్స్, జీమెయిల్‌లోని డాటా అంతా జీడ్రైవ్‌లో సేవ్ అయి ఉంది. అతను కొత్తఫోన్ కొని గూగుల్ అకౌంట్‌కి లాగిన్ కాగానే పాతఫోన్‌లోని డేటా అంతా కొత్తఫోన్‌లోకి వచ్చేసింది. శ్రీధర్ అలా చేయక పోవడంతో,పోగొట్టుకున్న ఫోన్‌తో పాట ఫోన్ కంటాక్ట్స్, జీమెయిల్‌లోని డేటా అంతా పోయింది. అంటే సంవత్సరాలుగా సేకరించిన సమాచారం హుష్ కాకి. సో...గూగుల్‌తో అనుసంధానం వల్ల ఫోన్ పోయినా,చెడిపోయినా.. మనం అంతకు ముందు సేకరించిన డేటా, ఫోన్‌నెంబర్లు అన్నీ సేఫ్‌గా ఉంటాయి. అందుకే స్మార్ట్ ఫోన్ కొన్నవెంటనే జీమెయిల్ అకౌంట్ ఓపెన్ చేసి,అనుసంధానం చేయడం చాలా ముఖ్యం. మీ జీమెయిల్ ఖాతాను ఫోన్‌కు అనుసంధానం చేసి,సింక్ చేసినట్లయితే ఫోన్‌లోను డేటా అంతా ప్రతిక్షణం జీమెయిల్‌లో సేవ్ అవుతుంది. మరో ముఖ్యమైన విషయం...,..జీమెయిల్ ఖాతాతో జోడించి ఉన్న స్మార్ట్‌ఫోన్ పోతే.... దాని లొకేషన్ ఇట్టే తెలుసుకోవచ్చు లేదా ఫోన్‌ను లాక్ చేయవచ్చు. కాని ఫోన్‌లోని ఫోన్‌లో ఉన్న ఎస్‌డీ కార్డులోని డేటాను మాత్రం తొలిగించలేము. అంతేకాదు మనకు ఒకటికన్నా ఎక్కువ ఫోన్‌లు ఉంటే.. అన్నింటిని జీమెయిల్‌తో అనుసంధానించుకోవచ్చు. పోయిన ఫోన్‌కు సంబంధించిన లాక్ చేయబడిన స్క్రీన్‌కు సందేశాన్ని, లేదా ఇతర ఫోన్ నెంబర్‌ను పంపించవచ్చు. మీరు పోగొట్టుకున్న ఫోన్ ఎవరైనా మంచి వ్యక్తులకు దొరికితే మీరు ఫంపిన సందేశం లేదా నెంబర్‌కు లాక్ చేసిన స్క్రీన్‌పై డిస్ప్లే అవుతుంది. అది చూసి దొరికిన వ్యక్తి ఫోన్ చేసిన మీ ఫోన్ మీకు అందించే ఛాన్స్ ఉంటుంది. ఇక ముఖ్యమైన డ్యాక్యుమెట్స్,ఐడీ కార్డులు, సర్టిఫికేట్స్, ఫోటోలు తదితర విలువైన వాటిని స్కాన్ చేసి వాటిని గూగుల్ డ్రైవ్‌లో భద్రపరుచుకోవచ్చు.కొన్ని సందర్భాలలో ఫోన్‌లో ఖాళీలేకపోతే కొంత డేటానుగూగుల్ డ్రైవ్‌లో సేవ్ చేసుకోవచ్చు. గూగుల్ డ్రైవ్‌లో 15జీబీ వరకు స్పేస్ ఉచితంగా వాడుకోవచ్చు.

ఒకే మెయిల్ ద్వారా..!

మీరు హాట్‌మెయిల్, ఔట్లుక్, మరొక జీమెయిల్ ఐడీ , యాహూలాంటి ఇతర మెయిల్స్ వాడుతున్నారా? వాటన్నింటిని ఒకే జీమెయిల్‌కు అనుసంధానం చేసుకోవచ్చు. దాని ద్వారానే ఇతర మెయిల్స్ సందేశాలను నిర్వహించవచ్చు. దీనివల్ల సమయం ఆదా అవతుంది. ఏదైనా పాప్(ౖ) లేదా ఐమాప్ (ఒఃఆ) ఖాతా నుంచి సందేశాలను సంపూర్ణంగా దిగుమతి చేసుకోవడంతో జీమెయిల్‌లో బహుళ ఇ-మెయిల్ చిరునామాలను ఏకీకరించుకోవచ్చు.



జీమెయిల్ లో అన్ డూ సెండ్ ఆప్షన్

జీమెయిల్‌లో అన్ డూ సెండ్ ఆప్షన్ ఉంది. సెట్టింగ్‌లోకి వెళ్లి దీనిని ఆక్టివేట్ చేసుకోవడం ద్వారా ఈ ప్రయోజనం పొందవచ్చు. మనం పంపిన మెయిల్‌లో అక్షర దోషాలు ఉన్నట్లు గుర్తించినా, ఒకరికి పంపాల్సిన మెయిల్ పొరపాటున ఇంకొకరికి పంపినా, దానివల్ల జరిగే నష్టనివారణ కోసం ఈ ఆప్షన్ ఎంతోఉపయోగ పడుతుంది. మెయిల్ సెండ్ చేసిన 5 నుంచి 30 సెకన్లలోపు అన్ డూ సెండ్ బటన్ క్లిక్ చేయడం ద్వారా మెయిల్‌ను నిరోధించవచ్చు. ఎన్ని సెంకండ్లు అన్నది అన్ డూ సెండ్ బటన్ ఆప్షన్ ఆక్టివేట్ చేసేటప్పుడే సెట్ చేసుకోవాలి. అయితే 30 సెకండ్లకు మించి ఈ ఛాన్స్ ఉండదు.

కీ బోర్డ్ షార్ట్ కట్స్

వినియోగదారుల సమయం ఆదాచేసుకోవడం, సులభ శైలిలో మెయిల్ పంపించుకోవడం కోసం కొన్ని కీ బోర్డ్ షార్ట్ కట్స్‌ను జీమెయిల్ ప్రవేశ పెట్టింది. సెట్టింగ్స్‌లోకి వెళ్లి కీ బోర్డ్ షార్ట్ కట్స్ ఆన్‌ను సెలక్ట్ చేసుకోవడం ద్వారా వినియోగ దారులే కీ బోర్డ్ షార్ట్ కట్స్‌ను సృష్టించుకోవచ్చు. ఉదాహరణకు కొత్త మెయిల్ కంపోజ్ చేయడానికి సీ..క్లిక్ చేయాలి. ఆర్..క్లిక్ చేయడం ద్వారా రిప్లై ఇవ్వవచ్చు. ఏ ..క్లిక్ చేసి కాపీ చేసిన వారందరికి మెయిల్ సందేశం పంపించ వచ్చు. మరో వైపు... పండుగలకు మీ మిత్రులకు శుభాకాంక్షలు,పుట్టిన రోజు శుభాకాంక్షలు, మీకు వచ్చిన సందేశాలకు ధన్యవాదాలు జీ మెయిల్ ద్వారా పంపడానికి మరో సులభమైన మార్గం ఉంది. అందుకోసం మీరు ముందుగా మీ సందేశాన్ని లేదా ప్రతిస్పందనను తయారు చేసుకోవాలి. ఆతర్వాత సెట్టింగ్స్‌లోని కెన్‌డూ రెస్పాన్స్‌ను క్లిక్ చేయడం ద్వారా ఈ సౌకర్యం ఉపయోగించుకోవచ్చు.



స్మార్ట్ రిప్లై ఫీచర్

జీమెయిల్ సెట్టింగ్స్‌లో ఉన్న స్మార్ట్ రిప్లై ఫీచర్‌ను ఆక్టివేట్ చేసుకుంటే ..మీకు వచ్చిన ప్రతి మెయిల్ కింద దాని సారాంశాన్ని బట్టి మూడు సూక్ష్మ సందేశాల వస్తాయి. దానిని క్లిక్ చేసి వెంటనే మెయిల్‌కు రిప్లై ఇవ్వవచ్చు. ఇది మిషన్ లెర్నింగ్ ఆధారిత ఫీచర్. ఉదాహరణకు ..మీ ఊర్లోపుస్తక ప్రదర్శన ఉందని మిత్రుల ద్వారా మెయిల్ వచ్చిందనుకోండి. ఈ ఫీచర్ ఆక్టివేట్ చేసుకుంటే..ఆ మెయిల్ కింద ... వెళ్లడం కుదరదు.. ఇష్టం లేదు....అటెండ్ అవుతాను.. అనే ఆప్షన్ మెసేజ్‌లు ఉంటాయి.వాటిని క్లిక్ చేయడం ద్వారా వెంటనే మీకు వచ్చిన మెయిల్‌కు రిప్లై ఇవ్వవచ్చు.

మ్యూట్ ,బ్లాక్ ఆప్షన్లు ఉన్నాయి...!

మనం పాల్గొనక పోయినా వాట్సాప్ గ్రూపుల్లో జరిగిన సంభాషణలకు సంబంధించి నోటిఫికేషన్స్ వచ్చి డిస్టర్బ్ చేస్తుంటాయి. వాటిలాగే ఈ మెయిల్ థ్రెడ్స్ కూడా పొద్దస్తమానం వస్తూ... మీ ఏకాగ్రతను చెడగొట్టవచ్చు. అటువంటప్పుడు సందేశాన్ని తెరచి దానిపై ఉన్న మ్యూట్ బటన్ క్లిక్ చేయడం ద్వారా జీమెయిల్ గ్రూప్, థ్రెడ్స్ మెసేజ్‌లను మ్యూట్ చేసుకోవచ్చు. ఇక మీకు ఇష్టం లేని వ్యక్తుల నుంచి వచ్చే మెయిల్స్ లేదా ఒక సంస్థ నుంచి పదేపదే వచ్చే మార్కెటింగ్, ప్రమోషన్ మెయిల్స్, లేదా మిమ్ములను బాధించే వ్యక్తులను బ్లాక్ చేయవచ్చు. అలాంటి మెయిల్ వచ్చిన నప్పుడు దానిని ఓపెన్ చేసి రిప్లై బటన్ ఎగువన కుడివైపు మూలలో బ్లాక్ అనే ఆప్షన్‌ను ఎంచుకోవాలి. అలాచేస్తే పైన చెప్పుకున్న వారినుంచి మీకు ఎలాంటి మెయిల్ రాకుండా నిరోధించవచ్చు.

ఆఫ్ లైన్ జీమెయిల్ ..!

వినియోగ దారులు విమానంలో ఉన్నప్పుడో...వైఫై సౌకర్యం లైదా మొబైల్ నెట్‌వర్క్ అందని మారు మూల ప్రదేశాల్లో ఉన్నప్పుడో... కొండ ప్రాంతాల్లో పర్యటిస్తున్న ప్పుడో ఆఫ్ లైన్ జీమెయిల్ సౌకర్యం ఎంతగానో ఉపయోగ పడుతుంది. గూగుల్ క్రోమ్ బ్రౌసర్ అనువర్తనంతో ఆఫ్‌లైన్‌లో జీమెయిల్ ఉపయోగ పడుతుంది. మీరు ఆఫ్‌లైన్‌లో ఉన్నప్పుడు సందేశం పంపితే మీరు ఆన్‌లైన్‌లోకి రాగానే మీ ప్రమేయం లేకుండా సందేశం పంపబడుతుంది.

మీ జీమెయిల్ సురక్షితమా?

మీ జీమెయిల్ సురక్షితంగా ఉందా? లేదా ఎవరైనా దాని పాస్‌వర్డ్ తెలుసుకుని లేదా హాక్ చేసి మీ మెయిల్ ఓపెన్ చేస్తున్నారా?అనే విషయం తెలుసుకునే సౌకర్యం కూడా ఉంది. ఇది తెలుసుకోవాలంటే మీ ఇన్ బాక్స్‌లో.. లాస్ట్ అకౌంట్ ఆక్టివిటీ ... వివరాలు ఉంటాయి. అందులో డిటైల్స్ పై క్లిక్ చేస్తే మీ గూగుల్ ఖాతాను ఎప్పుడెప్పుడు లాగిన్ అయ్యారు,ఐ.పీ అడ్రెస్ జాబితాతో సహా జీమెయిల్ మీకు అందిస్తుంది. అంతేకాకుండా గూగుల్ క్రోమ్ అనేక ఎక్స్‌టెన్షన్లను కలిగి ఉంది. వాటిలో మెయిల్ షెడ్యూల్ మరియు ట్రక్ కూడా చేయవచ్చు. మీరు మధ్యాహ్నం రాసిన బిజినెస్ ప్రపోజల్ మెయిల్ అమెరికాలోని క్లయింట్‌కు పంపాలంటే..అప్పుడు అతనికి నిద్రాభంగం అవుతుంది. మరి మనం మధ్యాహ్నం రాసిన మెయిల్ అతనికి ఆఫీసు వెళలో చేరాలంటే ..మీరు పంపే మెయిల్‌ను సమయం ఆధారిత షెడ్యూల్ చేసుకోవచ్చు. అంతేకాదు మనం పంపిన మెయిల్ ను అవతలి వ్యక్తి ఓపెన్ చేశారా? లేదా? ఏ సమయంలో ఓపెన్ చేశారు? తదితర వివరాలు తెలుసుకోవచ్చు. ఇక అలాగే ఇందులో టూ డూ లిస్ట్ సౌకర్యం ఉంది. మనం చేయాల్సిన పనుల జాబితాను, టాస్కులను రూపొందించి గూగుల్ క్యాలెండర్ లేదా కంటాక్టులతో అనుసంధానం చేసుకోవచ్చు. జీమెయిల్ ల్యాబ్స్ ద్వారా అపాయింట్ మెంట్‌షెడ్యూల్ చేసుకోవచ్చు. షెడ్యూల్ చేసుకునేందుకు ఇన్ బాక్స్ గూగుల్ క్యాలెండర్ ఉంటుంది.ఇలా గూగూల్‌లో ఎన్నో ఫీచర్లు ఉన్నాయి. వాటిని సరైన రీతిలో వినియోగించుకుంటే యూజర్లకు ఎంతో సౌకర్య వంతంగా ఉంటుంది. ఆశించిన ప్రయోజనం కలుగుతుంది.



-సునీల్ ధవళ, మాజీ వైస్ ప్రెసిడెంట్ , నేషనల్ జియోగ్రాఫిక్ అండ్ ఫ్యాక్స్

ఈ బైక్...'త్రి'భయచరం!

ఇక గాల్లో... నీటిలో... రోడ్లపై రైడింగ్ చేయొచ్చు

2017 ముగిసింది. 2018 ప్రారంభమైంది. మరి ఎగిరే కార్లు ఎక్కడ? కొన్ని సంవత్సరాలుగా మనం ఏదో సందర్భంలో ఎగిరే కార్ల గురించి మాట్లాడుకుంటున్నాం. అయితే వాటి సంగతి ఎలా ఉన్నా..ఇప్పుడు ఎగిరే బైక్‌లు మన కళ్లముందుకు వచ్చే అవకాశాలు కనబడుతున్నాయి. ఇంతకుముందు ఒక హాలివుడ్ సినిమా ఇలాంటి సూపర్ బైక్‌లనే తెరమీద సృష్టించి ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకుంది. స్టార్ వార్స్ అనే ఈ హాలీవుడ్ సినిమా యువతరాన్నే కాకుండా అన్ని వయసువారినీ అలరించింది. విజయం సాధించింది.

ఆ మూవీలో వినియోగించిన సూపర్ బైక్స్ గతంలో మనం ఎప్పుడూ చూసినవి కాదు. కానీ ఇలాకూడా తయారుచేయవచ్చు అనే ఊహకు ఆ సినిమా ఊతం ఇచ్చింది. ఇప్పుడు ఆ ఊహని నిజం చేయడానికి సిద్ధమైంది... అమెరికాకు చెందిన ఎరోఫెక్స్ అనే సంస్థ.

ఎరోఫెక్స్....మునుపెన్నడూ ఊహల్లోకి కూడా రాని ఒక అద్భుతాన్ని నిజం చేసి చూపిస్తానంటోంది. సాధారణంగా టూవీలర్స్..ఎంత అధునాతన టెక్నాలజీతో వచ్చినా అవి నేలమీద మాత్రమే నడుస్తాయి. మరింత వేగంగా మరింత సౌకర్యవంతంగా...ఉండేలా వాటిని మార్పులు చేస్తూ వచ్చారు. కానీ ఎరోఫెక్స్ తయారుచేస్తున్న ఎరో-ఎక్స్ అనే బైక్ మాత్రం నేలమీదే కాదు...నీటిపైనా గాలిలో కూడా నడవగలదు. కాకపోతే గాలిలో ఇది 12 అడుగుల ఎత్తు వరకు మాత్రమే ప్రయాణం చేయగలుగుతుంది. ఎగిరేందుకు వీలుగా దీనికి రెండు పెద్ద ఫ్యాన్స్ ఉంటాయి. సాధారణ బైక్‌ల మాదిరిగానే దీనిని నడపవచ్చు.


ఈ బైక్‌ని 2017లోనే అందుబాటులోకి తీసుకురావాలని కంపెనీ భావించింది. అయితే ఇది కచ్చితంగా ఎప్పుడు మనముందుకు వస్తుందనే విషయం మాత్రం ఇప్పటికి ప్రశ్నే. అయితే దీనిని మామూలు బైక్‌ల్లా రోడ్లమీద పరుగులు తీయించే అవకాశాలు మాత్రం తక్కువనే చెప్పాలి. అందుకే ప్రాథమిక దశలో ఈ బైక్‌ని వ్యవసాయ క్షేత్రాల్లో, భూమి సర్వేల కోసం వాడవచ్చని భావిస్తున్నారు. అంతేకాకుండా... సరదా రైడింగ్‌కు కూడా ఈ ఎగిరే బైక్‌ని అప్పుడప్పుడు వాడుకోవచ్చు...అదీ ట్రాఫిక్ సమస్యలు లేని చోట్ల మాత్రమే. 2018లో లేదా మరికొన్నేళ్లకో ఈ బైక్ మార్కెట్లోకి వచ్చే అవకాశాలు మాత్రం పుష్కలంగా ఉన్నాయి.

ఏదైతేనేమి ఎరో-ఎక్స్ అందుబాటులోకి వస్తే ఎగిరే కార్ల సంగతెలా ఉన్నా...రోడ్లమీద, నీటిలో, గాలిలో...అంటే మూడు విధాలుగా నడిచే త్రిభయచరవాహనం మనకు అందుబాటులోకి వచ్చినట్టే. నీటిలో నేలమీద కూడా బతకగల కప్ప ఉభయచర జీవి కనుక దీన్ని త్రిభయచరం అనడం సముచితమే కదా! కాకపోతే ఎరో-ఎక్స్ గాల్లో ఎగిరినట్టుగానే దీని ధర కూడా ఆకాశంలోనే ఉంది... సింపుల్‌గా 85,000 డాలర్లు లేదా 55 లక్షల రూపాయలు మాత్రమే.



రంగవల్లిక

17చుక్కలు 1వచ్చే వరకు (సరిచుక్క)



ఎమ్.ధనలక్ష్మి, కల్లూరి పల్లి, హౌసింగ్ బోర్డు కాలని

21 చుక్కలు 3 వరుసలు 3 వచ్చే వరకు





ఎం కుసుమ లత మోతీ నగర్ హైదరాబాద్



21 చుక్కలు 1 వచ్చే వరకు

మీరూ ముగ్గులు పంపొచ్చు

ముగ్గుని ఎ4 సైజున్న మందపాటి పేపరుమీద వేయాలి. ఔట్ లైన్‌ని, చుక్కలను బ్లాక్ స్కెచ్ పెన్నుతో వేసి లోపల రంగులు నింపాలి. ఎన్ని చుక్కలు ఎన్ని వరుసలు అనే వివరాలను స్పష్టంగా రాయాలి.

అడ్రసు: లైఫ్ c/o ఆంధ్రప్రభ, 8-2-293/82/ఎ/75, ఫ్లాట్ నెం:75, రోడ్ నెం:9, జూబ్లీహిల్స్, హైదరాబాద్-28
lifepage2012@gmail.com

స్వధర్మమే పరమోత్కృష్టం

స్వధర్మ పరిపాలన ఎంతో ముఖ్యం. స్వధర్మే నిధనం శ్రేయః అని స్వధర్మ పరిపాలన శ్రేయస్కరమని శ్రీకృష్ణుడు గీతలో చెప్పాడు. స్వధర్మాచరణను మించిన ధర్మం లేదు. స్వధర్మాన్ని గాలికొదిలేసి ఏవేవో చేస్తాననటం సరికాదు. ఇక స్వధర్మం అనేది విస్తృతమైనది. మన స్వధర్మం ఏదో తెలుసుకుని దానిని ఆచరించడానికి కృషి చేయాలి.

స్వధర్మం గురించి భారతంలో ఉన్న ఈ కథ వివరిస్తుంది.

పూర్వం ఒకానొకాశ్రమంలో దేవశర్మ అనే మహర్షి అతని భార్య రుచి ఉండేవారు. రుచి అతిలోక సౌందర్యవతి. ఆమెను దేవశర్మ ఎంతో అనురాగంతో చూసుకునేవాడు. ఆమె కూడా పతిని ప్రత్యక్ష దైవంగా భావించి సేవ చేస్తుండేది. వారి దగ్గర ఉన్న శిష్యుల్లో విపులుడనేవాడు ఉండేవాడు. అతనిపై దేవశర్మకు ప్రత్యేకమైన అభిమానం ఉండేది. ఆ విపులుడికి దేవ శర్మ ఎన్నో శాస్త్రాలు, ధర్మాలూ బోధిస్తూ ఉండేవాడు.



మహాభారతంలో చిన్న కథలు

ఒకసారి దేవశర్మ పక్క ఊరికి యజ్ఞం చేయడానికి వెళ్లవలసి వచ్చింది. దానితో ఆయన ఆలోచనలో పడ్డాడు. 'నా భార్య అతిలోక సౌందర్యవతి. ఇంద్రునికి నా భార్య అందం గురించి తెలుసు. అహల్య విషయంలో మాదిరి అతను నేను లేని సమయం చూసుకుని నా భార్యను మాయోపాయంతో అపహరించే ప్రయత్నం చేయవచ్చు. అతనే కాక అసురీ ప్రవృత్తిగల వారు గతంలో అందుకు ప్రయత్నం చేస్తే నా ధర్మాచరణతో, బుద్ధి కుశలతతో అడ్డుకున్నాను. అంతేకాదు వివాహమైన నాటి నుంచి ఆమె ఆశ్రమంలో ఏనాడూ నేను లేకుండా లేదు, ఇపుడు ఆమెకు రక్షణ ఎలాగ అని ఆలోచించాడు. ఇలా ఆలోచించే దేవశర్మ వద్దకు విపులుడు వచ్చాడు. దేవశర్మ తన సంకటాన్ని ప్రియ శిష్యుడైన విపులునికి చెప్పాడు. తాను వచ్చే దాకా అతనికి గురు పత్ని అయిన తన భార్యను రక్షించమని కోరాడు. 'మీ ఆజ్ఞతో ఆమెను రక్షిస్తాన'ని విపులుడు మాట ఇచ్చాడు. దేవశర్మ ఊరికి బయలుదేరాడు. విపులుడు ఆమె రక్షణ బాధ్యత నెరవేరుస్తూ, క్షణ క్షణం ఆమెను కనిపెట్టుకుని ఉండడం కష్టమని అంతేకాక అసురీ శక్తులు ఎటువంటి మాయలు పన్నుతాయో తెలియదు కనుక తానే ఆమెలో ప్రవేశిస్తే ఇక నిరంతర రక్షణ కల్పించవచ్చని భావించాడు. వెంటనే రుచి చూస్తూండగానే రుచికి తెలియకుండా గాలి రూపంలో విపులుడు ఆమె శరీరంలోకి తన యోగ శక్తితో చేరాడు. విపులుని ఆత్మ రుచిలోకి ప్రవేశించినందున అతని శరీరం అచేతనంగా పడిపోయింది. రుచి అది చూసి అతను నిద్రపోతున్నాడనుకుంది. ఆ విధంగా విపులుడు గురుపత్నిని కానాడాడు. తర్వాత గురువు వచ్చాడు. విపులుని వల్ల తన భార్య సురక్షితంగా ఉందని తెలుసుకుని ఆనందించాడు.

ఇలా ఉండగా ఒకనాడు రుచి వనంలో తిరుగుతుండగా ఆకాశంలో వెడుతున్న ఒక దేవ కాంత చేతి నుంచి జారిపడిన పూలమాల అమెకు దొరికింది. ఆ పూల వాసనకు అబ్బురపడిన ఆమె ఆ పూలు వాడనివి అయినందున వాటిని జాగ్రత్తగా దాచుకుంది.

మరో రోజు చిత్ర రథుడనే మహారాజు దేవశర్మ ఆశ్రమానికి వచ్చి తమ రాజ్యంలో జరిగే ఒక ఉత్సవాన్ని చూడడానికి రమ్మని రుషి దంపతుల్ని ఆహ్వానించారు. చిత్రరథుని భార్య, రుచి అక్కాచెల్లెళ్లు. రుచి ఆ ఉత్సవానికి తన వద్ద ఉన్న దేవలోక పూలను అలంకరించుకుని వెళ్లింది. వాటి వాసనకు ఆమె సోదరి పరవశించి తనకు కూడా అటువంటి పూలు సంపాదించి పెట్టమంది. రుచి ఆ విషయం దేవశర్మకు తెలిపింది.

ఆయన ఆ పూలు ఎక్కడున్నా వాటిని తెమ్మని విపులుణ్ని ఆదేశించాడు. విపులుడు అవి ఎక్కడుంటాయో తెలుసుకునేందుకు ప్రయత్నిస్తుండగా మార్గమధ్యంలో అతనికి అటువంటి పూల మాల దొరికింది. అది తీసుకుని ఆయన గురువు గారి వద్దకు బయలుదేరాడు. తిరుగు ప్రయాణంలో అతను నాట్యం చేస్తున్న ఒక యువతీయువకుల జంటను చూశాడు. ఇంతలో ఆ జంట నాట్య విషయంలో తమలో తాము వాదులాడుకున్నారు. వారిలో ఒకరు 'నేను తప్పు కనుక చేసి ఉంటే విపులునికి పట్టిన గతే నాకూ పడుతుంది' అని అన్నారు. ఇది విన్న విపులుడు తాను ఏమి తప్పు చేశాడా అని ఆలోచిస్తూ, మరి కొంత దూరం వెళ్ళాడు. అక్కడ ఆరుగురు వ్యక్తులు జూదమాడుతూ కనిపించారు. వారిలో వారికి తగవులొచ్చి ఒకడు 'నేను తప్పు చేస్తే నాకు ఆ విపులుని గతే పడుతుంది అని అన్నాడు. ఈ మాటలు విన్న విపులుడు వ్యాకుల పడి గురువు దగ్గరికి వెళ్ళి పూలమాల ఇచ్చి తాను ఏమి తప్పు చేశానని అడిగాడు. అప్పుడు గురువు చిరునవ్వుతో, 'విపులా! నీవేమీ తప్పు చేయలేదు. నీకు ఎటువంటి దుర్గతి పట్టదు. నీకు కనిపించిన యువతీ యువకుల జంట సూర్యచంద్రులకు, ఆరుగురు జూదరులు ఆరు ఋతువులకు సంకేతం. ఎవరైనా తాము చేసిన పని ఎవరూ చూడలేదనుకున్నా సూర్య చంద్రులు, ప్రకృతి చూస్తూనే ఉంటాయి' అని చెప్పడానికి వీరు నీకు కనిపించారు. ఇక నీవు నా భార్య, నా అనుమతి లేకుండా ఆమెలో ప్రవేశించడం తప్పు అనుకుంటున్నావు. నీవు చేసిన పనిని తప్పు అనుకోనక్కర్లేదు. ఎందుకంటే నేను నీకు విధించినది నీకు స్వధర్మం. దానితో ఆమెను కాపాడడం నీ స్వధర్మం అయింది. స్వధర్మాన్ని, సాంఘిక ధర్మ, సమాజ హిత ధర్మాన్ని పాటించావు. కనుక నీవు నా భార్యను రక్షించడానికి ఆమె శరీరంలోకి నా అనుమతి లేక వెళ్ళావు. అయినా ఆమెను రక్షించడమే నీ ఉద్దేశం కనుక నీకు పాపమేదీ రాదు. నీకు ఎలాంటి చింత అక్కర్లేదు' అని చెప్పాడు. దానితో విపులునికి చాలా ఆనందం కలిగింది. ఆ విధంగా స్వధర్మమైనా, సాంఘిక ధర్మమైనా, ఎవరికీ అన్యాయం చేయకుండా, ఆపదలో ఉన్న వారిని రక్షించడానికి చేసే కొన్ని పనులు తప్పు కాదు అని మనకు ఈ కథ వల్ల తెలుస్తుంది.

- అశ్విని

చింతన

శ్రీ రమణాశ్రమ లేఖలు, స్మృతులు

గురుస్వరూపం



శ్రీ రమణాశ్రమం

26-2-47

ఉన్నదంతా బయటికి రావద్దూ? ఈ లోకమంతా వెదకి గురుస్వరూపం నిర్ణయిస్తారట వీరు. గురువుగా వరించే యోగ్యత ఇంతవరకూ ఎవరి వద్దనూ కనుపించలేదట. దత్తాత్రేయులు, లోక గురువు గదా? వారు లోకమంతా నాకు గురువేనన్నారట. చెడ్డ చూస్తే చేయరాదని తోస్తున్నది. అందువల్ల అదీ గురువే. మంచి చూస్తే చేయాలనిపిస్తున్నది గనుక ఇదీ గురువే. మంచి చెడ్డలు రెండూ నాకు గురువులేనన్నారు. వేటకాడు దోవ అడిగిన తన మాట వినిపించుకొనక పక్షిని గురిపెట్టి కొట్టటం చూచి 'నాయనా, నీవు నాకు గురువువు'అని నమస్కరించారట. పక్షిని చంపటం చెడ్డదైనప్పటికీ లక్ష్యముంచి బాణం వేయటం చూచి, నా మనస్సు ఈవిధంగా ఈశ్వరుని యందు లక్ష్యముంచి అనుసంధించాలని బోధిస్తున్నావు గనుక, నీవొక గురువువు' అన్నారట. ఇదేవిధంగా ఏది చూస్తే, అదే గురువని చెప్పి కడకీ శరీరమే గురువన్నారు. ఏమంటే నిద్రలో, ఈ శరీరం లేదు గదా; ఈ లేని దానియందు దేహాత్మ భావన కూడదని బోధిస్తున్నది. అందువల్ల ఇదీ గురువే'నన్నారు. వారు లోకమంతా గురువుగా భావిస్తే వారిని లోకమంతా గురువని కొనియాడింది. ఈశ్వర విషయమూ అంతే. లోకమంతా ఈశ్వర మయంగా ఎవరు చూస్తారో, వారిని ఈశ్వరుడని లోకం పూజిస్తుంది. మనమెంతో లోకమంతే. 'యద్భావం తద్భవతి' అన్నారు. పెద్ద తోట ఉంటుంది. కోకిల వస్తే, మంచి పండ్ల నిమిత్తం మామిడి చెట్లు వెదకుతుంది. కాకి వస్తుందనుకో, అది వేపచెట్లు వెదకుతుంది. తుమ్మెదలు, తేనెటీగలు మంచి పూలను వెదికితే, ఈగలు మలాన్నన్వేషిస్తవి. సాలగ్రామం కావలసినవాడు రాళ్లన్నీ త్రోసివేసి అది ఒక్కటీ గ్రహించి పూజిస్తాడు. ఆ సాలగ్రామం రాళ్లల్లోనే ఉంటుంది. చెడ్డ ఉంటేనే మంచి తెలుస్తుంది. చీకటి ఉంటేనే, వెలుగు శోభిస్తుంది. మాయ ఉంటేనే ఈశ్వరుడున్నాడు. సార గ్రాహికి నూరింటిలో ఒక్కమంచి దొరికితే చాలు. ఆ ఒక్కటీ గ్రహించి, తొంబది తొమ్మిదీ త్రోసివేసి ఇదొక్కటీ చాలురా మనకు, దీనితో లోకమంతా జయించవచ్చుననుకుంటాడు. వారి దృష్టి ఆ ఒక్క దానిమీదనే ఉంటుం" దని మేఘ గంభీర ధ్వనితో పలికి విరమించారు.

హాలంతా నిశ్శబ్దమై గంభీరంగా ఉన్నది. గడియారం టంగుటంగున గంటలు నాలుగు కొట్టింది. అజ్ఞానమనే శూరపద్మని హతమార్చి శాంతించిన అరుణాచల రమణుని అడుగుదమ్ములకు నమస్కరించి, వినుతిసేయవచ్చిన ఆది మయూరమా; అన్నట్లు హాలుకు ఉత్తర దిక్కున ఉన్న పాకలోనికి నెమలి వచ్చి, గంభీరమైన ఒక్క కేకారవంతో, తనరాక తెలియ పరచుకొన్నది. భగవాన్ "ఆవ్ ఆవ్" అంటూ అటువైపు తిప్పారు దృష్టి.

- సూరి నాగమ్మ

శ్రీ రమణాశ్రమము, తిరువణ్ణామలై వారి సౌజన్యంతో

Facebook page https://www.facebook.com/ Sri Ramana Telugu
website http://www.sriramanamaharshi.org/ tel/

అన్నం మహిమ ఇంతింత కాదు



భారతీయ సనాతనధర్మంలో అన్నానికి ఎంతో ప్రాధాన్యతనిచ్చారు. అన్నం అంటే ఆహారం అని అర్థం చేసుకోవాలి. సనాతన ధర్మం ముఖ్యంగా చెప్పే దానిలో కర్మ ఒకటి. ఈ కర్మకాండ చేసేందుకు, ధర్మాచరణకు శరీరం ముఖ్యం. అటువంటి కర్మకాండకు అవసరమైన శరీరాన్ని నిలిపి ఉంచేది అన్నమే కనుక అన్నానికి ఎంతో ప్రాధాన్యత ఉంది. **శరీరమాద్యం ఖలు ధర్మ సాధనం** అన్నది తెలిసిందే. ఇంకా అన్నాన్ని నిందించకూడదని, నిర్లక్ష్యం చేయకూడదని, పారవేయకూడదని ఎన్నో చోట్ల చెప్పబడింది. సూక్తాలలో అన్న సూక్తం ఒకటి. జీవించి ఉన్న వారికే కాదు, మరణించిన పితరులకూ అన్నాన్ని శ్రాద్ధాల్లో పెడుతూంటారు. ఇక అన్నదాన మహిమ చెప్పనలవికాదు. ఏ దానం ఇవ్వని ఉత్కృష్ట ఫలితం అన్నదానం ఇస్తుంది. ఎవరినైనా పూర్తిగా తృప్తిపరచగలిగేది అన్నమే. ఒకస్థాయి తర్వాత ఇక వద్దు అనిపించగలిగేది అన్నదానమే. కడుపు నిండిన తర్వాత ఇంకా అన్నం పెడితే దానిని తినేవాడు వద్దంటాడు . అదే డబ్బయితే ఎంత ఇచ్చినా ఇంకా కొంత ఇస్తే బావుండేదే అనే భావంతో ఉంటాడు. మిగతా దానాలకు పాత్రత చూడాలి. ఒక్క అన్నానికే అటువంటిదేమీ లేదు. ఆకలితో ఉన్నవాడు ఎవడైనా వాడికి అన్నం పెట్టవచ్చని ధర్మ శాస్త్రం చెబుతోంది. ఇక అన్న దానాన్ని సంపూర్ణ దానంగా పేర్కొన్నారు. ఇది దాతకూ, దాన ప్రతిగ్రహీతకు ఆనందం కలిగిస్తుంది. కనుక దీనిని సంపూర్ణ దానం అన్నారు.

అన్నాన్ని సాక్షాత్తు పరబ్రహ్మ స్వరూపంగా పేర్కొన్నారు. అందుకే అన్నాన్ని వృథా చేయరాదంటారు. అంతేకాక అన్నాన్ని తొలిబ్రహ్మంగా వర్ణించారు . అన్నాన్ని బ్రహ్మ గాను, అందులోని రసాన్ని విష్ణువుగాను దానిని తినేవాడిని మహేశ్వరుడని చెప్పే వాక్యం కూడా ఉంది. అన్నం పేరు మీద ఆహారానికి అధిదేవతగా అన్నపూర్ణాదేవి ఆరాధన కూడా సనాతన ధర్మంలో ఉంది. అన్నానికి సంబంధించి మరో నమ్మకం కూడా ఉంది. దేవుడు ప్రతి జీవి ఈ భూమి మీద పుట్టక మునుపే అతనికి ఇంత ఆహారం, నీరు అని నిర్దేశిస్తాడని అది అయిపోగానే మరణిస్తాడని, అందువల్ల కూడా దానిని వృథా చేయరాదని అంటుంటారు. అందుకే మరణించాడనే దానికి నూకలు చెల్లాయనే మాట వచ్చిందని చెబుతారు.



మంచిమాట

సహనం ప్రతి మనిషికీ అత్యావశ్యకం

సహనశీలుడు ఏనాడూ వినాశం పొందడు

భారత వర్షము-అధిదేవత



భారత వర్షంలో భగవానుడు నరనారాయణ రూపంలో కల్పాంతం వరకు లోకాలను అనుగ్రహించటం కోసం ఆత్మ జ్ఞానం కలవారిపై దయతో తపస్సు చేస్తూ సంచరిస్తుంటారు.

నర నారాయణులు తపోమూర్తులు, జ్ఞాన మూర్తులు, పరమ శాంత మూర్తులు. తపః ప్రభావాన్ని లోకులకు ఉపదేశించడానికి అవతరించారు. మనశ్శాంతిని, మనో నిగ్రహాన్ని, మనోజయాన్ని కోరే వారు నరనారాయణులకు సంబంధించి భాగవతంలో ఉన్న మంత్రాన్ని భక్తి శ్రద్ధలతో జపించాలి. కోపాన్ని, కోరికలను గెలవాలనుకున్నవారు, విద్యాబుద్ధులు, సత్ ప్రవర్తన, లోక కళ్యాణ కాంక్ష కలిగిన వారు ఈ మంత్రాన్ని జపించాలి.

ధర్మం-మర్మం




మంత్ర జప విధానం

ప్రాతఃకాలమునే లేచి స్నానాదులు ముగించుకుని పరిశుద్ధమైన వస్త్రములు ధరించి లలాటమున తిలకమును దిద్దుకుని పూజామందిరంలో దీపారాధన చేసి తమ నిత్య కృత్యములైన సంధ్యావందనాది కార్యక్రమములను ముగించుకుని నిశ్చలమైన పరిశుద్ధమైన మనస్సుతో తమ శక్తికి అనుగుణంగా మంత్రాన్ని జపించాలి

- డా॥ కందాడై రామానుజాచార్య

భగవద్గీత

మానవులలో సామర్థ్యాన్ని నేనే



అధ్యాయం 7

శ్లోకం 8:

రసోహమప్సు కౌంతేయ
ప్రభాస్మి శశిసూర్యయోః।
ప్రణవః సర్వవేదేషు
శబ్దః ఖే పౌరుషం నృషు॥

తాత్పర్యం

ఓ కుంతీ పుత్రా! నీటిలో రుచిని, సూర్య చంద్రుల యందు కాంతిని, వేదమంత్రములందు ఓంకారమును, ఆకాశమునందు శబ్దమును, నరుని యందు సామర్థ్యమును నేనే అయియున్నాను.

భాష్యం

ఈ శ్లోకములో భగవంతుడు తన భౌతిక ఆధ్యాత్మిక శక్తుల ద్వారా ఎలా విస్తరించి ఉన్నాడో వివరించడం జరిగింది. సూర్యరశ్మి ద్వారా సూర్య భగవానుడి ఉనికిని గుర్తించినట్లు, భగవంతుని వివిధ శక్తుల ద్వారా భగవద్ధామంలో నున్న దేవాదిదేవుణ్ణి గుర్తించవచ్చును. ఉప్పునీరు సముద్రమంతా ఉన్నప్పటికీ దానిని తాగలేము. రుచిని బట్టి మనము నీటిని ఆస్వాదించగలము. అటువంటి స్వచ్ఛమైన నీటి రుచి భగవంతుని శక్తియై ఉంది. ఈ విధంగా మన దప్పిక తీర్చేందుకు భగవంతుడు చక్కని ఏర్పాటు చేసినందుకు మనము ఆయనను కీర్తించవచ్చు. అలాగే భగవంతుని దేహకాంతియైన బ్రహ్మజ్యోతి సూర్యచంద్రుల తేజస్సుకు మూలం. అలాగే ప్రతి వేదమంత్రము ముందూ ఉచ్చరించబడు 'ఓం' భగవంతుని శబ్ద రూపము. ఈ విధంగా కృష్ణుణ్ణి సదా స్మరించవచ్చు, ముక్తిని పొందవచ్చు. ఈ విషయము తెలియని వారు బంధములోనే ఉండిపోతారు.

అంతర్జాతీయ కృష్ణ చైతన్యసంఘ సంస్థాపకాచార్యులు కృష్ణ కృపామూర్తి శ్రీశ్రీల ఎసి భక్తి వేదాంతస్వామి ప్రభుపాదులు రచించిన 'భగవద్గీత' యథాతథము ఆధారంగా సమర్పిస్తున్నాము.

Google play | iOS iTunes

దినఫలాలు

మేష రాశి: ఆర్థిక లావాదేవీలు, దూరప్రయాణాలు అనుకూలం. విద్యా ప్రయత్నాలు అనుకూలం. మంచికార్యాలలో పేరు, ప్రఖ్యాతులు లభిస్తాయి. ఆరోగ్యంలో ప్రతికూలత తగ్గుతుంది. ఆదాయమార్గాలు సులభతరమవుతాయి.

వృషభ రాశి: ఆర్థిక ప్రయత్నాలు ఊరట కలిగిస్తాయి. స్థిరాస్తి విక్రయాలు వంటివి ఉపకరిస్తాయి. విద్యా విషయాల్లో ప్రాధాన్యత లభిస్తుంది. ఆరోగ్య విషయంలో అశ్రద్ధ పనికిరాదు. ఆర్థిక విషయాల్లో విస్మయాలు ఉంటాయి. ఆదాయ వృద్ధిలో ఆటంకాలు కొనసాగుతాయి.

మిథున రాశి: సాహస నిర్ణయాలు ఊరట కలిగిస్తాయి. కోర్టు వ్యవహారాలలో ఉపశమనం ఉంటుంది. ఆర్థిక వ్యవహారాల్లో అనుకూలత ప్రారంభమవుతుంది. ఆరోగ్య ప్రతికూలత తగ్గుతుంది. పనులలో వేగం పెరుగుతుంది. ఆదాయంలో గట్టి ప్రయత్నాలు లాభిస్తాయి.

కర్కాటక రాశి: విదేశీ లావాదేవీలు కలసి వస్తాయి. శుభవార్తలు వింటారు. పిల్లల విషయంలో శ్రద్ధ తప్పనిసరి. ఆరోగ్య ప్రతికూలత తగ్గుతుంది. శత్రుభీతి పోతుంది. మానసిక ధైర్యం పెరుగుతుంది. ఆదాయ మార్గాలు అనుకూలం.

సింహ రాశి: గృహకార్యాలు, కార్యక్రమాలు అనుకూలం. ఆర్థిక క్రమశిక్షణ తప్పనిసరి. పెట్టుబడుల ప్రతిబంధకాలు ప్రబలమవుతాయి. ఆరోగ్యం అనుకూలత పెరుగుతుంది. వ్యాపార మోసాలను గ్రహించలేకపోతారు. ఆదాయంలో అయోమయ పరిస్థితులున్నా అధిగమించగలుగుతారు.

కన్యా రాశి: ఆధ్యాత్మిక కార్యాలు, కార్యక్రమాలు లాభిస్తాయి. ఆహ్లాద పరిస్థితులు గృహరీత్యా ఉంటాయి. వ్యాపార విజయాలు కొనసాగుతాయి. ఆరోగ్య ప్రతికూలత తగ్గుతుంది. స్థిరాస్తి విషయాల్లో చిరాకులు పరిష్కరింపబడతాయి. ఆదాయ మార్గాలు సులభతర మవుతాయి.

తులా రాశి: విదేశీ లావాదేవీలు/సంభాషణలు కలసి వస్తాయి. కోర్టు వ్యవహారాలు లాభిస్తాయి. ఖర్చులు అధికమవుతాయి. మెరుగైన పరిస్థితులు ఆరోగ్య రీత్యా ఆనందాన్ని కలిగిస్తాయి. అతి తొందర ద్వారా కార్యక్రమాల్లో పొరపాట్లు దొర్లుతాయి. ఆదాయంలో మంచి లాభాలను కూడగట్టుకొనే ప్రయత్నాలు అనుకూలిస్తాయి.


వృశ్చిక రాశి: స్థిరాస్తి కొనుగోళ్ళు అనుకూలం. ఆరోగ్య పరీక్షలు మేలును కలిగిస్తాయి. ప్రయాణాల విషయంలో జాగ్రత్తలు పాటించాలి. ఆరోగ్యం జాగ్రత్తలు పాటించాలి. అసహన పరిస్థితులు వ్యాపార పరంగా ఉంటాయి. ఆదాయం పర్వాలేదు.

ధనూ రాశి: ఉద్యోగ ప్రయత్నాలు ఫలిస్తాయి. నూతన స్నేహాల ద్వారా లబ్ధి చేకూరుతుంది. వ్యాపార ప్రతిబంధకాలను ఎదుర్కోగలుగుతారు. ఆరోగ్యంలో ప్రతికూలత తగ్గుతుంది. గతంలోని తప్పులు సరిదిద్దుకొనే అవకాశాలు లభిస్తాయి. ఆదాయంలో మెరుగైన అవకాశాలు దగ్గరవుతాయి.

మకర రాశి: విదేశీ సంభాషణలు ఉపకరిస్తాయి. కోర్టు వ్యవహారాలు ఊరట కలిగిస్తాయి. ప్రయాణాల విషయంలో జాగ్రత్తలు తప్పనిసరి. ఆరోగ్య ప్రతికూలత తగ్గుతుంది. బాధ్యతలు పెరుగుతాయి. ఆదాయం గట్టి ప్రయత్నాలతో మాత్రమే సాధ్యం.

కుంభ రాశి: నూతన వాహన కొనుగోళ్ళు వంటివి ఆనందాన్ని కలిగిస్తాయి. విద్యా ప్రయత్నాలు లాభిస్తాయి. శుభవార్తలు వింటారు. ఆకస్మిక వ్యయం లేకపోలేదు. ఆరోగ్య విషయంలో ప్రతికూలత ఉంటుంది. ప్రత్యర్థుల ద్వారా చిరు సమస్యలు ఉంటాయి. ఆదాయంలో ప్రోత్సాహ పరిస్థితులు మాత్రం ఆనందాన్ని కలిగిస్తాయి.


మీన రాశి: ఋణ ప్రయత్నాలు లాభిస్తాయి.వాహన కొనుగోళ్లు లాభిస్తాయి. కోర్టు వ్యవహారాల్లో ఉపశమనం ఉంటుంది. ఆరోగ్య సమస్యల నుండి ఉపశమనం లభిస్తుంది. ఆరోగ్య రీత్యా శ్రద్ధ పాటించాలి. ముఖ్యమైన పనుల విషయంలో ఏకాగ్రత తప్పనిసరి. ఆదాయంలో జాగ్రత్తతో కూడిన నిర్ణయాలు ఉపకరిస్తాయి.



శ్రీ నూకల సూర్యనారాయణ
nookalasuryanarayana@gmail.com

కులాసా

గుండెపోటులో 'గోల్డెన్ అవర్'



గుండె పోటు అనేది అత్యంత ప్రమాదకరమైనది. గుండెకు రక్తాన్ని అందించే రక్తనాళాల్లో అడ్డంకులు ఏర్పడడం వల్ల గుండెకు రక్తసరఫరా నిలిచిపోతుంది. ఫలితంగా గుండెపోటు వస్తుంది. గుండె కండరానికి తగినంత ఆక్సిజన్, ఇతర పోషకాలు అందకపోతే దానికి నష్టం వాటిల్లుతుంది. ఒక్కోసారి అది పూర్తిగా నిర్వీర్యం కావచ్చు కూడా. చికిత్స అందడానికి ఎంత ఎక్కువ సమయం పడితే అంత ఎక్కువ నష్టం వాటిల్లుతుంది. ఎంత త్వరగా చికిత్స ప్రారంభిస్తే గుండెకు అంత తక్కువ నష్టం జరుగుతుంది. అంత త్వరగా కోలుకునే అవకాశాలుంటాయి. సాధారణంగా గుండెపోటులో ఛాతిలో నొప్పి, లేదా చాతి పట్టేసినట్లుగా ఉంటుంది. ఒక్కోసారి గుండె మీద ఏదో బరువు ఉన్నట్టుగా కూడా ఉండొచ్చు. గుండెలో మంటగా ఉంటుంది. చాతి ముందు వైపు కూడా నొప్పి ఉండొచ్చు. సాధారణంగా ఎడమ వైపు నొప్పి వస్తుంది. చాలాసార్లు ఎడమ భుజం నుంచి నొప్పి పాకినట్టుగా ఉంటుంది. ఇలా 30 నిమిషాల నుంచి కొన్ని గంటల వరకు ఉండొచ్చు. నొప్పి తీవ్రత ఒక్కొక్కరిలో ఒక్కోవిధంగా ఉండొచ్చు. కొంతమందిలో భరించలేని విధంగా ఉండొచ్చు. నొప్పితో పాటు తీవ్రంగా చెమటలు, ఊపిరి అందక పోవడం వంటి లక్షణాలు కూడా కనిపించవచ్చు. అయితే అందరిలో ఈ అన్ని లక్షణాలు కనిపించకపోవచ్చు. ముఖ్యంగా స్త్రీలలో ఇలాంటి లక్షణాలు అన్నీ కనిపించవు. గుండెపోటు లక్షణాలూ, గ్యాస్ పైకి తన్నినప్పుడు కలిగే ఛాతినొప్పి ఇంచుమించూ ఒకేలా ఉంటాయి. పైగా గ్యాస్‌తో కలిగే చాతినొప్పికి ఇంగ్లీష్ పేరు హార్ట్ బర్న్ అని. దాంతో ఏది ప్రమాదకరమైన గుండెపోటో, ఏది ప్రమాదం లేని గ్యాస్ సమస్యో తెలియక కొందరు తికమకపడుతుంటారు. కొందరు ప్రమాద కరమైన గుండెపోటును సైతం లైట్‌గా తీసుకుంటారు. అందుకే అది ప్రమాదం కాని గ్యాస్ సమస్యే అయినా, ప్రమాదకరమైన గుండెపోటుగా కాసేపు అనుకున్నా తప్పు లేదు. ఇలా ఎందుకు అనుమానించాలంటే.. గుండెపోటు ప్రమాదం భారతీయుల్లో చాలా ఎక్కువ. కారణం మన జన్యువులే. ఇతర దేశాల్లో వయో వృద్ధులకు వచ్చే గుండెపోటు ముప్పు మన దేశంలో పాతికేళ్లకే ఎదురవుతోంది. మూడు పదులు దాటకముందే గుండెకు రక్తాన్ని అందించే మూడు ప్రధాన రక్తనాళాలు పూడుకుపోతున్నాయి. ముందున్న ఈ ముప్పును గుర్తుంచుకొని గుండెపోటును గుర్తించడం ఎలాగో తెలుసుకుందాం. గుండెపోటు ఇస్తుంది వార్నింగ్... గుండెపోటు అకస్మాత్తుగా వచ్చే అవకాశాలు ఉన్నా.. కొన్ని లక్షణాలను ముందస్తు హెచ్చరికలా పంపుతుంది. దాంతో మనం ముందుగానే గుండెపోటును అనుమానించవచ్చు. కొన్నిసార్లు గుండెపోటు రావడానికి చాలా గంటల ముందు నుంచే మనకు ఈ హెచ్చరికలు అందుతుంటాయి.

ఛాతికి ఎడమవైపు

ఛాతికి ఎడమవైపున నొప్పితో పాటు బరువుగా ఉన్నట్టు అనిపించడం ఊపిరాడని పరిస్థితి మగత చెమటలు పట్టడం వాంతులు కొందరిలో దగ్గుతో పాటు నోటి నుంచి రక్తం కూడా రావచ్చు. గుండె నొప్పికీ, గుండెపోటుకీ మధ్య కూడా తేడా ఉంటుంది. ఛాతి నొప్పి ఉండే కాలవ్యవధిని బట్టి ఆ తేడాను గుర్తించవచ్చు. ఛాతినొప్పి మొదలైన మూడు నిమిషాల్లోదానికదే తగ్గిపోతుంది. అలా మూడు నిమిషాల్లో ఆగిపోకుండా, నొప్పి పది నిమిషాలకు పైగా కొనసాగుతూ ఉంటే దాన్ని గుండెపోటుగా అనుమానించాలి.

కారణం

గుండెకు రక్తప్రసరణ అకస్మాత్తుగా నిలిచిపోతే ఆకస్మికంగా గుండెపోటు వస్తుంది. గుండె రక్తనాళాల్లో ఏవైనా అడ్డంకులు తలెత్తితే ఇలాంటి పరిస్థితి ఎదురవుతుంది. భారతీయుల్లో సాధారణంగా 25 ఏళ్ల వయసులోనే మంచి రక్తం అందించే రక్తనాళాల్లో అడ్డంకులు ఏర్పడే లక్షణాలు మొదలవుతున్నాయి. రక్తనాళాల్లో కొవ్వు గడ్డలుగా పేరుకుపోతూ రక్తప్రసరణకు ఆటంకం కలిగినప్పుడు ఆకస్మికంగా గుండెపోటు వస్తుంది. ఇది ఎప్పుడైనా జరగవచ్చు.

గందరగోళం

సాధారణంగా చాలామంది గుండెపోటును గ్యాస్ సమస్యగానో, కడుపులో / ఛాతిలో మంటగానో, వెన్ను నొప్పిగానో, మెడనొప్పిగానో తేలిగ్గా తీసుకుంటారు. వాస్తవానికి మీరు అజీర్తి లేదా గ్యాస్ సంబంధిత సమస్యతో బాధపడుతూ.. కడుపులోనో లేదా గుండెలోనో మంటగా ఉంటే ఒక్క యాంటాసిడ్ మాత్రతో తగ్గిపోతాయి. మెడ, వెన్ను లేదా ఆ పరిసరాల్లోని ఇతర ప్రాంతాల్లో నొప్పి ఉంటే పెయిన్ కిల్లర్ మాత్ర తీసుకుంటే ఉపశమనం కలుగుతుంది. ఇలా జరిగితే పర్వాలేదు. కానీ ఇలా ఒకటి రెండు టాబ్లెట్లు తీసుకున్న తర్వాత కూడా ఉపశమనం లేదని భావిస్తే మాత్రం దాన్ని కచ్చితంగా గుండెనొప్పిగా అనుమానించాలి. గుండెపోటు వచ్చినప్పుడు ఛాతి మధ్యలో నొప్పితో పాటు తీవ్రమైన అసౌకర్యంగా ఉన్నట్లుగా అనిపిస్తుంది. ఛాతి మెలిపెడుతున్నట్లుగా, బరువు పెట్టినట్లుగా, ఒత్తిడి పడ్డట్టుగా ఉంటుంది. నొప్పి ఛాతిమొత్తం వ్యాపించినట్టుగా అనిపిస్తుంది. ఈ నొప్పి చాలాసార్లు కండరాలకు సంబంధించిన నొప్పిలా, జీర్ణ సంబంధ నొప్పి కూడా ఇలాగే అనిపిస్తూ తికమకపెడుతుంటుంది. రెండింటికీ తేడా ఏమిటంటే.. గుండెనొప్పి ఒకసారి వస్తే అది కొనసాగుతూ ఉంటుంది. అందే కండరాలు లేదా జీర్ణకోశ నొప్పులైతే వస్తూ పోతూ ఉంటాయి. అందువల్ల గుండెపోటును గ్యాస్ సమస్యగా తికమకపడుతుండగా దాని లక్షణాలు జాగ్రత్తగా పరిశీలించాలి. ఒక్కోసారి నొప్పి ఛాతిలో కాకుండా చంకల నుంచి మెడ, దవడలు, పొట్ట, దంతాల నుంచి కూడా మొదలుకావచ్చు.

గోల్డెన్ అవర్

గుండెపోటు లక్షణాలు బయటపడ్డ మొదటి గంట వ్యవధిని బంగారు క్షణాలుగా అభివర్ణించవచ్చు. ఇంగ్లీషులో దీన్ని గోల్డెన్ అవర్ అంటారు. ఈ సమయంలో రోగిని ఆసుపత్రికి చేర్చగలిగితే అతడిని తప్పక రక్షించవచ్చు. అందుకే ఆ క్షణాలకు అంత విలువ. ఈ ఒక్కగంటే చావుబతుకుల మధ్య తేడాను నిర్ణయిస్తుంది. సాధారణంగా కొందరు రోగులు గుండెపోటు లక్షణాలు చాలా తేలిగ్గా తీసుకుంటారు. తమకు అప్పుడప్పుడు కనిపించే గ్యాస్ తాలూకూ లక్షణాలుగా అపోహ పడతారు.

మితిమీరిన ఆత్మవిశ్వాసంతో ఉంటారు. కానీ ఛాతినొప్పిని గుండెపోటుగా అనుమానించి ఆసుపత్రికి వెళ్లినా.. రోగి క్షేమంగా తనకు అవసరమైన గ్యాస్ సమస్యకే చికిత్స తీసుకొని బయటకు వస్తాడు. కానీ ఒకవేళ .. అది నిజంగానే గుండెపోటు అయి ఉండి, గ్యాస్ సమస్యగా అపోహ పడితే దానికి చెల్లించే మూల్యం చాలా భారీగా ఉండవచ్చు.

అందుకే గ్యాస్ సమస్యనూ గుండెపోటుగానే అనుమానించి, నిర్ధారణ కోసం ఒక ఈసీజీ పరీక్ష తీయించడంలో తప్పేమి లేదు. తప్పేది ముప్పు మాత్రమే.

జాగ్రత్తలు

గుండెపోటు వచ్చినట్లు అనుమానించి వెంటనే రోగి చేత కొద్దిగా నీళ్లు తాగించాలి. ఆసుపత్రికి చేరుకునేలోగా అతడు దగ్గేలా ప్రోత్సహించాలి. 325 మి.గ్రా డిస్ప్రిన్, 300 మి. గ్రా క్లోపిడోగ్రెల్, 80 మి. గ్రా. స్టాటిన్ టాబ్లెట్లను మింగించాలి. దీనివల్ల ప్రాణాపాయం నుంచి బయటపడే అవకాశం ఉంటుంది. ఇక రోగి శరీరంపై బిగుతుగా ఉన్న దుస్తులను వదులు చేయాలి. అవసరమైతే కృత్రిమ శ్వాస అందించాలి. రోగి శరీరానికి ఏ మాత్రం శ్రమ కలగకుండా ఏదైనా వాహనంలో తక్షణం ఆసుపత్రికి తీసుకెళ్లాలి. అంతేగానీ ఎట్టిపరిస్థితుల్లోనూ రోగి గుండెపై భారం పడేలా నడిపించడమో, మెట్లు ఎక్కించడమో చేయకూడదు.

రకాలు

గుండెపోటు వచ్చిన సమయంలో నొప్పి తీవ్రత రకరకాలుగా ఉంటుంది. చాలా సందర్భాల్లో నొప్పి తీవ్రంగానూ, భరించలేనంతగా ఉంటుంది. ఛాతిలో అసౌకర్యం 15 నుంచి 30 నిమిషాలపైనే ఉంటుంది. దీనికి సంబంధించిన మూడు ప్రధాన లక్షణాలు ఇలా ఉంటాయి. నొప్పి వస్తున్న ప్రాంతం, నొప్పి స్వభావం, నొప్పి తీవ్రమవుతూ తగ్గుతూ ఉండడం.

డాక్టర్ అనూజ్ కపాడియా
ఇంటర్‌వెన్షనల్ కార్డియాలజిస్ట్
కేర్ హాస్పిటల్స్
బంజారాహిల్స్



ఆక్యుపంక్చర్‌లో అద్భుత చికిత్స

గుండె సమస్యలు చాలావరకు ఒత్తిడి కారణంగానే వస్తుంటాయి. పనిలో ఒత్తిడి, జీవితంలో ఒత్తిడి ఏ రూపంలో ఉన్నప్పటికీ అది ఆరోగ్యం మీద విపరీతమైన ప్రభావాన్ని చూపుతుంది.

ఒత్తిడిని ఎదుర్కొంటున్న వారు సాధారణంగా తీసుకునే ఆహారం, విశ్రాంతి, వ్యాయామం వంటి వాటి మీద పెద్దగా శ్రద్ధ నిలుపరు. ఫలితంగా ఆరోగ్యం మరింత దెబ్బతింటుంది. ఒత్తిడికారణంగా బీపీ, షుగర్ వంటి వ్యాధులు కూడా రావచ్చు. ఇవి కూడా పరోక్షంగా గుండె సమస్యలకు కారణమవుతాయి. ఆరు నుంచి 8 గంటల రాత్రిపూట నిద్ర ప్రతి ఒక్కరికీ తప్పనిసరిగా అవసరమవుతుంది. వారంలో కనీసం ఐదు రోజులపాటు వ్యాయామం తప్పకుండా చేయాలి. సంవత్సరంలో కనీసం ఒక్కసారైనా ఉద్యోగ బాధ్యతల నుంచి విశ్రాంతి తీసుకోవడం వల్ల శరీరం, మనసూ తిరిగి ఉత్సాహాన్ని పుంజుకుంటాయి.



శారీరక శ్రమ

రోజులో కనీసం 30 నిమిషాలపాటు వ్యాయామం చేయాలి. ఇది గుండె జబ్బులను నివారించడంలో కీలకపాత్రపోషిస్తుంది. వ్యాయామాన్ని జీవితలో భాగం చేసుకోగలిగితే అన్ని విధాల మంచిది. లిఫ్ట్ వాడడం కంటే మెట్లు ఉపయోగించడం, చిన్న చిన్న దూరాలకు వాహనం వాడకుండా కాలినడకన వెళ్లడం వంటివి కూడా శరీరం ఉత్తేజితంగా ఉండేందుకు తోడ్పడతాయి.

అంతేకాదు శరీర బరువు కూడా అదుపులో ఉంటుంది. పెరిగే బరువు గుండెమీద భారాన్ని పెంచుతుందనే విషయాన్ని మరిచిపోవద్దు.

ధూమపానం

ధూమపానం తాగే అలవాటు మానుకోవడం మీకే కాదు. మీ చుట్టు ప్రక్కల వారికి కూడా మేలు చేస్తుంది. పొగవల్ల రక్తనాళాల్లోని లోపలి పొరకు నష్టం వాటిల్లుతుంది. రక్తనాళాల్లో కొవ్వు చేరుకునేందుకు దోహదం చేస్తుంది. నికోటిన్ వల్ల గుండె వేగం పెరిగి బీపీ కూడా పెరుగుతుంది. తాజా పండ్లు, కూరగాయలు ఎక్కువగా తీసుకోవాలి. చేపలు, గింజలు, చిక్కుళ్లు ఆహారంలో భాగం చేసుకోవాలి. సంతృప్త కొవ్వులు తక్కువగా తీసుకోవాలి. ఆల్కాహాల్ తీసుకునే అలవాటు ఉన్నవారు దాన్ని పరిమితంగా చేసుకోవాలి. నీళ్లు వీలైనంత ఎక్కువగా త్రాగాలి. ఆహారంలో ఉప్పు తగ్గించి తీసుకోవడం వల్ల బీపీ అదుపులో ఉంటుంది. ఫలితంగా గుండె మీద భారం తగ్గుతుంది. బీఎంఐ రేటు 18.5 నుంచి 24.9 మధ్య ఉంటే వారు ఆరోగ్యవంతమైన శరీర బరువును కలిగి ఉన్నట్టు లెక్క.


ఆక్యుపంక్చర్

గుండెజబ్బులకు ఆక్యుపంక్చర్‌లో అనేక చికిత్సావిధానాలు ఉన్నాయి. గుండెజబ్బులు రావడానికి ప్రధాన కారణం బీపీ, షుగర్ వ్యాధులు అని చెప్పుకోవచ్చు. ఈ వ్యాధులు రావడానికి తగిన కారణాలు తెలుసుకుని మానసిక, శారీరక ఆరోగ్యాన్ని చేకూర్చే ఆక్యుపంక్చర్ చికిత్స చేయాలి. ప్రెషర్ పాయింట్స్ వద్ద సూదులతో గుచ్చి నాడులను తిరిగి ఉత్తేజితం తీసుకురావచ్చు.

హీలర్ కె. దిలీప్‌కుమార్
క్యాతన్ ఆక్యుపంక్చర్ హెల్త్
రీసెర్చ్ అండ్ సొసైటీ
హైదరాబాద్, విజయవాడ
9848828808



ఆహారం, జీవనశైలే కీలకం



గుండె సంబంధిత వ్యాధులలో కరోనరీ ఆర్టరీ డిసీజెస్ అనేది సాధారణంగా నడివయసు గల పురుషులలో, వయసు మీరిన వారిలో కలిగే వ్యాధి. ప్రస్తుతకాలంలో యుక్తవయసు గలవారిలో కలటం మనం గమనించవచ్చు. ఈ రకం గుండె వ్యాధి ప్రపంచమంతా విస్తరించి మరణించే వారి సంఖ్య కూడా పెరుగుతూనే ఉంది.

ఆహార సేకరణలో లోపాలున్నాయి. అంటే అధిక మొత్తంలో కొవ్వు పదార్థాలను తినడం మంచిది కాదు. హైపర్ టెన్షన్ ఉండకూడదు. మంచి జీవనశైలి వల్ల దీనిని అరికట్టవచ్చు. సిగరెట్ వంటి అలవాట్లు ఉన్నవారిలో గుండె సంబంధిత ధమనులలో కొవ్వు పదార్థాలు పేరుకుపోయి రక్తప్రసరణకు అడ్డంకులు ఏర్పడటం వల్ల కరోనరీ ఆర్టరీ డిసీజెస్‌లు కలుగుతాయి.

ఆయుర్వేద వైద్య శాస్త్రం ప్రకారం ఆహార సేకరణ లోపాలు, ఒత్తిడి, అనారోగ్యకర జీవనశైలి అనుసరణ వల్ల జీర్ణాశయంలో హానికర పదార్థాలు నిల్వ ఉంటాయని ఈ హానికర పదార్థాలు సమయానికి అనుగుణంగా శరీరంలో వివిధ విభాగాల్లో అంటే కరోనరీ ధమని వంటి ముఖ్య భాగాల్లో చేరి అవరోధంగా ఏర్పడతాయి. ఫలితంగా రక్తప్రసరణ రేటు తగ్గి, వివిధ రకాల గుండె సంబంధిత వ్యాధులు కలుగుతాయి. ఆయుర్వేద వైద్య శాస్త్రంలో గుండె సంబంధిత వ్యాధులను తగ్గించుటకుగాను, శరీరంలో ఉండే హానికర కారకాలను బయటికి పంపి జీర్ణవ్యవస్థ శుభ్రపరిచి శరీరంలో అవరోధాలు ఏర్పడకుండా చేయటమే ఆయుర్వేద వైద్య శాస్త్రం యొక్క ముఖ్య ఉద్దేశ్యం.

కరోనరీ ఆర్టరీ డిసీజెస్, గుండె సంబంధిత వ్యాధులకు గురవకుండా ఉండటానికి జీవనశైలి మార్పులను అనుసరించి ఆయుర్వేద ఔషధాలను వాడాలి.

యోగా, వ్యాయామాలు, ధ్యానం అనుసరించడం వల్ల శారీరక సామర్థ్యం పెరగటమే కాకుండా మానసిక ప్రశాంతతను పొందవచ్చు. కరోనరీ ఆర్టరీ డిసీజెస్‌ను ప్రథమంగా నివారించడానికిగానూ, సులువైన వ్యాయామాలను అనుసరించాలి.

గుండె వ్యాధులను తగ్గించే ఔషధాలలో అల్లియం సటైవా, సెంటెల్లా ఆసియాటికా, కొమ్మిఫోరా ముకుల్, కాన్వోల్యూలాస్ ప్లూరికాలిస్(శంకపుష్పి), ఏమ్బ్లికా అఫిసినాలిస్(ఉసిరి), జటామాంసి, తులసి, జాజికాయ, అర్జున, హిర్డే, గుడూచి, మెంతులు, అశ్వగంధ, అల్లం వంటి ఔషధాలను వాడాలి.

డాక్టర్ బి. సంగమేశ్వర్
శివ ఆయుర్వేద వైద్యశాల
హైదరాబాద్
9440065764



బరువు తగ్గడంలో తాత్సారం వద్దు



మధుమేహ నియంత్రణలో కొత్త పద్దతులేవైనా వచ్చాయా?

గుండె, కిడ్నీలు సురక్షితంగా ఉండే అనేకరకాల మందులు ఇప్పుడు మధుమేహ నియంత్రణలో వస్తున్నాయి. ఈ మందులు వాడటం వల్ల బరువు కూడా తగ్గే అవకాశం ఉంది. ఎస్‌జిఎల్‌టి2 ఇన్‌హిబిటర్స్, జీఎల్‌పి 1 రిసెప్టర్ అగోనిస్ట్‌లు అనే రెండు రకాల మందులు ఇప్పుడు అందుబాటులోకి వచ్చాయి.

మధుమేహ నియంత్రణలో బరువు తగ్గించే పాత్ర ఏమిటి?

బరువు తగ్గడం అనేది మధుమేహ నియంత్రణలో కీలక పాత్రపోషిస్తుంది. భారతదేశంలో 57శాతం కంటే ఎక్కువ మంది మధుమేహరోగులు పొత్తికడుపు స్థూల్యంతో బాధపడుతున్నారు. స్థూలకాయాన్ని అరికట్టే లక్ష్యం ఉన్నవాళ్లు తక్కువగా ఉంటున్నారు. మధుమేహానికి వాడే మందుల వల్ల కూడా బరువు పెరుగుతున్నారు. ముఖ్యంగా ఇన్సులిన్ తీసుకోవడం వల్ల బరువు పెరిగే అవకాశం ఉంది. బరువుపెరగడం వల్ల ఇన్సులిన్ పనిచేయనిస్థితి ఏర్పడుతుంది. దీనివల్ల గుండెపోటు, గుండెవైఫల్యం వంటివి కలుగుతాయి. గుండెసంబంధిత వ్యాధులు ఎక్కువవుతాయి.

ఎస్‌జిఎల్ టి 2 ఇన్‌హిబిటర్స్ ఏ విధంగా పనిచేస్తాయి? దీనివల్ల ప్రయోజనాలు ఏమిటి?

ప్రతినెలా రెండు నుంచి నాలుగుకిలోల బరువు తగ్గడానికి దోహదపడుతుంది. అంతేకాదు గ్లైసమిక్ అదుపులో ఉంటుంది. అంతేకాదు గుండె జబ్బులు రాకుండా నిరోధిస్తుంది. మయోకార్డియల్ ఇన్‌ఫ్రాక్షన్ , గుండె వైఫల్యంతో ఆస్పత్రిలో చేరి చనిపోయే పరిస్థితుల నుంచి ఇది తప్పిస్తుంది. మూత్రంలో ప్రోటీన్ విడుదల కాకుండా అడ్డుకుంటుంది. మున్ముందు డయాలసిస్ రాకుండా నిరోధిస్తుంది.

జిఎల్‌పి 1 రిసెప్టర్ అగొనిస్ట్ ఏ విధంగా పనిచేస్తుంది? దీనివల్ల ప్రయోజనాలు?

కొన్ని కొంతకాలమైతే మరికొన్ని దీర్ఘకాలం పనిచేస్తాయి. డులాగ్లూటైడ్, లిరాగ్లూటైడ్, లిక్సిసేనేటైడ్ మిశ్రమంతో కూడుకుంది. ఇతర మందులతో పోలిస్తే బరువు తగ్గడానికి ఇది అద్భుతంగా పనిచేస్తుంది.

ఈ రెండు రకాల మందుల దుష్ప్రభావం ఏమైనా ఉందా?

ఎస్‌జిఎల్‌టి 2 ఇన్‌హిబిటర్స్ చాలా ఖరీదైనవి. ప్రతీనెలా రూ 1,500 ఖర్చవుతుంది. జిఎల్‌పి1 రెసెప్టర్ అగొనిస్ట్ చాలా ఖరీదైనది. రూ 6000 నుంచి 10,000 వరకు ఉంటుంది. కొన్ని రకాల మందులు వాంతులు , వికారం, మలబద్ధకం, అతిసారం వంటివి కలిగిస్తాయి. ఈ లక్షణాలు అందరికీ వర్తించవు. కొంతమంది రోగులకు మాత్రమే ఉంటుంది. ఈ రెండు రకాల మందులు గ్లైసమిక్‌ను అదుపులో ఉంచడానికి గొప్పగా పనిచేస్తాయి. అంతేకాదు బరువు తగ్గించే అవకాశం ఉంది. మధుమేహం వల్ల కలిగే గుండెపోటు, గుండెవైఫల్యం, కిడ్నీలు పనిచేయకపోవడం వంటి దుష్పరిణామాలను తగ్గిస్తుందని అధ్యయనంలో తేలింది.

డాక్టర్ దిలీప్ గుడె
సీనియర్ కన్సల్టెంట్
ఫిజిషియన్, డయాబెటాలజిస్ట్
విరించి హాస్పిటల్స్
హైద్రాబాద్



కైరాతో మహేష్ ఆటా పాట...!



నటుడిగా వృత్తిపరమైన పని ఒత్తిడి ఎదుర్కొంటూనే వీలు దొరికినప్పుడు కుటుంబంతో సమయాన్ని గడుపుతుంటాడు మహేష్‌బాబు. కొత్త ఏడాది సందర్భంగా కుటుంబంతో సెలవులు గడిపిన మహేష్ బాబు మళ్లీ షూటింగ్‌కు వచ్చేశారు. ఒమన్ పర్యటనకు వెళ్లి వారం పాటు విరామం తీసుకుని తిరిగొచ్చారు. ఆయన నటిస్తున్న తాజా చిత్రం భరత్ అను నేను ఇవాళ్టి నుంచి రెగ్యులర్ చిత్రీకరణ జరుపుకోనుంది. నగరంలోని ఓ సెట్‌లో మహేష్‌బాబు, నాయిక కైరా అద్వానీ పై కీలక సన్నివేశాలను చిత్రీకరించనున్నారు. ఈ షెడ్యూల్‌లోనే పాటలను తెరకెక్కిస్తారు. భరత్ అనే నేను చిత్రీకరణ తుది దశలో ఉంది. నిర్మాణాంతర కార్యక్రమాలు పూర్తి చేసి ఏప్రిల్ 27న ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు. డీవీవీ దానయ్య నిర్మిస్తున్న ఈ చిత్రంలో ముఖ్యమంత్రి పాత్రలో కనిపించనున్నారు మహేష్. ఇక ఈ స్టార్ నటించనున్న 25వ చిత్రం ఫిబ్రవరిలో సెట్స్ మీదకు వెళ్లబోతోంది. ప్రతిష్ఠాత్మక పాతిక చిత్రం కాబట్టి...ఈ సినిమాను ప్రత్యేకంగా తీసుకున్నారు మహేష్. దిల్‌రాజు, అశ్వనీదత్ నిర్మాణంలో దర్శకులు వంశీ పైడిపల్లి ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. పూర్తిగా అమెరికాలో చిత్రీకరణ జరుపుకోనుందీ సినిమా.



ఇది భాగమతి అడ్డా అంటున్న అనుష్క

అరుంధతి, రుద్రమదేవి వంటి మహిళా ప్రధానాంశ చిత్రాలు అనుష్కకు ఎంతో పేరు తెచ్చిపెట్టాయి. టైటిల్ పాత్రలో ఆమె నటించిన మరో మహిళా ప్రధానాంశ చిత్రం భాగమతి. అశోక్ దర్శకత్వం వహిస్తున్నారు. యూవీ క్రియేషన్స్ పతాకంపై వంశీ, ప్రమోద్‌లు నిర్మిస్తున్న ఈ చిత్రం ట్రైలర్‌ను సోమవారం మధ్యాహ్నం విడుదలచేశారు. ఎవడు పడితే వాడు రావడానికి...ఎప్పుడు పడితే అప్పుడు పోవడానికి ఇదేమైనా పశువుల దొడ్డా? భాగమతి అడ్డా...లెక్కలు తేలాలి...ఒక్కడ్నీ పోనివ్వను అంటూ అనుష్క చెప్పే డైలాగ్ ఆకట్టుకుంటోంది. భగ..భగ..భగ..భాగమతి అంటూ వచ్చే నేపథ్య సంగీతం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఆద్యంతం ఆసక్తికరంగా సాగే ఈ ట్రైలర్ చిత్రంపై ఇప్పటికే నెలకొన్న అంచనాలను మరింత పెంచేలా చేస్తోంది. ఇదిలావుండగా...ఈ చిత్రంలో అనుష్క తన నటనతో ప్రేక్షకులను అబ్బురపరచనుందని, విడుదలైన కొన్ని గంటల్లోనే ట్రైలర్‌కు విశేషమైన స్పందన లభించిందని నిర్మాతలు వెల్లడించారు. దర్శకుడు అశోక్ టేకింగ్, మధి కెమెరా పనితనం, రవీందర్ కళా దర్శకత్వం, తమన్ రీరికార్డింగ్ హైలైట్స్‌గా నిలుస్తాయని వారు చెప్పారు. ఇలాంటి చిత్రాన్ని మా బేనర్‌లో మేం నిర్మిస్తున్నందుకు గర్వంగా ఫీలవుతున్నాం. కథకు తగ్గట్టుగా భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నాం. తప్పకుండా ఈ కథ, కథనాలు తెలుగు ప్రేక్షకుల్ని తప్పకుండా ఆకట్టుకుంటాయి. గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఈ నెల 26న సినిమాను విడుదల చేయబోతున్నాం అని వారు వివరించారు. ఈ చిత్రంలోని ఇతర పాత్రలలో ఉన్ని ముకుందన్, ఆది పినిశెట్టి, జయరాం, ఆశాశరత్, మురళీశర్మ, ధన్‌రాజ్, ప్రభాస్ శ్రీను, విద్యుల్లేఖ రామన్, దేవదర్శిని, తలైవాసల్ విజయ్, అజయ్‌ఘోష్, మధునందన్ తదితరులు తారాగణం.

అంకితభావంతో కష్టపడతాను...!



నయనతార

సంక్రాంతికి జైసింహాతో ప్రేక్షకుల ముందుకొస్తోంది తమిళ సుందరి నయనతార. బాలకృష్ణతో ఆమె నటిస్తున్న మూడో చిత్రమిది. జైసింహాలో యాక్షన్ సన్నివేశాల తీవ్రత తగ్గించేందుకు తన గ్లామర్ జోడించి కథను సమతూకం చేయబోతోంది నయనతార. తెలుగులో అడపాదడపా సినిమాలు చేస్తున్న నయన్ కోలీవుడ్‌లో అద్భుత విజయాలతో తిరుగులేని తారగా ఎదిగింది. మొత్తంగా ఆమె పదిహేనేళ్లుగా ప్రేక్షకులకు నయనానందం కలిగిస్తోంది. 2003 లో మనసినక్కరే చిత్రంతో నాయికగా తెరంగేట్రం చేసిన నయన్....చంద్రముఖి, గజినీ చిత్రాలతో స్టార్ హీరోయిన్ అయ్యింది. అనుభవంతో పాటు ఎదుగుతూ వస్తున్న నయనతార..కేవలం అందాల తారగానే కాకుండా...ఓ కథానాయక ుడికున్నంత పేరు తెచ్చుకుంటోంది. నాయిక ప్రధాన చిత్రాలు చేస్తూ విజయాలు సాధిస్తోంది. ఆమె తాజా చిత్రం ఆరమ్ తమిళ బాక్సాఫీస్ దగ్గర సంచలన విజయం నమోదు చేసింది. వ్యక్తిగత జీవితంలో ఎన్నో ఎత్తుపల్లాలు చూస్తున్న నయన్..నటిగా పోటీలో ముందుంటోంది. ఈ దిగ్విజయ పరంపరపై నయన్ మాట్లాడుతూ...ఒప్పుకున్న చిత్రంలో సంపూర్ణమైన అంకితభావంతో పనిచేస్తాను. ఏ రోజూ నాపై నేను ఆత్మవిశ్వాసాన్ని కోల్పోను. ఇది ఒక్క నటనలోనే కాదు...జీవితంలో ఏ పని చేసినా ఇదే వ్యక్తిత్వంతో ఉంటాను. అని చెప్పింది. ప్రస్తుతం నయనతార చేతిలో ఉన్న అరడజను చిత్రాలు ఆమె క్రేజ్‌కు నిదర్శనం.

శరవేగంగా నా... నువ్వే

నందమూరి కళ్యాణ్‌రామ్, తమన్నా నాయకానాయికలుగా జయేంద్ర దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రానికి నా...నువ్వే అనే టైటిల్‌ను ఖరారు చేశారు. కూల్‌బ్రీజ్ సినిమాస్ నిర్మాణంలో, ఈస్ట్‌కోస్ట్ ప్రొడక్షన్స్ సమర్పణలో రూపొందుతున్న ఈ చిత్రం షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఈ నెలాఖరుకు షూటింగ్ దాదాపుగా పూర్తవుతుందని నిర్మాతలు తెలిపారు. చిత్రానికి ఈ టైటిల్ చాలా చక్కగా సరిపోతుందని, ఒక నూతన కథాంశంతో దర్శకుడు దీనిని తీర్చిదిద్దుతున్నారని వారు చెప్పారు. కళ్యాణ్‌రామ్ ఇందులో కొత్త లుక్‌తో కనిపిస్తారని వారు తెలిపారు. నిర్మాతలలో ఒకరైన కిరణ్ ముప్పవరపు మాట్లాడుతూ, కళ్యాణ్‌రామ్, తమన్నాల కాంబినేషన్, పి.సి.శ్రీరామ్ కెమెరా పనితనం సినిమాకే హైలైట్‌గా నిలుస్తుందని అన్నారు. ముఖ్యంగా కళ్యాణ్‌రామ్‌కు టోటల్ మేకోవర్‌ని ఇస్తుందని నమ్ముతున్నామని చెప్పారు. లవ్, యాక్షన్, ఎంటర్‌టైన్‌మెంట్ ప్రధానాంశాలుగా సాగే ఈ చిత్రాన్ని వేసవి సెలవుల్లో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నామని సమర్పకుడు మహేష్ కోనేరు తెలిపారు.

ఈ చిత్రంలోని ఇతర పాత్రల్లో తనికెళ్ళ భరణి, పోసాని, వెన్నెలకిషోర్, ప్రవీణ్, బిత్తిరి సత్తి, ప్రియ, సురేఖవాణి తదితరులు తారాగణం. ఈ చిత్రానికి సంగీతం: షరెత్, ఎడిటింగ్: టి.ఎస్.సురేష్, సమర్పణ: మహేష్ కోనేరు, నిర్మాతలు: కిరణ్ ముప్పవరపు, విజయ్ వట్టికూటి, కథ, స్క్రీన్‌ప్లే: జయేంద్ర, దర్శకత్వం: జయేంద్ర.



తమన్నా, కళ్యాణ్ రామ్

ఇది నా లవ్‌స్టోరీ.. మూడు గెటప్స్‌లో కనిపిస్తా

- తరుణ్



ఇది నా లవ్‌స్టోరీ రెగ్యులర్ ప్రేమకథాచిత్రం కాదని హీరో తరుణ్ అన్నారు. రామ్ ఎంటర్‌టైనర్స్ పతాకంపై తరుణ్, ఓవియా హీరోహీరోయిన్లుగా రమేష్‌గోపి దర్శకత్వంలో ఎస్.వి.ప్రకాష్ నిర్మించిన ఈ చిత్రం ట్రైలర్‌ను సోమవారం హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో విడుదలచేశారు. తన జన్మదినోత్సవం సందర్భంగా తరుణ్ చేతులమీదుగా ఈ ట్రైలర్ విడుదలైంది. అనంతరం తరుణ్ మాట్లాడుతూ, ఇటీవల నాగార్జునగారు ఆవిష్కరించిన టీజర్‌కు చాలా మంచి స్పందన లభించింది. ఇప్పుడు ట్రైలర్ కూడా ప్రేక్షకులను మెప్పిస్తుంది. ఈ చిత్రంలో నేను మూడు గెటప్స్‌లో కనిపిస్తాను. అయితే ఇందులో త్రిపాత్రాభినయం చేశానా? మూడు కోణాలున్న పాత్ర చేశానా? అనేది తెలియాలంటే సినిమా చూడాల్సిందే. డైలాగ్స్, స్క్రీన్‌ప్లే, సినిమాటోగ్రఫీ, సంగీతం వంటివన్నీ చక్కగా కుదిరాయి. హీరోయిన్ ఓవియా చక్కటి అభినయాన్ని కనబరిచింది. ఈ చిత్రంలో ఎక్కువ పాత్రలు కూడా కనిపించవు. గోగినేని బాలకృష్ణగారు ఈ సినిమాను తెలుగు రాష్ట్రాల్లో విడుదల చేస్తున్నారు. అలాగే ట్రెండీ మూవీస్ సంస్థ చిత్రాన్ని యు.ఎస్.లో విడుదల చేస్తుంది అని అన్నారు. దర్శకుడు గోపి మాట్లాడుతూ, అంజలి, నువ్వేకావాలి కంటే ఈ సినిమా తరుణ్‌కి పెద్ద హిట్‌గా నిలుస్తుంది. సినిమాను చూసే ప్రేక్షకుల్లో అధికశాతం ఇది నా లవ్‌స్టోరి అని తప్పకుండా ఫీలవుతారు అని అన్నారు. నిర్మాత ఎస్.వి.ప్రకాష్ మాట్లాడుతూ, సినిమా చాలాబాగా వచ్చింది. ఫిబ్రవరి 14న సినిమాను విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాం అని అన్నారు. సంగీత దర్శకుడు శ్రీనాథ్ విజయ్ మాట్లాడుతూ, తెలుగులో తనకిది తొలి చిత్రమని, ఓ మంచి సినిమాకు పనిచేసే అవకాశం కలిగిందని అన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ మధు తదితరులు పాల్గొన్నారు. ఇదే వేదికపై తరుణ్ కేక్ కట్ చేసి తన జన్మదినోత్సవాన్ని జరుపుకున్నారు.

నా అభిమానులు మారలేదు...!



షారుక్ ఖాన్

ఎందరు స్టార్‌లు వచ్చినా బాలీవుడ్‌లో షారుక్ స్థానం పదిలమే. బాలీవుడ్‌ను రెండున్నర దశాబ్దాలుగా ఏలుతున్న ఈ బాద్‌షా ఆకర్షణ ఏమాత్రం తగ్గలేదు. ఆయన నటిస్తున్న సినిమాలు వాటిని ఆదరిస్తున్న ప్రేక్షకులు, అభిమానులు అదే ప్రేమను చూపిస్తున్నారు. షారుక్ ఖాన్ బాలీవుడ్ వచ్చి పాతికేళ్లవుతోంది. ఆయనకిప్పుడు 50 ఏళ్ల వయసు. ఇన్నేళ్లు తరగని స్టార్‌డమ్‌తో కెరీర్ కొనసాగిస్తున్న కథానాయకులను వేళ్లమీద లెక్కపెట్టవచ్చు. షారుక్ ఇరవై ఐదేళ్ల నట ప్రస్థానం సందర్భంగా తన మనసులో మాట చెప్పేశారు. రెప్పపాటులో పాతికేళ్లు గడిచాయన్నారు. తానెప్పుడూ వయసు గురించి ఆలోచించనని, అది ఒక భావం మాత్రమేనని అన్నారు. ఇటీవల ఓ పురస్కార కార్యక్రమంలో షారుక్ ఖాన్ మాట్లాడుతూ....ఓ రెండేళ్లు నటుడిగా కొనసాగితే చాలు అనుకుని ఢిల్లీ నుంచి ముంబై వచ్చాను. కానీ సినిమాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. అతి త్వరగా పేరొచ్చింది. రెండేళ్లు అనుకున్నది...చూస్తుండగానే పాతికేళ్లు గడిచిపోయాయి. 25ఏళ్లుగా నటిస్తున్నాను. నాకిప్పుడు 50 ఏళ్లు. అయినా నా విషయంలో ఏదీ మారలేదు. నా తరహా సినిమాలు, నాకున్న అభిమానులు అలాగే ఉన్నారు. నాపై వాళ్ల ప్రేమ తగ్గలేదు. వయసు గురించి నేను ఆలోచించను. ఇక ముందు కూడా ప్రేక్షకులకు నా చిత్రాలతో వినోదాన్ని అందిస్తూనే ఉంటాను. అన్నారు.

గుండు హనుమంతరావుకు ఆర్థిక సాయం

అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న హాస్య నటుడు గుండు హనుమంతరావుకు తెలంగాణ ప్రభుత్వం ఆర్థిక సాయం అందజేసింది. గత కొంతకాలంగా మూత్రపిండాల వ్యాధితో ఈ హాస్య నటుడు ఇబ్బందులు పడుతున్నారు. పాత్రలు తగ్గిపోవడంతో ఆర్థికంగా దెబ్బతిన్నారు. గుండు హనుమంతరావు పరిస్థితిని పరిశ్రమవాసుల ద్వారా తెలుసుకున్న ఐటీ మంత్రి కేటీఆర్..వైద్య ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి 5 లక్షల రూపాయల ఆర్థిక సహాయం ఇప్పించారు.

